సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 6.50

సంపుటి: 18
సంచిక: 253

గురువారం 4-12-2025

'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'

Dazzling DIAMOND Festival
GRT JEWELLERS Since 1964

SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

సాక్షి ఫ్యామిలీ

గుంటూరు

గురువారం ॥ 4-12-2025

సముద్రాన్ని జీవితంతో పోలుస్తారు తాత్వికులు. సముద్రంలో మౌనం ఉంటుంది. కల్లోలం ఉంటుంది. పడి లేచిన కెరటాలు ఉంటాయి. సవాళ్ల విషయంలో భారత నావికాదళం కూడా సముద్రం లాంటిదే. ఆ సవాళ్లను అధిగమించి భారత నావికా దళంలో వివిధ కీలక విభాగాల్లో తొలి మహిళలుగా చరిత్ర సృష్టించిన రోల్ మోడల్స్ గురించి...



దివ్యశర్మ

సాహో... సాగర ధీర

ప్రేరణ దియోస్థలీ

భారత నావికా యుద్ధనౌకకు నాయకత్వం వహించిన తొలి మహిళా కమాండర్‌గా ప్రేరణ దియోస్థలీ చరిత్ర సృష్టించింది. ముంబైకి చెందిన ప్రేరణ 'జీసస్ అండ్ మేరీ కాన్వెంట్' స్కూలులో చదువుకుంది. నేవీలో పనిచేయాలనే లక్ష్యానికి స్కూలు రోజుల్లోనే బీజం పడింది. సెయింట్ జేవియర్స్ కాలేజీలో సైకాలజీలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసిన ప్రేరణ 2009లో నావికాదళంలో చేరింది. ప్రేరణను స్ఫూర్తిగా తీసుకొని ఆమె తమ్ముడు కూడా నావికా దళంలో పని చేస్తున్నాడు. ఉద్యోగంలో చేరిన కొత్తలో ప్రారంభ సమస్యలు ఎదుర్కొంది ప్రేరణ. గోవాలో తన మొదటి ఎన్‌సీసీ సెయిలింగ్ క్యాంప్‌లో సెయిల్ బోట్ మూడుసార్లు బోల్తా పడింది. అయినప్పటికీ 'ఇక చాలు' అనుకోలేదు. పట్టుదలతో సెయిలింగ్‌లో ప్రావీణ్యం సాధించింది. ఒడిశాలోని చిల్కా సరస్సులో జరిగిన సెయిలింగ్ పోటీలో బంగారు పతకాన్ని గెలుచుకుంది. కెరీర్ తొలిరోజుల్లో సముద్ర నిఘా విమానంలో పరిశీలకురాలిగా శిక్షణ పొందింది. 2012లో చైనా వాణిజ్యనౌకపై సోమాలియ దొంగలు దాడికి దిగినప్పుడు, ఆ దాడిని తిప్పి కొడుతూ చేసిన ఆపరేషన్‌లో కీలక పాత్ర పోషించిన ప్రేరణ భారత్ నేవీ విదేశ్ సేవాపతకాన్ని అందుకుంది.

నేవీలో తొలి మహిళా క్వాలిఫైడ్ ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్టర్

భారత నావికాదళంలో తొలి మహిళా క్వాలిఫైడ్ ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్టర్ (క్యూఎఫ్ఐ)గా చరిత్ర సృష్టించింది కమాండర్ దివ్యశర్మ. డోర్నియర్ పైలట్‌లుగా పనిచేసిన మొదటి ముగ్గురు మహిళలలో న్యూ దిల్లీకి చెందిన దివ్యశర్మ ఒకరు. ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్టర్‌గా అర్హత సాధించడానికి కఠినమైన శిక్షణ తీసుకుంది. ఫ్రంట్‌లైన్ కార్యకలాపాల కోసం నావికా ఏవియేటర్‌లకు శిక్షణ ఇవ్వడంలో ఇన్‌స్ట్రక్టర్‌లది కీలక పాత్ర.

గతంలో ఫిక్స్‌డ్–వింగ్ విమానాలను నడిపిన దివ్య ఇండియన్ నేవల్ ఎయిర్ స్క్వాడ్రన్‌లలో పైలట్‌లకు శిక్షణ ఇచ్చే సర్టిఫికెట్ అందుకుంది. న్యూ దిల్లీలోని మాల్వియానగర్‌కు చెందిన దివ్య కెరీర్ తొలి రోజుల్లో నుంచే అద్భుతమైన ప్రతిభ ప్రదర్శిస్తూ వస్తోంది. డోర్నియర్ ఆపరేషనల్ ఫ్లయింగ్ ట్రైనింగ్ (డీవోఎఫ్‌టీ) కోర్సులో అత్యుత్తమ ప్రతిభ చూపింది. కెరీర్ ప్రారంభంలో నైపుణ్యం, అంకితభావానికి గుర్తింపుగా 'ఫస్ట్ ఇన్ ఫ్లయింగ్' అవార్డ్ అందుకుంది.

నావికా దళంలో నారీశక్తి

భారత నావికాదళంలో ఒకప్పుడు మహిళల పాత్ర పరిమితంగా ఉండేది. అయితే కాలక్రమంలో మహిళల శక్తిసామర్థ్యాలను పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవడానికి దారులు తెరిచింది ఇండియన్ నేవీ. ఒకప్పుడు మాండోవి, గోవా బ్రాంచ్‌లలో ఎడ్యుకేషన్, లాజిస్టిక్స్... మొదలైన వాటిలో పరిమిత పాత్ర పోషించిన మహిళలు కీలకమైన విభాగాల్లోకి వచ్చి సత్తా చాటుతున్నారు. నేవీలో పైలట్, ఫైటర్ పైలట్, క్వాలిఫైడ్ ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్టర్‌గా... ఎన్నో కీలక విభాగాల్లో పనిచేస్తున్నారు. విమాన వాహక నౌకలు, డిస్ట్రాయర్‌లు, ఫ్రిగేట్... మొదలైన ఫ్రంట్‌లైన్ యుద్ధనౌకలలో మహిళలు విధులు నిర్వహించడం నావికాదళంలో మహిళల పాత్రకు సంబంధించి విప్లవాత్మక అభివృద్ధి. లింగసమానత్వానికి పెద్ద పీట వేయడంలో భారత నావికాదళం ముందు వరుసలో ఉంది. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం భారత నావికాదళం మహిళా అధికారులకు (వైద్యేతర శాఖలు) మెరిట్ ఆధారంగా పర్మినెంట్ కమిషన్ మంజూరు చేసింది.

తొలి మహిళా ఫైటర్ పైలట్

ఆస్తా పూనియా

భారత నౌకాదళంలో మొట్ట మొదటి మహిళా ఫైటర్ పైలట్‌గా చరిత్ర సృష్టించింది ఆస్తా పూనియా. 'మహిళా ఫైటర్ పైలట్‌తో భారత నౌకాదళంలో కొత్త శకం మొదలైంది' అన్నారు అసిస్టెంట్ చీఫ్ ఆఫ్ నేవల్ స్టాఫ్ రియర్ అడ్మిరల్ జనక్ బెవ్లీ. ప్రతిష్ఠాత్మకమైన 'వింగ్స్ ఆఫ్ గోల్డ్' పురస్కారాన్ని అందుకుంది ఆస్తా పూనియా. నాన్–ఫైటర్ ఆపరేషన్‌లలో మహిళా అధికారులు ఉన్నప్పటికీ ఫైటర్ స్ట్రీమ్‌లో అడుగుపెట్టిన తొలి మహిళగా ప్రత్యేకత చాటుకుంది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని మేరఠ్‌కు చెందిన ఆస్తా ఇంజినీరింగ్ చేసింది.

ఎన్నో పరిమితుల కారణంగా నేవీ యుద్ధవిమానాన్ని నడపడం ఆషామాషీ విషయం కాదు. ఎన్నో సవాళ్లను అధిగమిస్తూ చరిత్ర సృష్టించింది. ఎంతోమంది యువతులకు రోల్‌మోడల్‌గా నిలిచింది.

తొలి మహిళా పైలట్

శుభాంగి

ఉత్తర్‌ప్రదేశ్‌లోని తిల్హార్‌కు చెందిన శుభాంగి స్వరూప్ భారత నావికా దళంలో తొలి మహిళా పైలట్‌గా చరిత్ర సృష్టించింది. 2017లో కన్నూర్‌లోని 'ఇండియన్ నేవల్ అకాడమీ' నుంచి పట్టభద్రురాలైన మొదటి బ్యాచ్ మహిళా అధికారులలో శుభాంగి ఒకరు. వెల్లూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో బయో టెక్నాలజీలో ఇంజినీరింగ్ చేసింది. హైదరాబాద్‌లోని ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో శిక్షణ పొందింది. నావికా దళంలో పనిచేసిన తండ్రి కమాండర్ జ్ఞాన్‌స్వరూప్ శుభాంగికి స్ఫూర్తి.

'నేవీలో పనిచేయడం అంటే మాటలు కాదు. తట్టుకుంటావా?' అని తండ్రి అడిగినప్పుడు 'యస్' అని చెప్పింది శుభాంగి. ఆమె నేషనల్ తైక్వాండో ఛాంపియన్ కూడా.

ఆమె అమరత్వం

వృత్తి నిర్వహణలో ప్రాణ త్యాగం చేసిన భారత వైమానిక దళంలోని తొలి మహిళా అధికారి కిరణ్ షెఖావత్. అబ్జర్వర్‌గా విధులు నిర్వహిస్తున్న కిరణ్ 2015 మార్చి 24న గోవా తీరంలో జరిగిన డోర్నియర్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రమాదంలో చనిపోయింది. ముంబైలో పుట్టిన కిరణ్ ఆంధ్రా యూనివర్శిటీలో ఫిజిక్స్‌లో పట్టా పుచ్చుకుంది. ఇండియన్ నేవల్ అకాడమీ(ఐఎన్ఏ)లో చేరడానికి ముందు ఒక ప్రైవేట్‌బ్యాంకులో పనిచేసింది. తన ఐదు సంవత్సరాల కెరీర్‌లో దేశంలోని వివిధ నౌకాదళ స్టేషన్‌లలో విధులు నిర్వహించింది. నేవీలోకి రావాలనుకోవడానికి తండ్రి స్ఫూర్తి. ఆయన నేవీ ఆఫీసర్. రచయిత నికోలస్ స్పార్క్‌కు కిరణ్ పెద్ద అభిమాని. అతడి అన్నిపుస్తకాలు చదివింది. ఆ పుస్తకాల ఆధారంగా వచ్చిన సినిమాలు చూసింది. కుమార్తె చనిపోయిన తరువాత ఆమె పేరు మీద 'లెఫ్టినెంట్ కిరణ్ షెఖావత్' ఫౌండేషన్ స్థాపించాడు తండ్రి. హరియాణాలోని కుర్తాలలో కిరణ్ షెఖావత్ గౌరవార్థం రెండు ఎకరాల భూమిని షహీద్ పార్క్‌గా అభివృద్ధి చేశారు. ఈ పార్క్‌లో కిరణ్ విగ్రహం ఏర్పాటు చేశారు.



కిరణ్ షెఖావత్

● మన(సు)లో మాట

ఆందోళనతో కంటికి కునుకే కరువైంది!

నా వయస్సు 72 సంవత్సరాలు. ఉద్యోగం నుంచి రిటైరై దాదాపు 14 ఏళ్లయింది. నేను చాలా సంవత్సరాల నుండి ఒక సమస్యతో బాధపడుతున్నాను. అదేమిటంటే ప్రతి చిన్న విషయం గురించి ఎక్కువగా ఆలోచించటం. ఎప్పుడూ మనసులో గందరగోళంగా ఉంటుంది. ఈ ఆలోచన వలన చేసే పనిలో ధ్యాస ఉండదు. రాత్రి పడుకున్న తర్వాత విపరీతంగా కలలు వస్తుంటాయి. దీనివల్ల ప్రశాంతంగా నిద్ర కూడా ఉండడం లేదు. ఈ సమస్య ఎప్పుడు మొదలైందో గుర్తు లేదు కానీ, రిటైర్మెంట్ తర్వాత నన్ను మరింతగా బాధిస్తోంది. నాకు షుగర్, బీపీ కూడా ఉన్నాయి. నా సమస్యకు పరిష్కారం చూడగలరు.

–కె.ఎల్.వి ప్రసాద్, హైదరాబాద్

మీరు రాసిన లక్షణాలను బట్టి మీకున్న సమస్యను 'యాంగ్జైటీ డిజార్డర్' (నిరంతర ఆందోళన రుగ్మత) అంటారు. యాంగ్జైటీ లేదా భయం అనేవి ప్రమాదాలనుండి మనల్ని మనం కాపాడుకోవడానికి ప్రకృతి ఏర్పరచిన, ఒక రక్షణ వ్యవస్థ. మనుషులతో పాటు జంతువుల్లో కూడా ఈ వ్యవస్థ ఉంటుంది. అయితే కొన్ని సార్లు మెదడు రసాయనాల్లో మార్పులు, చిన్న వయసులో ఎదుర్కొన్న ఇబ్బందుల వల్ల, ఈ రక్షణ వ్యవస్థలో లోపం ఏర్పడుతుంది. ఆ కారణంగానే మెదడు ఆందోళనకు గురవుతూ ఉంటుంది. రోజూవారి వ్యవహారాలు, చిన్న చిన్న సమస్యలని కూడా మెదడు భూతద్దంలో చూస్తూ ఎప్పుడూ వాటి గురించే ఆలోచిస్తూ ఉంటుంది. దీని వల్ల ప్రశాంతత ఉండదు. చేసే పని మీద ధ్యాస ఉండదు. ఎప్పుడూ కంగారు కంగారుగా భయంగా ఉంటుంది. రాత్రిపూట కూడా మెదడు ఇలా అతిగా ఆలోచనలు చేయడం వల్ల నిద్ర కూడా పట్టదు. ఇది యుక్తవయసులోనే మొదలైతే చాలా సంవత్సరాలు ఇబ్బంది పడవలసి ఉంటుంది. తర్వాతి కాలంలో ఇది తీవ్రమైన డిప్రెషన్‌కు దారి తీయొచ్చు. దీనికి ఆధునిక వైద్య విధానంలో చక్కని పరిష్కారం ఉంది. కొన్ని ప్రత్యేకమైన మందులు, చికిత్స పద్ధతులను మానసిక వైద్యుల సూచన మేరకు కొంతకాలం వాడాల్సి ఉంటుంది. అలాగే కాగ్నిటివ్ బిహేవియర్ థెరపీ, సైకోడైనమిక్ థెరపీ, ఎక్స్‌పోజర్ థెరపీ వంటి కౌన్సెలింగ్ పద్ధతుల ద్వారా క్లినికల్ సైకాలజిస్టులు ఈ సమస్య తీవ్రతని తగ్గించగలరు.

మీరు దగ్గరలోని మానసిక వైద్యుని కలిసి ఖచ్చితంగా ఈ సమస్య నుండి పూర్తిగా విముక్తి పొందగలరు. ఆల్ ది బెస్ట్!

డా. ఇండ్ల విశాల్ రెడ్డి, సీనియర్ సైకియాట్రిస్ట్, విజయవాడ. మీ సమస్యలు, సందేహాలు పంపవలసిన మెయిల్ ఐడీ: sakshifamily3@gmail.com

● న్యూస్ మేకర్

చెన్నైలో ఎనిమిదేళ్ల క్రితం ఆటో డ్రైవర్‌గా మారిన మోహన సుందరి (40) ఆ రోజు అనుకొని ఉండదు 'కమలా భాసిన్ అవార్డ్ 2025' సాధించి ఖాట్మాండు వెళ్లి మరీ దానిని స్వీకరించగలనని. లింగ సమానత్వం కోసం పోరాడేవారికి ఇచ్చే ఈ అవార్డు ఇటీవల మోహన అందుకుంది.

చెన్నైలో మహిళా ఆటోడ్రైవర్ల కోసం ఆమె స్థాపించిన యూనియన్ నేడు 400 మంది సభ్యులకు దిశా నిర్దేశం చేస్తోంది. వారంతా తమ సంఘాన్ని 'ఇరుంబు కొట్టయి' (ఇనుప కోట) అని పిలుచుకుంటారు. ప్రతి మహిళా కార్మికురాలికి, ఉద్యోగికి ఉండాల్సిన ఇలాంటి నాయకురాలి గురించి కథనం.

ఆటో ఎక్కి నేపాల్ వెళ్లింది

'మాకు ఇప్పటికీ ఆటో స్టాండ్ లేదు. మగవాళ్ల ఆటోలకు స్టాండ్స్ ఉన్నాయి. స్త్రీలకు ప్రత్యేకంగా ఆటో స్టాండ్ కావాలి. దాని సంగతి చూస్తున్నాం. ఇంకో సమస్య టాయిలెట్స్. ప్రస్తుతానికి పెట్రోలు బంకులే దిక్కవుతున్నాయి. రెస్టారెంట్ల వాళ్లు టాయిలెట్స్ వాడుకోవడానికి మమ్మల్ని రానివ్వడం లేదు. ఆ సమస్యను భవిష్యత్తులో సాల్వ్ చేసుకుంటాం' అంటోంది మోహన సుందరి కాన్ఫిడెంట్‌గా.

మోహన సుందరి మూడు నాలుగు రోజుల క్రితం ఖాట్మండులో 'కమలా భాసిన్ అవార్డు 2025' అందుకుని తిరిగి చెన్నైకి చేరుకుంది. ప్రఖ్యాత ఫెమినిస్ట్ కమలా భాసిన్ మరణానంతరం ఆమె స్మృతిలో భిన్న రంగాల్లో లింగ సమానత్వం కోసం కృషి చేస్తున్న వారికి ఈ అవార్డులు ఇస్తున్నారు. లక్ష రూపాయల నగదు ఉంటుంది. 'డ్రైవింగ్ ది వరల్డ్ టువర్డ్స్ జెండర్ ఈక్వాలిటీ' అనే కేటగిరి కింద మోహన సుందరికి అవార్డు ఇచ్చారు. కారణం చెన్నైలో ఎనిమిదేళ్ల క్రితం ఆటో డ్రైవర్‌గా మొదలైన ఆమె ప్రయాణం ఇవాళ ప్రపంచాన్ని ఆకర్షిస్తోంది. త్వరలో మోహన సుందరి, ఇతర మహిళా ఆటో డ్రైవర్ల మీద 'ఆటో క్వీన్స్' అనే డాక్యుమెంటరీ కూడా విడుదల కానుంది. అది వచ్చాక ఆమె పేరు ఇంకా మార్మోగనుంది.

సింగిల్‌గా పోరాటం

చెన్నై అయినవరంకు చెందిన మోహన సుందరి జీవితంలో అనేక ఆటుపోట్లు తిన్నది. కేవలం 8వ తరగతి చదువుకున్న ఆమె బతకడానికి ఎన్నో మార్గాలు వెతికింది. బ్యూటీ క్లీనిక్, టిఫిన్ సెంటర్, చిల్లర అంగడి... అన్నీ దెబ్బ తీశాయి. ఆ సమయంలో ఏనాడో తీసుకున్న డ్రైవింగ్ లైసెన్స్ గుర్తు కొచ్చింది. ఆటో నడుపుదాం అని నిశ్చయించుకుంది. ఇది తెలిసి ఇతర మగ ఆటోడ్రైవర్లు చాలా హడలగొట్టారు. 'చాలా కష్టమైన పని వద్దు' అన్నారు. కాని మోహన సుందరి ఆగలేదు. ఆటో డ్రైవర్‌గా మారింది. యూనిఫామ్ వేసుకొని రోడ్డు మీద ఆమె తిరుగుతుంటే ఆమె ప్రయాణికులను మాత్రమే గమ్యాన్ని చేరుస్తున్నట్టుగా కాక సామాన్య మహిళలకు ఆర్థిక స్వావలంబన కోసం ఒక మార్గాన్ని చూపుతున్నట్టుగా అందరికీ అనిపించింది. 'పల్లెల్లో ఆడవాళ్ల దగ్గర డబ్బు ఉండక ఇబ్బంది పడతారు. కాని సిటీల్లో కూడా స్త్రీల దగ్గర డబ్బు ఉండదు. స్త్రీలకు సంపాదన ఉంటే వారిని చూసే పద్ధతి మారుతుంది' అంటుంది మోహన.

మోహన సుందరి

సాటి మహిళలు

చెన్నైలో మోహన సుందరి ఆటో నడిపే సమయానికి చాలా తక్కువ మంది మహిళలు డ్రైవర్లుగా ఉన్నారు. కోవిడ్ సమయంలో చాలామంది ఉపాధి అతలాకుతలం అయ్యాక కొత్తగా మహిళలు ఈ రంగంలోకి వచ్చారు. 'చెన్నైలో ప్రస్తుతం 400 మంది మహిళా ఆటో డ్రైవర్లు ఉన్నారు. వారిలో సగం మంది సింగిల్ పేరెంట్స్. పిల్లల్ని చూసుకుంటూ సంపాదించాలంటే స్త్రీలకు పెద్ద ఛాలెంజ్' అంటుంది మోహన. వీరంతా మొదలు వాట్సప్ గ్రూపుల ద్వారా ఒకరికొకరు పరిచయం అయ్యారు. ఆ తర్వాత వీరి నుంచి స్కూలు పిల్లల గిరాకీ ఉందని, ఇక్కడా అక్కడా నెలవారీ గిరాకీలు ఉన్నాయనే సమాచారం ఒకరికొకరు పంచుకోవడం మొదలుపెట్టాక వీరికి పని గ్యారంటీ వచ్చింది. అదీగాక ఆటో ప్రయాణాల్లో ఎదుర్కొంటున్న ఇబ్బందులు పంచుకోవడం వల్ల సమస్యలు ఎలా సాల్వ్ చేసుకోవాలన్న ధైర్యం కూడా వచ్చింది. ఇప్పుడు ఈ మహిళా ఆటోడ్రైవర్లు ఒక బృందంగా బలపడ్డారు.

ఇనుప కోట

'ఒక ఆటో డ్రైవర్ మరణిస్తే అతని ముసలి తల్లి చేతిలో రూపాయి లేక ఇబ్బంది పడటం చూశాక మా మహిళా ఆటోడ్రైవర్లకు సంఘం పెట్టాలనిపించింది' అంది మోహన సుందరి. ఎన్నో తర్జన భర్జనల తర్వాత సరైన పద్ధతిలో గత సంవత్సరం 'వీర్ పెంగళ్ మున్నెట్ర సంగం' (విపిఎంఎస్) రిజిస్టర్ చేశారు. ఇది పెట్టాక మహిళా ఆటో డ్రైవర్లు సభ్యత్వం తీసుకుని తమ సంఘాన్ని 'ఇనుప కోట'గా పిలుచుకుంటున్నారు. అంటే ఏ సమస్య వచ్చినా కాచుకునేదన్న మాట. నెల నెలా 200 సంఘానికి డ్రైవర్లు కట్టాల్సి ఉంటుంది. ఆ నిధితో సభ్యుల సంక్షేమానికి వినియోగిస్తోంది మోహన. అవి ఏమిటంటే...

1. పది లక్షల రూపాయలకు ఇన్సూరెన్సు
2. అవసరానికి పది నెలల్లో తీర్చేలా 10 వేల అప్పు
3. అనారోగ్యం వల్ల ఆటో వేయలేకపోతే 5 వేలు సాయం
4. మహిళా ఆటోడ్రైవర్ ఇంట వృద్ధులు మరణిస్తే అంతిమ క్రియలకు 10 వేలు సాయం.

ఇవి గాక ఆటో డ్రైవర్లకు ఉండే ఫైనాన్స్ సమస్యలు, పిల్లల స్కూలు ఫీజులు, ఇతర సపోర్టు ఈ సంఘం ఇస్తోంది. అందుకే మోహన సుందరి చెన్నై ఆటో క్వీన్. ఆమె లాంటి కార్యాచరణ ప్రతి అసంఘటిత రంగంలో ఉంటే మహిళలకు ఎన్నో ఉపయోగాలు ఉంటాయి. ముందుకెళ్లే ఉపాయాలు దొరుకుతాయి.

బులియన్ (బంగారం 10 గ్రా.: వెండి కిలో) డిసెంబర్ 3న ముగింపు రూ.లలో

	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	రాజమండ్రి	ప్రొద్దుటూరు	చెన్నై
బంగారం (24 క్యారెట్లు)	1,29,110	1,,32,800	1,30,580	1,32,800	1,27,900	1,31,560
బంగారం (22 క్యారెట్లు)	1,10,329	1,19,700	1,19,700	1,23,290	1,17,670	1,20,600
వెండి	1,80,000	1,85,500	2,01,000	1,85,500	1,78,000	2,01,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 6.50
సంపుటి: 18 సంచిక: 253
గురువారం 4-12-2025
SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'

సాహో.. సాగర ధీర
నేవీడే సందర్భంగా నావికా దళంలోని నారీశక్తిపై కథనం - ఫ్యామిలీలో

358 సరిపోలేదు
రెండో వన్డేలో దక్షిణాఫ్రికా విజయం.. కోహ్లి, రుతురాజ్ సెంచరీలు వృథా - 11లో



బెంగాల్‌లో విజయమే లక్ష్యం..
బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో టీఎంసీపై విజయమే లక్ష్యంగా పనిచేయాలని బీజేపీ ఎంపీలకు ప్రధాని మోదీ సూచించారు.
వివరాలు 6లో ▸

పుతిన్ పర్యటనకు ఫుల్ సెక్యూరిటీ
భారత్‌లో పుతిన్ పర్యటన నేపథ్యంలో డ్రోన్లు, స్నైపర్లు, జామర్లు సహా ఏఐ ఆధారిత ఐదంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు.
వివరాలు 6లో ▸

అంతరిక్ష కేంద్రానికి తుది రూపు
ఇస్రో మరో ఘనత సాధించింది. ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన భారతీయ అంతరిక్ష కేంద్రానికి తుదిరూపు ఇచ్చింది.
వివరాలు 6లో ▸

'సంచార్ సాథీ' తప్పనిసరి కాదు
సంచార్ సాథీ యాప్‌ను స్మార్ట్‌ఫోన్లలో ప్రి-ఇన్‌స్టలేషన్ చేయడం తప్పనిసరి కాదని కేంద్ర ప్రభుత్వం వివరణ ఇచ్చింది.
వివరాలు 6లో ▸

జీవో సాక్షిగా బాబు క్రెడిట్ చోరీ గుట్టు రట్టు..

ఔను.. అదానీనే!

విశాఖకు గూగుల్‌ను తెచ్చాం.. గూగులే డేటా సెంటర్ నిర్మిస్తోందంటూ ఇన్నాళ్లూ మభ్యపుచ్చి ప్రచారం

అసలు డేటా సెంటర్‌ను నిర్మిస్తోంది అదానీనే..

డేటా సెంటర్‌కు కేటాయించిన 480 ఎకరాలు తిరిగి అదానీకి ఇస్తూ తాజాగా జీవో

ఈ ఏడాది అక్టోబర్‌లో గూగుల్‌కు భూమి కేటాయిస్తున్నట్లు నమ్మిస్తూ జీవో జారీ

రెండు నెలలు తిరగకుండానే అదానీకి బదలాయింపు..

బాబు క్రెడిట్ చోరీనా మజాకా..!
అని నివ్వెరపోతున్న ప్రజలు

వైఎస్ జగన్‌కు క్రెడిట్ రాకూడదని బాబు బృందం పన్నిన పన్నాగం గుట్టు రట్టు

ఏడు కోట్ల మంది ప్రజల చెవిలో చంద్రబాబు పువ్వులు

జగన్ తెచ్చిన అదానీ డేటా సెంటరే... గూగుల్ డేటా సెంటర్

2 లో

అక్టోబర్ 11న గూగుల్‌దేనని మభ్యపెట్టే ప్రయత్నం | **బాబు క్రెడిట్ చోరీకి ఈ జీవోలే సాక్ష్యం** | **డిసెంబర్ 2న అదానీదే అని బాబు గుట్టురట్టు**



GOVERNMENT OF ANDHRA PRADESH
ABSTRACT

IT, E&C Dept - Promotion Wing – Allotment of land to M/s. Raiden Infotech India Pvt Ltd in Visakhapatnam and Anakapalli districts and approval of tailor-made incentives for setting up Data Centers with proposed investment of INR 87,520 Crores and the potential to generate significant indirect employment across allied sectors – Orders –Issued.

INFORMATION TECHNOLOGY, ELECTRONICS AND COMMUNICATION
[IT, E & C] (PROMOTIONS) DEPARTMENT

G.O.MS.No.40 Date:11.10.2025

6. The Government after careful examination of the proposal and keeping in the view the recommendations of the SIPB and the Council of Ministers, hereby approves for allotment of 480 acres of land in Visakhapatnam and Anakapalli districts. This allotment is for establishing AI data centers of about 1000 MW capacity with proposed investment of INR 87,520 crores with the potential to generate significant indirect employment across allied sectors.

విశాఖలో డేటా సెంటర్‌కు 480 ఎకరాలు కేటాయిస్తున్నట్లు ఈ ఏడాది అక్టోబర్ 11న చంద్రబాబు సర్కారు జారీ చేసిన జీవో కాపీ. (ఇందులో ఎక్కడా అదానీ పేరు ప్రస్తావించకపోవడం గమనార్హం)



GOVERNMENT OF ANDHRA PRADESH
ABSTRACT

Sub: ITE&C Dept – Prom Wing- Allotment of land and providing of incentives to the notified partners of M/s. Raiden Infotech Pvt Ltd as per GO.MS.No. 40 dated 11th October 2025 – Approved – Reg

INFORMATION TECHNOLOGY, ELECTRONICS AND COMMUNICATION
[IT, E & C] (PROMOTIONS) DEPARTMENT

G.O.Ms.No. 66 Date:02.12.2025

11. The Government, after careful examination of the proposal, and as per the approval accorded by the council of ministers in its meeting dated 28/11/2025 hereby accords permission for the transfer of 480 acres of land in Visakhapatnam and Anakapalli districts to M/s Adani Infra (India) Private Limited. The notified partners in the project shall also be eligible for incentives already sanctioned, subject to overall ceilings

గూగుల్‌కు విశాఖలో కేటాయించిన 480 ఎకరాల భూమిని అదానీకి బదలాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 2వ తేదీన జారీ చేసిన జీవో

రెండు నెలల క్రితం.. ▸ రూ.లక్ష కోట్లకుపైగా భారీ పెట్టుబడులతో విశాఖకు గూగుల్ వస్తోంది..! మేమే తీసుకొస్తున్నాం.. డేటా సెంటర్ ఏర్పాటు ఘనత మాదే!



- గూగుల్ రాకపై చంద్రబాబు సర్కారు విన్యాసాలివీ!

రెండు రోజుల క్రితం.. ▸ అదానీ భాగస్వామ్యంతోనే గూగుల్ ప్రాజెక్టు. గూగుల్‌కు విశాఖలో కేటాయించిన 480 ఎకరాలను తిరిగి అదానీకి బదలాయిస్తున్నాం. గూగుల్‌కు ఇచ్చిన అన్ని రాయితీలను ప్రైమరీ నోటిఫైడ్ పార్ట్‌నర్ అదానీకి వర్తింప చేస్తున్నాం.

రూపాయి.. 90కి
జారిపోయి
కొత్త జీవితకాల కనిష్ట స్థాయి 90.30కి పతనం
చివరికి 90.15 వద్ద ముగింపు
ఈ ఏడాది 5% డౌన్
విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాలు, వాణిజ్య ఒప్పందంపై అస్పష్టతతో కరెన్సీపై ఒత్తిడి
12 లో

200 ఇండిగో విమానాలు రద్దు
ఆలస్యంగా నడిచిన మరికొన్ని విమానాలు
తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రయాణికులు
ఎఫ్‌డీటీఎల్ కొత్త నిబంధనల వల్లే: ఇండిగో
మరో 48 గంటల పాటు ఇబ్బందులు!
6 లో

నేడు వైఎస్ జగన్ ప్రెస్‌మీట్

సాక్షి,అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం ప్రెస్ మీట్ నిర్వహించనున్నారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఉదయం 11 గంటలకు మీడియాతో మాట్లాడనున్నారు.

నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో కుంభవృష్టి

- వాయుగుండం ప్రభావంతో శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో కుండపోత వర్షాలు కురిశాయి. దీంతో పలు కాలనీలు, లోతట్టు ప్రాంతాలు, పంట పొలాలు నీటమునిగాయి.

14 లో

నేటి గుడ్లు & చికెన్ గుంటూరు జోన్ ధరలు
12 గుడ్ల ట్రేల్ ధర ₹90
ఫారం దగ్గర లైవ్ బర్డ్ 132
రిటైల్ లైవ్ బర్డ్ 159
డ్రెస్డ్ స్కిన్‌తో 231
స్కిన్ లెస్ 262

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

12 మంది మావోయిస్టులు మృతి

ముగ్గురు డీఆర్‌జీ జవాన్లు కూడా..
మరో ఇద్దరికి గాయాలు
కూంబింగ్ ముమ్మరం చేసిన పోలీసు బలగాలు
3 లో

మంగళూరులో జరిగిన కార్యక్రమంలో కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, కేసీ వేణుగోపాల్

నివురుగప్పిన నిప్పుగానే కర్ణాటకం!

ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఎదుట గళమెత్తిన డీకే శివకుమార్ వర్గం
పోటీగా సిద్ధరామయ్య మద్దతుదారుల నినాదాలు

- వివరాలు 14లో

టెన్త్ పరీక్షల్లో స్వల్ప మార్పులు

- తక్కువ ఆదాయ వర్గాల వారికి ఫీజు మినహాయింపు
- 7 పరీక్ష పేపర్లు, 600 మార్కులు
- జనరల్ సైన్స్‌లో రెండు పేపర్లు

- వివరాలు 13లో

ఇదండీ సంగతి



సార్! పాలన రివర్స్ అవుతోంది!

రోగులతో చెలగాటం!

కాకినాడ జీజీహెచ్‌లో కాలం చెల్లిన కిట్లతో స్క్రబ్ టైఫస్ పరీక్షలు

వీఆర్‌డీఎల్ ల్యాబ్‌లో ఉన్న కాలం చెల్లిన స్క్రబ్ టైఫస్ రియేజెంట్ల కిట్లు

- కోవిడ్ సహా ప్రాణాంతక రోగ నిర్ధారణకు ఎక్స్‌పైరీ రియేజెంట్ల వినియోగం
- ప్రజలు, వైద్య ఆరోగ్యశాఖను తప్పుదోవ పట్టించి రిపోర్టులు
- వీఆర్‌డీఎల్ ల్యాబ్ నిపుణుడి నిర్వాకం
- రీసెర్చ్ సైంటిస్ట్ హోదాలోని ఆ ఉద్యోగి బరితెగింపు.. ఫోరెన్సిక్ వైద్యులు, మృతుడి కుటుంబీకుల ప్రాణాలకూ ముప్పు
- స్టేట్ పోర్టల్‌లోనూ ఈ కాకిలెక్కలే అప్‌డేట్

10 లో

స్క్రబ్ టైఫస్‌తో ఇద్దరు మహిళలు మృతి పల్నాడు జిల్లా డింంహెచ్‌వో వెల్లడి
2 లో

జీవో సాక్షిగా బాబు క్రెడిట్ చోరీ గుట్టు రట్టు..

ఔను.. అదానీనే!

విశాఖకు గూగుల్‌ను తెచ్చాం.. గూగులే స్వయంగా డేటా సెంటర్ నిర్మిస్తోందంటూ ఇన్నాళ్లూ మభ్యపుచ్చి ప్రచారం

అసలు డేటా సెంటర్‌ను నిర్మిస్తోంది అదానీనే..


THE TIMES OF INDIA

Google takes on lease 4.64 lakh square feet space at Adani data centre in Noida

PTI | Oct 11, 2022, 11:40 PM IST

NEW DELHI: Adani Enterprises has given on lease 4.64 lakh square feet of space at its data centre in Noida to Raiden Infotech, an entity of Google, for Rs 11 crore monthly rent, according to documents accessed by CRE Matrix.

The documents, accessed by the data analytics firm, showed that D C Development Noida Ltd, which is part of Adani Enterprises Ltd, has leased 4,64,460 square feet of space at Adani data centre in Sector-62, Noida for a period of 10 years.

The rental is Rs 235 per square feet per month. The starting annual rent is Rs 130.89 crore and there will be 1 per cent increase in the rental every year. The lease agreement was signed last month, the documents showed.
Email queries sent to Adani Group's flagship firm Adani Enterprises and Google remained unanswered.
In February 2021, Adani Enterprises had formed an equal joint venture with leading global data centre operator EdgeConneX to develop and operate data centres throughout India.

To start with, the JV had announced building a network of hyperscale data centres in India, starting with Chennai, Navi Mumbai, Noida, Vizag and Hyderabad.

In July 2021, Noida Authority had allotted 34,275 square metres land at Sector 62 to Adani Enterprises for setting up a data centre with an investment of around Rs 2,400 crore.

Adani Enterprises Ltd had in November last year divested its 100 per cent stake in DC Development Noida Pvt Ltd to AdaniConnex Pvt Ltd, which is an equal joint venture between Adani Enterprises and EdgeConneX.

నొయిడాలోని అదానీ ఎంటర్‌ప్రైజెస్‌లో డేటా సెంటర్ ఏర్పాటు కోసం 4.64లక్షల చదరపు అడుగులను గూగుల్ అనుబంధ సంస్థ రైడాన్ ఇన్ఫోటెక్ లీజుకు తీసుకుందని 2022 అక్టోబర్ 11న టైమ్స్ ఆఫ్ ఇండియాలో వచ్చిన కథనం ఇది.

Gautam Adani
@gautam_adani

A monumental day for India!
Adani is proud to partner with @Google to build India's largest AI data centre campus - in Visakhapatnam - engineered specifically for the demands of artificial intelligence.

This facility will house the TPU and GPU-based compute power required for deep learning, neural network training, and large-scale AI model inference and create an ecosystem that accelerates AI-driven solutions for India's most critical sectors - from healthcare and agriculture to logistics and finance.

We are honoured to be building the engine to power India's AI revolution, providing the tools for our nation's brightest minds to solve complex challenges.

గూగుల్‌తో కలిసి విశాఖపట్నంలో అతిపెద్ద డేటా సెంటర్ ఏర్పాటు చేయనుండటం గర్వంగా ఉందని అదానీ గ్రూప్ అధినేత గౌతం అదానీ 'ఎక్స్'లో పెట్టిన పోస్టు

సాక్షి, అమరావతి: గూగుల్ డేటా సెంటర్ క్రెడిట్ తన ఖాతాలో వేసుకోవడానికి చంద్రబాబు చేసిన జిమ్మిక్కులు, సంకుచిత వైఖరి స్వయంగా రాష్ట్ర ప్రభుత్వమే అధికారికంగా వెలువరించిన జీవోల సాక్షిగా మరోసారి రుజువయ్యాయి. విశాఖలో 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో 1,000 మెగావాట్ల సామర్థ్యంతో ఏఐ డేటా సెంటర్‌ను అదానీ భాగస్వామ్యంతోనే గూగుల్ ఏర్పాటు చేస్తోందని రాష్ట్ర ప్రభుత్వమే జీవోలో వెల్లడించింది. అంతేకాదు... గతంలో గూగుల్‌కు విశాఖలో కేటాయించిన 480 ఎకరాల భూమిని తిరిగి అదానీకి బదలాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా అధికారిక ఉత్తర్వులు కూడా జారీ చేయడం గమనార్హం. విశాఖలో డేటా సెంటర్ ఏర్పాటుకు సంబంధించి గూగుల్‌తో ఒప్పందం సమయంలో ఉద్దేశపూర్వకంగానే అదానీ పేరును తొక్కి పెట్టి క్రెడిట్ మొత్తం తన ఖాతాలో వేసుకోవడానికి చంద్రబాబు చేసిన విన్యాసాలు విఫలమైన విషయం తెలిసిందే. డేటా సెంటర్ ఏర్పాటుపై తొలుత ఈ ఏడాది అక్టోబర్‌లో ఆగమేఘాలపై జీవో ఇచ్చిన చంద్రబాబు సర్కారు.. స్వయంగా గూగులే దీన్ని నిర్మిస్తోందని, ఈ ప్రాజెక్టు మొత్తం గూగుల్ సంస్థే ఇప్పటికిప్పుడు కొత్తగా చేపడుతోందనే భ్రమలు కల్పించింది. ఇక యథావిధిగా ఎల్లో మీడియా దీనికి కోరస్ పాడుతూ అదొక ప్రపంచ ఈవెంట్ మాదిరిగా చిత్రీకరించింది. టీడీపీ పెద్దల కనుసన్నల్లో రక్తి కట్టించిన ఈ నాటకం అంతా డ్రామా అని తాజాగా ప్రభుత్వ జీవోలే వెల్లడిస్తున్నాయి. ఒక రాష్ట్ర ప్రభుత్వం ఈ స్థాయిలో అబద్ధాలు ఆడటం.. ఇంతటి ఘరానా మోసం.. ప్రజలకు ఎలా తప్పుడు సమాచారం ఇస్తున్నారో చెప్పేందుకు ఇదొక క్లాసిక్ కేస్ స్టడీగా రాజకీయ విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు. చంద్రబాబు కళ్లార్పకుండా నిస్సిగ్గుగా అబద్ధాలాడతారనేందుకు విశాఖ డేటా సెంటర్లే నిదర్శనమని పేర్కొంటున్నారు. చంద్రబాబు బృందం క్రెడిట్ చోరీకి పాల్పడుతూ ఎంతటి అబద్ధాలైనా ఆడగలదని, ఆత్మసాక్షిని మోసగించి వంచనకు పాల్పడుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అదానీ.. గూగుల్ సంస్థ భాగస్వామే

విశాఖలో గూగుల్ డేటా సెంటర్‌కు తొలుత అడవివరం –ముడసర్లోవ వద్ద 120 ఎకరాలు, ఆనందపురం మండలం తర్లువాడ వద్ద 200 ఎకరాలు, రాంబిల్లి వద్ద 160 ఎకరాలను గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్ ఇన్ఫోటెక్‌కు కేటాయిస్తూ ఈ ఏడాది అక్టోబర్ 11న రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. క్రెడిట్ చోరీలో భాగంగానే అదానీ పేరును దాచిపెట్టి కేవలం రైడెన్ టెక్ పేరుతో జీవో విడుదల చేసింది. అయితే ఇప్పుడు ఈ ప్రాజెక్టులో గూగుల్ అధికారిక భాగస్వామిగా అదానీ వ్యవహరిస్తున్నట్లు చంద్రబాబు సర్కారు వెల్లడించక తప్పని పరిస్థితి ఏర్పడింది. అదానీ గ్రూపును గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్ వ్యాపార భాగస్వామిగా చంద్రబాబు సర్కారు తాజాగా జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొనడం గమనార్హం.

ఆ భూములను అదానీకి బదలాయించండి..

ఏపీఐఐసీ కేటాయించిన ఆ 480 ఎకరాలను అదానీ గ్రూపు తదితర సంస్థల పేరిట బదలాయించాల్సిందిగా గూగుల్ కోరింది. తర్లువాడ, అడవివరం–ముడసర్లోవలో కేటాయించిన భూములను అదాని పేరిట అంతర్గతంగా బదలాయించనున్నట్లు స్పష్టం చేసింది. ఈ బదలాయింపు రైడెన్, అదానీ మధ్య అంతర్గత ఒప్పందం ద్వారా జరుగుతుందని వివరించింది. ప్రైమరీ నోటిఫైడ్ పార్టనర్‌గా ఉన్న అదానీకి గూగుల్‌కు ఇచ్చిన అన్ని రాయితీలను వర్తింప చేస్తున్నట్లు ఐటీ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ ఆ ఉత్తర్వుల్లో వెల్లడించడం గమనార్హం.

సీఐఐ సదస్సు సాక్షిగా తేల్చి చెప్పిన అదానీ..

విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు సంబంధించి అక్టోబర్ 14న ఢిల్లీలో ఎంవోయూ కుదుర్చుకున్న సమయంలో అదానీ పేరును చంద్రబాబు సర్కారు కనీసం ప్రస్తావించలేదు. దాదాపు రూ.87 వేల కోట్ల పెట్టుబడి పెడుతున్న అదానీ పేరు ఎక్కడా చెప్పకుండా చంద్రబాబు దాగుడుమూతలు ఆడారు. అయితే అదానీ గ్రూపు చైర్మన్ గౌతమ్ అదానీ తాము ఆ డేటా సెంటర్‌లో భాగస్వామి అవుతున్నందుకు సంతోషంగా ఉందంటూ ట్వీట్ చేశారు. గత నెలలో విశాఖలో జరిగిన సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్ సందర్భంగా తాము గూగుల్‌తో కలసి 15 బిలియన్ డాలర్ల డేటా సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు అదానీ పోర్ట్స్ అండ్ ఎస్ఈజెడ్ మేనేజింగ్ డైరెక్టర్ కరణ్ అదానీ స్వయంగా సీఎం చంద్రబాబు సమక్షంలోనే ప్రకటించారు. దీంతో ముఖ్యమంత్రితో పాటు వేదికపైన ఉన్న మంత్రుల మొహాలు ఒక్కసారిగా మాడిపోయిన సంగతి తెలిసిందే.


From: Alexander Smith <smithalexander@google.com>
Sent: Saturday, October 4, 2025 4:39:19 AM
To: Bhaskar Katamneni IAS <secy_itc@ap.gov.in>
Subject: Data Center Project - Land Allotment

Dear Mr. Bhaskar,

Thank you again for the detailed discussions this week, I particularly appreciate all of your efforts while you have been travelling internationally.

In order to ensure clear coordination on all matters related to the land preparation and allotment, we would like to authorise Mr. Sanjay Bhutani of Adani to serve as an authorised point of contact with the Andhra Pradesh Government in preparation for the land allotment. As shared with you previously, to facilitate the land allotment process, please see the attached details of the relevant Adani entities that we are authorising to be used for the formal allotment process for each of the three site locations.

As outlined in our DPR and discussions, all incentives in the GO will be issued to the applicant, Raiden Infotech India Pte Ltd. Once the GO is issued we will shortly thereafter provide Mr. Bhaskar in your capacity as IT Secretary with formal written notification of our Notified Partners for the purposes of availing incentives under the GO to deliver on the Project.

Please let me know if you have any questions or require further action from us.

Thank you.

Alex

విశాఖలో డేటా సెంటర్‌ను అదానీ సంస్థ నిర్మిస్తుందని, ఆ సంస్థకు భూమి అప్పగించాలంటూ ఈ ఏడాది అక్టోబర్ 4న గూగుల్ సంస్థ ప్రతినిధి అలెగ్జాండర్ స్మిత్ రాష్ట్ర ఐటీ శాఖ కార్యదర్శి భాస్కర్‌కు రాసిన లేఖ

ఆ డేటాసెంటర్.. జగన్ నాటిన మొక్క

సంకుచిత బుద్ధితోనే అదానీ పేరెత్తని బాబు

చంద్రబాబు సర్కారు క్రెడిట్ చోరీని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటికే విలేకరుల సమావేశంలో సాక్ష్యాధారాలతో సహా బయట పెట్టిన విషయం తెలిసిందే. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి క్రెడిట్ దక్కుతుందనే సంకుచిత బుద్ధితోనే సీఎం చంద్రబాబు గూగుల్‌తో ఒప్పందం సమయంలో అదానీ పేరెత్తలేదని విమర్శించారు. గత ప్రభుత్వం కృషి, చొరవతో సాకారమైన డేటా సెంటర్ క్రెడిట్‌ను చంద్రబాబు అబద్ధాలతో తన ఖాతాలో ఏ విధంగా వేసుకున్నాడన్న విషయాన్ని వైఎస్ జగన్ సాక్ష్యాలతో ఎండగట్టారు. డేటా సెంటర్ ద్వారా విశాఖలో ఒక ఎకో సిస్టమ్ ఏర్పడుతుందని, తద్వారా గ్లోబల్ కేపబుల్ సెంటర్స్ వస్తాయన్నారు. డేటా సెంటర్ పనులకు శంకుస్థాపన చేయడంతో పాటు సబ్ సీ కేబుల్ సింగపూర్ నుంచి విశాఖకు ఏర్పాటు పనులకు వైఎస్ జగన్ ప్రభుత్వమే అంకురార్పణ చేసింది. వైఎస్ జగన్ చెప్పిన ప్రతీ అక్షరం సత్యమని ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వం అధికారికంగా విడుదల చేసిన జీవో సాక్షిగా మరోసారి తేటతెల్లమైంది. తొలుత గూగుల్ పేరిట జీవో విడుదల చేసిన చంద్రబాబు సర్కారు ఇప్పుడు ఆ భూములను అదానీ పేరు మీదకు బదలాయించడమే దానికి తార్కాణం. కోవిడ్ లాంటి విపత్కర పరిస్థితులు ఉన్నప్పటికీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విశాఖలో 300 మెగావాట్ల డేటా సెంటర్ ఏర్పాటుకు 2020 నవంబర్‌లో అదానీతో ఒప్పందం చేసుకుంది. అంతేకాదు.. డేటా సెంటర్‌కు డేటా రావాలంటే సింగపూర్ నుంచి 3,900 కి.మీ. పొడవున సబ్‌సీ (సముద్ర గర్భం)లో కేబుళ్లు వేయాల్సి ఉన్నందున దీనిపై 2021 మార్చి 9న సింగపూర్ ప్రభుత్వానికి లేఖ కూడా రాసింది. దేశంలో డేటా సెంటర్ల ఏర్పాటుకు సంబంధించి గూగుల్‌తో అదానీకి వ్యాపార అనుబంధం ఉంది. నోయిడాలో అదానీ నిర్మించిన డేటా సెంటర్‌ను గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్ ఇన్ఫోటెక్ 2022 అక్టోబర్ 11 లీజుకు తీసుకుంది. ఈ క్రమంలో విశాఖలో అదానీ డేటా సెంటర్ ఏర్పాటుకు 2023 మే 3న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అంతేకాదు.. ఆ డేటా సెంటర్ కోసం 190 ఎకరాల భూమిని కూడా కేటాయించారు. ఇప్పుడు చంద్రబాబు సర్కారు చెబుతున్న డేటా సెంటర్‌ను అసలు తాము నిర్మించడం లేదని, దీన్ని అదానీ గ్రూపే నిర్మిస్తుందని, ఆ భూమిని కూడా అదానీకే కేటాయించాలంటూ గూగుల్ ప్రతినిధి అలెగ్జాండర్ స్మిత్ రాష్ట్ర ఐటీ శాఖ కార్యదర్శి భాస్కర్‌కు అక్టోబర్‌లో లేఖ రాయడం గమనార్హం.

చంద్రబాబును కలిసిన గౌతమ్ అదానీ

సాక్షి, అమరావతి : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ భేటీ అయ్యారు. ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో రాష్ట్రంలో అదాని గ్రూపు చేపట్టిన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, రానున్న రోజుల్లో పెట్టబోయే పెట్టుబడులపై చర్చించారు.

గౌతమ్ అదానీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఎం చంద్రబాబు

పల్నాడులో స్క్రబ్ టైఫస్‌తో ఇద్దరు మహిళలు మృతి

నరసరావుపేట: పల్నాడు జిల్లాలో స్క్రబ్ టైఫస్ వ్యాధితో ఇద్దరు వ్యక్తులు మృతిచెందారని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ బి.రవి తెలిపారు. తన కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాజుపాలెం ఆర్‌ఆర్ కాలనీకి చెందిన నాగమ్మ (64) స్క్రబ్ టైఫస్ ప్రభావంతో మృతిచెందిందని, గతనెల 8న ఆమెకు జ్వరం, జలుబు రావటంతో రాజుపాలెం పీహెచ్‌సీలో చికిత్స తీసుకుందన్నారు. రక్తపరీక్షలు చేసిన డాక్టర్ ఆమెను సత్తెనపల్లి ఏరియా ఆస్పత్రికి పంపారన్నారు. ప్లేట్‌లెట్స్ తక్కువగా ఉండటంతో జీజీహెచ్‌కు వెళ్లి చికిత్స పొందుతూ 16న మృతిచెందిందన్నారు. 21న ఆమె రిపోర్టు వచ్చేసరికే ఆలస్యమైందని, స్క్రబ్ టైఫస్ అని నిర్ధారణ అయిందన్నారు. ఆమెకు లివర్ సమస్య ఉండటం కూడా మరణానికి కారణమన్నారు. అలాగే.. ముప్పాళ్ల మండలానికి చెందిన జ్యోతి (19)కి అక్టోబరు 16న దగ్గు, జలుబు, జ్వరం వచ్చిందని, గ్రామంలోని ఆర్ఎంపీ దగ్గర చికిత్స పొందాక రెండ్రోజులపాటు తగ్గిందని, ఆ తర్వాత మళ్లీ నీళ్ల విరోచనాలు ప్రారంభమై జ్వరం వచ్చిందన్నారు. సత్తెనపల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లినా తగ్గకపోవడంతో 24న మంగళగిరి ఎయిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ నవంబర్ 1న మృతిచెందిందన్నారు. పరీక్షల్లో స్క్రబ్ టైఫస్ కారణమని నివేదిక ఇచ్చారని చెప్పారు.

'పట్టిసీమ' అవినీతిని నిగ్గు తేల్చండి

- పీఏసీ సమావేశంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్ డిమాండ్
- మద్దతు పలికిన జనసేనకు చెందిన పీఏసీ చైర్మన్ రామాంజనేయులు
- వైఎస్సార్‌సీపీ వాదనతో ఏకీభవించి వాదించిన బీజేపీ సభ్యుడు

సాక్షి, అమరావతి: టీడీపీ హయాంలో పట్టిసీమ ఎత్తిపోతల పథకం నిర్మాణంలో జరిగిన అవినీతి నిర్ధారణ అయిందని, దానిపై సమగ్ర విచారణ జరపాలని పీఏసీ సమావేశంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. వెలగపూడిలోని అసెంబ్లీ కమిటీ హాలులో బుధవారం పీఏసీ (పబ్లిక్ అకౌంట్స్ కమిటీ) సమావేశం చైర్మన్ పులపర్తి రామాంజనేయులు (జనసేన) అధ్యక్షతన జరిగింది. పట్టిసీమ ఎత్తిపోతల పథకం నిర్మాణంలో జరిగిన అవినీతి, నిధుల దుర్వినియోగంపై గతంలో పీఏసీ ఇచ్చిన నివేదికను సమావేశ అజెండాలో పొందుపరచడంతో దానిపై అరుణ్‌కుమార్ మాట్లాడారు. టెండర్‌లో 5 శాతం ప్రీమియం పరిమితి విధించినా.. ప్రభుత్వం 21.99 శాతం ప్రీమియంతో బిడ్‌ను ఆమోదించిందని చెప్పారు. దీనివల్ల రూ.199 కోట్లు అదనంగా ఖర్చయ్యాయని తెలిపారు. వెల్ ఫౌండేషన్ బదులుగా డయాఫ్రం వాల్ వేయడానికి రూ.106 కోట్లు అదనంగా కాంట్రాక్టర్‌కి ఇచ్చారని, అప్పటికే 21.99 శాతం ఎక్కువ రేటుతో బిడ్ వేశాక అదనపు సొమ్ము ఇవ్వడం దుర్వినియోగమేనని స్పష్టం చేశారు. పైప్‌లైన్ల అంచనాల్లో ప్రభుత్వం వేసిన అంచనా, కాంట్రాక్టర్ చేసిన ఖర్చు మధ్య రూ.600 కోట్ల తేడా ఉందని తెలిపారు. కావాలని అంచనాలు పెంచారని, ఇందులో భారీ అవినీతి ఉందన్నారు. ఎత్తిపోతల పథకంలో బిగించిన పైపుల కంటే ఎక్కువ పైపులకు బిల్లులు తీసుకున్నారని తెలిపారు. వీటన్నింటిపైనా సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అరుణ్‌కుమార్ వాదనను సమర్థించిన పీఏసీ చైర్మన్ పులపర్తి రామాంజనేయులు పట్టిసీమలో జరిగిన తప్పులపై విచారణ జరిపించాల్సిన అవసరం ఉందని అన్నట్టు సమాచారం. పీఏసీ సభ్యుడుగా ఉన్న బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు కూడా పట్టిసీమ నిర్మాణంలో అవకతవలు జరిగాయని, వాటిని విచారించాలని కోరారు. జనసేన, బీజేపీ చంద్రబాబుకు వ్యతిరేక వైఖరి తీసుకోవడంతో సమావేశంలో ఉన్న టీడీపీ సభ్యులు బిత్తరపోయారు. సమావేశంలో జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, ఈఎన్‌సీ, ఇతర అధికారులు పాల్గొన్నారు. పీఏసీ సమావేశం ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరగడంతో రెండు రోజులు జరగాల్సిన సమావేశాన్ని ఒక రోజుతోనే ముగించారు.

పింఛన్ సొమ్ము నుంచే ఇంటి పన్ను వసూళ్లు

- లబ్ధిదారుల తిరుగుబాటుతో తోకముడిచిన ప్రభుత్వం
- కాకినాడ జిల్లా తుని మండలం లోవకొత్తూరులో ఘటన

పింఛన్ డబ్బు నుంచి ఇంటి పన్ను మినహాయించుకుంటున్న ఉద్యోగి.. పింఛన్ డబ్బు నుంచి ఇంటి పన్ను చెల్లించిన రశీదు

తుని రూరల్: సామాజిక భద్రతగా అందించాల్సిన పింఛన్ల సొమ్ము నుంచి ఇంటి పన్నులు వసూలు చేస్తున్న ప్రభుత్వంపై లబ్ధిదారులు తిరుగుబాటు చేశారు. దీంతో ప్రభుత్వం వెనక్కి తగ్గింది. స్థానికుల సమాచారం మేరకు..ఈ నెల 1న కాకినాడ జిల్లా తుని మండలం లోవకొత్తూరు గ్రామంలో పంచాయతీ కార్యదర్శి స్వామి ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది పింఛన్ల పంపిణీ చేపట్టారు. పింఛన్లు పొందుతున్న కొంతమంది నుంచి ఇంటి పన్ను సొమ్ము మినహాయించి మిగతాది ఇచ్చారు. ఇంటి పన్ను కట్టకపోతే ప్రభుత్వం పింఛన్ నిలిపివేస్తుందన్న భయంతో కొంతమంది ఇంటి పన్ను చెల్లింపునకు అంగీకరించారు. పలివెల దేవుడమ్మ పింఛన్ నుంచి ఇంటి పన్ను వసూలు చేస్తుండగా ఆమె కుమార్తె తీవ్రంగా వ్యతిరేకించి సచివాలయ సర్వేయర్ సురేష్‌ను నిలదీసింది. మిగిలిన పింఛన్‌దారులు ఆమెకు మద్దతు పలికారు. దీంతో పింఛన్ డబ్బు చెల్లించి సర్వేయర్ వెనుతిరిగారు.అలాగే, యండగుడ నూకాలమ్మ నుంచి 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇంటి పన్ను రూ.243 మినహాయించుకుని పింఛన్ ఇచ్చినట్లు బాధితురాలు చెప్పారు. మరికొంతమంది నుంచి పింఛన్ డబ్బులోనుంచే ఇంటి పన్నులు మినహాయించుకుని రశీదులు ఇచ్చినట్లు తెలిసింది. కొడుకు ఇంటి పన్ను చెల్లించలేదని అతని తల్లికి పింఛన్ 2 రోజులు నిలిపివేసినట్లు ఆరోపించారు. కాగా, ఇంటి పన్నులు గత నెల నుంచీ వసూలు చేస్తున్నామని, కొంతమంది ఒకటో తేదీకి కడతామని చెప్పడంతో అడిగినట్లు సచివాలయ కార్యదర్శి స్వామి తెలిపారు. ఎవరి నుంచీ తమ సిబ్బంది బలవంతంగా ఇంటి పన్నులు వసూలు చేయలేదని, పింఛన్ డబ్బు నుంచి మినహాయించుకోలేదని అన్నారు.

హైదరాబాద్‌లో విమాన సర్వీసులు రద్దు

శంషాబాద్: ప్రతికూల వాతావరణం వల్ల శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ఇండిగో ఎయిర్‌లైన్స్ సంస్థ భారీగా విమాన సర్వీసులను రద్దు చేసింది. బుధవారం ఒక్కరోజే శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరాల్సిన 19 విమాన సర్వీసులతో పాటు శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వివిధ గమ్యస్థానాల నుంచి రావల్సిన 21 విమానాలను ఇండిగో సంస్థ రద్దు చేసింది. విమానాల రద్దు, ఆలస్యంతో శంషాబాద్ ఎయిర్‌పోర్టులో రద్దీ ఏర్పడింది. సర్వీసుల రద్దుపై ఎయిర్‌లైన్స్ సంస్థ ముందస్తు సమాచారం ఇవ్వకపోవడంతో ప్రయాణికులు ఎయిర్‌పోర్టు దాకా వచ్చి వెనుదిరిగారు. కోయంబత్తూరు వెళ్లాల్సిన పలువురు అయ్యప్ప భక్తులు ఎయిర్‌లైన్స్ తీరుపై నిరసన వ్యక్తం చేశారు.

వైఎస్సార్‌సీపీ బీసీ నేతపై హత్యాయత్నం

- అధికార ప్రతినిధి విజయభాస్కర్‌పై ఇనుప రాడ్లు, కట్టెలు, ట్యూబ్ లైట్లతో దాడి
- కిందపడిపోయిన బాధితుడిని వీడియో, ఫొటోలు తీసుకుని వెళ్లిన వైనం

తీవ్రంగా గాయపడిన విజయభాస్కర్

రాయచోటి అర్బన్: వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి శిబ్యాల విజయభాస్కర్‌పై బుధవారం రాత్రి హత్యాప్రయత్నం జరిగింది. బాధితుడి భార్య విజయలక్ష్మి తెలియజేసిన వివరాల ప్రకారం దాదాపు 10 మంది వ్యక్తులు ఇంటికి వచ్చి గేటు తీయాలని అడిగారు. గేటు తీసిన భాస్కర్‌పై ఇనుప రాడ్లు, కట్టెలు, ట్యూబ్ లైట్లతో విచక్షణారహితంగా దాడి చేయడం ప్రారంభించారు. కాళ్లు పట్టుకున్నా వదలలేదు. తీవ్రంగా గాయపడి కింద పడిపోయిన తరువాత దుండగులు వీడియో, ఫొటోలు తీసుకుని అక్కడి నుంచి వెళ్లిపోయారు. వెంటనే స్థానికుల సహకారంతో గాయపడిన భాస్కర్‌ను రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మంత్రి అనుచరుల పనే..!

మంత్రి రాంప్రసాద్ రెడ్డి వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌పై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ బుధవారం మీడియా సమావేశం ఏర్పాటు చేసినందుకు ఆగ్రహించిన మంత్రి అనుచరులే తనపై దాడి చేసి ఉంటారని విజయభాస్కర్ పేర్కొన్నారు. తనకు రాయచోటిలో వేరే శత్రువులు ఎవరూ లేరని తెలియజేశారు.

హేయమైన చర్య: వైఎస్సార్‌సీపీ

విజయభాస్కర్‌పై దాడిని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ప్రజాపక్షాన మాట్లాడేవారిని గొంతునొక్కాలన్న అరాచక ధోరణి ఇటీవల రాష్ట్రంలో పెరిగిపోయిందన్నారు. గతంలో బీసీ నాయకులైన మాజీ ఎంపీపీ అంపాబత్తిన రెడ్డెయ్య ఇంటిపై దాడి, మల్లూరు రెడ్డి వరప్రసాద్‌పై దాడిని ఈ సందర్భంగా ప్రస్తావించారు. భాస్కర్‌పై దాడిచేసిన నిందితులను గుర్తించి 48 గంటల్లో అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఇది రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ పనితీరుకు ఒక మచ్చగా మిగిలిపోతుందని పేర్కొన్నారు. కాగా భాస్కర్‌పై దాడి దారుణమని పార్టీ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ దస్తగిరి ఒక ప్రకటనలో ఖండించారు.

ప్రభుత్వ సాయంలోనూ వివక్ష

నేతన్నల నిరసన

వర్షంలో నిలబడి నిరసన తెలుపుతున్న నేత కార్మికులు

నారాయణవనం: తుపాను ప్రభావంతో ఉపాధి కోల్పోయిన చేనేత కార్మికులకు ప్రభుత్వం అందించిన సాయంలోనూ వివక్ష చోటుచేసుకోవడంతో తిరుపతి జిల్లా నారాయణవనంలోని చేనేత కార్మికులు బుధవారం వర్షంలో నిలబడి నిరసన తెలిపారు. తుపాను ప్రభావంతో మగ్గం గుంతల్లో నీరు చేరడం, నేయడానికి వాతావరణం సహకరించక ఉపాధిని కోల్పోయిన నేత కార్మికులకు ప్రభుత్వం 25 కేజీల బియ్యం, పప్పు, ఉల్లిపాయలు, బంగాళాదుంపలను అందజేసింది. మండలంలో నారాయణవనం, కైలాసకోన వీవర్స్ కాలనీ, తుంబూరు, పాలమంగళం ఉత్తర, దక్షిణపుకండ్రిగ గ్రామాల్లో చేనేత కుటుంబాలు వారు వైఎస్సార్ సీపీకి మద్దతుగా ఉన్నారనే కారణం చూపుతూ టీడీపీ నేతలు వందకు పైగా చేనేత కుటుంబాలకు సాయం అందకుండా చేశారు. ప్రభుత్వ సాయంలో అధికారులు పక్షపాతం చూపారని కార్మికులు వాపోయారు. నెల రోజులు దాటుతున్నా సాయం అందలేదని వాపోతున్నారు. సాయంలో ప్రత్యక్ష జోక్యం లేదని రెవెన్యూ, సచివాలయ అధికారులు సమాధానం దాటవేస్తున్నారని నేత కార్మికులు జయరామయ్య, దేశయ్య, పెరుమాళ్, జయశంకర్ తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు.

సాక్షి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్నా.
మా టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ.7.00 గం.ల నుండి రా.8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగిన చర్యలు తీసుకుంటాం.
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899

క్లుప్తంగా...

దృఢ సంకల్పానికి ఏ వైకల్యం అడ్డుకాదు

దివ్యాంగులకు వైఎస్ జగన్ శుభాకాంక్షలు

సాక్షి, అమరావతి: ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. 'ఆత్మ విశ్వాసానికి, దృఢ సంకల్పానికి ఏ వైకల్యం అడ్డు కాదు. పట్టుదలతో సవాళ్లను అధిగమిస్తూ.. ప్రతి రంగంలోనూ నూతన శిఖరాలను అధిరోహిస్తున్న విభిన్న ప్రతిభావంతులందరికీ ప్రపంచ దివ్యాంగ దినోత్సవ శుభాకాంక్షలు' అంటూ వైఎస్ జగన్ బుధవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు.

రాజధాని రైతులు సహకరించకపోతే భూ సేకరణకు వెళ్తాం

మంత్రి నారాయణ హెచ్చరిక

సాక్షి, అమరావతి/తాడికొండ: అమరావతి పరిధిలోని 29 గ్రామాల రైతులు భూ సమీకరణకు సహకరించకపోతే భూ సేకరణకు వెళ్తామని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ హెచ్చరించారు. ఆయన బుధవారం రాజధాని ప్రాంత రైతులు, అధికారులతో సమావేశమయ్యారు. భూసమీకరణ కోసం భూములు ఇచ్చి ప్రభుత్వానికి సహకరిస్తే ప్రక్రియ త్వరగా పూర్తవుతుందని చెప్పారు. 2,168 మంది రైతులకు 7,743 ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉందని.. విడతల వారీగా అందరికీ రిజిస్ట్రేషన్ చేస్తామన్నారు. అలాగే భూములిచ్చిన రైతులకు 719 ఎకరాల మేర ప్లాట్లు కేటాయించాల్సి ఉందని చెప్పారు. అడ్డంకులు తొలగిన వెంటనే ఈ ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు.

ఉత్పత్తి ఆధారిత వేతనం సర్క్యులర్‌ను ఆపండి

స్టీల్ ప్లాంట్ యాజమాన్యానికి లేబర్ కమిషనర్ ఆదేశం

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ఉత్పత్తి ఆధారంగా జీతం చెల్లిస్తామని యాజమాన్యం ఇచ్చిన సర్క్యులర్‌ను అమలు చేయవద్దని రీజనల్ లేబర్ కమిషనర్ (ఆర్ఎల్‌సీ) ఆదేశించారు. గత నెలలో ఉక్కు యాజమాన్యం ఇచ్చిన ఆదేశాల మేరకు డిసెంబర్ 2న ఉత్పత్తి ఆధారంగా పర్సంటేజి జీతాలు చెల్లించారు. దీనిపై ఉక్కు కార్మిక సంఘాలు ఆర్ఎల్‌సికు ఫిర్యాదు చేశాయి. దీనిపై బుధవారం ఆర్ఎల్‌సి కార్యాలయంలో జరిగిన సమావేశంలో కార్మిక సంఘాలు, యాజమాన్యం ప్రతినిధులు వాదనలు వినిపించారు. అనంతరం యాజమాన్యం ఇచ్చిన సర్క్యులర్‌ను వచ్చే నెల వరకు అమలు చేయవద్దని, ఈ నెలలో కోత విధించిన జీతాలను సాధ్యమైనంత త్వరగా చెల్లించాలని ఆదేశించారు.

30లోగా సచివాలయాల ఉద్యోగుల సీనియారిటీ జాబితాలు

సాక్షి, అమరావతి: జిల్లాల వారీగా గ్రామ/వార్డు సచివాలయాల ఉద్యోగుల సీనియారిటీ జాబితాలను ఈ నెల 30లోగా ఖరారు చేయాలని ఆ శాఖ డైరెక్టర్ శివప్రసాద్ బుధవారం కలెక్టర్లకు లేఖ రాశారు. కేటగిరీ వారీగా జిల్లా సీనియారిటీ జాబితాలను ఖరారు చేయాలని లేఖలో సూచించారు. ఈ నెల 9లోగా ప్రాథమిక సీనియారిటీ జాబితాలు రూపొందించి, 10న ఆ జాబితాను అందరికీ తెలిసేలా ప్రచురించాలని.. 11 నుంచి 23వ తేదీ వరకు ఆయా జాబితాలపై అభ్యంతరాలు స్వీకరించి 30వ తేదీలోగా తుది సీనియారిటీ జాబితాలను ఖరారు చేయాలని ఆదేశించారు.

హెల్త్ కార్డు సమస్యలతో ఉద్యోగులకు తీవ్ర నష్టం

పెండింగ్ డీఏలు తక్షణమే ఇవ్వాలి

ఉద్యోగులకు హెల్త్ ఇన్సూరెన్స్ చేయాలి

ఏపీ ఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్



భీమవరం(ప్రకాశం చౌక్): హెల్త్ కార్డు సమస్యలతో తీవ్రంగా నష్టపోతున్నామని ఏపీ ఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్ తెలిపారు. బుధవారం ఇక్కడ పశ్చిమగోదావరి జిల్లా అడ్‌హాక్ కమిటీ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెండింగ్ డీఏలను తక్షణమే మంజూరు చేయాలని, పదవీ విరమణ చేసిన ఉద్యోగుల బకాయిలను చెల్లించాలని చంద్రబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముఖ్యంగా ఉద్యోగులకు హెల్త్ కార్డు సమస్య తీవ్రంగా ఉందని దాంతో నష్టపోతున్నారని, ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లామని, హెల్త్ ఇన్సూరెన్స్ చేయాలని, వెంటనే హెల్త్ కార్డుల సమస్యలను పరిష్కరించాలని కోరామన్నారు. 7 వేల మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులకు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, పెన్షనర్లకు అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ తగ్గించారని, దానిని పునరుద్ధరించాలన్నారు. ముందుగా జరిగిన సభలో పాల్గొన్న పీడీఎఫ్ ఎమ్మెల్సీ గోపిమూర్తి మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యోగులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి సమస్యలు శాసనమండలిలో ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానన్నారు. అనంతరం పశ్చిమగోదావరి జిల్లా అడ్ హాక్ కమిటీని విద్యాసాగర్ ప్రకటించారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

12 మంది మావోయిస్టులు మృతి

ముగ్గురు డీఆర్‌జీ జవాన్లు కూడా.. మరో ఇద్దరికి గాయాలు

కూంబింగ్ ముమ్మరం చేసిన పోలీసు బలగాలు

చర్ల: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో బుధవారం పోలీస్ బలగాలకు, మావోయిస్టులకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో 12 మంది మావోయిస్టులు, ముగ్గురు డీఆర్‌జీ జవాన్లు మృతి చెందారు. మరో ఇద్దరు జవాన్లకు తీవ్ర గాయాలయ్యాయి. బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ పట్టిలింగం కథనం ప్రకారం.. బీజాపూర్–దంతెవాడ జిల్లాల సరిహద్దు ప్రాంతం బైరంగఢ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కేశ్‌కుతుల్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారని నిఘా వర్గాలకు సమాచారం అందింది. దీంతో రెండు జిల్లాలకు చెందిన డీఆర్‌జీ, ఎస్టీఎఫ్, కోబ్రా, సీఆర్‌పీఎఫ్ బలగాలు మంగళవారం సాయంత్రం నుంచి కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో బుధవారం ఉదయం కేశ్‌కుతుల్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు మెరుపుదాడికి (అంబుష్) దిగారు. పోలీసు బలగాలపై కాల్పులు జరపడంతో అప్రమత్తమైన పోలీసులు ఎదురుకాల్పులు జరిపారు. ఇప్పటివరకు 12 మంది మావోయిస్టుల మృతదేహాలను గుర్తించారు. అయితే వారు ఏయే ప్రాంతాలకు చెందినవారనేది గుర్తించాల్సి ఉంది. బీజాపూర్ జిల్లాకు చెందిన ముగ్గురు జవాన్లు మోనూ వాడాది (హెడ్ కానిస్టేబుల్), దుకారు గోండే, రమేష్ సోఢీ ఎదురుకాల్పుల్లో మృతి చెందారు. సోమ్‌దేవ్ యాదవ్‌తో పాటు మరో జవాన్ గాయపడ్డారు. వీరిని బీజాపూర్ జిల్లా కేంద్రానికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఎదురుకాల్పుల్లో పలువురు మావోయిస్టులు తప్పించుకోగా కూంబింగ్ మరింత ముమ్మరం చేసినట్లు బస్తర్ ఐజీ తెలిపారు. సంఘటనా ప్రాంతం నుంచి ఎస్ఎల్ఆర్, ఇన్సాస్ రైఫిల్, త్రీనాట్ త్రీ రైఫిల్, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

ఇప్పటివరకు 275 మంది ఎన్‌కౌంటర్

జిల్లాలో యాంటీ నక్సల్ ఆపరేషన్ ఇంకా కొనసాగుతోందని ఐజీ తెలిపారు. తాజా ఎన్‌కౌంటర్‌తో కలిపి ఈ ఏడాది ఇప్పటివరకు ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎదురుకాల్పుల్లో 275 మంది మావోయిస్టులు మృతి చెందారు. బీజాపూర్, దంతెవాడ సహా ఏడు జిల్లాలతో కూడిన ఒక్క బస్తర్ డివిజన్‌లోనే 246 మంది మరణించారు.

అన్నదాతల పాలిట శాపంగా మారిన చంద్రబాబు

- ధాన్యం సహా ఏ పంటకూ మద్దతు ధర ఎందుకు ఇవ్వడం లేదు
- మీరు చేస్తున్నది రైతన్న మోసం కార్యక్రమం
- మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

సాక్షి, అమరావతి: ఏ పంటకూ గిట్టుబాటు ధర కల్పించని చంద్రబాబు అన్నదాతల పాలిట శాపంగా మారారని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు మండిపడ్డారు. బుధవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. 'రాష్ట్రంలో ఇప్పుడు ఎక్కడ చూసినా కల్లాల్లో ధాన్యం కళ్లల్లో దైన్యం తప్ప మరేమీ కనిపించడం లేదు. చంద్రబాబు ప్రభుత్వం నిర్వహిస్తున్నది రైతన్నా మీ కోసం కార్యక్రమం కాదు. అది రైతన్న మోసం కార్యక్రమం. రైతులే లేకుండా అధికార పార్టీ కార్యకర్తలకే పచ్చ కండువాలు కప్పి.. ప్రచారం కోసం కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వంలో ధాన్యానికి మద్దతు ధరతో పాటు సంచులు, రవాణా ఖర్చులు కూడా అందించి అన్నదాతలను అన్ని రకాలుగా ఆదుకున్నారు. కూటమి ప్రభుత్వంలో ధాన్యం బస్తాకు రూ.1,770 చెల్లించాల్సి ఉండగా.. చంద్రబాబు ప్రభుత్వం రైతులను దళారుల పాలు చేసింది. రైతులు రూ.1,200కే దళారులకు అమ్ముకుంటున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే అన్నదాతలు కాడె వదిలిపెట్టడం ఖాయం. తక్షణమే ప్రభుత్వం జోక్యం చేసుకుని మద్దతు ధర కల్పించడంతో పాటు రానున్న సీజన్‌లో విత్తనాలు, ఎరువులు కొరత లేకుండా ఇవ్వాలి' అని డిమాండ్ చేశారు.

ఏ పంటకూ గిట్టుబాటు ధర ఇవ్వలేదు

'ప్రత్తి, మామిడి, అరటి, ఉల్లి, కందులు ఇలా ఏ పంటకూ మీరు గిట్టుబాటు ధర ఇవ్వలేదు. మీ హెరిటేజ్ షాపుల్లో అరటిపండు రూ.50 పైసలకు అమ్ముతారా?. రైతు పండించిన అరటిని కిలో రూ.50 పైసలకు కూడా కొనలేని పరిస్థితిలో ఈ ప్రభుత్వం ఉంది. వైఎస్ జగన్ ప్రభుత్వంలో అరటి రైతులకు అండగా నిలిచేందుకు ప్రభుత్వమే అరటి పంటను కొని పశ్చిమ బెంగాల్‌కు ప్రత్యేక రైళ్లలో తరలించారు. మీరు మాత్రం మీ కోసం రైతన్నా అంటూ అబద్ధాలు చెబుతున్నారు. నల్లజర్ల వెళ్లిన చంద్రబాబు అక్కడా అబద్ధాలే చెప్పారు. రైతులు తడిసిన ధాన్యంతో తీవ్రంగా అల్లాడిపోతున్నారు. వాళ్ల బాధ వర్ణణాతీతం. ప్రభుత్వం ఏం చేస్తోంది?. కోట్లాది రూపాయల ఖర్చుతో ప్రచారం చేసుకుంటున్న మీరు ఆ మొత్తాన్ని రైతులకిచ్చినా మేలు జరిగి ఉండేది. రాయలసీమ ప్రాంతంలో వర్షాలతో పంటలు దెబ్బతింటే మీరు ఎందుకు మాట్లాడటం లేదు? రైతులకు రూ.600 కోట్ల పాత బాకీ ఇంకా చెల్లించలేదు. తుపాను వల్ల నష్టపోయిన రైతులకు పరిహారం కూడా ఇవ్వలేదు. రూ.2.66 లక్షల కోట్లు అప్పు చేసి రైతులకు ఏం మేలు చేశారు? ప్రజలకేం చేశారు?. ఓఎన్‌జీసీ పనుల వల్ల కొబ్బరి చెట్లు నేలకూలుతున్నాయి. డిప్యూటీ సీఎంగా పవన్‌కళ్యాణ్ రైతులకు నష్టపరిహారం ఇప్పించే పనిచేయాలే తప్ప అనవసరమైన మాటలు మాట్లాడటం వృథా. ప్రభుత్వం ఇన్సూరెన్స్ కట్టకపోవడం వల్లే రైతులకు పంట నష్టపరిహారం రాలేదు. దానిగురించి పవన్‌కళ్యాణ్ ఎందుకు మాట్లాడటం లేదు' అని కారుమూరి నిలదీశారు.

16న వైఎస్ జగన్ నేతృత్వంలో

గవర్నర్‌కు కోటి సంతకాలు అందజేత

- మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై కోటి సంతకాల ప్రజా ఉద్యమానికి అనూహ్య స్పందన
- వైఎస్సార్‌సీపీ స్టేట్ కో–ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి

సాక్షి, అమరావతి: ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ చేపట్టిన కోటి సంతకాల ప్రజా ఉద్యమ కార్యక్రమానికి అన్నివర్గాల ప్రజల నుంచి అనూహ్యమైన స్పందన వచ్చిందని వైఎస్సార్‌సీపీ స్టేట్ కో–ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పారు. వైఎస్సార్‌సీపీ జిల్లా పార్టీల అధ్యక్షులు, పార్లమెంటరీ పరిశీలకులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు (కో–ఆర్డినేషన్, అనుబంధ విభాగాలు), రాష్ట్ర కార్యదర్శులు (కో–ఆర్డినేషన్), ఎమ్మెల్యేలు, నియోజకవర్గ సమన్వయకర్తలు, రాష్ట్ర కార్యదర్శులు (పార్లమెంట్)తో బుధవారం రామకృష్ణారెడ్డి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమంలా సాగిందన్నారు. సంతకాలు కోటి అనుకుంటే అంత కుమించి వస్తున్నాయని చెప్పారు. ఇప్పటివరకు నియోజకవర్గ స్థాయిలో సేకరించిన సంతకాలను ఈ నెల 10న జిల్లా పార్టీ కార్యాలయాలకు పంపాలని సూచించారు. 13న జిల్లా కార్యాలయాల నుంచి కేంద్ర కార్యాలయం తాడేపల్లికి పంపాలని కోరారు. ఈ నెల 16న పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలో గవర్నర్‌కు కోటి సంతకాలు అందజేయనున్నట్టు చెప్పారు. సేకరించిన సంతకాలన్నీ నియోజకవర్గ కేంద్రాల్లో ప్రజల ముందు, మీడియా ముందు ప్రదర్శించి వారి సమక్షంలోనే బాక్సుల్లో సర్ది వాహనాల్లో పెట్టి నాయకులు జెండా ఊపి జిల్లా పార్టీ కార్యాలయానికి పంపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమైన నాయకులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. 13న జిల్లా కేంద్రంలో కూడా అదే స్థాయిలో కార్యక్రమం నిర్వహించి అక్కడి నుంచి రాష్ట్ర కార్యాలయానికి పంపాలని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని అధినేత వైఎస్ జగన్ ప్రత్యేకంగా చెప్పారని వెల్లడించారు. జిల్లా కేంద్రం నుంచి వేలాది మందితో ర్యాలీలు చేపట్టి రాష్ట్ర కార్యాలయానికి పంపాలన్నారు. పార్టీ అనుబంధ విభాగాలు కూడా ఇందులో కీలకపాత్ర పోషించాలని సూచించారు.

ఇక 'రుచి' చూపిస్తా!

రెస్టారెంట్ ఏర్పాటు చేస్తానని చెప్పిన ఐ బొమ్మ రవి

పైరసీ చేయడం మానేస్తానని పోలీసుల విచారణలో వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ఐ బొమ్మ, బప్పం పేర్లతో వెబ్‌సైట్లను ఏర్పాటు చేసి, 21 వేల సినిమాలను పైరసీ చేసిన ఇమ్మడి రవి జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత ఓ రెస్టారెంట్ ఏర్పాటు చేసి వినియోగదారులకు షడ్రుచుల ఆహార పదార్థాలను విక్రయించాలని యోచిస్తున్నాడు. హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసుల విచారణలో ఇదే విషయాన్ని చెప్పాడు. ఇమ్మడి రవిపై హైదరాబాద్‌లో మొత్తం ఐదు కేసులు నమోదయ్యాయి. తొలుత ఓ కేసులో అరెస్టు చేసిన పోలీసులు కోర్టు అనుమతితో ఓసారి కస్టడీకి, మరోసారి అదనపు కస్టడీకి తీసుకున్నారు. ఆపై మరో కేసులో అరెస్టు చేయడానికి అనుమతి కోరుతూ న్యాయస్థానంలో ప్రిజనర్స్ ట్రాన్సిట్ వారెంట్ కోసం పిటిషన్ వేస్తున్నారు. ఇలా ఇప్పటి వరకు రెండు కేసుల్లో ఈ తంతు పూర్తి చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు మిగిలిన మూడు కేసుల్లోనూ ఇదే ప్రక్రియను అనుసరించడానికి సన్నాహాలు చేస్తున్నారు. తొలిసారి అరెస్టు చేసిన నాటికి, ఇప్పటికి అతడిలో ఎంతో మార్పు కనిపిస్తోందని సైబర్ క్రైమ్ పోలీసులు చెప్తున్నారు. తమకు చిక్కినప్పుడు సినిమా టికెట్ల రేట్లు, హీరోల రెమ్యూనరేషన్ల విషయాలు మాట్లాడి, తన పనిని సమర్థించుకున్నాడని, ప్రస్తుతం పైరసీ సినిమాలకు ఫుల్‌స్టాప్ పెట్టాలని నిర్ణయించుకున్నట్లు చెపుతున్నాడని అధికారులు తెలిపారు. బతుకు తెరువు కోసం హైదరాబాద్ లేదా తన స్వస్థలమైన విశాఖపట్నంలో రెస్టారెంట్ ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు పోలీసులతో చెప్పాడు. అలాగే తన తప్పు తెలుసుకున్న రవి తన తండ్రి చిన అప్పారావు వద్దకూ వెళ్లాలని భావిస్తున్నట్టు పోలీసులు చెప్పారు. భార్య నుంచి దూరమైన నాటి నుంచి అతడు ఒంటరిగానే జీవిస్తున్నాడు. ప్రస్తుతం తాను ఇక్కడ, తండ్రి అక్కడ ఒంటరి జీవితం గడుపుతున్నామని విచారం వ్యక్తం చేస్తున్నాడు. అనారోగ్యంతో, తన తల్లి నుంచి దూరంగా బతుకుతున్న తండ్రిని జాగ్రత్తగా చూసుకుంటానని పోలీసులకు తెలిపాడు.

సాక్ష్యాలు, కారణాలు లేకుండానే

వైఎస్సార్‌సీపీ నేతలపై ఎడాపెడా కేసులు

- హత్యలకు సైతం టీడీపీ నేతలు వెనుకాడటం లేదు
- రాజకీయ కక్ష సాధింపు కోసం పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోదరులపై తప్పుడు కేసు
- నకిలీ మద్యం కేసులో జోగి రమేష్ అక్రమ అరెస్ట్
- మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

సాక్షి, అమరావతి: సాక్ష్యాలు, కారణాలు లేకుండానే వైఎస్సార్‌సీపీ నేతలపై ఎడాపెడా కేసులు పెడుతూ చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు దుయ్యబట్టారు. బుధవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. చట్టాన్ని చుట్టంగా భావిస్తున్న చంద్రబాబు కూటమి ప్రభుత్వం రాజకీయ కక్షసాధింపు చర్యలను పరాకాష్టకు చేర్చిందన్నారు. తమ పాలనా వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని చెప్పారు. 'అధికారమే పరమావధిగా కనీస నైతిక విలువలు లేకుండా సీఎం చంద్రబాబు వికృత, నీచ రాజకీయాలు చేస్తారు. కక్షసాధింపు చర్యల్లో చంద్రబాబు డబుల్ పీహెచ్‌డీ చేశారు. రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ అధికార దుర్వినియోగం ఎలా చేయవచ్చని ఎవరినైనా పీహెచ్‌డీ చేయమంటే వారు కచ్చితంగా చంద్రబాబు పేరే తీసుకుంటారు. ఎందుకంటే చంద్రబాబు రాజకీయంలో అన్నిరకాల ఉల్లంఘనలు ఉంటాయి. ఆయనకు సహకరిస్తున్న వ్యవస్థలూ ఉంటాయి. ఇప్పుడు కూడా వైఎస్సార్‌సీపీ లక్ష్యంగా ఆయన వికృతంగా వ్యవహరిస్తున్నారు. ఏ మాత్రం సాక్ష్యాలు, ఆధారాలు, కారణాలు లేకుండానే మా పార్టీ నేతలు, నాయకులపై కేసులు పెడుతున్నారు. అరెస్టు చేస్తున్నారు. జైళ్లకు పంపుతున్నారు. ఎప్పటికైనా నిజమే గెలుస్తుంది. అందుకే చంద్రబాబు ఎన్ని రకాలుగా వేధించినా అన్నింటినీ ధైర్యంగా ఎదుర్కొంటాం' అని సుధాకర్‌బాబు వ్యాఖ్యానించారు.

టీడీపీ వర్గపోరు హత్యల్లో పిన్నెల్లిని ఇరికించారు

'వైఎస్సార్‌సీపీలో ముఖ్య నాయకుడైన పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని రాజకీయంగా ఎదుర్కోలేక చంద్రబాబు దుష్ట సంప్రదాయానికి తెర లేపారు. టీడీపీలో రెండువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఒక వర్గానికి చెందిన ఇద్దరు చనిపోతే.. ఆ కేసును పిన్నెల్లి సోదరుల మీద బనాయించారు. పిన్నెల్లి సోదరులకు ఆ హత్యలతో ఎలాంటి సంబంధం లేదు. అదే విషయాన్ని హత్యలు జరిగిన రోజు జిల్లా ఎస్పీ శ్రీనివాస్ స్వయంగా ప్రకటించారు. ప్రకాశం జిల్లాలో వీరయ్య చౌదరిని చంపింది ఎవరు?. ఇవన్నీ అందరికీ తెలిసినవే. ప్రకాశం జిల్లాలో దోచుకున్న డబ్బులు తినే క్రమంలో వచ్చిన విభేదాలతో వీరయ్య చౌదరి హత్య జరిగింది. ఆ రెండు ఘటనలను వైఎస్సార్‌సీపీకి అంటగట్టేందుకు కుట్రతో నిరాధార ఆరోపణలు చేస్తూ నిందిస్తున్నారు. బీసీ నాయకుడైన జోగి రమేష్‌పై అక్రమ కేసు బనాయించి అరెస్టు చేశారు. అసలు మీరు చెబుతున్న ఆ కేసుకు సంబంధించిన నిందితుల కాల్ డేటాల్లో, ఫోన్ డేటాల్లో ఎక్కడైనా జోగి రమేష్ పేరు ఉందా?' అని ప్రశ్నించారు.

వరి వల్ల ఉపయోగం లేదు.. ఆదాయం లేదు

- ఆ స్థానంలో ఉద్యానపంటలకు ప్రాధాన్యం ఇవ్వాలి
- నదుల అనుసంధానానికి ప్రణాళికలు
- రైతన్నా మీకోసం.. సభలో సీఎం చంద్రబాబునాయుడు



సాక్షి, రాజమహేంద్రవరం/నల్లజర్ల: వరి సాగు వల్ల ఎలాంటి ఉపయోగం, ఆదాయం లేవని సీఎం చంద్రబాబునాయుడు చెప్పారు. వరిస్థానంలో ఉద్యాన పంటలు సాగుచేయాలని సూచించారు. తూర్పుగోదావరి జిల్లా నల్లజర్లలో బుధవారం నిర్వహించిన రైతన్నా మీ కోసం.. కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రైతులు, రైతు కుటుంబాలతో ముఖాముఖి నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పామాయిల్ సాగులో టెక్నాలజీ ఉపయోగించి తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందవచ్చన్నారు. గోదావరి జలాలను కృష్ణానదిలో కలిపామని, వంశధారకు కలుపుతామని, పెన్నానది వరకు తీసుకెళ్లేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. భూగర్భ జలాలు పెంచుకోగలిగితే కరవు ఉండదని చెప్పారు. పోలవరం రైట్ కెనాల్ నుంచి నీరు ఇస్తే నల్లజర్ల ప్రాంతంలో భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. కరవు ఎక్కువగా ఉండే రాయలసీమ నంద్యాల జిల్లాలో భూగర్భ జలాలు నాలుగు మీటర్లకు పెరిగాయన్నారు. తూర్పుగోదావరి, ఏలూరు, ప్రకాశం జిల్లాల్లో భూగర్భ జలాలు తగ్గాయని చెప్పారు. కాగా, ప్రస్తుతం రాష్ట్రంలో ఎయిడ్స్ తగ్గుముఖం పట్టిందన్నారు.

సినిమా సెట్టింగ్.. అంతా స్క్రిప్ట్

సీఎం చంద్రబాబు సభ మొత్తం సినిమా సెట్టింగ్‌ను తలపించింది. సభావేదిక నుంచి రైతుల ప్రసంగం వరకు అన్నీ స్క్రిప్ట్ ప్రకారం సాగాయి. సభ మొదటి వరుసలో రైతులకు నులకతాడుతో చేసిన కుర్చీలు వేశారు. వేదిక పక్కన రెండు ఎండుగడ్డి వాములు, ఒక ఎద్దుల బండి ఏర్పాటు చేశారు. రైతులు ఏం మాట్లాడాలి.. ఎలాంటి ప్రశ్నలు అడగాలి.. అనే విషయమై అధికారులు రెండు రోజులుగా ట్రెనింగ్ ఇచ్చారు. ఆ ప్రకారమే రైతులు చంద్రబాబును పొగడటం, చంద్రబాబు రైతులకు సలహాలివ్వడం కనిపించింది.

దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం

సాక్షి, అమరావతి: ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు మాదిరిగానే దివ్యాంగులకు పూర్తిగా ఉచిత ప్రయాణ అవకాశం కల్పిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బుధవారం రాత్రి నిర్వహించిన ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ సభలో సీఎం మాట్లాడారు. రాష్ట్ర స్థాయిలో అమరావతితోపాటు అన్ని జిల్లా కేంద్రాల్లోను 'దివ్యాంగ భవన్'లు ఏర్పాటు చేస్తామన్నారు. విశాఖపట్నంలో 23 ఎకరాల్లో నేషనల్ సెంటర్ ఫర్ డిసెబిలిటీ స్పోర్ట్స్ స్టేడియం ఏర్పాటు చేస్తున్నామన్నారు. అనంతరం ఇటీవల అంధ మహిళల ప్రపంచ కప్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన కరుణ కుమారికి రూ.15 లక్షలు, దీపికకు రూ.10 లక్షలు చొప్పున ప్రభుత్వం తరపున అందిస్తామని, వారికి ఇళ్లు నిర్మిస్తామని చెప్పారు. కోచ్ అజయ్ కుమార్‌రెడ్డికి రూ.2.50 లక్షల నగదు ప్రోత్సాహకాన్ని అందిస్తామన్నారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్(ఏసీఏ) తరపున రూ.10 లక్షలు అంధ మహిళల క్రికెట్ టీంకు అందించారు.

కల్తీ మద్యం, హత్య కేసు నిందితులతో

టీడీపీ ఎమ్మెల్యే కూన సాంగత్యం

- గోవా ట్రిప్‌లో ఎంజాయ్ చేసిన ఫొటోలు వెలుగులోకి
- సోషల్ మీడియాలో హల్‌చల్

టీడీపీ ఎమ్మెల్యే కూన రవికుమార్‌తో గోవా ట్రిప్‌లో కల్తీ మద్యం, హత్య కేసు నిందితులు

సాక్షి టాస్క్‌ఫోర్స్: శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస టీడీపీ ఎమ్మెల్యే కూన రవికుమార్, అనుచరులు ఎలాంటి వారో చెప్పడానికి ఈ ఫొటోలు చాలు. గోవా ట్రిప్‌లో ఎంజాయ్ చేస్తూ తీసుకున్న ఫొటోలివి. ఇందులో ఒకరు సరుబుజ్జిలి వైన్‌షాపులో జరిగిన కల్తీ మద్యం కేసులో నిందితుడు కాగా, మరో ఇద్దరు ఎచ్చెర్ల మండలం ఫరీద్‌పేటలో జరిగిన హత్య కేసులో ప్రధాన నిందితులు. ఇటువంటి వ్యక్తులతో ఎమ్మెల్యే కూన రవికుమార్ ఎంజాయ్ చేసిన ఫొటోలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. ఎమ్మెల్యే అయి ఉండి ఇలాంటి వారితో చెట్టాపట్టాలేసుకు తిరగడమేంటని అధికార పార్టీ వర్గాల్లోనే తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇటీవల సరుబుజ్జిలిలోని పీఆర్ వైన్స్‌లో 10.88 లీటర్ల మద్యంలో కల్తీ చేసిన బాగోతం బయటపడింది. నవంబర్ 27న ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారుల తనిఖీల్లో కల్తీ మద్యం బాటిల్స్ దొరికాయి. ఈ వైన్‌షాపు యజమాని పైడి ముఖలింగం అలియాస్ నూకరాజుపై కేసు నమోదైంది. అలాగే, ఈ ఏడాది ఎచ్చెర్ల మండలం ఫరీద్‌పేటలో సత్తారు గోపి అనే వ్యక్తిపై పట్టపగలు దాడి చేసి హతమార్చారు. ఈ కేసులో ఏ1గా ఉన్న కొత్తకోట సూర్యనారాయణ, ఏ9గా కొత్తకోట అమ్మినాయుడు ఉన్నారు. తాజాగా బయటికొచ్చిన గోవా ట్రిప్ ఫొటోలు ఈ ముగ్గురూ టీడీపీ ఎమ్మెల్యే కూన అనుచరులని నిర్ధారిస్తున్నాయి. నేరాలు అరికట్టేందుకు కృషి చేయాల్సిన ప్రజాప్రతినిధులే ఇలా నేరస్తులతో సహవాసం చేయడం ఏంటనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఒక్కరు మరణించినా ప్రభుత్వానిదే బాధ్యత

అగ్రి గోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్

గాంధీనగర్ (విజయవాడసెంట్రల్): అగ్రి గోల్డ్ బాధితుల్లో ఏ ఒక్కరు మరణించినా ఆ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని అగ్రి గోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. అగ్రి గోల్డ్ సంస్థ ఆస్తుల వేలం ప్రక్రియ వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేయాలని, సత్వరమే డిపాజిట్లు చెల్లింపులు జరపాలని కోరుతూ అగ్రి గోల్డ్ ఖాతాదారులు, ఏజెంట్లు బుధవారం విజయవాడలోని రైల్వే స్టేషన్ నుంచి ధర్నా చౌక్ వరకు ఆవేదన యాత్ర చేపట్టారు. అనంతరం అసోసియేషన్ అధ్యక్షుడు ఈవీ నాయుడు అధ్యక్షతన ఆవేదన దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. కంపెనీలో పెద్దమొత్తంలో డిపాజిట్ చేసినవారు 10 లక్షల మందికి పైగా ఉన్నారని, వారికి న్యాయం జరిగేవరకు ఈ పోరాటం ఆగదన్నారు. అధికారంలో లేనప్పుడు పవన్‌కళ్యాణ్ అగ్రి గోల్డ్ బాధితులతో సమావేశమై న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని, ఇప్పుడు ఎటువంటి స్పందన లేకపోవడం దురదృష్టకరమన్నారు.

ఆవేదన యాత్రలో అగ్రి గోల్డ్ కస్టమర్స్, ఏజెంట్లు

కోటంరెడ్డి సోదరుల అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి

పెంచలయ్య హంతకులు వీరి అనుచరులే

నెల్లూరు మేయర్ స్రవంతి భర్త జయవర్ధన్

నెల్లూరు రూరల్: నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆయన తమ్ముడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి దాష్టీకాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని నెల్లూరు నగరపాలక సంస్థ మేయర్ పొట్లూరి స్రవంతి భర్త పొట్లూరి జయవర్ధన్ డిమాండ్ చేశారు. నెల్లూరులో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కమ్యూనిస్టు నేత పెంచలయ్య హత్యవెనక కోటంరెడ్డి కుట్ర లేదా అని ప్రశ్నించారు. 'ఆ హత్యలో అరెస్ట్ అయిన వాళ్లు మావాళ్లు కాదని ప్రచారం చేస్తున్నావు. నిందితులు పాలకీర్తి రవి, అరవ కామాక్షి అంతకు ముందూ నీ అనుచరులు కాదా? నువ్వు పార్టీ మారితే.. 2024 సెప్టెంబర్ 16న టీడీపీలో చేర్చుకున్న విషయం వాస్తవం కాదా? ఈ ఫొటోలను నీ ఫేస్‌బుక్‌లో పెట్టుకోలేదా? గంజాయి స్మగ్లింగ్‌పై ఒక ఉద్యమకారుడిని హత్య చేయించి, నీ బండారం బయటపడేసరికి ఇతరులపై రుద్దే ప్రయత్నం చేయడం ఎంతవరకు సబబు? చిన్నచిన్న తప్పులు చేసి నీ దగ్గరకు వచ్చిన శ్రీకాంత్‌తో ఎన్నో తప్పులు చేయించింది నువ్వు కాదా? నిడిగుంట అరుణతో మీ తమ్ముడు అంటకాగిన విషయం వాస్తవం కాదా? ఒక్కసారి నీ తమ్ముడి ఫోన్‌కాల్ లిస్ట్ తీస్తే విషయాలన్నీ బయటకు వస్తాయి. నిడిగుంట అరుణ ఫోన్‌లో ఉన్న విషయాలన్నీ డిలీట్ చేసింది మీరు కాదా? వైఎస్సార్‌సీపీకి చెందిన వైవీ రామిరెడ్డి, కొండ్రెడ్డి రంగారెడ్డిలను నీ అనుచరుడు జగదీష్‌తో ఫోన్లో బెదిరించిన విషయం, గవాస్కర్ హత్యవెనుక వ్యూహరచన, మాజీమంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటిపై దాడి చేయించింది నువ్వు కాదా?' అని కోటంరెడ్డిని నిలదీశారు.

నీ దాష్టీకాలు తెలిసే వైఎస్సార్‌సీపీ నిన్ను పక్కనపెట్టింది

'2019 నుంచి నెల్లూరు రూరల్‌లో అధికారం, పోలీసులు అండతో ఎన్ని దాష్టీకాలు, దుర్మార్గాలు చేయించావో అందరికీ తెలుసు. అందుకే వైఎస్సార్‌సీపీ నిన్ను పక్కనపెట్టింది. అధికారం ఉంటే ప్రతి ఒక్కరూ తోపే. అధికారం లేకపోతే నీ పరిస్థితి ఏమిటో ఒక్కసారి గుర్తుతెచ్చుకో. నీ తమ్ముడు గిరిధర్‌రెడ్డికి ఏ అధికారం ఉందని అధికారులతో రివ్యూ మీటింగ్‌లు చేయిస్తున్నావు? మేయర్ భర్తగా నేను ఏ రోజన్నా ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం చూశారా?' అని నిలదీశారు.

సముద్రం శక్తిమంతమైనదే.
అంతకంటే శక్తిమంతమైనది భారత నౌకాదళం.
– నేవీ మాజీ చీఫ్ అడ్మిరల్ ఎస్.ఎం. నందా

సాక్షి
గురువారం, 4 డిసెంబర్ 2025

వెనక్కి తగ్గిన 'సాథీ'!

ఉద్దేశాలు మంచివైనప్పుడు దాపరికాలు అవసరం లేదు. జనానికి మేలు చేయటమే ధ్యేయమైనప్పుడు చాటుమాటు చర్యలు సరికాదు. రెండేళ్ల క్రితం తీసుకొచ్చిన 'సంచార్ సాథీ' యాప్ మూణ్ణెల్లలో ఫోన్లలో ఉండితీరాలంటూ కేంద్రం మొబైల్ ఉత్పత్తిదారులకు మొన్న శుక్రవారం చడీచప్పుడూ లేకుండా ఇచ్చిన ఆదేశాలు తీవ్ర వివాదాస్పదం కావటం ఇందువల్లే. మీడియాలో, సామాజిక మాధ్యమాల్లో వెల్లువెత్తిన విమర్శలకు జడిసి ఆ ఆదేశాలను వెనక్కి తీసుకోవాల్సి వచ్చింది. ఇక్కడ ఉత్పత్తవుతున్న, దిగుమతవుతున్న ఫోన్లకు వర్తించటంతోపాటు ఇప్పటికే వినియోగదారుల దగ్గరున్న ఫోన్లకు సాఫ్ట్‌వేర్ ద్వారా ఈ యాప్‌ను చేరేయాలని టెలికమ్యూనికేషన్ల విభాగం మూడు రోజుల క్రితం మొబైల్ ఉత్పత్తిదారుల్ని ఆదేశించింది. తాజాగా అది తప్పనిసరి కాదంటూ ప్రకటించింది. పౌరుల శ్రేయస్సును ఆశించి, వారు మోసగాళ్ల బారిన పడకుండా చూసేందుకు ఇది రూపొందించామనీ, ఇందులో గూఢచర్యం లేదా ఫోన్ సంభాషణల పర్యవేక్షణ ఉద్దేశం లేనేలేవనీ కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రి జ్యోతిరాదిత్య సింధియా సంజాయిషీ ఇచ్చారు. దాదాపు కోటిన్నరమంది దీన్ని డౌన్‌లోడ్ చేసుకుని లబ్ధి పొందుతున్నారనీ, 41 లక్షల మోసపూరిత మొబైల్ నంబర్లను గుర్తించి నిరోధించామనీ, అపహరించిన దాదాపు 26 లక్షల మొబైల్ సెట్ల జాడ కనిపెట్టి 7 లక్షల సెట్లను వాటి యజమానులకు అందించామనీ సింధియా చెబుతున్నారు. ఈ గణాంకాలతో విభేదించాల్సిన అవసరం లేదు. కానీ యాప్ ద్వారా ప్రయోజనాలు వెల్లువెత్తుతుంటే ఆ మాటే చెప్పి, మరింతమందిని ప్రోత్సహించవచ్చు. తదుపరి చర్యలు అవసరమనుకుంటే వెల్లడించవచ్చు. ఇదేం లేకుండా రహస్య చర్య ఆంతర్యమేమిటి?

దాదాపు నలభయ్యేళ్ల క్రితం అప్పటి ప్రధాని రాజీవ్ గాంధీ 'పోస్టల్ బిల్లు' తీసుకొచ్చినప్పుడు జరిగిందేమిటో పాలకులు గ్రహించివుంటే వ్యక్తిగత గోప్యతను పౌరులు ఎంత ప్రాణప్రదంగా పరిగణిస్తారో అర్థమై ఉండేది. కనీవినీ ఎరుగని స్థాయిలో 400 స్థానాలకు పైగా కైవసం చేసుకుని, తిరుగులేదనుకున్నవేళ పౌరులకు తెలియకుండా వారి ఉత్తరాలను చదివేందుకుద్దేశించిన బిల్లు తీసుకొచ్చి ఆయన అభాసుపాలయ్యారు. జస్టిస్ పుట్టస్వామి కేసులో 2017లో సుప్రీంకోర్టు వ్యక్తిగత గోప్యతను ప్రాథమిక హక్కుల్లో చేర్చింది. జాతీయ భద్రత లేదా సముచిత ప్రజాప్రయోజనం ఉన్నదని ప్రభుత్వం భావిస్తే గోప్యత నియంత్రణకు తగిన చట్టం తీసుకురావొచ్చని స్పష్టం చేసింది. అప్పుడు ప్రజల్లో, పార్లమెంటులో విస్తృత చర్చ జరుగుతుంది. ఇవేమీ లేకుండా ఒక నోటీసు ద్వారా పనికానిచ్చేద్దామనుకోవటం ప్రజాస్వామ్యంలో చెల్లుబాటవుతుందా?

అభివృద్ధి చెందిన దేశాలతో పోల్చినా మన దగ్గర డిజిటల్ వినియోగం బాగా పెరిగింది. క్రయవిక్రయాలు, చెల్లింపులు, వసూళ్లు, ఆన్‌లైన్ నమోదులు ముమ్మరమయ్యాయి. వాటితోపాటే సైబర్ నేరాలు ఎక్కువయ్యాయి. డిజిటల్ అరెస్టు పేరుతో మోసగాళ్లు కోట్లు కాజేస్తున్నారు. ఆ నేరగాళ్లను పట్టుకోవటానికీ, పోగొట్టుకున్న ఫోన్లు పొందేందుకూ 'సంచార్ సాథీ' తోడ్పడటం నిజమే కావొచ్చు. కానీ గుప్పెడుమంది నేరగాళ్లను పట్టుకోవడానికి కోట్లాదిమందిని నిఘా నీడలోకి తెస్తామనటం ఏం తర్కం? ఉత్పత్తిదారులకు తప్పనిసరంటూ ఆదేశాలిచ్చి, ఇష్టపడకపోతే వినియోగదారులు తొలగించుకోవచ్చని చెప్పడంలో మర్మమేమిటి?

వ్యక్తిగత గోప్యత విషయంలో పౌరులకు ఎంత పట్టింపు ఉంటుందో నిత్యజీవితంలో చూస్తుంటాం. తల్లిదండ్రులు తమ ఫోన్లు గమనిస్తున్నారంటే పిల్లలకు కోపం. ప్రాణ స్నేహితుడైనా చాటుగా ఫోన్ చూస్తే సహించరు. భార్యాభర్తలే ఒకరి ఫోన్లు మరొకరు చూశారని తెలిస్తే దుమ్మెత్తిపోసుకుంటారు. అలాంటిది ప్రభుత్వ నిఘాకు అవకాశమిచ్చే యాప్‌ను జనం అంగీకరించగలరా? కాల్స్ వినేందుకూ, ఎస్సెమ్మెస్‌లు, ఫోన్ నంబర్లు, ఫొటోలు వగైరాలన్నిటినీ చూసేందుకూ... ఆఖరికి మనకు తెలియకుండా కెమెరా వినియోగానికి కూడా ఈ యాప్ అవకాశమిస్తుందన్నది నిపుణుల మాట. బహుశా '1984' రచయిత జార్జి ఆర్వెల్ కూడా ఇంత చేటు నిఘా ఊహించలేదు. ఏదేమైనా ప్రభుత్వం వెనక్కి తగ్గింది. అది వివేకవంతమైన చర్య.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, తిథి: శు.చతుర్దశి ఉ.7.45 వరకు, తదుపరి పౌర్ణమి తె.5.21 వరకు (తెల్లవారితే శుక్రవారం), నక్షత్రం: కృత్తిక ప.3.13 వరకు, తదుపరి రోహిణి, వర్జ్యం: తె.6.06 నుండి 7.35 వరకు, దుర్ముహూర్తం: ఉ.10.06 నుండి 10.50 వరకు, తదుపరి ప.2.29 నుండి 3.13 వరకు, అమృత ఘడియలు: ప.12.57 నుండి 2.26 వరకు, శ్రీదత్త జయంతి.

సూర్యోదయం : 6.19
సూర్యాస్తమయం: 5.20
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుండి 7.30 వరకు

సోషల్ టాక్

నచ్చిన పని

ఏ పనైనా నీకు ఆనందాన్ని, సంతృప్తిని ఇస్తున్నంత కాలం దానిని చేయకుండా నువ్వెందుకుండాలి? నేను 34 సార్లు తలకు గుండు కొట్టించుకున్నాను. ఇందులో ఎవరికీ అభ్యంతరం ఉండనవసరం లేదు. నీకు నచ్చింది చెయ్యి! చేస్తున్న దానిని ప్రేమించు!!

– అపర్ణ గోపీనాథ్, మలయాళ నటి

దాటేయండి!

నేను నా కెరీర్‌ను ప్లాన్ చేసుకోను. ప్రవాహంలో కలిసిపోతాను. అక్కడే నేర్చుకుంటాను. మెరుగయేందుకు ప్రయత్నిస్తాను. నాతో నేనే పోటీ పడతాను. కానీ ఒక విషయం! ప్రవాహంలో అందరితో పాటు కొట్టుకుని పోకూడదు. అందరినీ దాటుకుంటూ వెళ్లాలి.

– జావేద్ జాఫ్రీ, నటుడు – డ్యాన్సర్

రోజూ ఆడాలి!

క్రీడలు సానుకూలమైన దృక్పథాన్ని ఏర్పరచి, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవరుస్తాయి. జీవితంలోని తర్వాతి దశలలో సంతోషంగా గడపటానికి అవసరమైన సహనం, ఓర్పు వంటి జీవన నైపుణ్యాలను మీలో పెంపొందిస్తాయి. మీ దైనందిన జీవితంలో చిన్న ఆటనైనా చేర్చుకోండి.

– అజిత్ అగార్కర్, మాజీ క్రికెటర్

జ్వలనం

నా జీవితాన్ని నేను కొవ్వొత్తిలా భావించను. జాజ్వల్యమానంగా ప్రకాశిస్తున్న క్రీడాజ్యోతి అనుకుంటాను. నేను 'వెళ్లేటప్పుడు' ఈ జ్వలనాన్ని మరొకరికి అందిస్తాను. అది ఏ రూపంగానైనా కావచ్చు, నా కృషి, నా ఫలితం అన్నీ సంఘ హితానికే అర్పిస్తాను.

– దుర్గా శంకర్ మిశ్రా, ఐఏఎస్ అధికారి

క్లాసిక్స్

మన దేశ విద్యారంగం బంజరు భూమిలా ఉంది. రాళ్లతో నిండి ఉంది. సత్తువ లేకపోవటం వల్ల మంచి విత్తనం కూడా మొలకెత్తలేదు. ఈ భూమిని సారవంతం చేయటానికి సుసంపన్నమైన 'క్లాసిక్స్'ను భారతీయ భాషలలోకి అనువదించాలి. ఎరువులా అందించాలి.

– అరవింద్ గుప్తా, విద్యావేత్త

అవసరాలు

వికీపీడియా ఒక లాభాపేక్ష లేని సంస్థ. అది నేను చేసిన అత్యంత తెలివి తక్కువ పని. లేదా అత్యంత తెలివైన పని. సమూహాలు అద్భుతాలను చేయగలవు. మీరూ వాటిల్లో భాగం కండి. ప్రజల సమాచార అవసరాలు తీర్చండి. గౌరవం పొందండి.

– జిమ్మీ వేల్స్, వికీపీడియా కో–ఫౌండర్

అస్థిర ప్రపంచంలో సుస్థిర బంధం

విశ్లేషణ

జయంత రాయ్ చౌధురీ

ప్రధాని నరేంద్ర మోదీతో వార్షిక శిఖరాగ్ర సదస్సు నిమిత్తం రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ న్యూఢిల్లీ రాక ఒక పాత సంగతిని గుర్తుకు తెస్తోంది. దాదాపు ఐదున్నర దశాబ్దాల క్రితం భారతదేశంతో 'స్నేహ ఒడంబడిక' కోసం అప్పటి ప్రధాని ఇందిరా గాంధీతో చేతులు కలిపేందుకు అప్పటి సోవియట్ యూనియన్ నాయకులు ఇలాగే ఢిల్లీ వచ్చారు. తూర్పు పాకిస్తాన్‌లో మారణ హోమాన్ని అంతమొందించే ప్రత్యక్ష ప్రమేయానికి ముందు అది జరిగింది.

రెండవ ప్రపంచ యుద్ధానంతరం ప్రపంచం రెండు అగ్ర రాజ్యాల మధ్యన చీలిపోయింది. కానీ, ఇపుడు అంతర్జాతీయ వ్యవస్థ ఏ దిశగా సాగుతోందో తెలియని ఒక కొత్త స్థితిలోకి జారుకుంది. అమెరికా శక్తిమంతమైనదిగానే కొనసాగుతోంది కానీ, దాన్ని అంతగా నమ్మడానికి లేదనే అభిప్రాయం పాదుకుంది. చైనా శిఖరారోహణ ఇతర ప్రవర్ధమాన దేశాలలో ఆందోళనను పెంచుతోంది. ఐరోపా మరింత స్వయం ప్రతిపత్తిని చాటుకునేందుకు తారట్లాడుతోంది. గాలివాటుగా ఉన్న భారత–రష్యాలు అవసరార్థమే అయినప్పటికీ, వ్యూహాత్మక పొందికను పునరుద్ధరించుకుంటున్నాయి.

ఒకరికొకరు నిలబడి...

అమెరికా నిలకడలేనితనంతో దానిపై చాలా దేశాలకు నమ్మకం కొరవడింది. దానికి తోడు అది ఎక్కడెక్కడో సుదీర్ఘ కాలం యుద్ధాలను కొనసాగించి, చివరకు అక్కడ పరిస్థితులు కుదుటపడకపోయినా నిష్క్రమిస్తూ వచ్చింది. అమెరికా లోపల కూడా పరిస్థితులు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. తాజాగా, సుంకాల విషయంలో అది అనుసరిస్తున్న తలతిక్క ధోరణి అందుకు ఉదాహరణ. ఇదంతా ప్రపంచంలో ఒక అస్థిర వాతావర ణానికి దారితీసింది. చైనా తన వంతు ఆకర్షణలను, భయాలను రెండింటినీ సృష్టించుకుంది. క్రమేపీ అది దృఢ వైఖరిని చాటడం పెరగడంతో, దాని ప్రత్యర్థులు, మిత్రులు కూడా దానిపై చిరకాల అభిప్రాయాలను పునరాలోచించుకోవడం ప్రారంభించాయి.

ఉక్రెయిన్‌పై యుద్ధం మొదలెట్టిన తర్వాత, చైనాతో రష్యా వ్యూహాత్మక ఏకీకరణ బలపడిందికానీ, సంబంధాలు అసమంగానే ఉన్నాయి. మాస్కో వ్యూహాత్మక ఆలోచనల ప్రకారం, దీర్ఘకాలంలో తనకు బెడదగా పరిణమించగల శక్తి అమెరికా కన్నా చైనాకే ఉంది. మధ్య ఆసియాలో తన ప్రభావాన్ని కనబరచేందుకు చైనా చేస్తున్న ప్రయత్నాలు, సైబీరియాకు సంబంధించి రష్యా పడుతున్న ఆందోళన, చైనాకు తాను జూనియర్ భాగస్వామిగా మారవలసి వస్తుందేమోననే భయం క్రెమ్లిన్‌ను మరోసారి భారతదేశానికి సన్నిహితం చేస్తున్నాయి. అయితే, చైనాకు ప్రత్యామ్నాయంగా భారత్ నిలుస్తుందని కాదు. చైనాపై తాను ఎక్కువ ఆధారపడకుండా భారత్ తనకొక రక్షణ కవచంగా ఉపయోగపడుతుందని రష్యా ఆలోచన.

మోదీతో పుతిన్ (ఫైల్). నేడు రష్యా అధ్యక్షుడి ఇండియా రాక.

◆ రష్యా ఆలోచనల ప్రకారం, దీర్ఘకాలంలో తనకు బెడదగా పరిణమించగల శక్తి అమెరికా కన్నా చైనాకే ఉంది. మధ్య ఆసియాలో తన ప్రభావాన్ని కనబరచేందుకు చైనా చేస్తున్న ప్రయత్నాలు, చైనాకు తాను జూనియర్ భాగస్వామిగా మారవలసి వస్తుందేమోననే భయం దాన్ని మరోసారి భారత్‌కు సన్నిహితం చేస్తున్నాయి.

స్నేహమే కాదు, వ్యూహాత్మకం కూడా!

సోవియట్ యూనియన్ చీలికలు పీలికలైన తర్వాత కూడా భారత్‌తో రష్యా స్నేహ సంబంధాలు నిలదొక్కుకుంటూ వచ్చాయి. కశ్మీర్‌పై భారత్ ఇరకాటంలో పడకుండా ఐరాసలో రష్యా తన వీటో గొడుగు పడుతోంది. దానికి తగ్గట్లుగానే, ఉక్రెయిన్‌పై యుద్ధం పర్యవసానంగా రష్యాపై ఆంక్షలు విధించాలని పశ్చిమ దేశాలు పదేపదే కోరినా భారత్ తలొగ్గలేదు. ఈ విషయమై అమెరికా విధిస్తానన్న సుంకాల బెదిరింపును కూడా భారత్ ఖాతరు చేయలేదు. దీనికి రెండు దేశాల మధ్య పరస్పర నమ్మకంతో కూడిన స్నేహ సంబంధం ఒక్కటే కారణం కాదు. ఈ బంధాన్ని నిలబెట్టుకునేందుకు రెండు దేశాలకు తమవైన వ్యూహాత్మక ప్రయోజనాలు ఉన్నాయి.

దానికి తోడు, కొన్నేళ్ళుగా ఎన్నడూ చూడనంత అస్థిర పరిస్థితులు ప్రపంచంలో తాండవిస్తున్నాయి. ఇండో–పసిఫిక్ ప్రాంతంలో ఏ ఒక్క దేశమూ పరిస్థితులను శాసించగలిగిన స్థితిలో లేదు. అగ్ర రాజ్యంగా నిలవాలని కలలు కంటున్న దేశపు అడుగులకు మడుగులొత్తడానికి ఆఫ్రికా, ఆగ్నేయాసియా, లాటిన్ అమెరికాలలో చాలా మధ్య స్థాయి దేశాలు సిద్ధంగా లేవు. తమ వ్యూహాత్మక స్వయం ప్రతి పత్తిని కాపాడుకోవాలని గాఢంగా కోరుకుంటున్న భారత – రష్యాలకు ఆ సెంటిమెంట్‌లో ఒక ఉమ్మడి ప్రయోజనం కనిపిస్తోంది.

పరస్పర రక్షణ

భారత్–రష్యాల మధ్య స్నేహ సంబంధాలకు రక్షణ అంశమే ఇప్పటికీ వెన్నెముకగా ఉంది. లాజిస్టిక్స్ విషయంలో పరస్పర సహకారానికి సంబంధించిన ఒప్పందం కుదరబోతోంది. అది కార్యరూపం ధరిస్తే ఇరు దేశాలు సైనిక స్థావరాలను, రేవులను, వైమానిక క్షేత్రాలను పరస్పరం వినియోగించుకోవచ్చు. దీంతో ఇండో–పసిఫిక్ నుంచి ఆర్కిటిక్ వరకు కార్యకలాపాలు నిర్వహించగలిగినదిగా భారత్ తయారవుతుంది. హిందూ మహాసముద్ర ప్రాంతంలో రష్యా భౌతికంగా కాలు మోపేందుకు వీలు చిక్కుతుంది. ప్రపంచంలో సగం వాణిజ్య నౌకల రాకపోకలకు ఈ ప్రాంతమే జీవనాడి.

భారత–రష్యా అధికారులు అత్యంత ఆశావహమైన సైనిక–సాంకేతిక ప్యాకేజీకి రూపుదిద్దుతున్నారు. దీనివల్ల ఎస్–400 గగన రక్షణ వ్యవస్థలను మరిన్ని చోట్ల ఏర్పాట్లు చేయవచ్చు. సు–30 ఎంకెఐ యుద్ధ విమానాలను భారత్ చాలా ఎక్కువగా అప్‌గ్రేడ్ చేసుకోవచ్చు. మరింత దూరం వెళ్ళగలిగినవిగా బ్రహ్మోస్ క్షిపణులను ఉన్నతీకరించుకునే అవకాశాలు మెరుగుపడతాయి. సు–57ఇ స్టెల్త్ యుద్ధ విమాన టెక్నాలజీ బదిలీకి సంబంధించి తాత్కాలిక చర్చలైనా మొదలయ్యేందుకు వెసులుబాటు కలుగుతుంది. ఇక భారత్–రష్యా స్నేహంలో అణు సహకారం మరో అంశం. బృహత్తర వీవీఈఆర్–1200 రియాక్టర్ల నిర్మాణ ప్రణాళికలతో రోసాటమ్, భారత అణు శక్తి సంస్థలు ముందుకు ఉరకాలని చూస్తున్నాయి.

అలాగే, కీలక ఖనిజాలు, రేర్ ఎర్త్‌ల అన్వేషణ రెండు దేశాల మధ్య సంబంధాలను గుణాత్మకంగా మార్చివేయవచ్చు. వీటి అంతర్జాతీయ సరఫరాలో చైనాదే పైచేయిగా ఉంది. ఖనిజాలు సుసంపన్నంగా ఉన్న రష్యా తూర్పు దూర ప్రాంతాలలో సంయుక్త రంగంలో పనులు సాగించాలని భారత్ ఎదురు చూస్తోంది. భారత వైజ్ఞానిక సంస్థలు, రష్యా పరిశోధన కేంద్రాల మధ్య భాగస్వామ్యాలు ఏర్పడితే దేశీయంగా రేర్–ఎర్త్ ప్రాసెసింగ్‌కు, పర్మనెంట్ మ్యాగ్నెట్ తయారీకి రంగం సిద్ధమవుతుంది. ఎలక్ట్రిక్ వాహనాలు, అత్యున్నత ఎలక్ట్రానిక్స్, అధునాతన ఆయుధ వ్యవస్థల వాల్యూ చైన్‌ను నియంత్రించగల పరిశ్రమలు రెండు దేశాలకు సొంతమవుతాయి. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం ప్రస్తుతం సుమారు 65–66 బిలియన్ డాలర్లుంది. 2030 నాటికి దీన్ని 100 బిలియన్ డాలర్లకు చేర్చే లక్ష్యంతో ఉన్నాయి.

ఈ శిఖరాగ్ర సదస్సులో వ్యక్తమయ్యేది కేవలం పొత్తు కాదు. స్నేహ సంబంధాలు ఏవీ దెబ్బతిని లేవు కనుక ఇండో–సోవియట్ మైత్రి పునరుద్ధరణ అనడానికి కూడా లేదు. ఇది మరింత ఆచితూచి వేస్తున్న అడుగు కాబోతోంది. మరింత ఆచరణాత్మక దృక్పథం కనపడబోతోంది. అధికార కేంద్రాలు మసకబారి, సమీకరణాలు అనుక్షణం మారిపోతున్న వర్తమాన ప్రపంచంలో అంతకన్నా ఇంకేం కావాలి!

వ్యాసకర్త పీటీఐ వార్తా సంస్థ తూర్పు ప్రాంత మాజీ అధిపతి

మొక్కజొన్న కొనుగోళ్లలో ప్రభుత్వ వైఫల్యం!

ఆంధ్రప్రదేశ్‌లో నేడు మొక్కజొన్న రైతులు తీవ్రమైన సంక్షోభంలో ఉన్నారు. సేద్యపు ఖర్చులు పెరగడం, పండించిన పంటకు న్యాయమైన ధర లభించకపోవడంతో దళారుల దోపిడీకి గురై అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు.

ప్రపంచంలో మొక్కజొన్నను అత్యధికంగా ఉత్పత్తి చేసే దేశాలు అమెరికా, మెక్సికో, బ్రెజిల్, చైనా. అమెరికా 36 కోట్ల టన్నుల మొక్కజొన్న ఉత్పత్తితో మొదటి స్థానంలో ఉంది. అమెరికా ఆర్థిక వ్యవస్థలో మొక్కజొన్న ఉత్పత్తి ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నది. ప్రపంచ ఎగుమతుల్లో అమెరికా వాటానే 50%గా ఉంది. అమెరికా పాలకులు 1930 నుంచే మొక్కజొన్న ఉత్పత్తికి మద్దతు ఇస్తున్నారు. ప్రతి ఏడాది అమెరికా రైతు 61 వేల డాలర్ల సబ్సిడీ పొందుతున్నాడు. కాగా భారత రైతుకు కేవలం 282 డాలర్లు మాత్రమే సబ్సిడీ లభిస్తున్నది. అమెరికాలో మొక్కజొన్న దిగుబడి హెక్టార్‌కు 11 టన్నులు కాగా, భారత్‌లో 2 టన్నుల 540 కిలోలు మాత్రమే. నేడు భారత్ 98.9 లక్షల హెక్టార్ల మొక్క జొన్న సాగు ద్వారా ప్రపంచ విస్తీర్ణంలో 4వ స్థానంలో ఉంది. ఉత్పత్తి 4.23 కోట్ల టన్నులు.

ఆంధ్రప్రదేశ్‌లో ఈ సంవత్సరం 1.42 లక్షల ఎకరాల్లో రైతులు మొక్కజొన్న సాగు చేశారు. దేశంలో మొక్కజొన్న సాగులో తెలంగాణ 5వ, ఆంధ్రప్రదేశ్ 7వ స్థానంలో ఉన్నాయి. ఏపీ ఎకరా సేద్యపు ఖర్చు 30 నుండి 35 వేలు. కౌలు రైతులు మరో 13 వేలు అదనంగా కౌలు చెల్లించాలి. సగటు దిగుబడి 25 క్వింటాళ్లు. కేంద్రం ప్రకటించిన మద్దతు ధర 2,400 రూపాయలు. ఈ ధర రైతులకు అంత ప్రయోజనంగా లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇంతవరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. ప్రభుత్వ కొనుగోళ్ల కేంద్రాలు లేకపోవడం వల్ల ప్రైవేట్ మార్కెట్లో లభిస్తున్న ధర రూ.1,600 మాత్రమే. కొన్ని ప్రాంతాల్లో 1,450 మాత్రమే దక్కుతున్నది. ఫలితంగా రైతు పెట్టిన పెట్టుబడి కూడా రాక తీవ్రంగా నష్టపోతున్నాడు.

రైతాంగం గిట్టుబాటు ధర లభించక నష్టపోయి అప్పుల పాలవుతుంటే, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగాన్ని ఆదుకునే చర్యలు తీసుకోవాల్సి ఉండగా, అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయి. దేశ రైతుల వద్ద ఉన్న మొక్కజొన్నను కొనుగోళ్లు చేయకుండా 5 లక్షల టన్నుల మొక్కజొన్నను కేంద్రం అమెరికా నుండి దిగుమతి చేసుకుని భారత రైతాంగాన్ని మరింత సంక్షోభంలోకి నెట్టింది.

కేంద్ర ప్రభుత్వంతో పాటు రాష్ట్ర ప్రభుత్వానికి కూడా పంటల కొనుగోళ్ల బాధ్యత ఉంది. గిట్టుబాటు ధర పంటలకు లభించనప్పుడు, రాష్ట్ర ప్రభుత్వం కొనుగోళ్లు చేపట్టి రైతులను ఆదుకోవాలి. అందుకు ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేయాలి. దాని ద్వారా పంటలు కొనుగోళ్లు చేయాలి. అలాంటి చర్యలు చంద్రబాబు నాయుడు ప్రభుత్వం చేపట్టలేదు. గత వైసీపీ ప్రభుత్వం ధరల స్థిరీకరణ నిధికి రూ. 3 వేల కోట్లు కేటాయిస్తే, కూటమి ప్రభుత్వం 300 కోట్లు మాత్రమే కేటాయించింది. ఈ మొత్తంతో పంటల కొనుగోళ్ళు ఎలా సాధ్యం? కూటమి ప్రభుత్వం మొక్కజొన్న రైతులనే కాదు, ఏ పంట రైతులనూ ఆదుకోవటం లేదు. ఏ పంటకూ గిట్టుబాటు ధర లభించడం లేదు. మద్దతు ధర చెల్లించి ప్రభుత్వ సంస్థలే రైతుల వద్ద ఉన్న మొక్కజొన్నను కొనుగోళ్లు చేయాలనీ; దళారుల, ప్రైవేట్ వ్యాపారుల దోపిడీని అరికట్టాలనీ; మొక్కజొన్న దిగుమతులను ఆపాలనీ ఉద్యమించడమే రైతుల తక్షణ కర్తవ్యం.

– బొల్లిముంత సాంబశివరావు
రైతు కూలీ సంఘం (ఆం.ప్ర.) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు

మరో వ్యాధి కలకలం

ఇన్ బాక్స్

రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ స్క్రబ్ టైఫస్ విజృంభిస్తోంది. అతి సులభ చికిత్స గల వ్యాధి గనుక భయాందోళనలు లేవు గానీ వ్యాప్తి మాత్రం ఎక్కువగానే ఉందని అర్థమవుతున్నది. ఈ వ్యాధికారక బ్యాక్టీరియాను వైద్యశాస్త్ర పరిభాషలో 'ఓరియంటా సుట్స్ గమిషి' అంటారు. ఈ వ్యాధి ఇప్పుడు ఆసియా ఖండం మొత్తం వ్యాపించి ఉంది. మన పొరుగు దేశాలైన పాకిస్తాన్, చైనా, బంగ్లాదేశ్, శ్రీలంకల్లో వ్యాధిగ్రస్థులు బయటపడుతున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదికలు తెలియజేస్తున్నాయి.

ఈ స్క్రబ్ టైఫస్ కారక బ్యాక్టీరియా ప్రత్యక్షంగా మన శరీరంలోకి ప్రవేశించలేదు. బ్యాక్టీరియాను కలిగి వాహకాలుగా పేర్కొనే ఈగలు, పేలు, నల్లులు, చిగ్గర్లు కుట్టడం ద్వారా అది మన శరీరంలోకి ప్రవేశిస్తుంది. కుట్టిన చోట నల్లని మచ్చ ఏర్పడుతుంది. నొప్పి ఉండదు. కొన్ని రోజులలోనే ఎండిపోతుంది. దీనినే 'ఎస్కార్'గా పేర్కొంటారు. కుట్టిన ప్రదేశం నుండే బ్యాక్టీరియా రక్తంలోకి ప్రవేశించి శరీరమంతా వ్యాపిస్తుంది. ఆరు లేదా ఏడు రోజుల తర్వాత వ్యాధి లక్షణాలు బయట పడటం మొదలవుతుంది.

తొలుత తీవ్ర జ్వరం, తలనొప్పి, చలితో లక్షణాలు మొదలవుతాయి. కండ రాల నొప్పులు ఉంటాయి. లింపు గ్రంథుల వాపు ఉంటుంది. 50% మందిలో శరీరంపై దద్దుర్లు కనిపిస్తాయి. కొందరిలో కళ్ళు ఎర్రబడవచ్చు. దగ్గు ఉండవచ్చు. నీరసం ఉంటుంది. పిల్లలలో, 60 సంవత్సరాలు దాటిన వృద్ధులలో, వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న ఏ వయసు వారిలోనైనా వ్యాధి లక్షణాలు తీవ్రంగా ఉంటాయి. సకాలంలో గుర్తించి చికిత్స పొందకపోతే అన్ని ప్రధాన అవయవాలపై ప్రభావం పడుతుంది.

స్క్రబ్ టైఫస్ వ్యాధి నిర్ధారణకు ఎస్కార్ మచ్చలు, రక్త పరీక్షలలో ఎలీసా, ఇమినో ఫ్లోరోసెంట్ ఎస్సే(ఐ.ఎఫ్.ఎ.), పి.సి.ఆర్. వంటి మాలిక్యులర్ పరీక్షలు ఉపయోగపడతాయి. వ్యాధిని పూర్తిగా నయం చేసే మందులున్నాయి. తొలి దశలో అయితే అతి సులువుగా చికిత్స చేయవచ్చు. చికిత్స ప్రారంభించిన 24 నుండి 48 గంటలలోనే లక్షణాల తీవ్రత తగ్గుముఖం పడుతుంది. శరీరం డీహైడ్రేషన్‌కు గురికాకుండా ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. సులభంగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవడం మంచిది. సాధారణంగా ప్రాణాంతక వ్యాధి కాదు కనుక భయపడవలసిన అవసరం లేదు. కానీ వ్యాప్తిని నియంత్రించి వ్యక్తుల ఆరోగ్య, ఆర్థిక నష్టాలను అరికట్టవలసిన అవసరం ఎంతైనా ఉంది.

– డా।। టి. సేవకుమార్ । వైద్య నిపుణులు, గుంటూరు

పెరుగుతున్న ఉద్యోగార్హులు!

డేటా పాయింట్

దేశంలో ఉద్యోగానికి అన్ని విధాలా అర్హులైన యువత పెరుగుతున్నారు. ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకుంటున్నవారిలో 56.4 శాతం మంది అర్హులని తేలింది. గతేడాది ఇది 54.8 శాతం.



ప్రతిదీ గురువే!



త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణువు, మహేశ్వరుల వర ప్రభావంతో... సప్తర్షులలో అగ్రగణ్యుడైన అత్రిమహర్షి, మహాపతివ్రత అనసూయ దంపతులకు శ్రీదత్తాత్రేయుడు అవతరించాడు. 'దత్తం' అంటే ఇచ్చినవాడు; అత్రి పుత్రుడు కావడంతో ఆత్రేయుడు; మొత్తంగా దత్తాత్రేయుడిగా లోకారాధకుడయ్యాడు. త్రిమూర్తుల అనుగ్రహ అవతారుడు కావడంతో దత్తుడి రూపం మూడు శిరసులతో భాసించింది. మధ్య శిరస్సు మహావిష్ణువుది, కుడివైపుది మహాశివుడిది, ఎడమవైపుది బ్రహ్మ దేవుడిది. ఈ విధంగా త్రిమూర్తుల తత్త్వాలు ఆయనలో మూర్తీభవించాయి.

శ్రీమహావిష్ణువు 21 అవతారాల్లో దత్తాత్రేయ అవతారం ఆరవది అని భాగవత పురాణం చెబుతోంది. దత్తాత్రేయుడు ఉపనయనమైన వెంటనే అరణ్యానికి వెళ్ళి తపస్సు చేశాడు. ప్రకృతిలోని ప్రతీ వస్తువునూ, ప్రతీ జీవినీ, తనకు ఎదురైన ప్రతి పరిస్థితినీ గురువుగా భావించాడు. ముఖ్యంగా ఇరవై నలుగురిని గురువులుగా సేవించాడు.

భూమి నుంచి సహన శీలత, గాలి నుంచి స్వేచ్ఛ, ఆకాశం నుంచి నిస్సంగత్వం నేర్చుకున్నాడు. తద్వారా అలవడిన మహత్తర విజ్ఞానాన్ని లోకహితార్థం ఆవిష్కరించాడు. అగ్ని నుంచి నిర్మలత్వాన్నీ, సముద్రం నుంచి గాంభీర్యాన్నీ, కపోతం నుంచి నిర్మోహత్వాన్నీ గ్రహించాలని చెప్పాడు. కొండ చిలువలా భ్రాంతిలో పడకూడదన్నాడు. స్పర్శకు దూరంగా ఉండమన్నాడు. మిడత, ఏనుగుల నుంచి పట్టుదలనూ, చేప నుంచి త్యాగనిరతినీ నేర్చుకోవాలన్నాడు. మానావమానాల సమస్పందన అలవర్చుకోవాలన్నాడు. సాలె పురుగు నుంచి సృష్టి, స్థితి, లయ కారుడు పరమాత్మేనని తెలుసుకోవాలన్నాడు. సీతాకోక చిలుకలా ఆత్మానంద అన్వేషణ సాగించాలన్నాడు. చంద్రుడి నుంచి వృద్ధి, క్షయాలు శరీరానికే కానీ ఆత్మకు కావని గ్రహించాలన్నాడు. ఆర్తులను కాపాడే చింతనను నీటి నుంచి అవగాహన చేసుకోవాలన్నాడు. చీమలా జిహ్వా చాపల్యానికి లోను కారాదని తెలుసుకోవాలన్నాడు. ఇవన్నింటినీ తన గురువులుగా ప్రకటించి వాటి నుంచి నేర్చుకున్న అపార అనుభవంతో జ్ఞానానందమయుడయ్యాడు.

– తాళ్ళపల్లి యాదగిరి గౌడ్ (నేడు శ్రీదత్త జయంతి)

మంగళగిరి-తాడేపల్లి 'మున్సిపల్' పరిధిలోకి మరో నాలుగు గ్రామాలు

పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ

సాక్షి, అమరావతి: సీఆర్‌డీఏ పరిధిలో ఉన్న నాలుగు గ్రామాలను మంగళగిరి– తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పరిధిలోకి తెస్తూ పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఇప్పటి వరకు సీఆర్‌డీఏ పరిధిలో ఉన్న పెనుమాక, నవులూరు, నిడమర్రు, ఉండవల్లి గ్రామాలు మంగళగిరి–తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోకి రానున్నాయి. ఏపీ సీఆర్‌డీఏ చట్టంలోని 108, 20, 115, 116, 139 సెక్షన్ల పరిధిలోని అధికారాలను బదలాయిస్తూ జీవో నంబర్ 254 జారీ చేశారు. ఇకపై ఈ నాలుగు గ్రామాల్లో బిల్డింగ్ పర్మిషన్లు, లేఅవుట్ అప్రూవల్స్, నో అబ్జక్షన్ సర్టిఫికెట్‌లు, ఎన్‌వోసీలు, వర్క్‌స్టాప్ ఆర్డర్లు, షోకాజ్ నోటీసులు మంగళగిరి–తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జారీ చేయనున్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ ప్రదీప్ చింతా

సాక్షి అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ యూకే కన్వీనర్ డాక్టర్ ప్రదీప్ చింతాను పార్టీ ప్రధాన కార్యదర్శి (ఎన్ఆర్ఐ అఫైర్స్) గా నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ప్రకటన విడుదల చేసింది.

నేడు తిరుమలలో కార్తీక దీపోత్సవం

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో గురువారం కార్తీక పర్వదీపోత్సవాన్ని టీటీడీ నిర్వహించనుంది. కార్తీక పౌర్ణమినాడు శ్రీవారికి సాయంకాల కైంకర్యాలు, నివేదనలు పూర్తయిన తరువాత ఈ దీపోత్సవం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ప్రతి నెలా నిర్వహించే పౌర్ణమి గరుడ సేవను, సహస్ర దీపాలంకరణ సేవలను టీటీడీ రద్దు చేసింది. సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు నేతి వత్తులతో దీపాలను వెలిగించి ఛత్రచామర, మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా విమాన ప్రదక్షిణం చేస్తూ ఆనంద నిలయంలో శ్రీవారికి హారతి ఇస్తారు. ఆ తర్వాత గర్భాలయంలో అఖండం మొదలుకొని కులశేఖర పడి, రాములవారి మేడ, ధ్వజస్తంభం, బేడి ఆంజనేయస్వామి, శ్రీవరాహస్వామి ఆలయం, స్వామి పుష్కరిణి తదితర స్థలాల వద్ద దీపాలను ఏర్పాటు చేస్తారు.

రేపటి నుంచి విజయనగరంలో వైద్యుల జాతీయ సదస్సు

విజయనగరం ఫోర్ట్: వైద్యుల జాతీయ సదస్సును ఈనెల 5, 6, 7, తేదీల్లో విజయనగరంలోని ఓ ప్రైవేటు కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్టు ఐఎంఏ కాలేజ్ ఆఫ్ జనరల్ ప్రాక్టీషనర్ (సీజీపీ) డీన్ డాక్టర్ వి.ఎస్.ప్రసాద్ తెలిపారు. స్థానిక ఐఎంఏ హాల్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సదస్సుకు ఐఎంఏ జాతీయ అధ్యక్షుడు దిలీప్ భానుశాలి, ఉపాధ్యక్షుడు బిడినహాళ్, కోశాధికారి పీయూష్‌జైన్ హాజరవుతారన్నారు. సదస్సులో వైద్యుల నైపుణ్యాభివృద్ధిపై నిపుణులు సూచనలు చేస్తారని తెలిపారు.

ఘాట్‌లో విన్యాసాలేంటి గోవిందా!

తిరుమల శ్రీవారి దర్శనం కోసం తిరుమలకు వచ్చిన ఓ భక్త బృందంలోని యువకులు బుధవారం కారులో ఘాట్ రోడ్‌లో వెళ్తున్న సమయంలో విన్యాసాలు చేశారు. కిటికీల నుంచి తలలు బయటపెట్టుకొని సెల్ఫీలు, వీడియోలు తీసుకుంటూ వెళ్లారు. దీన్ని చూసిన భక్తులంతా భయభ్రాంతులకు గురయ్యారు. – తిరుమల

దేదీప్యమానం!

తమిళనాడులోని అగ్ని స్థలమైన తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయం కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా పదో రోజు బుధవారం సాయంత్రం కార్తీక మహా దీపోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. అరుణాచలేశ్వరాలయం వెనుక వైపునున్న 2,668 అడుగుల ఎత్తుగల కొండపై సాయంత్రం 6 గంటలకు వేద మంత్రాల నడుమ అర్ధనారీశ్వరుడి దర్శనమైంది. అనంతరం ఆలయం ముందు బాణసంచా పేల్చి కర్పూరం వెలిగించారు. వీటిని కొండపై నుంచి చూసి శంఖాన్ని ఊది శివ నామ స్మరణల మధ్య మహా దీపాన్ని వెలిగించారు. ఉదయం 4 గంటలకే ఆలయంలోని పంచముఖ స్థలంలో భరణి దీపాన్ని వెలిగించారు. సాయంత్రం వెలిగించే మహా దీపానికి 4,500 కిలోల నెయ్యి, 1,500 మీటర్ల గాడా గుడ్డను రాగి రాక్షస కొప్పరిలో ఉంచి శివ నామస్మరణలతో మహా దీపాన్ని వెలిగించారు. దీన్ని తిలకించేందుకు 45 లక్షల మంది భక్తులు తిరువణ్ణామలై చేరుకున్నారు. – వేలూరు

నల్లమలలో పులుల లెక్కింపు షురూ

మార్కాపురం: నల్లమల అటవీ ప్రాంతంలో పులుల లెక్కింపు ప్రారంభమైంది. మార్కాపురం, గిద్దలూరు, నంద్యాల, ఆత్మకూరు డివిజన్ పరిధిలోని 25 రేంజ్‌లలోని అధికారులు, బేస్ క్యాంపు సిబ్బంది, ప్రొటెక్షన్ వాచర్స్ కలిపి 500 మందికిపైగా ఉద్యోగులు పులుల గణనలో నిమగ్నమయ్యారు. బుధవారం ప్రకాశం జిల్లా మార్కాపురం మండలంలోని గొట్టిపడియ, అక్కచెరువు తాండ, కలనూతల అటవీ ప్రాంతాల్లో పులుల గణన చేపట్టారు. ఈనెల 8 వరకూ జరిగే కార్యక్రమంలో 1, 2, 3 తేదీల్లో పెద్దపులి, చిరుతపులి, రేసుకుక్కలు, ఎలుగుబంట్లు తదితర జంతువుల లెక్కింపును సైంటిఫిక్ పద్ధతిలో చేపట్టామని మార్కాపురం ఎఫ్ఆర్‌వో పిచ్చిరెడ్డి, డిప్యూటీ ఆర్‌వో జి.నాగరాజు తెలిపారు. పులులను ప్రత్యక్షంగా, పాదముద్రలు, వాటి మలము, చెట్లపైన గీసిన గుర్తుల వంటి అనేక వాటిని పరిగణలోనికి తీసుకుని లెక్కవేస్తున్నట్లు తెలిపారు. 6, 7, 8 తేదీల్లో శాకాహార జంతువుల సర్వే చేస్తామన్నారు. ఉదయం 6 గంటల నుంచి లెక్కింపు ప్రారంభమైందని చెప్పారు.

పెద్దపులి పాదముద్రలు పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

భక్తులపై నీటి పిల్లుల దాడి

శ్రీశైలం: ముక్కంటి క్షేత్రంలోని పాతాళగంగలో పుణ్య స్నానాలు చేయడానికి వెళ్లిన కొందరు భక్తులపై బుధవారం నీటి పిల్లులు దాడి చేసి గాయపరిచాయి. శివదీక్ష విరమణకు శ్రీశైలం వచ్చామని, బుధవారం ఉదయం పాతాళగంగలో పుణ్యస్నానం చేయడానికి నీటిలోకి దిగినప్పుడు నీటి పిల్లులు కరిచాయని హైదరాబాద్‌కు చెందిన భక్తులు తెలిపారు. తమకు కొద్ది దూరంలో ఉన్న మరో ముగ్గురు భక్తుల కాళ్లను గాయపరచడంతో అరుచుకుంటూ బయటికి వచ్చారన్నారు. స్నానఘట్టాల వద్దకు నీటి పిల్లులు రాకుండా దేవస్థానం, అటవీ శాఖాధికారులు ఐరన్ మెష్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ విషయంపై శ్రీశైలం ప్రాజెక్టు కాలనీలో ఉన్న బయోడైవర్సిటీలో సైంటిస్టుగా పనిచేస్తున్న రమేశ్‌ను సంప్రదించగా వర్షాకాలంలో మాత్రమే ఇవి నీటిప్రవాహంలో కనిపిస్తాయని, వీటిని నీటి కుక్కలు, నీటి పిల్లులు అని పిలుస్తారని చెప్పారు. వీటి చర్మం నున్నగా ఉంటుందని, పదునైన పళ్లు ఉంటాయన్నారు. క్షీరదాలు, ఉభయ జలచరాలని, సాధు జంతువులని, ఇది వాటికి సంగమ సమయం కావడంతో వాటి ఏకాంతానికి భంగం కలిగినట్లు అనిపిస్తే రక్షణ కోసం ఎదురు తిరుగుతాయని తెలిపారు. భక్తులు లోతట్టు ప్రాంతాలకు వెళ్లకుండా ఐరన్ మెష్ వేసిన ప్రాంతంలోపలే స్నానాలు చేయడం మంచిదని తెలిపారు.

దాడి గురించి వివరిస్తున్న భక్తుడు శంకర్

నీటి పిల్లులు (ఫైల్)

బాలికను దత్తత తీసుకున్న అమెరికన్ దంపతులు

దత్తత తీసుకున్న అమెరికన్ దంపతులకు ధ్రువపత్రం అందజేస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

నరసరావుపేట: పల్నాడు జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ సంరక్షణలో ఉన్న బాలికను అమెరికన్ దంపతులు దత్తత స్వీకరించారు. తల్లిదండ్రులు వదిలివేసిన అమర ప్రగతి(2)ని అమెరికన్ దంపతులకు దత్తత ఇస్తూ కలెక్టర్ కృతికా శుక్లా బుధవారం కలెక్టరేట్‌లో ధ్రువపత్రం అందజేశారు. తొలుత దత్తత తీసుకునేందుకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. దంపతుల ఆర్థిక పరిస్థితి, పిల్లల అవసరం తదితర అంశాలను పరిశీలించి దత్తత ధ్రువపత్రం జారీ చేశారు. బాలికకు 21 ఏళ్ల వయసు వచ్చే వరకూ ఆమె సంరక్షణను పర్యవేక్షిస్తామన్నారు. మొదటి ఏడాది ప్రతి వారం బాలిక పెంపకంపై సమీక్ష ఉంటుందని తెలిపారు. అనంతరం మూడేళ్ల పాటూ నెలకోసారి, ఆ తర్వాత ఏడాదికోసారి సమీక్ష చేస్తామన్నారు. సురక్షితమైన దత్తత కోసం ఐసీడీఎస్‌ను సంప్రదించాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

రైల్వే స్టేషన్‌లో నాటు బాంబు కలకలం

కుక్క కొరకడంతో పేలుడు...శునకం మృతి

మిగితా బాంబులను స్వాధీనం చేసుకున్న పోలీసులు

కొత్తగూడెం అర్బన్: భద్రాద్రి జిల్లా కేంద్రం కొత్తగూడెంలోని భద్రాచలం రోడ్డు రైల్వే స్టేషన్‌లో బుధవారం నాటుబాంబు పేలిన ఘటన సంచలనమైంది. ఆర్‌పీఎఫ్ పోలీసుల కథనం ప్రకారం.. బుధవారం ఉదయం 10.30 గంటలకు రైల్వే స్టేషన్ మొదటి ప్లాట్‌ఫాంపైకి కుక్క ఓ బ్యాగ్‌ను తీసుకొచ్చి అందులో ఉన్న ఒక నాటు బాంబును కొరికింది. అది పేలడంతో కుక్క అక్కడికక్కడే మృతి చెందింది. బాంబు శబ్దానికి రైల్వే అధికారులు, సిబ్బంది వెళ్లి చూడగా ట్రాక్‌పై కుక్క చనిపోయి ఉంది. దీంతో రైల్వే జీఆర్‌పీ పోలీసులు, త్రీటౌన్ పోలీసులు, బాంబుస్క్వాడ్ సిబ్బంది చేరుకుని పరిశీలించగా బ్యాగులో మరో ఐదు నాటు బాంబులు కనిపించాయి. వాటిని జీఆర్‌పీ పోలీసులు స్వాధీనం చేసుకొని నీటితో ఉన్న బకెట్‌లో నిర్వీర్యం చేశారు. కాగా, ఈ నాటుబాంబులను అటవీ ప్రాంతాల్లో పందులను, ఇతర జంతువులను వేటాడేందుకు ఉపయోగిస్తారని, అవి రైల్వే స్టేషన్ ఆవరణలోకి ఎలా వచ్చాయనే విషయాలపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

రైల్వే ట్రాక్‌పై బాంబుపేలి మృతి చెందిన కుక్క

రోడ్డుపైనే అంతిమ సంస్కారమా!

శ్మశాన వాటికలో చేయలేని దుస్థితిలో ఉన్నామా?

- శ్మశానాల నిర్వహణకు నిధులిచ్చేందుకు ప్రభుత్వం ఎందుకు ఆసక్తి చూపడం లేదు
- జీవోలిచ్చినా ఎందుకు అమలు చేయడం లేదు
- శ్మశాన వాటికల ఏర్పాటు.. నిర్వహణకు ఓ కార్యాచరణ రూపొందించండి
- యంత్రాంగాన్ని కూడా ఏర్పాటు చేయండి
- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: ఓ వ్యక్తి అంతిమ సంస్కారాలను రోడ్డుపైనే నిర్వహించడంపై హైకోర్టు విస్మయం వ్యక్తం చేసింది. శ్మశాన వాటికల్లో అంతిమ సంస్కారాలు నిర్వహించలేని దుస్థితిలో ఉన్నామా? అని ఆవేదన వ్యక్తం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న శ్మశాన వాటికల్లో కనీస సదుపాయాలను కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని స్పష్టం చేసింది. శ్మశానాల నిర్వహణకు నిధులు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు అసక్తి చూపడం లేదని ప్రశ్నించింది. శ్మశానాల ఏర్పాటు, నిర్వహణ కోసం జీవోలు ఇచ్చినప్పటికీ అవేవీ అమలు కావడం లేదంది. ఆ జీవోలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని తెలిపింది. రాష్ట్రంలో రాబోయే రెండు దశాబ్దాలకు అనుగుణంగా శ్మశాన వాటికల ఏర్పాటుకు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ప్రస్తుతం ఉన్న శ్మశానాల నిర్వహణకు ఓ యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని కూడా ఆదేశించింది. శ్మశాన వాటికల్లో కనీస మౌలిక వసతుల కల్పనకు అవసరమైన నిధులను సైతం విడుదల చేయాలని స్పష్టం చేసింది. ఈ ఆదేశాలను అమలు చేసి దానిపై రెండు నెలల్లో నివేదిక ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. తదుపరి విచారణను వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చల్లా గుణరంజన్ ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలోని అన్ని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, పంచాయతీల్లోని శ్మశాన వాటికల్లో కనీస సదుపాయాలు లేకపోయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదంటూ విజయవాడకు చెందిన పి.ప్రమోద్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన సీజే ధర్మాసనం రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. పిటిషనర్ తరపు న్యాయవాది గడిపూడి వెంకటేశ్వర్లు, పురపాలక శాఖ తరఫున ప్రభుత్వ న్యాయవాది అంబటి శ్రీకాంత్‌రెడ్డి వాదనలు వినిపించారు.

మల్లన్న సేవలో క్రికెటర్లు

ఆలయం వెలుపల రవి బిష్ణోయి, జితేశ్ శర్మ

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను భారత క్రికెటర్లు జితేశ్ శర్మ, రవి బిష్ణోయి దర్శించుకున్నారు. బుధవారం మల్లన్న దర్శనానికి వచ్చిన వీరికి ఆలయ రాజగోపురం వద్ద దేవస్థాన అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం క్రికెటర్లు మల్లికార్జున స్వామివారికి రుద్రాభిషేకం, భ్రమరాంబాదేవికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఆలయం వద్ద ఆశీర్వచన మండపంలో క్రికెటర్లకు అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. దేవస్థాన అధికారులు స్వామివారి శేషవస్త్రాలను, లడ్డూప్రసాదాలను అందజేశారు. టీమిండియా క్రికెటర్లతో పాటు అండర్–19కు ఆడే క్రికెటర్లు కూడా ఉన్నారు.

బస్సు రోడ్డెక్కాలంటే కప్పం కట్టాల్సిందే!

ఆర్టీసీ అద్దె బస్సుల యజమానులకు బెదిరింపులు

ఒక్కో బస్సుకు రూ.2 లక్షల చొప్పున వసూలు

మంత్రి పేరు చెప్పి మామూళ్లు వసూలు చేస్తున్న వైనం

సాక్షి, పుట్టపర్తి: 'మామూళ్లు ఇస్తేనే మీ బస్సులు రోడ్డెక్కుతాయి. మీరు వ్యాపారం చేయాలంటే మంత్రికి కప్పం కట్టాల్సిందే. రూ.2 లక్షలు చెల్లించిన వారే ఆర్టీసీలో కొనసాగుతారు' అంటూ ఆర్టీసీ అద్దె బస్సుల యజమానులను కొందరు దళారీలు బెదిరిస్తున్నారు. అడిగినంత ఇవ్వకపోతే మీ బస్సును ఆర్టీసీలో కొనసాగించేది లేదంటూ హెచ్చరిస్తున్నారు. దీంతో అద్దె బస్సుల యజమానులు లబోదిబోమంటున్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 2,500 అద్దె బస్సులు ఉన్నాయి. ఆర్టీసీలోకి ఎలక్ట్రిక్ బస్సులు తీసుకుంటామని సీఎం చంద్రబాబు ప్రకటించడంతో అద్దె బస్సుల యజమానులంతా దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఈ నేపథ్యంలో అద్దె బస్సుల యజమానుల అసోసియేషన్‌కు చెందిన కొందరు.. ప్రభుత్వ పెద్దలతో చర్చించి.. 950 అద్దె(డీజిల్) బస్సులకు అనుమతులు పొందినట్లు చెబుతున్నారు. వాటిలో ఉండాలంటే రూ.2 లక్షల చొప్పున ఇవ్వాల్సిందేనంటూ అసోసియేషన్‌కు చెందిన పలువురు వసూళ్లు చేస్తున్నట్లు సమాచారం. మంత్రికి అత్యంత సన్నిహితులతో టచ్‌లో ఉన్నామని.. రూ.2 లక్షలు చెల్లించిన వారినే కొనసాగిస్తారంటూ బెదిరిస్తున్నట్లు తెలిసింది. ఇందులో ప్రొద్దుటూరు, ఒంగోలుకు చెందిన ఇద్దరు పెద్దలు కీలకపాత్ర పోషిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే రూ.3 కోట్ల వరకు వసూలు చేసినట్లు తెలిసింది. ఉచిత బస్సు వల్ల ప్రయాణికుల రద్దీ పెరిగి ఇప్పటికే తమ బస్సులకు మైలేజీ రాక నష్టపోతున్నామని.. ఇప్పుడు అకస్మాత్తుగా రూ.2 లక్షలు ఇవ్వాలంటే ఎలా? అని పలువురు యజమానులు వాపోతున్నారు. చంద్రబాబు ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి తాము నష్టపోతూనే ఉన్నామని.. ఇలాంటి తరుణంలో డీజిల్ బస్సులు వద్దంటే ఎలా? అని ప్రశ్నిస్తున్నారు. తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

వెంకన్నను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి వారిని బుధవారం ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాలకృష్ణారావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అధికారులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనానంతరం వారికి పండితులు వేదాశీర్వచనం, తీర్థ ప్రసాదాలు, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. అలాగే, న్యాయమూర్తి కుటుంబసమేతంగా అంతర్వేది లక్ష్మీనరసింహస్వామివారి ఆలయాన్ని కూడా దర్శించుకున్నారు. – కొత్తపేట/సఖినేటిపల్లి

శ్రీవారి సేవలో తెలంగాణ హైకోర్టు జడ్జీలు

తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జి.ప్రవీణ్ కుమార్, జస్టిస్ ఈవీ వేణుగోపాల్ బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు ఆశీర్వదించగా అధికారులు లడ్డూ ప్రసాదాలు అందజేశారు. – తిరుమల

ఆలయం వెలుపల జస్టిస్ ప్రవీణ్ కుమార్, జస్టిస్ వేణుగోపాల్

గాయపడిన ఏనుగు మృతి

తిరుపతి అన్నమయ్య సర్కిల్: గత నెల 30న చిత్తూరు పారదరామి రిజర్వ్ ఫారెస్టులో తీవ్రంగా గాయపడి తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర జంతు ప్రదర్శనశాల (జూపార్క్)లో చికిత్స పొందుతున్న వయోజన మఖ్నా ఏనుగు బుధవారం మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. సుమారు 25 సంవత్సరాల వయసున్న ఈ ఏనుగు నవంబరు 30 చిత్తూరు పశ్చిమ రేంజ్, పారదరామి రిజర్వ్ ఫారెస్ట్‌లోని గుడ్డివాని చెరువులో గాయపడి కదల్లేక నడవలేని స్థితిలో ఉంది. అటవీశాఖ, ఎస్వీ జంతు ప్రదర్శనశాల పశువైద్యులతో కూడిన రెస్క్యూ బృందం ఏనుగును రక్షించి, మెరుగైన వైద్యం కోసం ఈనెల 1న తిరుపతిలోని ఎస్వీ జూపార్క్‌కు తరలించారు. చికిత్స అందించినప్పటికీ ఏనుగు పరిస్థితి విషమంగా మారింది. ఆహారం తీసుకోవడం మానేయడంతో బుధవారం తెల్లవారు జామున మరణించినట్లు గుర్తించారు.

పోస్టుమార్టంలో గుర్తించిన అంశాలు

ఏనుగు తన గుంపులో జరిగిన పోరాటం కారణంగా గాయపడినట్లు పోస్టుమార్టంలో గుర్తించారు. ఈ గాయం వల్ల అది నీటి గుంటలో పడిపోయి ఉండవచ్చని, ఎక్కువసేపు నీటిలో ఉండడం వల్ల అది పైకి పాకే అంటువ్యాధి (అసెండింగ్ ఇన్ఫెక్షన్)కి దారితీసినట్లు భావిస్తున్నారు. దీనికి తోడు తుంటి వద్ద తీవ్ర గాయమైంది. మూత్రాశయంలో చీము ఏర్పడడం వల్ల ప్రాణాంతక సెప్టిసీమియా (రక్తం విషపూరితం కావడం) ఏర్పడి మరణానికి కారణమైందని నిర్ధారించారు. అనంతరం ఎస్వీ జంతు ప్రదర్శనశాల ప్రాంగణంలోనే కళేబరాన్ని ఖననం చేశారు.

మార్కెట్ యార్డులో పత్తి రైతుల ధర్నా

మార్కాపురం: తాము పండించిన పత్తిని సీసీఐ ద్వారా బయ్యర్లు గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలని కోరుతూ రైతులు బుధవారం ప్రకాశం జిల్లా మార్కాపురం మార్కెట్ యార్డులో ధర్నా చేశారు. గత నెలలో తుపాను కారణంగా పత్తి తడవటంతో నాణ్యత తగ్గిందని, వ్యాపారులు ధర తగ్గించి కొంటున్నారని, దీంతోపాటు పర్చూరు యార్డుకు రావాలని చెబుతున్నారని రైతులు ఆరోపించారు. తాము అక్కడికి వెళ్లి ఎలా అమ్మగలమని ప్రశ్నించారు. ఈ నెల 1వ తేదీ నుంచి కొనుగోలు చేస్తామని తేదీలు మారుస్తున్నారే తప్ప కొనుగోలు చేయడం లేదని మండిపడ్డారు. కొనుగోలు కేంద్రాన్ని గత నెలలో అట్టహాసంగా ప్రారంభించి 3 రోజులకే మూసేశారని ఆరోపించారు. తమ ఫోన్లు కూడా బయ్యర్లు ఎత్తడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను గురించి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు.

పత్తి కొనుగోలు చేయాలని నిరసన తెలుపుతున్న రైతులు

26న విశాఖలో 'రంగానాడు' బహిరంగ సభ

గుణదల (విజయవాడ తూర్పు): విశాఖలో ఈ నెల 26న రంగానాడు పేరిట భారీ బహిరంగసభ నిర్వహించనున్నట్లు రాధా రంగ రాయల్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. విజయవాడలో వీరు బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. వంగవీటి మోహన రంగా వర్ధంతిని పురస్కరించుకొని విశాఖలో బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ సభ పోస్టర్‌ను వంగవీటి రంగా కుమార్తె ఆశాకిరణ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాపు సంఘం నాయకులు వంగవీటి శంతన్‌కుమార్, గాదె బాలాజీ, ఆమంచి స్వాములు, సుధాకర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు. ఆశాకిరణ్ మాట్లాడుతూ రంగా అభిమానులందరి కోసం నిర్వహిస్తున్న ఈ సభ కుల మత,రాజకీయాలకు అతీతంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. తాను రాజకీయంగా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. వంగవీటి రాధాకృష్ణతో తనకు ఎలాంటి విభేదాలు లేవని స్పష్టం చేశారు.

'రంగానాడు'సభ పోస్టర్ ఆవిష్కరిస్తున్న వంగవీటి ఆశ తదితరులు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
నిట్ నెం. 36/2025-26/EOSE/గి.సం/నెల్లూరు/డిబి/ తేది : 01.12.2025
గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ విభాగం పర్యవేక్షక ఇంజినీర్ (ఎక్స్-ఆఫీషియో), నెల్లూరు పరిధిలోని 2 పనులకు అంచనా విలువ : రూ. 557.70 లక్షలకు ఆన్‌లైన్ టెండర్లు జారీచేయడమైనది. టెండరు షెడ్యూలు ప్రారంభ తేది : 10.12.2025, సా.4.00 గం.ల తరువాత. ఇతర వివరాలను http://www.apeprocurement.gov.in లో చూడవచ్చును.
సం/- పర్యవేక్షక ఇంజినీర్ (ఎక్స్-ఆఫీషియో), గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ విభాగము, నెల్లూరు
DIPR RO No.18257/CL/Advt/1/1/2021-22, Dt: 03.12.2025

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
పంచాయతీరాజ్ శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
నం. 09/2025-26, నిట్ నెం. 46 నుండి 53 వరకు తేది : 28.11.2025
కార్యనిర్వాహక ఇంజినీర్, పంచాయతీరాజ్ డివిజన్, తెనాలి పరిధిలోని పొన్నూరు, మంగళగిరి మరియు తెనాలి నియోజకవర్గంలో భవన & రోడ్ల నిర్మాణము, అదనపు సౌకర్యములు ఏర్పాటుచేయు 8 పనులకు అంచనా విలువ : రూ. 150.00 లక్షలతో వివిధ గ్రాంట్ల క్రింద మంజూరు చేయబడినవి. టెండరు 11.12.2025 నుండి https://www.apeprocurement.gov.in ద్వారా కోరబడుచున్నవి.
సం/- కార్యనిర్వాహక ఇంజినీర్, పంచాయతీరాజ్ డివిజన్, తెనాలి
DIPR RO No. 18255/CL/Advt/1/1/2021-22, Dt : 03.12.2025

పుతిన్ పర్యటనకు ఫుల్ సెక్యూరిటీ

ఐదంచెల భద్రతా వ్యవస్థ ● పూర్తిగా ఏఐ ఆధారితమే

- స్నైపర్లు, డ్రోన్లు, జామర్లు
- రష్యన్ పీఎస్‌ఎస్ సిబ్బంది
- మన నేషనల్ గార్డ్ కమెండోలు
- మోదీతో రాత్రి విందు భోజనం
- రేపు రాష్ట్రపతిభవన్‌లో స్వాగతం
- మహాత్ముని సమాధి వద్ద నివాళులు

న్యూఢిల్లీ: స్నైపర్లు, డాగ్ స్క్వాడ్, డ్రోన్లు, జామర్లు, ఏఐ ఆధారిత ఐదంచెల భద్రతా వ్యవస్థ. ఇవన్నీ ఏమిటో తెలుసా? రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భారత పర్యటన సందర్భంగా చేస్తున్న అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు! రష్యా నుంచి పుతిన్‌తో పాటు వెంట వచ్చే ప్రెసిడెంట్ బాడీగార్డులు, ప్రెసిడెన్షియల్ సెక్యూరిటీ సర్వీస్‌కు చెందిన అత్యంత సుశిక్షితులైన సిబ్బంది ఈ ఏర్పాట్లకు అదనం. వీరంతా కాకుండా భారత నేషనల్ సెక్యూరిటీ గార్డ్ విభాగానికి చెందిన టాప్ కమెండోలు ఎటూ రంగంలోకి దిగుతారు. ఇలా మొత్తమ్మీద పుతిన్ భారత పర్యటనకు భద్రతా ఏర్పాట్లు ఏకంగా అమెరికా అధ్యక్షుని పర్యటనను కూడా మించే స్థాయిలో సాగుతున్నాయి!

ముందే రంగంలోకి 40 మంది ఉన్నతాధికారులు

- పుతిన్ పర్యటన తాలూకు భద్రతా ఏర్పాట్ల పర్యవేక్షణ కోసం రష్యా నుంచి ఏకంగా 40 మందికి పైగా రక్షణ శాఖ ఉన్నతాధికారులు ముందే రంగంలోకి దిగారు.
- వారు ఢిల్లీ చేరుకుని తమ అధ్యక్షుని భద్రతకు సంబంధించిన ప్రతి సూక్ష్మ అంశాన్నీ భూతద్దంలో మరీ పరిశీలిస్తున్నారు.
- పుతిన్ కాన్వాయ్ వెళ్ళే ప్రతి మార్గాన్నీ ఢిల్లీ పోలీసులు, ఎన్‌ఎస్‌జీ సిబ్బందితో కలిసి జల్లెడ పడుతున్నారు.
- అంతేగాక కాన్వాయ్ పై నిరంతర నిఘా కోసం రష్యా అధికారులు ఏకంగా ఒక డ్రోన్ కార్యాలయమే తెరిచారు!
- పుతిన్ వెళ్లే మార్గాలన్నింటినీ ప్రత్యేక శిక్షణ పొందిన రష్యా స్నైపర్లు డేగ కళ్లతో పరిశీలిస్తూ ఉంటారు.
- ఇక సాంకేతిక పరిజ్ఞానాన్ని అయితే అత్యున్నత స్థాయిలో ఉపయోగిస్తున్నారు.
- కృత్రిమ మేధ(ఏఐ), ఫేషియల్ రికగ్నిషన్ కెమెరాలు అంగుళం అంగుళాన్నీ వారికి అతి స్పష్టంగా పట్టి చూపనున్నాయి.
- మొత్తం సెక్యూరిటీ ఛత్రంలో ఎన్‌ఎస్‌జీ కమెండోలు, ఢిల్లీ పోలీసులు బయటి అంచెలకే పరిమితం అవుతారు.
- మిగతా నాలుగు లోపలి అంచెలనూ రష్యా భద్రతా వర్గాలే చూసుకుంటాయి.
- పుతిన్, మోదీ కలిసి ఉన్నప్పుడు మాత్రం ప్రధాని భద్రతా ఏర్పాట్లు చూసే ఎన్‌ఎస్‌జీ, స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ కమెండోలు రష్యా స్పెషల్ ఫోర్సెస్ సిబ్బందితో పాటుగా లోపలి వలయంలోకి వస్తారు.
- పుతిన్ బస చేసే హోటల్‌ను రష్యా వేగులు ఇప్పటికే జల్లెడ పట్టేశారు.
- ఆయన వెళ్లే ఇతర ప్రాంతాలన్నింటినీ వారు తరచూ పరీక్షిస్తున్నారు.

పుతిన్‌తో మోదీ(ఫైల్)

బిజీ బిజీ!

ప్రధాని నరేంద్ర మోదీ ఆహ్వానం మేరకు భారత్, రష్యా వార్షిక శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు పుతిన్ గురువారం మన దేశానికి రానున్నారు. సాయంత్రం కల్లా ఆయన ఢిల్లీలో భేటీ అవకాశముంది. రాత్రి మోదీ ఆయనకు విందు ఇస్తారని సమాచారం. శుక్రవారం రాష్ట్రపతి భవన్‌లో పుతిన్‌కు సంప్రదాయబద్ధంగా ఘన స్వాగతం పలకనున్నారు. అనంతరం రాజ్ ఘాట్‌లో మహాత్ముని సమాధిని సందర్శించి నివాళులు అర్పిస్తారు. సాయంత్రం హైదరాబాద్ హౌస్‌లో శిఖరాగ్రంలో పాల్గొంటారు. రాత్రి భారత్ మండపంలో ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాలను పుతిన్ తిలకిస్తారు. తర్వాత రాష్ట్రపతి భవన్ చేరుకుంటారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఇచ్చే ప్రభుత్వ విందులో పాల్గొంటారు.

రక్షణ మంత్రుల భేటీ నేడు

భారత, రష్యా రక్షణ మంత్రులు రాజ్ నాథ్ సింగ్, ఆండ్రే బెలెసోవ్ గురువారం ఢిల్లీలో భేటీ కానున్నారు. మరిన్ని ఎస్–400 గగనతల రక్షణ వ్యవస్థల కొనుగోలు, సుఖోయ్–30 యుద్ధ విమానాల ఆధునీకరణలతో పాటు రష్యా నుంచి కీలక సైనిక సామగ్రి కొనుగోలు ప్రధాన ఎజెండా కానుంది. పుతిన్ బృందంలో భాగంగా బెలోసోవ్ భారత్ వస్తున్నారు. పుతిన్, మోదీ శిఖరాగ్రానికి ఒక రోజు ముందు రక్షణ మంత్రుల కీలక భేటీ జరుగుతోంది. అత్యంత అధునాతనమైన ఎస్–500 డిఫెన్స్ వ్యవస్థల కొనుగోలు ప్రతిపాదనలను కూడా రాజ్‌నాథ్ ఈ సందర్భంగా బెలోసోవ్ ముందు ఉంచవచ్చని సమాచారం. సుఖోయ్–57 యుద్ధ విమానాలను భారత్‌కు సరఫరా చేసే యోచన ఉందని క్రెమ్లిన్ అధికార ప్రతినిధి ద్మిత్రీ పెస్కోవ్ మంగళవారమే తెలిపారు. ఐదో తరం యుద్ధ విమానాల కోసం భారత్ ప్రయత్నిస్తున్న నేపథ్యంలో ఈ అంశమూ చర్చకు వచ్చే అవకాశం ఉంది.

అసలు హైలెట్ ఆ కారే!

ఆరస్ సెనట్. ప్రపంచంలోనే అత్యంత విలాసవంతమైన లగ్జరీ కార్లలో ఒకటి. పుతిన్ కాన్వాయ్ మొత్తంలోకెల్లా అసలు హైలెట్ అదే. ఎలాంటి పెను దాడినైనా తట్టుకుని నిలిచే సామర్థ్యం ఈ కారుకు ఉంది. వెనువెంటనే ప్రతిదాడి చేసేందుకు అనువుగా ఇందులో అనేక అత్యాధునిక ఆయుధాలు ఉన్నాయి. ఇది అన్ని విధాలా శత్రు దుర్భేద్యం. అందుకే దీన్ని ముద్దుగా 'నడిచే దుర్గం' అని పిలుచుకుంటూ ఉంటారు. ఈ లిమోజిన్‌ను ప్రత్యేక విమానంలో ఢిల్లీకి తరలిస్తున్నారు. ఇటీవల చైనాలో షాంఘై సహకార శిఖరాగ్రం సందర్భంగా మోదీ ఈ కారులోనే పుతిన్‌తో కలిసి విహరించడం విశేషం.

- ఆరస్ సెనట్ కారును 2018లో పుతిన్ కాన్వాయ్‌లో చేర్చారు.
- నాటినుంచి అది ఆయన అధికారిక ప్రభుత్వ వాహనంగా ఉంటోంది.
- ప్రభుత్వ అవసరాల నిమిత్తం తయారు చేసే సాయుధ వాహనాల కోసం ఉద్దేశించిన కోర్టెజ్ ప్రాజెక్టులో భాగంగా ఈ లిమోజిన్‌ను తయారు చేశారు.

200 ఇండిగో విమానాలు రద్దు

- ఆలస్యంగా నడిచిన మరికొన్ని విమానాలు
- సాంకేతిక సమస్యలు, సిబ్బంది కొరత తదితర కారణాలతో..
- తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రయాణికులు

న్యూఢిల్లీ: దేశంలో అతిపెద్ద విమానయాన సంస్థ 'ఇండిగో'కు చెందిన విమానాలు ఆలస్యంగా రాకపోకలు సాగించడం, మరికొన్ని రద్దు కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బుధవారం దేశవ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది. చిన్నపాటి సాంకేతిక సమస్యలు, రద్దీ, సిబ్బంది రోస్టరింగ్ నిబంధనలు, అననుకూల వాతావరణం వంటివి విమానాల రద్దుకు కారణాలుగా నిలిచాయి. ఢిల్లీ, ముంబై, బెంగళూరు, హైదరాబాద్, విశాఖపట్నం, గోవా, అహ్మదాబాద్, చెన్నై, హుబ్లీ, భోపాల్, భువనేశ్వర్ ఎయిర్‌పోర్టుల్లో ప్రయాణికుల గంటలకొద్దీ వేచి చూడాల్సి వచ్చింది. వారు సోషల్ మీడియాలో తమ ఆగ్రహం వ్యక్తం చేస్తూ పోస్టులు పెట్టారు. ముఖ్యమైన సమావేశాలు వెళ్లలేకపోతున్నామని, ఇండిగో సిబ్బంది తగిన సమాధానం చెప్పడం లేదని మండిపడ్డారు. ఇండిగో సంస్థ దేశంలో 2,200 విమానాలను నడిపిస్తోంది. మంగళవారం 1,400 విమానాలు ఆలస్యంగా నడిచాయి. బుధవారం 200 విమానాలు రద్దయ్యాయి. ఈ పరిస్థితికి కారణం ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్(ఎఫ్‌డీటీఎల్) నిబంధనల్లో సవరణ చేయడమేనని ఇండిగో వర్గాలు చెబుతున్నాయి. కొత్త నిబంధనల ప్రకారం.. పైలట్లకు, ఇతర సిబ్బందికి మరింత ఎక్కువ సమయం విశ్రాంతి ఇవ్వాల్సి వస్తోంది. ఫలితంగా పైలట్లు, సిబ్బంది కొరత ఏర్పడింది. దాంతో అనివార్యంగా విమానాలను రద్దు చేయాల్సి వచ్చిందని, విమానాలు ఎయిర్‌పోర్టులకే పరిమితం అయ్యాయని అంటున్నారు. కొన్ని అంతర్జాతీయ విమానాశ్రయాల్లో సాంకేతిక లోపాలతో చెక్–ఇన్ వ్యవస్థలు సరిగా పనిచేయలేదు. కౌంటర్ల ముందు ప్రయాణికులు బారులు తీరారు.

మరో 48 గంటలు ఇదే పరిస్థితి!

రెండు రోజులుగా తమ ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం వాస్తవమేనని, వారిని క్షమాపణ కోరుతున్నామని ఇండిగో యాజమాన్యం ఒక ప్రకటనలో వెల్లడించింది. షెడ్యూల్‌లో మార్పులతోపాటు కొన్ని సాంకేతిక సమస్యల వల్ల ఈ పరిస్థితి తలెత్తినట్లు పేర్కొంది. మరో 48 గంటలపాటు ఇబ్బందులు కొనసాగే అవకాశం ఉన్నట్లు వెల్లడించింది. ఎఫ్‌డీటీఎల్ కొత్త నిబంధనలను పౌర విమానయాన డైరెక్టర్ జనరల్(డీజీసీఏ) ఇటీవలే జారీ చేశారు. విమాన సిబ్బంది రోజుకు 8 గంటలు, వారానికి 35 గంటలు, నెలకు 125 గంటలు, సంవత్సరానికి 1,000 గంటలకు మించి విధులు నిర్వర్తించకూడదని ఆదేశించారు. 24 గంటల్లో కనీసం 10 గంటలు వారికి విశ్రాంతి ఇవ్వాలని పేర్కొన్నారు. నవంబర్ 1వ తేదీ నుంచే ఈ నిబంధనలు అమల్లోకి వచ్చాయి. ఇదిలా ఉండగా, స్పైస్‌జెట్, ఆకాశ ఎయిర్, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సంస్థల విమానాలు కూడా ఆలస్యంగా నడిచాయి.

డీజీసీఏ దర్యాప్తు

ఇండిగో ఫ్లైట్ల రాకపోకల్లో అంతరాయంపై దర్యాప్తు చేస్తున్నట్లు డీజీసీఏ బుధవారం ప్రకటించారు. ప్రస్తుత పరిస్థితికి కారణం ఏమిటో తెలియజేయాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. అలాగే విమాన సేవలను యథాతథంగా కొనసాగించడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారోరన చెప్పాలని సూచించినట్లు వివరించారు. ఈ మేరకు డీజీసీఏ ఒక ప్రకటన విడుదల చేశారు. మానవ వనరుల నిర్వహణలో ఇండిగో విఫలమైందని, అందుకే విమానాలను రద్దు చేయాల్సి వచ్చినట్లు ఎయిర్‌లైన్ పైలట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(అల్పా) బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించింది.

రూ.29 కోట్ల డ్రగ్స్ పట్టివేత

బెంగళూరు(బనశంకరి): బెంగళూరులో డ్రగ్స్ అక్రమ రవాణా, విక్రయాలకు పాల్పడుతున్న ఇద్దరు విదేశీయులను బుధవారం పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ.29 కోట్ల విలువ చేసే 10.36 కేజీల ఎండీఎంఏ క్రిస్టల్, 8 కేజీల హైడ్రో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. చామరాజపేటలోని పోస్టాఫీస్‌లో డ్రగ్స్ పార్శిల్స్ వచ్చినట్లు తెలిసి పోలీసులు సోదాలు చేయగా 8 కిలోల హైడ్రో గంజాయి లభించింది. మరోఘటన.. బెంగళూరు విమానాశ్రయంలో ఓ ప్రయాణికుని నుంచి కోట్ల రూపాయల విలువైన గంజాయిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

బెంగాల్‌లో విజయమే లక్ష్యంగా పనిచేయండి

- రాష్ట్ర బీజేపీ ఎంపీలకు ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు
- తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని స్పష్టీకరణ

న్యూఢిల్లీ: పశ్చిమ బెంగాల్‌లో అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీపై పోరాటం కొనసాగించాలని, వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలని రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎంపీలకు ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలంటే తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని తేల్చిచెప్పారు. బెంగాల్‌లో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) ప్రక్రియ పారదర్శకంగా, సరళంగా జరిగేలా జాగ్రత్త వహించాలని సూచించారు. బెంగాల్ బీజేపీ ఎంపీలు బుధవారం ఢిల్లీలో ప్రధాని మోదీతో సమావేశమయ్యారు. ఎన్నికల వ్యూహాలపై వారు చర్చించినట్లు సమాచారం. బెంగాల్‌లో కచ్చితంగా అధికారం దక్కించుకోవాలని, అందుకోసం కష్టపడి పని చేయాలంటూ ప్రధానమంత్రి తమకు దిశానిర్దేశం చేశారని బెంగాల్ బీజేపీ అధ్యక్షుడు సుకాంత మజుందార్ చెప్పారు. బీజేపీ కార్యకర్తల అంకితభావాన్ని మోదీ ప్రశంసించారని డార్జిలింగ్ ఎంపీ రాజు బిస్తా తెలిపారు. ప్రజలకు మరింత చేరువ కావడానికి కృషి చేయాలంటూ ఆదేశించారని పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని మాల్దాకు చెందిన లోక్‌సభ సభ్యుడు ఖగేన్ ముర్ము కూడా మోదీని కలిశారు. అక్టోబర్‌లో ముర్ముపై అల్లరిమూక దాడి చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ముర్ము ఆరోగ్య పరిస్థితిపై ప్రధానమంత్రి ఆరా తీశారు.

మన అంతరిక్ష కేంద్రానికి తుది రూపు

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరో అతి పెద్ద ఘనత సాధించింది. అత్యంత ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన భారతీయ అంతరిక్ష కేంద్రం (బీఏఎస్)కు తుదిరూపు ఇచ్చింది. దాని ఆకృతీకరణ (కన్ఫిగరేషన్) ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసింది. మానవసహిత అంతరిక్ష యాత్ర దిశగా దీన్ని కీలక మైలురాయిగా శాస్త్ర సాంకేతిక లోకం వేనోళ్ల కీర్తిస్తోంది. కేంద్ర ప్రభుత్వం నియమించిన జాతీయ స్థాయి పరిశీలన కమిటీ బీఏఎస్ తుది రూపును పూర్తిస్థాయిలో పరిశీలించడం, ఆమోదముద్ర వేయడం చకచకా జరిగిపోయాయి. ఈ శుభవార్తను కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ లోక్ సభలో వెల్లడించారు.

ఏమిటీ బీఏఎస్?

ఇస్రో పూర్తి దేశీయ పరిజ్ఞానం సాయంతో రూపొందిస్తున్న మన సొంత అంతరిక్ష కేంద్రమిది. ఇందులో మొత్తం ఐదు మాడ్యూళ్లు ఉంటాయి. మరో పదేళ్లలో అంటే 2035 నాటికి దీన్ని ఆరంభించి కార్యకలాపాలు మొదలు పెట్టాలన్నది ఇస్రో లక్ష్యం. బీఏఎస్– 01 పేరిట మన అంతరిక్ష కేంద్రం తొలి మాడ్యూల్ అభివృద్ధికి కేంద్రం 2024లో పచ్చజెండా ఊపింది. ఫౌండేషనల్ మాడ్యూల్‌ను 2028 కల్లా ప్రయోగాత్మకంగా పూర్తిస్థాయిలో పరీక్షించి చూడాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే ఈ ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఇస్రో ఏడాదిలోనే బీఏఎస్ నిర్మాణం పూర్తి చేయడం విశేషం. దాని తాలూకు విడి భాగాలు, ఉప వ్యవస్థలు తదితరాలన్నీ చక్కగా పని చేస్తున్నాయని ఇస్రో శాస్త్రవేత్తలు నిర్ధారించారు. గగన్‌యాన్ ప్రాజెక్టులో అంతర్గతంగా బీఏఎస్‌కు నిధులు తదితరాలు సమకూర్చారు. దీనికి కేటాయింపులను ఏకంగా రూ.29,193 కోట్లకు పెంచుతూ కేంద్రం నిర్ణయం తీసుకుంది.

(ఫైల్)

ఎన్నెన్నో విశేషాలు...

- బీఏఎస్ నిర్మాణాన్ని అంతర్జాతీయ ప్రమాణాలన్నింటికీ అనుగుణంగా ఇస్రో పూర్తి చేసింది.
- గగన్‌యాన్ ప్రాజెక్టులో భాగంగా భూ దిగువ కక్ష్య (ఎల్ఈఓ)లోకి మానవసహిత ఉపగ్రహాన్ని పంపాలన్న తొలి లక్ష్య సాధనలో బీఏఎస్ పాత్ర కీలకం కానుంది.
- అంతరిక్షంలో పలు కీలక పరీక్షలు, ప్రయోగాలు కూడా బీఏఎస్ చేపట్టనుంది.
- భారత్ సత్యం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మానవసహిత చంద్రయాన్‌లో కూడా ఇదే కీలకం కానుంది.
- అవసరాన్ని బట్టి అత్యవసర పరిస్థితుల్లో ఇతర అంతరిక్ష కేంద్రాలతో ఎప్పటికప్పుడు అనుసంధానం అయ్యేందుకు దీంట్లో అన్ని ఏర్పాట్లూ ఉన్నాయి.
- బీఏఎస్‌లోని అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం కారణంగా ప్రయోగించిన కొద్ది కాలంలోనే అన్ని అంతరిక్ష కేంద్రాలకూ అది సారథిగా ఎదిగినా ఆశ్చర్యం లేదని చెబుతున్నారు.
- ఇతర అంతరిక్ష కేంద్రాలతో భాగస్వామ్యం దిశగా ఇస్రో ఇప్పటికే చర్చలు మొదలు పెట్టడం విశేషం

– సాక్షి, నేషనల్ డెస్క్

'సంచార్ సాథీ' తప్పనిసరి కాదు

విపక్షాల అభ్యంతరాలతో వెనక్కి తగ్గిన కేంద్రం

న్యూఢిల్లీ: సంచార్ సాథీ యాప్‌ను స్మార్ట్‌ఫోన్లలో ప్రి–ఇన్‌స్టలేషన్ చేయడం తప్పనిసరి కాదని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ యాప్‌ను కొత్త ఫోన్లలో కచ్చితంగా పొందుపర్చి, విక్రయించాలంటూ కంపెనీలకు జారీ చేసిన ఆదేశాలను ఉపసంహరించుకుంది. ఈ మేరకు కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. యాప్ గురించి ఎక్కువ మందికి అవగాహన కల్పించడంతోపాటు వారికి సులువుగా అందుబాటులోకి తీసుకురావాలన్న ఉద్దేశంతోనే తొలుత దీన్ని తప్పనిసరి చేశామని, అంతకుమించి మరో ఉద్దేశం లేదని స్పష్టంచేసింది. యాప్‌ను తప్పనిసరి చేస్తూ నవంబర్ 28న కేంద్రం ఉత్తర్వు జారీ చేసిన సంగతి తెలిసిందే. దీనిపై ప్రతిపక్షాలు భగ్గుమన్నాయి. ప్రజల ఫోన్లపై నిఘా పెట్టడానికి, వారి సంభాషణలను రహస్యంగా వినడానికి, మెసేజ్‌లు చదవడానికే సంచార్ సాథీని తీసుకొచ్చారని కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డాయి. యాపిల్, సామ్‌సంగ్ వంటి మొబైల్‌ఫోన్ల తయారీ సంస్థలు కూడా వ్యతిరేకత వ్యక్తంచేశాయి. దీంతో ప్రభుత్వం వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. సంచార్ సాథీని డౌన్‌లోడ్ చేసుకోవడం స్వచ్ఛందమేనని, బలవంతం ఏమీ లేదని తేల్చిచెప్పింది. సంచార్ యాప్‌తో స్నూపింగ్ ఎట్టిపరిస్థితుల్లోనూ సాధ్యం కాదని, ప్రజల ఫోన్లపై నిఘా పెట్టలేమని కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా స్పష్టంచేశారు.

పెగాసస్‌కు ఇది మరోపేరు: ఉద్ధవ్

వివాదాస్పద పెగాసస్ స్పైవేర్‌కు మరోపేరు సంచార్ సాథీ అని శివసేన(ఉద్ధవ్) అధినేత, మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే బుధవారం విమర్శించారు. ఓట్లు వేసి అధికారం కట్టబెట్టిన ప్రజలపైనే కేంద్ర ప్రభుత్వం నిఘా పెట్టిందని ఆరోపించారు. యాప్ ముసుగులో జనం రోజువారీ కార్యకలాపాల గురించి ఆరా తీయడం పక్కనపెట్టి.. పహల్గాం ఉగ్రవాద దాడి ఎలా జరిగిందో కనిపెట్టాలని, ఉగ్రవాదులు మన దేశంలోకి ఎలా ప్రవేశించారో గుర్తించాలని కేంద్ర ప్రభుత్వానికి ఉద్ధవ్ ఠాక్రే హితవు పలికారు. విశ్వసించిన ప్రజలపైనే ప్రభుత్వానికి విశ్వాసం లేకపోతే ఎలా? అని ప్రశ్నించారు.

స్నూపింగ్ కోసమే తీసుకొచ్చారు: కాంగ్రెస్

సంచార్ సాథీ యాప్ విషయంలో కేంద్ర ప్రభుత్వం అడ్డంగా దొరికిపోయిందని కాంగ్రెస్ నేత పవన్ ఖేరా విమర్శించారు. ప్రజలను మభ్యపెట్టడానికి మాయమాటలు చెబుతోందని బుధవారం ధ్వజమెత్తారు. ప్రజలపై నిఘా కోసమే ఈ యాప్‌ను తీసుకొచ్చారని ఆరోపించారు. పస లేని వివరణతో జనాన్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆక్షేపించారు. ఇష్టం లేకపోతే యాప్‌ను ఫోన్ నుంచి తొలగించవచ్చని జ్యోతిరాదిత్య సింధియా చెబుతున్న దాంట్లో వాస్తవం లేదన్నారు. ప్రి–ఇన్‌స్టలేషన్ యాప్‌ను తొలగించలేరంటూ ప్రభుత్వ ఉత్తర్వుల్లోనే ఉందని పవన్ ఖేరా పేర్కొన్నారు. సంచార్ సాథీ అనేది ప్రమాదకరమైన యాప్ అని చెప్పారు. జనానికి తెలియకుండానే వారి సమస్త సమాచారం లాగేయడం దీని ఉద్దేశమని వెల్లడించారు.

రిజర్వేషన్ కేంద్రాల్లో బుకింగ్‌లకూ ఇక ఓటీపీ

రైల్వే టికెట్ల కొనుగోళ్లలో దుర్వినియోగానికి చెక్

న్యూఢిల్లీ: చివరి నిమిషం ప్రయాణాలకు వరప్రదమైన తత్కాల్ టికెట్ల దుర్వినియోగానికి చెక్ పెట్టే దిశగా రైల్వే శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై రిజర్వేషన్ కేంద్రాల వద్ద తత్కాల్ టికెట్ల కొనుగోలు చేసేందుకు వన్ టైమ్ పాస్ వర్డ్ (ఓటీపీ) వినియోగాన్ని తప్పనిసరి చేసింది. ప్రయాణికులు రిజర్వేషన్ ఫారంలో నింపే తమ మొబైల్ ఫోన్‌కు వచ్చే ఓటీపీని వెల్లడించి టికెట్ కొనుగోలు చేయాల్సి ఉంటుంది. 'ఈ విధానాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఇప్పటికే నవంబర్ 17వ తేదీ నుంచి ప్రయోగాత్మకంగా అమలు చేసి చూస్తున్నాం. ప్రస్తుతం కొన్ని రైళ్లకు మాత్రమే ప్రయోగాత్మకంగా దీనిని పరీక్షిస్తున్నాం. త్వరలో చాలా స్టేషన్లకు విస్తరిస్తాం. అనంతరం దేశమంతటా ఇదే విధానం అమల్లోకి వస్తుంది' అని రైల్వే శాఖ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. ''ఓటీపీ అనుసంధాన తత్కాల్ టికెట్ కొనుగోలు ప్రక్రియను అమల్లోకి తెచ్చిన కారణంగా తత్కాల్ టికెట్ల అక్రమాలకు అడ్డుకట్ట పడుతుంది. తత్కాల్ టికెట్ల జారీలో పారదర్శకత మరింత పెరుగుతుంది'' అని రైల్వేశాఖ పేర్కొంది. ఆన్‌లైన్‌లో తత్కాల్ బుకింగ్‌లకు ఆధార్ వెరిఫికేషన్ తప్పనిసరి చేస్తూ గత జూలైలో నిబంధన తెచ్చింది. బుకింగ్స్ మొదలైన తొలి 15 నిమిషాల్లో కేవలం ఆధార్ ధ్రువీకృత యూజర్లు మాత్రమే ఐఆర్‌సీటీసీ సైట్, యాప్ ద్వారా టికెట్ కొనుగోలు చేసేలా నిబంధనలు మార్చిన విషయం విదితమే.

32 వేల మంది టీచర్ల కొలువులు భద్రం

కలకత్తా హైకోర్టు డివిజన్ బెంచ్ తీర్పు

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో 32 వేల మంది ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు భారీ ఊరట లభించింది. వారి నియామకాలను రద్దు చేస్తూ కలకత్తా హైకోర్టు సింగిల్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులను డివిజన్ బెంచ్ బుధవారం తోసిపుచ్చింది. టీచర్ల నియామక పరీక్షలో విజయం సాధించలేని కొందరు అభ్యర్థుల కారణంగా మొత్తం వ్యవస్థ ప్రభావితం కావడానికి వీల్లేదని స్పష్టంచేసింది. పరీక్షలో అక్రమాలు జరిగినట్లు ఇప్పటిదాకా నిరూపణ కాలేదని పేర్కొంది. తొమ్మిదేళ్లపాటు టీచర్లుగా కొనసాగిన వారిని ఉద్యోగం నుంచి తొలగిస్తే వారిపై, వారి కుటుంబాలపై తీవ్ర ప్రభావం పడుతుందని వెల్లడించింది. పరీక్షల్లో అక్రమాల కేసులో కొనసాగుతున్న విచారణను ఆధారంగా చేసుకొని వారి నియామ కాలను రద్దు చేయలేమని వివరించింది. సింగిల్ బెంచ్ ఉత్తర్వును సమర్థించేందుకు నిరాకరించింది. ఆ 32,000 మంది ప్రైమరీ టీచర్ల నియామకాలు చెల్లుబాటు అవుతాయని తేల్చిచెప్పింది. సింగిల్ బెంచ్ తీర్పు పట్ల బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ హర్షం వ్యక్తంచేశారు. వేలాది మంది టీచర్ల కుటుంబాలకు న్యాయస్థానం గొప్ప ఓదార్పును ఇచ్చిందని పేర్కొన్నారు. యువత కోసం కొత్త ఉద్యోగాలు సృష్టిస్తాం తప్ప వారి ఉద్యోగాలను తొలగించాలన్న ఆలోచన ప్రభుత్వానికి లేదని స్పష్టంచేశారు. న్యాయమూర్తులు మానవతా దృక్పథంతో ఆలోచించి, తీర్పు ఇచ్చారని తెలిపారు.

డాలర్‌కు 12 లక్షల రియాల్స్

దారుణంగా పడిపోయిన ఇరాన్ కరెన్సీ

టెహ్రాన్: ఇరాన్ కరెన్సీ రియాల్ విలువ దారుణంగా పతనమైంది. ఒక్క అమెరికన్ డాలర్‌తో మారకం విలువ ఏకంగా 12 లక్షల రియాల్స్‌కు పడిపోయింది. ఇరాన్ అణు కార్యక్రమంపై అమెరికా, పశ్చిమ దేశాల ఆంక్షల ప్రభావం ఆర్థిక వ్యవస్థపై తీవ్రంగా పడిందనటానికి ఇదే నిదర్శనం. దేశంలో ఆహార పదార్థాల ధరలు ఆకాశాన్నంటాయి. మాంసం, బియ్యం, ఇతర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. సామాన్యుల రోజువారీ జీవనం సైతం గగనంగా మారింది. ఇరాన్ అణు కార్యక్రమం లక్ష్యంగా జూన్‌లో ఇజ్రాయెల్ దాడులకు దిగడం, ఇరాన్ ప్రతిదాడుల అనంతరం అమెరికా రంగంలోకి దిగడం తెల్సిందే. మళ్లీ ఇజ్రాయెల్‌తో యుద్ధం రావచ్చన్న భయాందోళనలు ఇరాన్ వాసులను వెంటాడుతున్నాయి.

ఉమ్మడి వ్యూహంపై విపక్షాల చర్చ

న్యూఢిల్లీ: ప్రతిపక్ష నేతలు బుధవారం పార్లమెంట్‌లో ప్రాంగణంలోని మల్లికార్జున ఖర్గే చాంబర్‌లో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. శీతాకాల సమావేశాల్లో అనుసరించాల్సిన ఉమ్మడి వ్యూహంపై చర్చించారు. కాంగ్రెస్, డీఎంకే, ఆర్జేడీ, సమాజ్‌వాదీ పార్టీ, జేఎంఎం, సీపీఎం, సీపీఐ, ఐయూఎంఎల్, ఎన్సీపీ(ఎస్పీ), శివసేన(ఉద్ధవ్) తదితర పార్టీల నేతలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై పార్లమెంట్‌లో చర్చించేలా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని నిర్ణయించారు. ఈ విషయంలో విపక్షాలన్నీ ఐక్యంగా ముందుకెళ్లాలని తీర్మానించారు. పార్లమెంట్ సమావేశాలు సజావుగా జరిగేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ప్రతిపక్ష నేతలు స్పష్టంచేశారు. పార్లమెంట్‌లో నిర్మాణాత్మక చర్చలు జరగాలని తాము కోరుకుంటున్నట్లు చెప్పారు. అయితే, విపక్షాల భేటీకి తృణమూల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజరు కాకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఈ నెల 1వ తేదీన సమావేశానికి కూడా వారు హాజరు కాలేదు.

లేబర్ కోడ్స్‌పై ప్రతిపక్షాల నిరసన

కేంద్రం తీసుకొచ్చిన నూతన లేబర్ కోడ్స్‌పై ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తంచేశాయి. వీటిని వెంటనే రద్దు చేయాలని తేల్చిచెప్పాయి. లేబర్ కోడ్స్ పట్ల విపక్షాలు బుధవారం పార్లమెంట్ మకర ద్వారం వద్ద నిరసన వ్యక్తంచేశాయి. కాంగ్రెస్ ముఖ్యనేతలు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ వాద్రా తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్లకార్డులు ప్రదర్శించారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం కార్మికులకు కక్షగట్టిందని, కేవలం ఆశ్రిత పెట్టుబడిదారులకు అనుకూలంగా వ్యవహరిస్తోందని ఖర్గే మండిపడ్డారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. కొత్త లేబర్ కోడ్స్‌తో కార్మికులకు, ఉద్యోగులకు నష్టం వాటిల్లుందని పేర్కొన్నారు. లేబర్స్ కోడ్స్‌ను ప్రియాంకా గాంధీ సైతం తప్పుపట్టారు.

పార్లమెంట్ వెలుపల నిరసన తెలుపుతున్న టీఎంసీ ఎంపీలు

భౌ భౌ...!

'హక్కుల తీర్మానం'పై రేణుక స్పందన

న్యూఢిల్లీ: పార్లమెంటు ఆవరణలోకి కారులో కుక్కను తీసుకొచ్చి కలకలం రేపిన కాంగ్రెస్ ఎంపీ రేణుకా చౌదరి బుధవారం మీడియాకు మరింత పని పెట్టారు. తనపై సభలో హక్కుల తీర్మానం పెట్టాలని పాలక బీజేపీ ఎంపీలు యోచిస్తున్నారన్న వార్తలపై మీడియా ఆమెను ప్రశ్నించగా 'భౌ భౌ...!'అంటూ విచిత్రంగా స్పందించారు. ''ఇంతకంటే ఇంకేం చెప్పమంటారు నన్ను?'' అంటూ మీడియాకే ఎదురు ప్రశ్న కూడా వేశారు. ''తీర్మానం పెట్టినప్పుడు చూసుకుందాం. అదేమన్నా పెద్ద సమస్యా? అదే జరిగితే సరైన సమాధానం సభలోనే ఇస్తా'' అని చెప్పుకొచ్చారు. అనంతరం తన సామాజిక మాధ్యమ 'ఎక్స్'ఖాతాలో కూడా ఈ ఉదంతంపై మార్మిక వ్యాఖ్యలు చేశారు. రేణుక 'భౌ భౌ' ఉదంతంపై సోషల్ మీడియాలో మీమ్స్, జోకులు పేలుతున్నాయి. ఒకరు పాపులర్ సాంగ్ 'హూ లెట్ ద డాగ్స్ ఔట్' ను ఎంపీ కామెంట్స్ తో రీమిక్స్ చేసి అలరించగా మరొకరు 'ప్రాణికోటికి మన ఎంపీలు భలే సేవ చేస్తున్నారు' అని రాసుకొచ్చారు.

రాజకీయ రచ్చ

సోమవారం పార్లమెంటు శీతాకాల సమావేశాల తొలి రోజు సందర్భంగా రేణుక ఒక కుక్కను భవన ప్రాంగణంలోకి తేవడం కలకలం రేపింది. అయితే, 'దారిలో తారసపడ్డ ఒక వీధి కుక్కను తాను కాపాడి కార్లో తీసుకొచ్చా. దాన్ని వెటర్నరీ డాక్టర్ వద్దకు తీసుకెళ్లానని అనంతరం ఆమె చెప్పారు. పైగా, 'కరిచేది (సభ) లోపల కూచున్నవాళ్లే. బయటుండే ఇలాంటి శునకాలు కాదు' అంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అంతేగాక ఈ శునకోదంతం రాజకీయ రచ్చకు కూడా దారి తీసింది. కుక్కలను పార్లమెంటు ఆవరణలోకి అనుమతించడం లేదు గానీ లోనికి (సభ వైపు చూపుతూ) మాత్రం రానిస్తున్నారని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. ఈ ఉదంతంపై పలువురు బీజేపీ ఎంపీలు తీవ్రంగా మండిపడ్డారు.

సాక్షి
గుంటూరు
గురువారం । 4 । డిసెంబర్ । 2025

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 579.50 అడుగులకు చేరింది. శ్రీశైలం నుంచి 15,445 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

పులిచింతల సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 3881 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా, దిగువకు 400 క్యూసెక్కులు వదులుతున్నారు. నిల్వ 42.1600 టీఎంసీలు.

రేపు డిప్యూటీ సీఎం రాక

చేబ్రోలు: నారాకోడూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగే మెగా పేరెంట్స్ డేకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ రానున్నట్టు సబ్ కలెక్టర్ సంజనా సింహ తెలిపారు.

నిధులకు అడ్డగోలు కత్తెర

చైర్‌పర్సన్ వైఖరితో ఉమ్మడి గుంటూరు జిల్లాలో కుంటుపడుతున్న అభివృద్ధి

- జెడ్పీ నిధుల కేటాయింపుల్లో జెడ్పీటీసీలకు అన్యాయం
- ఏకపక్షంగా పనుల ఆమోదంతో సమావేశాలను అడ్డుకుంటున్న వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీలు
- బడ్జెట్ కేటాయింపులను మించి పనుల కేటాయింపునకు జెడ్పీ అధికారుల చెక్
- జెడ్పీటీసీలు స్థాయీ సంఘ సమావేశాల బహిష్కరణతో ఆగిన కేటాయింపులు
- ఎమ్మెల్యేలు, ఎంపీల సిఫార్సులతో రూ.30 కోట్ల పనులకు చైర్‌పర్సన్ ఓకే
- ఆర్థిక సంవత్సర బడ్జెట్ ప్రణాళికలో చేర్చిన పనులకే నిధులు కరువు
- స్టాంప్ డ్యూటీ బకాయిలు విడుదల చేయని చంద్రబాబు ప్రభుత్వం
- ఆర్థిక సంక్షోభంలో జెడ్పీ

ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజా పరిషత్ ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతోంది. ఆదాయ మార్గాలను పెంచుకోవడంలో విఫలం కావడంతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి గ్రాంట్లు తెచ్చుకోవడంలో నిర్లక్ష్యం కారణంగా ఉమ్మడి గుంటూరు జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పడకేస్తోంది. ప్రజల ఓట్లతో గెలిచి, పాలకవర్గంలో భాగస్వాములుగా ఉన్న జెడ్పీటీసీ సభ్యులను పక్కనపెట్టి జెడ్పీని వాడుకుంటున్న పాలకుల తీరుతో జిల్లా ప్రజా పరిషత్ పేరు, ప్రఖ్యాతులు మసకబారుతున్నాయి.

స్థాయీ సంఘ సమావేశాలను బహిష్కరించిన వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ సభ్యులు (ఫైల్)

గుంటూరు ఎడ్యుకేషన్: జెడ్పీ చైర్‌పర్సన్, టీడీపీ ప్రజాప్రతినిధుల తీరుతో జెడ్పీటీసీలు ఏళ్ల తరబడి పనులు చేయలేకపోవడం వల్ల ప్రజల్లో చెడ్డపేరు వస్తోంది. మరో వైపు టీడీపీ ఎమ్మెల్యేలు, ఎంపీల సిఫార్సులకు పెద్దపీట వేసి జెడ్పీతోపాటు కేంద్ర నిధుల్లోనూ వారికే ప్రాధాన్యత ఇవ్వడంతో జెడ్పీటీసీలు ప్రేక్షకపాత్రకు పరిమితం అవుతున్నారు. మూడు నెలలకోసారి కొలువుదీరే స్టాండింగ్, జనరల్ బాడీ సమావేశాలకు హాజరై అజెండాల ఆమోదానికి పరిమితమవుతున్నారు. టీడీపీ ప్రజాప్రతినిధుల సిఫార్సులకే ప్రాధాన్యత ఇస్తూ చైర్‌పర్సన్ సాగిస్తున్న ఏకపక్ష విధానాలకు నిరసనగా వైఎస్సార్ సీపీ జెడ్పీటీసీ సభ్యులు సమావేశాలను అడ్డుకుంటున్నారు. గతంలో సర్వసభ్య సమావేశాన్ని మూకుమ్మడిగా బహిష్కరించిన జెడ్పీటీసీలు గత నెల 26న ఏర్పాటు చేసిన స్థాయీ సంఘ సమావేశాలను బహిష్కరించారు. కీలకమైన ప్రణాళిక, ఆర్థిక అంశాలతో కూడిన సమావేశాల అజెండాలను తిరస్కరించడం ద్వారా జెడ్పీలో ఏకపక్ష వైఖరిపై యుద్ధం ప్రకటించారు.

ప్రచ్ఛన్న యుద్ధం

జెడ్పీలో చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినాకు, వైఎస్సార్ సీపీ జెడ్పీటీసీలకు మధ్య ప్రచ్ఛన్న యుద్ధం నడుస్తోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జెడ్పీటీసీగా గెలిచాక చైర్‌పర్సన్ పీఠాన్ని అధిష్టించి, రాజకీయ ప్రయోజనాల కోసం పార్టీ మారిన హెనీ క్రిస్టినా వైఖరితో జెడ్పీటీసీలు తీవ్రంగా విభేదిస్తున్నారు. రాజకీయ కక్ష సాధింపులో భాగంగా తమ మండలాల్లో పనులు కేటాయించకుండా వ్యవహరిస్తున్న తీరును సహించలేక పోరుకు సిద్ధమయ్యారు.

ఎవరితోనూ పనిలేకుండానే...

జెడ్పీ వార్షిక బడ్జెట్‌లో ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకుని అభివృద్ధి పనులకు 2025–26 బడ్జెట్‌లోనే కేటాయింపులు పూర్తయ్యాయి. జెడ్పీకి వివిధ మార్గాల్లో వచ్చే ఆదాయంతోపాటు 15వ ఆర్థిక సంఘం నుంచి రావాల్సిన బకాయిలు, ప్రస్తుత ఆర్థిక సంవత్సర నిధులకు సైతం పనులు కేటాయించేశారు. పరిస్థితి ఈ విధంగా ఉండగా టీడీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు తమ నియోజకవర్గాల్లో వివిధ అభివృద్ధి పనులకు జెడ్పీ చైర్‌పర్సన్‌కు సిఫార్సులు పంపడం, వాటిని చైర్‌పర్సన్ వెంటనే ఆమోదించేయడం పరిపాటిగా మారింది. జెడ్పీటీసీలతో చర్చించకుండా నేరుగా స్టాండింగ్ కమిటీ, అక్కడి నుంచి జనరల్ బాడీ సమావేశాల అజెండాల్లో పొందుపర్చి ఆమోదింపచేసుకుంటున్నారు. స్టాండింగ్ కమిటీ సమావేశాల్లో ప్రవేశపెట్టిన అజెండాపై సభ్యులతో చర్చించి, వారి నుంచి అభిప్రాయాలు తీసుకోవడానికి భిన్నంగా కోరం అయిందా, లేదా అని చూసి ఆమోదించేస్తున్నారు.

టీడీపీ ఎమ్మెల్యేల సిఫార్సులతో..

జెడ్పీటీసీలకు తెలియకుండా టీడీపీ ఎమ్మెల్యేల సిఫార్సులతో చైర్‌పర్సన్ పెద్ద సంఖ్యలో కేటాయింపులు జరిపేశారు. వీటిలో కొన్నింటిని పరిశీలిస్తే... వేమూరు ఎమ్మెల్యే ప్రతిపాదనలతో రూ.29.30 లక్షలు, నరసరావుపేట ఎమ్మెల్యే సిఫార్సులతో రూ.20 లక్షలు, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ప్రతిపాదనలతో రూ.30 లక్షలు, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రతిపాదనలతో అత్యధికంగా రూ.కోటి పనులకు ముందస్తు అనుమతులు ఇచ్చేశారు. ఈ విధంగా రూ.30 కోట్ల మేరకు ముందస్తు అనుమతులతో పనులు కేటాయించడంతో భగ్గుమన్న జెడ్పీటీసీలు వాటిని అడ్డుకున్నారు.

నిలిచిన అడ్డగోలు కేటాయింపులు

గత నెల 26న ఏర్పాటు చేసిన స్టాండింగ్ కమిటీ సమావేశాల్లో వైఎస్సార్ సీపీకి చెందిన జెడ్పీటీసీలు అజెండాలను తిరస్కరించి, సమావేశాలను బహిష్కరించడంతో అడ్డగోలుగా జరిపిన కేటాయింపులకు బ్రేక్ పడింది. దీంతో మూడు నెలలకోసారి జరగాల్సిన సమావేశాల నిర్వహణ జఠిలంగా మారుతోంది. ఎమ్మెల్యేలు, ఎంపీల సిఫార్సులతో రూ.30 కోట్ల మేరకు ముందస్తు అనుమతులు ఇచ్చేసిన చైర్‌పర్సన్ ఏకపక్ష చర్యలను మూకుమ్మడిగా అడ్డుకోవడంలో సఫలీకృతులయ్యారు. ఆర్థిక సంవత్సర బడ్జెట్ ప్రణాళికలో చేర్చిన పనులకే నిధులు కోసం తడుముకోవాల్సిన పరిస్థితుల్లో స్టాంప్ డ్యూటీ బకాయిలు తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. 15వ ఆర్థిక సంఘం నుంచి రావల్సిన నిధులు రూ.23 కోట్లకు కేవలం రూ.తొమ్మిది కోట్లే వచ్చాయి. దీంతోపాటు స్టాంప్ డ్యూటీ కింద రూ.35 కోట్లు అలాగే నిలిచిపోయాయి. టీడీపీ అధికారంలోకి వచ్చాక 18 నెలల కాలంలో కేవలం రూ.40 లక్షలు విదిల్చారు.

సచివాలయంలో పింఛను నగదు మాయం

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి సీతానగరానికి సంబంధించిన 14వ నెంబర్ సచివాలయంలో పింఛను పంపిణీ చేసేందుకు తీసుకువచ్చిన నగదులో కొంత మాయమైన సంఘటన ఆలస్యంగా బుధవారం వెలుగులోకి వచ్చింది. సేకరించిన వివరాల ప్రకారం... సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ ఆదివారం సెలవు కావడంతో శనివారం బ్యాంకు నుంచి సీతానగరంలోని పలు ప్రాంతాల్లో పింఛన్లు పంచేందుకు రూ.20 లక్షలు విత్‌డ్రా చేసి తీసుకువచ్చారు. అదేరోజు నగదును టేబుల్‌పై పేర్చి అక్కడ సిబ్బందికి ప్రాంతాల వారీగా నగదు పంచుతున్న సమయంలో రూ.40 వేలు మాయమైంది. వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ సంఘటనపై తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పింఛను ఆపకుండా వెల్ఫేర్ అసిస్టెంట్ నగదు ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. ఎంటీఎంసీ అధికారులు మాత్రం నగదు ఎవరి దగ్గర పోయాయో వారే చెల్లించాలని చెప్పినట్లు విశ్వసనీయ సమాచారం.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో స్క్రబ్ టైఫస్‌కు చికిత్స

గుంటూరు మెడికల్: జిల్లాలో స్క్రబ్ టైఫస్ కేసులు నమోదు అవుతున్న దృష్ట్యా ప్రజలు ఆందోళన చెందకుండా అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి బుధవారం మీడియాకు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ఈ వ్యాధికి చికిత్స చేసేందుకు అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు. శరీరంపై నల్ల మచ్చలతో కూడిన దద్దు, జ్వరం, తలనొప్పి, వణుకు, కండరాల నొప్పులు లాంటి లక్షణాలు వ్యాధి సోకిన వారిలో కనిపిస్తాయన్నారు. సకాలంలో వ్యాధిని గుర్తించకపోతే శ్వాస సంబంధిత వ్యాధులకు దారితీస్తుందని వెల్లడించారు. పైన పేర్కొన్న వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే, దగ్గరలోని ఆరోగ్య సిబ్బందిని గాని , ఆరోగ్య కేంద్రాన్ని గాని సందర్శించి చికిత్స తీసుకోవాలని చెప్పారు. ఆరోగ్య కేంద్రాలలో వ్యాధికి సంబంధించిన చికిత్స అందుబాటులో ఉందన్నారు. వ్యాధి నిర్ధారణ రక్త పరీక్ష గుంటూరు జీజీహెచ్‌లో మాత్రమే అందుబాటులో ఉందని(ఐజీఎమ్ ఎలీసా), ఆందోళన అవసరం లేదన్నారు.

న్యూస్‌రీల్

గణపవరం పీహెచ్‌సీలో ఆరోగ్యశాఖ కమిషనర్

నాదెండ్ల: గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండ్యన్ సందర్శించారు. సాయంత్రం 5.30 గంటల సమయంలో ఆయన రాగా, అప్పటికే సిబ్బంది వెళ్లిపోయి పీహెచ్‌సీకి తాళాలు వేసి ఉన్నాయి. పరిసరాలు పరిశీలించి ఫొటోలు, వీడియోలు తీసుకున్నారు. విషయం తెలుసుకున్న 'సాక్షి' కమిషనర్‌తో మాట్లాడగా, సాధారణ పర్యటనలో భాగంగా గణపవరం పీహెచ్‌సీకి వచ్చినట్లు తెలిపారు.

భక్తి శ్రద్ధలతో హనుమత్ వ్రత పూజలు

అమరావతి: శ్రీమత్ హనుమత్ వ్రతాన్ని పురస్కరించుకుని బుధవారం ప్రసిద్ధ శైవక్షేత్రమైన అమరావతి అమరేశ్వరాలయంలోని ప్రసన్నాంజనేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు, తమలపాకులతో పూజలు, హనుమాన్ చాలీసా పారాయణం చేసి వడ మాలలు సమర్పించారు. తొలుత ఆలయ అర్చకుడు పరుచూరి కేశవాచార్యులు స్వామి వారికి పంచామృత స్నపన, సహస్ర నామాలతో తమలపాకుల పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

అనధికారిక లే అవుట్లు ధ్వంసం

తాడికొండ: సీఆర్డీఏ అధికారులు మంగళవారం ఎన్టీఆర్ జిల్లాలోని అక్రమ లే అవుట్లను ధ్వంసం చేశారు. విజయవాడ రూరల్ మండలం పాతపాడులోని సర్వే నెంబర్ 114లో 5.50 ఎకరాల భూమిలో అనధికారిక లే అవుట్, సర్వే నెంబర్ 145లోని 1.20 ఎకరాల భూమిలో అనధికారిక లే అవుట్‌లను ధ్వంసం చేశారు. సీఆర్డీఏ పరిధిలో అనధికారిక లే అవుట్‌లను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించబోమన్నారు.

బెటాలియన్ అభివృద్ధిలో సిబ్బంది పాత్ర ప్రధానం

మంగళగిరి టౌన్ : బెటాలియన్ అభివృద్ధిలో సిబ్బంది పాత్ర ప్రధానంగా ఉందని, గతంలో కంటే బెటాలియన్ అభివృద్ధి చెందిందని 6వ బెటాలియన్ ఏపీఎస్‌పీ కమాండెంట్ కె.నగేష్ బాబు పేర్కొన్నారు. మంగళగిరి నగర పరిధిలోని శ్రీరామ్‌నగర్ కాలనీలోని ఆధునీకీకరించి ఏపీఎస్‌పీ పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. అసోసియేషన్ నాయకులు కమాండెంట్ నగేష్‌బాబు, అసిస్టెంట్ కమాండెంట్ ఆశీర్వాదంలను శాలువ, పూలమాలలతో సత్కరించారు.

ఎన్విరాన్మెంట్ సెక్రటరీలకు పదోన్నతి కల్పించాలి

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): ఆంధ్రప్రదేశ్ వార్డు శానిటేషన్, ఎన్విరాన్మెంట్ సెక్రటరీలకు వారి లైన్ డిపార్ట్‌మెంట్లల్లో, విద్య అర్హతల ఆధారంగా ఇతర ప్రభుత్వ శాఖల్లో ప్రమోషన్ కల్పించాలని కోరుతూ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చింతల రాజ్‌కుమార్ కోరారు. ఈ మేరకు బుధవారం మంగళగిరిలో రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ నిబంధనలకు అనుగుణంగా ఉద్యోగులు అందరికి న్యాయం జరిగే విధంగా చూడాలని కోరారు.

తగ్గిన ఏసీబీ దూకుడు

- ఏళ్లు గడిచినా డీఎస్పీల నియామకాలు లేవు
- టోల్‌ఫ్రీ నంబర్‌కు కొరవడిన ప్రచారం
- చంద్రబాబు సర్కారు వచ్చాక అవినీతిపై ఉదాసీనత

నగరపాలెం (గుంటూరు వెస్ట్): ఉమ్మడి గుంటూరు జిల్లాలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) దూకుడు తగ్గింది. అవినీతి అధికారులకు ముచ్చెమటలు పట్టించాల్సిన విభాగం ఇప్పుడు మౌనంగా వ్యవహరిస్తోంది. డీఎస్పీలను నియమించకపోవడం, ఐదేళ్లు, రెండేళ్లకు పైగా కొందరు సీఐలు తిష్టవేసి ఉండటం.. కిందిస్థాయి సిబ్బంది ఎనిమిదేళ్లుగా పాతుకుపోవడంతో నిస్తేజంగా మారింది. ఈ రెండేళ్లల్లో ఏసీబీ అధికారులకు చిక్కిన అవినీతి అధికారులు తక్కువే. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పోలీస్ శాఖకు అనుబంధమైన విభాగాల్లో సమూల మార్పులు చేపట్టారు. గుంటూరు ఏసీబీలో మాత్రం ఎక్కడి వారు అక్కడే గప్‌చుప్ అన్నట్టుగా వ్యవహారం ఉంది.

జూలైలోనే ముగ్గురు..

జిల్లాల పునర్విభజన జరిగిన తర్వాత కూడా ఏసీబీ అధికారులు ఉమ్మడి గుంటూరు జిల్లా కేంద్రంగా విధులు నిర్వహిస్తున్నారు. గత ప్రభుత్వంలో జిల్లాల విభజన జరిగాక ఏసీబీ చాలా దూకుడుగా వ్యవహరించింది. ఎక్కడా అవినీతికి తావులేకుండా పారదర్శక వ్యవస్థ రూపొందించాలనే ఏకైక లక్ష్యంతో అడుగులేసింది. ఫిర్యాదుల స్వీకరణకు టోల్‌ఫ్రీ నంబర్ 14400 అందుబాటులోకి తీసుకొచ్చారు. 2023 జూలైలో ఇరవై రోజుల్లో ముగ్గురు అధికారులపై ఏసీబీ దాడులు చేయడమే ఇందుకు నిదర్శనంగా చెప్పొచ్చు. రూ.60 వేలు, రూ.40 వేలు లంచాలు తీసుకుంటూ దొరికిన అధికారులు ఉన్నారు.

అధికారులు ఎక్కడ?

ఇక ఏసీబీని అధికారులు, సిబ్బంది కొరత పట్టిపీడిస్తోంది. 2024 ఎన్నికలకు రెండు నెలలు ముందు డీఎస్పీని బదిలీ చేశారు. ఇప్పటి వరకు ఆయన స్థానంలో వేరే వారిని నియమించలేదు. ఇక్కడ ఇద్దరు డీఎస్పీలు ఉండాల్సినా ప్రస్తుతం ఒక్కరినీ నియమించలేదు. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఓ సీఐని బదిలీ చేశారు. దీంతో వారి మార్క్ రాజకీయాన్ని ప్రదర్శించారు. తర్వాత మరో సీఐపై బదిలీ వేటు వేశారు. ప్రస్తుతం నలుగురు సీఐలు ఉన్నారు. వారిలో నాలుగేళ్లుగా కొనసాగే వారు లేకపోలేదు. ఏఎస్ఐలు మొదలు కానిస్టేబుళ్ల వరకు ఏళ్ల తరబడిగా తిష్ట వేశారు. ప్రస్తుతం విధుల్లో ఉన్న అధికార/సిబ్బంది సరిపోతారని, అదనపు నియమకాలు అవసరంలేదని కార్యాలయపు వర్గాలు పేర్కొనడం విస్మయానికి గురిచేస్తోంది. నియమాకాలపై ఉన్నత స్థాయిలో ప్రతిపాదనలు పంపించినా స్పందన లేదు.

గుంటూరులోని ఏసీబీ కార్యాలయం

పెరిగిన పని భారం

ఏసీబీలో పనుల భారం ఎక్కువైంది. చంద్రబాబు ప్రభుత్వం వచ్చిన దగ్గర్నుంచి కార్యాలయపు ఉన్నతాధికారులు ప్రధాన కార్యాలయం (హెడ్ ఆఫీస్) వైపు చక్కర్లు కొడుతున్నారు. ఎవరైనా ఫోన్ కాల్ చేస్తే హెడ్ ఆఫీస్‌లో ఉన్నామని చెబుతున్నారు. సిట్, ఇతరత్రా వాటిల్లో విచారణకు సంబంధించి క్షణం తీరికలేకుండా ఉంటున్నామని వాపోతున్నారు.

మారిన టోల్‌ఫ్రీ నంబర్..

చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏసీబీ చతికిల పడింది. గత ప్రభుత్వంలో ఉన్న దూకుడుతనం ప్రస్తుతం కానరావడం లేదు. పెద్ద మొత్తంలో లంచాలు అడిగారని బాధితులు ఇచ్చిన ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించాలనే నిబంధన అమల్లోకి వచ్చినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ ఏడాది అక్టోబర్ చివర్లో రేపల్లె డివిజన్ ఫారెస్ట్ రేంజ్ అధికారి వెంకటరమణ రూ.1.25 లక్షలు తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. అయితే లంచాల్లోనూ చిన్న, పెద్ద తేడాలు సృష్టిస్తే కింది స్థాయిలో న్యాయం జరుగుతుందా అనే అనుమానం బాధితుల నుంచి వ్యక్తమవుతుంది. గతంలో ఉన్న టోల్‌ఫ్రీ నంబర్ 14400ను తొలగించారు. అవినీతిని నిర్మూలిద్దాం, రాష్ట్ర అభివృద్ధికి కృషి చేద్దామంటూ 1064 నంబర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ నంబర్‌పై ఉమ్మడి జిల్లాలోని ప్రజల్లో అవగాహన కొరవడింది. బాధితులు సైతం ఏ నంబర్‌కు ఫోన్ చేయాలనేది అర్థంకాని పరిస్థితిలో ఉన్నారు. ఏసీబీ సైతం లంచంపై పెద్దగా అవగాహన సదస్సులు నిర్వహించడం లేదు.

ఆదాయం తప్ప వసతులు పట్టవా?

- అరకొర వసతులతో గుంటూరు రిజిస్ట్రేషన్ కార్యాలయం
- 153 సంవత్సరాల నుంచి ఒకే కార్యాలయంలో మనుగడ
- రికార్డులపై పట్టలు కప్పి కాపాడుతున్న సిబ్బంది

నిత్యం అరచేతిలో వైకుంఠం చూపించే పాలకులు ప్రజాసమస్యలను ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. దీనికి ప్రత్యక్ష ఉదాహరణ గుంటూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంతోపాటు జిల్లాలో మరి కొన్నింటిలో సమస్యలు. రాష్ట్ర ఖజానాకు కాసుల వర్షం కురిపించే కార్యాలయం ఇది. సుదీర్ఘ చరిత్ర దీని సొంతం. కనీసం పట్టించుకునే వారు లేక దీనస్థితిలో కొట్టుమిట్టాడుతోంది.

గుంటూరు వెస్ట్ : నగరం నడిబొడ్డున, కలెక్టరేట్ ఆవరణలోని గుంటూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిస్థితి ప్రజలను అసహనానికి గురిచేస్తోంది. దీనిని అప్పటి బ్రిటీషు ప్రభుత్వ హయాంలో జూలై 1, 1872లో ప్రారంభించారు. ఇప్పటికే 153 సంవత్సరాలు గడిచింది. ఏటా సుమారు 50 వేల వరకు దస్తావేజులు ఇక్కడ రిజిస్టర్ అవుతాయి. రూ.100 కోట్లకు పైగా ఆదాయం వస్తుంది. కానీ మరమ్మతులకు కూడా దిక్కులేక శిథిలావస్థకు చేరుకుంది. 2008లో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి నూతన భవన నిర్మాణానికి రూ.60 లక్షలు కేటాయించారు. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు నిధులను విడుదల చేయలేదు. ఏ ప్రభుత్వం ఉన్నా క్రమం తప్పకుండా రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచుకుంటూ పోతున్నారు. మౌలిక సదుపాయాల సంగతి మాత్రం పట్టించుకోవడంలేదని ప్రజలు, సామాజిక కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గుంటూరు రిజిస్ట్రేషన్ కార్యాలయం

కనీస వసతులు కరవు

పురాతన భవనం కావడంతో పైకప్పు గత 20 ఏళ్ల నుంచి లీక్ అవుతోంది. దీంతో ఇక్కడ పనిచేసే సిబ్బందితోపాటు దాతల సహకారంతో పైన పట్టలు కప్పించారు. విద్యుత్ తీగలు కూడా బ్రిటీషు కాలం నాటివే. ఇక రికార్డులు భద్రపరిచే ఇనుప రాక్స్ కూడా తుప్పు పడుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా మళ్లీ లీకులు ఏర్పడ్డాయి. దీనిని ప్లాస్టిక్ కవర్లతో కప్పి ఉంచారు. పైకప్పు రాళ్ళకు చెమ్మ పడుతోంది. ఎప్పుడు ఏమవుతుందో తెలీక ప్రజలతోపాటు సిబ్బంది కూడా బిక్కు బిక్కు మంటూ కాలం గడుపుతున్నారు. ఇటీవల కాలంలో అక్కడక్కడా పెచ్చులు కూడా ఊడిపడుతున్నాయి. రిజిస్ట్రేషన్ కార్యాలయానికి ఎదురుగా 2012లో రెవెన్యూ భవన్ నిర్మించారు. వాస్తవానికి ఇది రిజిస్ట్రేషన్ కోసం వచ్చే వారి పార్కింగ్‌కు ఉపయోగించేవారు. రెవెన్యూ భవన్ నిర్మాణంతో ఇక్కడ ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. దీనికి ప్రత్యామ్నాయం చూపలేదు. ఇటీవల రిజిస్ట్రేషన్ కాంపౌండ్ ఆవరణలో కొత్త షెడ్డును సిబ్బంది సొంత ఖర్చుతో నిర్మించారు. అంతే కాకుండా మరుగుదొడ్లు కూడా దాతల సహకారంతోనే ఏర్పాటు చేశారు.

వర్షానికి తడవకుండా కప్పిన పట్టలు

ప్రజల ఇబ్బందులు గుర్తించాలి

స్థానిక ప్రజాప్రతినిధుల నుంచి ఉన్నతాధికారుల వరకు ఫిర్యాదులు చేసినా ఫలితం లేదు. ఆదాయంపై పెట్టిన శ్రద్ధ ప్రజలకు వసతులు కల్పించడంపై పెట్టడం లేదు. ఆదాయంలో ఏడాదికి కేవలం 10 శాతం వెచ్చించినా ఎంతో మెరుగయ్యేది. 150 ఏళ్లుగా ఇక్కడ ఉండటం అంటే ఎంత వెనుబడి ఉన్నామో అర్థమవుతోంది. జిల్లాల పునర్ విభజన తర్వాత చాలా ప్రభుత్వ కార్యాలయాలు ఖాళీగా ఉన్నాయి. ఇప్పటికైనా స్పదించాలి.

– చిరతన గంగ్ల వాసు, బీఎస్పీ నాయకుడు, గుంటూరు

ఎమ్మెల్సీ పేరుతో 'మట్టి' దందా

- రాజధాని గ్రామాల్లో జేబులు నింపుకొంటున్న తమ్ముళ్లు
- నామమాత్రంగా అప్పుడప్పుడు వాహనాలు సీజ్

తాడేపల్లి రూరల్: రాజధాని ప్రాంతంలో రాత్రి సమయాల్లో కొంతమంది టీడీపీ నాయకుల పేరు చెబుతూ అక్రమంగా మట్టి తవ్వకాలు నిర్వహిస్తూ జేబులు నింపుకొంటున్నారు. మట్టి మాఫియాపై సామాజిక మాధ్యమాల్లో, పత్రికల్లో వార్తలు వచ్చినప్పుడల్లా సీఆర్‌డీఏ అధికారులు, పోలీసులు నామమాత్రంగా చర్యలు చేపట్టి చేతులు దులుపుకొంటున్నారు. అక్రమ రవాణా చేస్తున్న 8 మట్టి లారీలను తుళ్లూరు, తాడేపల్లి, మంగళగిరి పోలీసులు బుధవారం సీజ్ చేశారు. ఆ వెంటనే ఓ వైట్ కాలర్ మట్టి మాఫియా వ్యక్తి పోలీస్‌స్టేషన్‌కు కారులో వచ్చాడు. ఆ కారును పోలీస్‌స్టేషన్‌కు అడ్డంగా పెట్టి 'నేను ఎమ్మెల్సీ ఆలపాటి రాజా తాలూకా, మా బళ్లు ఎందుకు సీజ్ చేశారంటూ' హడావుడి చేశాడు. పోలీసులు మాత్రం సీజ్ చేసిన ఆ బళ్లు వదిలేది లేదని తేల్చి చెప్పారు. సదరు వ్యక్తి రాజధాని గ్రామాల్లో దౌర్జన్యం చేసే కొంతమందిని తన పక్కన పెట్టుకుని కారులోనే కూర్చుని ఒక్కో లారీ నుంచి రూ.వెయ్యి, రూ.2 వేల వరకు సీనరేజ్ కింద వసూలు చేస్తున్నాడు. ఎక్కడ మట్టి కావాలో లారీ యజమానులకు చెప్పి వారి నుంచి డబ్బులతోపాటు మట్టి తోలకాలు ఇచ్చినందుకు డబ్బులు తీసుకోవడం విశేషం.

నాడు అనుమతులు ఉన్నా...

గతంలో ప్రభుత్వ హయాంలో అనుమతులతో మట్టి తవ్వకాలు నిర్వహిస్తున్నపుడు అప్పటి ఎమ్మెల్యే ఆర్కేకి అనుమతులు లేవంటూ నిలదీసిన వ్యక్తే ఇప్పుడు రాజధాని ప్రాంతంలో సదరు వ్యక్తితో కలిసి దందాలు చేస్తున్నట్లు సమాచారం. తాడేపల్లి మణిపాల్ హాస్పిటల్ వెనుక మహానాడు కట్టపై నివాసం ఉంటూ మంగళగిరి, తాడేపల్లి పోలీస్‌స్టేషన్లలో రాజధాని పరిధిలో పలు దొంగతనాల్లో ప్రధాన ముద్దాయి అయిన రౌడీషీటర్ కూడా లారీలను లీజ్‌కు తీసుకుని మట్టి దందా చేస్తున్నాడు. రాజధానికి పంట పొలాలు ఇచ్చిన రైతులు జరిగిన ఈ సంఘటనపై, జరుగుతున్న ఈ అక్రమ తవ్వకాలపై ప్రశ్నిస్తుంటే దౌర్జన్యం చేస్తున్నారు. వారిని కొంతమంది గ్రామస్తులతో బెదిరించి ఈ దందా నిర్వహిస్తున్నట్లు తెలియవచ్చింది.

పోలీసులు సీజ్ చేసిన లారీలు

మిర్చి యార్డు సమాచారం
(బుధవారం ధరలు)

వచ్చిన బస్తాలు	43,369
అమ్మకాలు	41,814
నిల్వ	12,872

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,000-17,000
నంబరు-5	11,000-15,600
341	10,500-16,800

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,500-16,800
నంబరు-5	10,500-15,500
341	12,000-17,300
4884	12,000-14,200

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 - 15,500
బాడిగ-355	10,500 - 17,200
దేవనూరు డీలక్స్	11,000 - 16,500
ఆర్మూర్	10,500 - 13,300
తాలుకాయలు	5,200 - 7,300

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	11,000-15,000
బాడిగ - 355	11,000-17,500
దేవనూరు డీలక్స్	10,500-16,000
తాలు	5,200 - 7,200

-కొరిటెపాడు (గుంటూరు)

వైభవంగా ప్రసన్నాంజనేయ వ్రత మహోత్సవం



బెల్లంకొండ: బెల్లంకొండ క్రాస్ రోడ్డు వద్ద గల కోళ్లూరు ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో బుధవారం హనుమత్ వ్రత మహోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. మార్గశిర శుద్ధ త్రయోదశి సందర్భంగా ప్రతి ఏటా స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తారు. వ్రత మహోత్సవాల సందర్భంగా దేవదాయ శాఖ అధికారులు విద్యుత్ దీపాలతో ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. కార్తిక మాసంలో స్వామివారి దీక్షలను చేపట్టిన మాలధారులు మండల కాలం దీక్ష చేసి బుధవారం స్వామివారికి ఇరుముడులను సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు నరసింహ చార్యులు, అనంతాచార్యులు వ్రత పూజల అనంతరం విశేష అభిషేక కార్యక్రమాలను నిర్వహించారు. స్వామివారి సంకీర్తన కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. భక్తులకు అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ ఈవో సనిమెళ్ల కోటిరెడ్డి, ఆలయ కమిటీ ట్రస్ట్ బోర్డు చైర్మన్ ఆసుల జగన్, పాలకవర్గ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

HOUSE FOR SALE

■ తెనాలి దగ్గర అంగలకుదురులో 80అ॥ రోడ్డు, 2వ బిట్, 113 చ॥గ॥ ఇల్లు 25లక్షలు మాత్రమే ప్లాన్ అప్రూవల్, లోన్ సౌకర్యం. సంప్ర॥ 97046 99997

■ కొలనుకొండ, జయభేరి క్యాపిటల్ సమీపంలో 1000 Sq. Yards గజాల site గల 10,000+Sq. Feet విల్లా అమ్మకమునకు కలదు. నో బ్రోకర్స్. ✆ 99662 28370

SERVICES

BUSINESS OFFER

■ వ్యాపార భాగస్వాములు కావాలి. తక్షణం వ్యాపార భాగస్వాములు వెతుకుతున్నాము. సంప్రదించండి: RSJ Inspection Service Ltd. సెల్ : 85959 24917.

CHANGE OF NAME

■ నేను, అబ్బూరి శరణ్య, అబ్బూరి ప్రణీత్ గారి భార్య, నివాసం: డోర్ నం. 20-56/3, 9వ లైన్, ముత్యాలరెడ్డినగర్, మెడికల్ హాస్టల్ ఎదురుగా, అమరావతి రోడ్, గుంటూరు-522007. నా పేరు అబ్బూరి శరణ్య నుండి బత్తుల శరణ్యగా మార్చుకున్నాను. ఇది అన్ని అధికారిక, వ్యక్తిగత మరియు చట్టపరమైన ఉద్దేశ్యాల కోసం అమలులోకి వస్తుంది.

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ఫోన్ : 81422 92071

■ బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేటుసంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారాం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును ✆ 8790741166

WANTED

■ తెనాలిలోని ప్రముఖ హాస్పిటల్ నందు పనిచేయుటకు ICU స్టాఫ్, స్టాఫ్ నర్స్, ఫార్మసిస్ట్ కావలెను. సంప్రదించండి. ఫోన్: 7702762108, 9666354489

■ శ్రీవసుధ డెవలపర్స్ గుంటూరులో పని చేయుటకు మేనేజర్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, టెలికాలర్స్, డ్రైవర్స్, అకౌంటెంట్ & సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. సంప్ర: 77319 51999

■ Wanted Qualified Primary Teachers, Helpers & Receptionist English fluency is must. ✆ Montessori E.M. School, Gnt. 81214 00100

■ కృష్ణసాయి క్లాత్ శారీస్ నందు పని చేయుటకు సేల్స్‌మెన్, హెల్పర్స్‌గా స్త్రీ/పు కావలెను. ఆకర్షణీయమైన జీతం. సంప్ర: 4/1 అశోక్‌నగర్, గుంటూరు. 98855 13844

■ వెంటనే కావలెను. Ltd కంపెనీలో కం॥ ఆప రేటర్స్,రిసెప్షనిస్ట్,అకౌంటెంట్స్,టెలికాలర్స్, సూ॥ వైజర్స్,ఆఫీస్‌బాయ్స్,ఆఫీస్ ఎగ్జిక్యూటివ్స్, హెల్పర్స్ కావలెను.10th-PG,జీ:10-25. ✆7993976590

■ పిడుగురాళ్ళ, వినుకొండ, మాచర్ల, గురజాల డెలివరీ బాయ్స్ అండ్ గుంటూరులో లేడి టెలికాలర్స్ కావలెను. మంచి శాలరీ. సంప్ర॥ 8340855728, 7730997214

■ వంట మాస్టర్లు భార్యాభర్తలు వెంటనే కావలెను. వసతి సౌకర్యం కలదు. వరంగల్ సిటీ లోని ప్రైవేటు మెడికల్ కాలేజీలో వంట చేయుటకు సంప్ర: 9390809999, 9849235255.

■ పంజాబ్ నేషనల్ బ్యాంక్ మెట్‌లైఫ్‌లో సేల్స్ మేనేజర్స్, డిస్ట్రిబ్యూషన్ మేనేజర్స్, అడ్వైజర్స్ కావలెను. అన్‌కోల్ 30k శాలరీ ఇన్సెంటివ్+ కమీషన్ P/T స్త్రీ/పు 9949839400, 9032592584

■ ఉద్యోగ అవకాశం డిగ్రీ పూర్తిచేసిన వారికి ఫీల్డ్ వర్క్ (Field Work) కోసం వయస్సు: 30 సంవత్సరాల లోపు వారు సంప్ర॥ +91 8800629648. RSJ Inspection Service Ltd

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు
475
100
గుంటూరు
7075167663
7075167541

గమనిక

వైకల్యం శరీరానికే.. మనసుకు కాదు

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియాఉద్దీన్

దివ్యాంగ చిన్నారులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి సయ్యద్ జియాఉద్దీన్

గుంటూరు లీగల్: జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని గుంటూరు బ్రాడీపేట 2వ లైన్‌లోని భవిత స్కూల్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన న్యాయవిజ్ఞాన సదస్సుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియాఉద్దీన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ పిల్లలకు థామస్ ఆల్వా ఎడిసన్ గురించి వివరించారు. వైకల్యం అనేది శరీరానికే కానీ మనసుకు కాదన్నారు. చిన్నారులు ఆత్మనూన్యతాభావానికి గురికాకుండా చదువుపై శ్రద్ధ వహించి, పట్టుదలతో చదివి ఉన్నతస్థానాలకు చేరుకోవాలన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చిన్నారులతో స్నేహభావంగా మెలిగి, ప్రోత్సహించాలని తెలిపారు. అనంతరం స్థానిక చిన్నారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పిల్లల్లో ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించిన తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను అభినందించారు. ప్యానెల్ అడ్వకేట్, ఇంక్లూసివ్ ఎడ్యుకేషన్ కో-ఆర్డినేటర్ ఎన్.శ్రీనివాసరావు, రిసోర్స్‌పర్సన్ సువర్ణ లత, హెచ్ఎం ఎండీ అస్సన్ బేగ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫోర్జరీ సంతకాలతో భూముల విక్రయం

రౌడీషీటర్ జలీల్ దందాలకు అడ్డుకట్ట వేయాలని రైతుల డిమాండ్

ఆందోళన చేస్తున్న చినకాకాని రైతులు

మంగళగిరి టౌన్ : రైతుల భూములను చేజిక్కించుకునే లక్ష్యంతో సంతకాలను ఫోర్జరీ చేసి నకిలీ దస్తావేజులు సృష్టించి భూములు విక్రయించిన రౌడీ షీటర్ జలీల్ దందాలకు అడ్డుకట్ట వేయాలని రైతులు డిమాండ్ చేశారు. మంగళగిరి నగర పరిధిలోని చినకాకానిలో బుధవారం ఈ ఘటనపై రైతులు ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ సర్వే నెం. 182/1లోని 10 ఎకరాల 25 సెంట్ల వ్యవసాయ భూమిపై నకిలీ దస్తావేజులు సృష్టించి, రైతుల సంతకాలను ఫోర్జరీ చేసి ఇతరులకు కోట్లాది రూపాయలకు విక్రయించాడని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల తన సహచరులతో కలసి భూమిలోకి చొరబడి రైతులను బెదిరించిన ఘటన తీవ్ర ఆందోళనకు కారణమైందని పేర్కొన్నారు. రైతులు ప్రతిఘటించడంతో అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు తెలిపారు. రైతుల భూములపై నకిలీ పత్రాలు సిద్ధం చేసి తప్పుడు నమూనా సర్వేలు చూపిస్తూ భూమిని వదిలివేయాలని బెదిరిస్తున్నాడని బాధితులు పేర్కొన్నారు. పలువురు రైతుల సంతకాలను ఫోర్జరీ చేసి పంచాయితీ, రెవెన్యూ రికార్డుల్లో తారుమారు చేయడం వంటి చర్యలు వెలుగులోకి రావడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి రౌడీషీటర్ జలీల్, అతని అనుచరులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి రైతులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బాధిత రైతులు వెంకటేశ్వరరావు, నరసింహారావు, శివన్నారాయణ, కొండలరావు, శ్రీనివాసరావు, ప్రసాద్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు సీపీఐ జిల్లా వర్క్‌షాప్

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్) : జిల్లా సీపీఐ శాఖ కార్యదర్శులు, జిల్లా సమితి, మండల సమితి, నియోజకవర్గ సమితి సభ్యుల రెండు రోజుల వర్క్‌షాప్ ఈ నెల 4, 5 తేదీల్లో గుంటూరు సీపీఐ కార్యాలయం మల్లయ్య లింగం భవన్‌లో జరగనుందని జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి తెలిపారు. గుంటూరు కొత్తపేటలోని జిల్లా సీపీఐ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 4న జరిగే కార్యక్రమంలో ఉదయం 10:30 గంటలకు ముప్పాళ్ళ నాగేశ్వరరావు ప్రసంగంతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. 5వ తేదీ ఉదయం ''భారతీయ సమాజం - మనువాదం - మార్క్సిజంపై రాజశేఖర్ ప్రసంగంతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు.

ప్రత్యేక కంటైనర్ రైల్ టెర్మినల్‌గా రెడ్డిపాలెం గూడ్స్ షెడ్

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్) : దక్షిణ మధ్య రైల్వే గుంటూరు డివిజన్‌లోని రెడ్డిపాలెం గూడ్స్ షెడ్‌ను ఈ ఏడాది నవంబర్ 13 నుంచి ప్రత్యేక కంటైనర్ రైల్ టెర్మినల్ గా గుర్తించినట్టు డివిజన్ పి.ఆర్.ఓ. వినయ్‌కాంత్ బుధవారం తెలిపారు. ఈ నోటిఫికేషన్‌తో, రెడ్డిపాలెం ఇప్పుడు ప్రస్తుత గూడ్స్ రవాణాతో పాటు ప్రత్యేకంగా కంటైనర్ ట్రాఫిక్‌ను కూడా నిర్వహించనున్నారు. దీనివల్ల సరుకు రవాణా సామర్థ్యం పెరగడం, పరిశ్రమలకు అనుగుణంగా రవాణా అవసరాలు తీర్చడం, రైలు వినియోగదారులకు మెరుగైన లాజిస్టిక్స్ సేవలు అందించే అవకాశం ఉందని తెలిపారు. కమర్షియల్ శాఖ అధికారులు పేర్కొన్న దాని ప్రకారం, రెడ్డిపాలెంను ప్రత్యేక కంటైనర్ రైల్ టెర్మినల్ గా కమిషన్ చేయడం ద్వారా ప్రైవేట్ రవాణా వృద్ధి, పరిశ్రమల ఆధారిత సరుకు రవాణా అభివృద్ధి, కస్టమర్ సేవలు ప్రైవేట్ పనితీరు మెరుగుదల సాధ్యమవుతుందని తెలిపారు.

రాజధానిలో ఆర్థిక కార్యకలాపాలు పెరగాలి

రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ

గుంటూరు వెస్ట్ : రాజధాని ప్రాంతంలో ఆర్థిక కార్యకలాపాలు పెరగాలని నిర్ణయించడం జరిగిందని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, పల్నాడు జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్లా, శాసన సభ్యులు శ్రావణ్‌కుమార్, భాష్యంప్రవీణ్‌లతో వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడుతూ ప్రస్తుతం రాజధాని ప్రాంతంలో రైతుల భూమికి విలువ పెరగాలని, అందుకు ఆర్థిక కార్యకలాపాలు పెరగాలని అన్నారు. తాడికొండ శాసనసభ్యులు శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ రెండో విడత ల్యాండ్ పూలింగ్‌కు సంబంధిత అధికారుల నియామకం జరగాలని కోరినట్లు చెప్పారు. శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్ మాట్లాడుతూ నవంబర్ 28న రెండవ దశ ల్యాండ్ పూలింగ్ కు క్యాబినెట్ ఆమోదం లభించిందన్నారు.

అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నరసరావుపేట రూరల్: పాఠశాల విద్యా సంచాలకులు ఆదేశాల మేరకు జిల్లాలోని ఉన్నత పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలలో ఖాళీగా ఉన్న స్కూల్ అసిస్టెంట్, సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులకు తాత్కాలిక ప్రాతిపదికన అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమిస్తున్నట్టు డీఈవో ఎల్.చంద్రకళ తెలిపారు. వివరాల కోసం మండల విద్యాశాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులను ఈనెల 5వ తేదీలోపు మండల విద్యాశాఖ అధికారులకు అందజేయాలని ఆమె పేర్కొన్నారు.

పుట్టిన బిడ్డలను చెత్తకుప్పలు, కాలువల్లో పడేయవద్దు

- దత్తత సంస్థకు అప్పగిస్తే సంరక్షిస్తాం
- మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ అధికారి పి.ఉమాదేవి

నరసరావుపేట: ఎక్కరైనా పుట్టిన పిల్లలను వద్దనుకుంటే ఆ పిల్లలను స్థానిక ఎన్‌జీఓ కాలనీలో ఉన్న దత్తత సంస్థకు అప్పగించాలని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారి పి.ఉమాదేవి బుధవారం కోరారు. ఆ పిల్లలను సంస్థ సంరక్షించి పిల్లలు లేని దంపతులకు దత్తత ఇచ్చే అవకాశం కలుగుతుంది పేర్కొన్నారు. అంతేకానీ పుట్టిన పసికందులను బాధ్యత తీసుకోలేని వారు చెత్తకుప్పలు, నీటి కాలువల్లో పడేయవద్దని కోరారు. అటువంటి పిల్లలను తమకు ఇప్పగిస్తే వారి పూర్తి బాధ్యత దత్త సంస్థ తీసుకుంటుందని, సమాచారం కోసం 83090 48218, 89773 77273 నంబర్లకు తెలియచేయాలని కోరారు.

ఉపాధ్యాయులపై కక్ష సాధింపు చర్యలు

ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా శాఖ

జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వినతిపత్రం అందజేస్తున్న బసవలింగారావు

గుంటూరు వెస్ట్ : మెగా డీఎస్సీ-2025లో ఉపాధ్యాయులుగా ఎంపికైన 21 మంది వెల్ఫేర్-ఎడ్యుకేషన్ అసిస్టెంట్స్‌ను అక్టోబర్ 2లోపు రిలీవ్ చేయాల్సి ఉండగా సోషల్ వెల్ఫేర్ డెప్యూటీ డైరెక్టర్ (ట్రైబల్) చెన్నయ్య అదే నెల 13వ తేదీన రిలీవ్ చేసి ఇబ్బందులకు గురిచేశారని ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.బసవలింగారావు, మహమ్మద్ ఖాలీద్‌లు బుధవారం జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్‌అన్సారీయాకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దీనిపై చెన్నయ్యకు వినతిపత్రం అందజేస్తే నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. ఎంపికైన 21 మందికి న్యాయం చేయకుండా అక్టోబర్ 13న సాయంత్రం రిలీవ్ చేయడంతో మొత్తం11రోజులు సర్వీస్ నష్టపోయి ప్రతి బదిలీలలో మిగిలిన డీఎస్సీ 25వారి కంటే వెనకబడతారని తెలిపారు. ఆ 21మందిపై కక్షసాధింపు చర్యగా అక్టోబర్ 13న రిలీవ్ చేసి అన్యాయం చేశారన్నారు. ఈ కారణంగా బదిలీలతో పాటు రేషనలైజేషన్‌లో కూడా నష్టపోతారన్నారు. ఇప్పటికైన ఆ 21మంది వెల్ఫేర్-ఎడ్యుకేషన్ అసిస్టెంట్స్‌కి న్యాయం జరగకపోతే సోషల్ వెల్ఫేర్ డీడీ కార్యాలయం ఎదుట బాధిత ఉపాధ్యాయులతో కలసి ఏపీటీఎఫ్ పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతుందని తెలిపారు.

ఇద్దరి మృతికి కారకులైన నిందితులకు జైలు శిక్ష

గుంటూరు లీగల్: భూవివాదం నేపథ్యంలో ఉద్దేశపూర్వకంగా కారు నడిపి ఇద్దరి మరణాలకు కారణమైన ఘటనలో ముగ్గురు నిందితులకు న్యాయమూర్తి జైలుశిక్ష విధించారు. కోర్టు వర్గాలు తెలిపిన వివరాలు.. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం, నెక్కలు గ్రామం ప్రధాన రోడ్డుపై 2019 ఏప్రిల్ 5వ తేదీన భూ వివాదాల నేపథ్యంలో పసుపులేటి చిన్న బాపయ్య కుటుంబ సభ్యులపై కర్రలు, చేతులు, కాళ్లతో పలువురు దాడి చేసి, తీవ్రంగా గాయపరిచారు. అంతేకాకుండా నిందితులు బాధితులపై ఉద్దేశపూర్వకంగా కారు నడపడంతో పసుపులేటి మహాలక్ష్మి(74), పసుపులేటి వీరకుమారి (34) గాయాలపాలై చికిత్స పొందుతూ మృతిచెందారు. ఈమేరకు పసుపులేటి చిన బాపయ్య ఇచ్చిన ఫిర్యాదుపై కేసు విచారణ.. అనంతరం ఐదవ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి కె.నీలిమ కేసులో ప్రధాన నిందితుడు ఏ1 అలూరి సుధాకర్‌కు 10 సంవత్సరాలు కఠిన కారాగార శిక్ష, రూ. 11వేలు జరిమానా, ఏ2 అలూరి అజయ్‌కు 3 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ. 3వేలు జరిమానా, ఏ4 యరమాసు శ్రీనివాసరావుకు 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ. 10వేలు జరిమానా విధించారు. ఈ క్రమంలో ఏ3, ఏ5, ఏ6 లపై నేరం రుజువు కానందున నిర్దోషులుగా విడుదల చేశారు. ఈ కేసులో స్పెషల్ పీపీ టి.దుర్గాప్రసాద్ బాధితుల తరపున వాదనలు వినిపించారు. నిందితులకు శిక్ష పడేలా చేసిన సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

బాలికల హ్యాండ్ బాల్ విజేత పశ్చిమ గోదావరి

పిడుగురాళ్ల రూరల్: ఆంధ్రప్రదేశ్ హ్యాండ్ బాల్ చాంపియన్‌షిప్ అండర్ -15 బాలికల విభాగం విజేతగా పశ్చిమ గోదావరి జిల్లా జట్టు నిలిచింది. మండలంలోని జానపాడు శివారులోని తిరుమల ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లో పోటీలు హోరాహోరిగా జరిగాయి. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 560 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఫైనల్‌లో పశ్చిమ గోదావరి, విజయనగర్ జట్లు పోటీ పడ్డాయి. పశ్చిమ గోదావరి విజయం సాధించి మొదటి స్థానంలోను, రెండవ స్థానంలో విజయనగరం, మూడవ స్థానంలో కడప, కర్నూలు జట్లు జాయింట్ విన్నర్లుగా నిలిచాయి. విజేతలుగా నిలిచిన జట్లకు తిరుమల ఆక్స్‌ఫర్డ్ విద్యా సంస్థల డైరెక్టర్ బొల్లా గిరిబాబు షీల్డ్‌లను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నరేష్, రాష్ట్ర హ్యాండ్ బాల్ అసోసియేషన్ సెక్రటరీ పి. శ్రీనివాసులు, కర్నూలు జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు రామాంజనేయులు, ఆర్గనైజింగ్ సెక్రటరీ కోటేశ్వరరావు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు

బొల్లాపల్లి: పునీత ఫ్రాన్సిస్ శౌరి మహోత్సవాలను పురస్కరించుకుని బొల్లాపల్లి మండలం రెడ్డిపాలెం గ్రామంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు బుధవారంతో ముగిశాయి. ఈ పోటీల్లో సుమారు 15 టీంలు పాల్గొన్నాయని, వీటిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ, నాలుగవ స్థానాల్లో బాపట్ల, బేతపూడి, మాచవరం, యడ్లపాడు జట్లు గెలుపొందాయని నిర్వాహకులు కె. ప్రకాష్‌రావు, సీహెచ్ రాజేశ్వరరావులు తెలిపారు. ప్రథమ బహుమతి బాపట్ల జట్టుకు శ్రీ చక్ర సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం రూ 30,116, ద్వితీయ శివ శక్తి లీలా అంజన్ ఫాండేషన్ రూ. 25,116లు చీఫ్ విఫ్ జీవీ ఆంజనేయులు చేతులు మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రెవ ఫాదర్ వై. జాకోబ్ రెడ్డి, జాన్ శేఖర్, గ్రామ సర్పంచ్ కె. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సంఘ విద్రోహశక్తులను ఎదుర్కొనేందుకు మాక్‌డ్రిల్

- ఆక్టోపస్ డీఎస్పీ కృష్ణ
- ఏఎన్‌యూలో ఆక్టోపస్ బలగాల మాక్ డ్రిల్

డీఎస్పీ కృష్ణ ఆధ్వర్యంలో ఆక్టోపస్, ఎస్‌టీఎఫ్ బలగాల మాక్ డ్రిల్

పెదకాకాని: సంఘ విద్రోహ శక్తులు, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు మాక్‌డ్రిల్ నిర్వహించినట్లు ఆక్టోపస్ డీఎస్పీ కృష్ణ తెలిపారు. మండలంలోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో బుధవారం రాష్ట్ర ఐజీ శ్రీకాంత్ ఆదేశాల మేరకు గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పర్యవేక్షణలో డీఎస్పీ కృష్ణ, ఎస్‌బీ సీఐ రాంబాబు సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం తెల్లవారుజామున మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆక్టోపస్ డీఎస్పీ కృష్ణ మాట్లాడుతూ ఉగ్రవాదులు, సంఘ విద్రోహశక్తులు ఎదురైనప్పుడు, అత్యవసర పరిస్థితులు సంభవించినపుడు స్పందించవలసిన విధానాన్ని, వాటిని సమర్థంగా ఎదుర్కోవడంపై మాక్ డ్రిల్ జరిగిందన్నారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా తీసుకోవలసి చర్యలు, పటిష్టమైన ప్రణాళికలు రూపొందించి, వాటిని సమర్థవంతంగా ఎదుర్కొని ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా తీసుకోవాల్సిన చర్యలను అమలు పరచే దిశగా మాక్‌డ్రిల్ కొనసాగిందన్నారు. రాష్ట్ర ఆక్టోపస్ విభాగంలోని డెల్టా బృందం, జిల్లా స్పెషల్ టాస్క్‌ఫోర్స్ బలగాలు, పెదకాకాని పోలీసుల సహకారంతో ఈ మాక్‌డ్రిల్ నిర్వహించడం జరిగిందన్నారు. ఆక్టోపస్ ఆర్ఐ వరప్రసాద్, రామ్‌మోహన్, పెదకాకాని ఎస్ఐ రామకృష్ణ, అగ్నిమాపకశాఖ అధికారి వెంకటేశ్వర్లు, ఆరోగ్యశాఖ అధికారి రమణమూర్తి, ఆర్ఐ శ్రీనివాసరావు, ఏఎన్‌యూ యాజమాన్యం, 30 మంది ఆక్టోపస్ బలగాలు, ఎస్‌టీఎఫ్ బలగాలు, పెదకాకాని పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా పునీత శౌరి తిరునాళ్ల

సమిష్టి పూజాబలి నిర్వహిస్తున్న గుంటూరు పీఠాధిపతులు చిన్నాబత్తిని భాగ్యయ్య, ఫాదర్లు

ప్రత్యేక పూజాబలి కార్యక్రమంలో పాల్గొన్న విశ్వాసులు

- ఘనంగా మహోత్సవ సమష్టి పూజాబలి
- పునీతశౌరిని దర్శించుకున్న విశ్వాసులు, కథోలికులు

ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం ముట్లూరులోని పునీత శౌరి తిరునాళ్ల మహోత్సవం వైభవోపేతంగా జరిగింది. నవంబరు 24వ తేదీన జెండా ప్రతిష్టతో ప్రారంభమై తొమ్మిది రోజుల పాటు జరిగిన ఉత్సవాలు బుధవారం రాత్రి జరిగిన సమిష్టి దివ్య పూజాబలితో ముగిశాయి. ఫాదర్ మార్నేని దిలీప్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన పూజాబలి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గుంటూరు పీఠాధిపతులు చిన్నాబత్తిని భాగ్యయ్యతో పాటు ఆయా చర్చిల ఫాదర్లు, గురువులు హాజరై సమిష్టి పూజాబలిని నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాలు, ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున హాజరైన విశ్వాసులు పుణ్యక్షేత్రం ఆవరణలో ఒత్తుల ప్రదక్షిణను దేవుని స్తుతిస్తూ చేపట్టారు, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కేరళ డ్రమ్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. లయబద్ధంగా వాయిస్తున్న కళాకారుల విన్యాసాలు, కోలాట ప్రదర్శనలు, కర్ర సాములను తిలకించేందుకు ప్రజలు ఉత్సాహాన్ని కనబరిచారు. తిరునాళ్లకు గ్రామానికి విచ్చేసిన బంధువులతో ఊరంతా సందడితో కళకళలాడింది. రాత్రి పది గంటల సమయంలో పునీతశౌరి వారిని స్తుతిస్తూ ప్రత్యేక ప్రార్థనలు. గీతాలాపనలు చేశారు. తేరు ప్రదక్షిణలో వందల సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు.

గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు
అద్దం పట్టిన కళా ప్రదర్శనలు

నృత్యాలు చేస్తున్న చిన్నారులు

సాక్షి, అమరావతి: గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్(ఈఎంఆర్ఎస్) విద్యార్థుల కళా ప్రదర్శనలు అందర్నీ ఆకట్టుకున్నాయి. గుంటూరు జిల్లా వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ ప్రాంగణంలో ఆరవ జాతీయ ఉత్సవ్-2025లో భాగంగా దేశం నలుమూలల నుంచి వచ్చిన ఏకలవ్య స్కూల్స్ విద్యార్థుల సంస్కృతి, సాహిత్య, కళా ఉత్సవాలు కన్నుల విందుగా జరిగాయి. బుధవారం మధ్యాహ్నం నుంచి ప్రధాన వేదిక అయిన కృష్ణ జింక ఆడిటోరియలో దాదాపు 22 రాష్ట్రాల నుంచి వచ్చిన సీనియర్ విభాగంలో విద్యార్థులు ప్రదర్శించిన సంప్రదాయ నృత్యాలు వివిధ గిరిజనుల సంస్కృతులను, వారి వ్యవహార శైలితో పాటు ఆచార వ్యవహారాలను చాటి చెప్పడమే కాకూండా వారి నృత్యాలతో హావభావాలతో వీక్షకులను అలరింపజేశారు. నృత్య ప్రదర్శనతోపాటు కథల పోటీలు, ఉపన్యాస పోటీలు, పలు భాషలలో సృజనాత్మక రచన వంటి దాదాపు 18 రకాల పోటీలను వివిధ వేదికలపై నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌లోని పార్వతీపురం మన్యం జిల్లా జీఎల్ పురం నుంచి సీనియర్ విభాగంలో ఈఎమ్ఆర్ఎస్ విద్యార్థులు ప్రదర్శించిన గిరిజన సంప్రదాయ వీర నృత్యం వారి వేడుకల అంశంతో కోలాటం, నృత్యం అద్భుతంగా సాగింది. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థులు ఈ జాతీయ కళా ఉత్సవాల్లో పాల్గొన్నారు.

దివ్యాంగ బాలల ఉన్నతికి వెన్నుదన్ను



భవిత పాఠశాలలో మొక్కలు నాటుతున్న డీఈఓ చంద్రకళ



వేడుకల్లో పాల్గొన్న జడ్జి శ్రీనివాసరావు తదితరులు

పల్నాడు డీఈఓ చంద్రకళ

నరసరావుపేట రూరల్: దివ్యాంగ బాలబాలికల ఉన్నతికి ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలిచేందుకు పథకాలు అమలు చేస్తోందని జిల్లా విద్యాశాఖ అధికారి చంద్రకళ తెలిపారు. అంతర్జాతీయ దివ్యాంగ దినోత్సవాన్ని నరసరావుపేటలోని భవిత పాఠశాలలో బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో డీఈవో చంద్రకళ, సమీకృత విద్య కో-ఆర్డినేటర్ ఆర్.సెల్వరాజ్, నవభారత దివ్యాంగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.కృష్ణమూర్తి అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రకళ మాట్లాడుతూ భవిత పాఠశాలల్లో ఉపాధ్యాయులు, ఫిజియోథెరపిస్ట్, ఆయాల సేవలు మరువలేనివని తెలిపారు. దివ్యాంగుల ఉన్నతికి భవిత కేంద్రాలు మూల స్తంభాలని కొనియాడారు. అనంతరం దివ్యాంగుల విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏఎంవో పూర్ణచంద్రరావు, ఓసీటీబీ పాఠశాల సెక్రటరీ నాయక్, ఫిజియోథెరపిస్ట్ పెదన్నారావు నాయక్, ఉపాధ్యాయులు కె.పద్మజ, జి.మేరీ కుమారి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దివ్యాంగులు శక్తివంతులుగా ఎదగాలి
: సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు

దాచేపల్లి : మానసిక దివ్యాంగులు శక్తివంతులుగా ఎదగాలని సీనియర్ సివిల్ జడ్జి వై. శ్రీనివాసరావు తెలిపారు. నారాయణపురంలోని ఫాతిమా మాత విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. విద్యార్థుల సమక్షంలో వేడుకలు జరిపి, కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా జడ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థానాల్లో ఉండాలని ఆకాంక్షించారు. విభిన్న ప్రతిభావంతులను అంతా గౌరవించాలని, సమాజంలో వారిని ప్రోత్సహించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు షేక్ జానీ బాషా, మందపాటి శ్రీనివాసరెడ్డి, గురుప్రసాద్, వలంటీర్ అహ్మద్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎంటీఎంసీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం

మంత్రి నారాయణ

మంగళగిరి టౌన్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేపడుతున్నామని మంత్రి నారాయణ పేర్కొన్నారు. ఎంటీఎంసీ కార్యాలయంలో బుధవారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆత్మకూరులో కంపోస్ట్ యార్డును పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ 513 కి.మీ. మేర 1167 కోట్ల రూపాయలతో ఎంటీఎంసీ పరిధిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీని నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో 123 మున్సిపాలిటీల్లో 7 వేల టన్నుల చెత్త వస్తోందన్నారు. వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లు, బయో గ్యాస్ ప్లాంట్లు, కంపోస్ట్ యార్డుల ద్వారా ఘన పదార్థాలను పూర్తిగా ప్రాసెస్ చేస్తామని తెలిపారు. సమావేశంలో ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా, అడిషనల్ కమిషనర్ శకుంతల, అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే లక్ష్యం

కలెక్టర్ తమీమ్ అన్సారియా

మేడికొండూరు: మారుతున్న కాలానికి అనుగుణంగా మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను సాగు చేస్తూ, ఆర్థికంగా బలపడాలని కలెక్టర్ ఎ. తమీమ్ అన్సారియా రైతాంగానికి పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని సిరిపురంలో నిర్వహించిన 'రైతన్నా! మీ కోసం' కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సంప్రదాయ సాగుకి స్వస్తి పలికి, అగ్రిటెక్, ప్రకృతి సేద్యం వైపు రైతులు మొగ్గు చూపాలని ఆకాంక్షించారు.ప్రజల ఆహారపు అలవాట్లు మారుతున్నాయని, రాగులు, జొన్నలు, సజ్జలు, కొర్రలు వంటి చిరుధాన్యాలకు మార్కెట్లో విపరీతమైన డిమాండ్ ఉందని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో తాడికొండ ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ పద్మావతి, మేడికొండూరు ఎంపీడీవో డేవిడ్ ప్రభాకర్, తహసీల్దార్ రాఘవరావు, ఈవోపీఆర్డీ పూర్ణ శంకరరావు పాల్గొన్నారు.

ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలి

తాడికొండ: ప్రజలకు ఉత్తమమైన పోలీసు సేవలందిస్తూ భరోసా కల్పించాలని గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ సూచించారు. సాధారణ వార్షిక తనిఖీల్లో భాగంగా తాడికొండ పోలీస్‌స్టేషన్‌ను ఆయన బుధవారం తనిఖీ చేశారు. దర్యాప్తులు, నేరాల సంఖ్య, పెండింగులో ఉన్న కేసులు, అరెస్టులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. సైబర్ నేరాలు, డిజిటల్ అరెస్టుల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో తుళ్లూరు డీఎస్పీ మురళీకృష్ణ, ఎస్బీ డీఎస్పీ గొట్టిపాటి శ్రీనివాసులు, తాడికొండ సీఐ వాసు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్యకర్తలకు వైఎస్సార్ సీపీ అండ

సమావేశంలో కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న వేమారెడ్డి

సేకరించిన పత్రాలను వేమారెడ్డికి అందజేస్తున్న నాయకులు

మంగళగిరి సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి

తాడేపల్లి రూరల్: కార్యకర్తలకు అండగా వైఎస్సార్ సీపీ ఉంటుందని మంగళగిరి సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి తెలిపారు. ప్రజా ఉద్యమాల్లో పాల్గొంటున్న వైఎస్సార్ సీపీ శ్రేణులను ఇబ్బందులకు గురిచేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలపై పెట్టే తప్పుడు కేసులకు భయపడొద్దని చెప్పారు. తప్పుడు కేసులు పెట్టిన ప్రతి ఒక్క అధికారిపై రాబోయే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. రాబోయే కాలంలో ప్రజా ఉద్యమాల్లో పాల్గొనే ప్రతి కార్యకర్తకు, నాయకుడికి ప్రత్యేక గుర్తింపు ఉంటుందని ఆయన అన్నారు. బుధవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని అంజిరెడ్డి భవన్‌లో పట్టణ అధ్యక్షులు, పొన్నూరు నియోజకవర్గ పరిశీలకులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం, పార్టీ పిలుపు మేరకు తాడేపల్లి పట్టణంలో సేకరించిన సంతకాల పత్రాలను అందజేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వేమారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వ ఆస్తులు, మెడికల్ కాలేజీలను అనుయాయులకు ధారాదత్తం చేసేందుకు ప్రణాళిక రచించారని విమర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ. గోరేబాబు, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముదిగొండ ప్రకాష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్‌రాజు, గుంటూరు జిల్లా యాక్టివిటీ కమిటీ మెంబర్, సీనియర్ నాయకులు గంగాధరరావు, తాడేపల్లి పట్టణ ఉపాధ్యక్షులు జీలగ గాలయ్య, వేల్పుల ఎలీషా, పట్టణ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె. సర్దార్, పట్టణ మహిళా అధ్యక్షురాలు విజయశ్రీ , పట్టణ ప్రధాన కార్యదర్శి స్నేహ సంధ్య, వైఎస్సార్ సీపీ తాడేపల్లి పట్టణ 23వ వార్డు నాయకులు పాల్గొన్నారు.

బాబు పాలనలో వైద్య రంగం నిర్వీర్యం

మంగళగిరి టౌన్ : బాబు పాలనలో వైద్యరంగం నిర్వీర్యమైందని, పెత్తందార్ల ప్రయోజనాల కోసమే ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తున్నారని వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి ధ్వజమెత్తారు. ఆత్మకూరు నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో బుధవారం సేకరించిన సంతకాల పత్రాలను వేమారెడ్డికి నాయకులు అందజేశారు. పట్టణ పరిధిలోని 21వ వార్డు అధ్యక్షులు బియ్యం శ్రీను ఆధ్వర్యంలో సంతకాల సేకరణ మంగళవారంతో పూర్తయ్యింది. ఈ సందర్భంగా డీవీఆర్ మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను ప్రజలంతా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు.పట్టణ అధ్యక్షులు ఆకురాతి రాజేష్, పట్టణ మహిళా అధ్యక్షురాలు సంకె సునీత, రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగ కార్యదర్శి ఎండీ. ఫిరోజ్, జిల్లా యాక్టివిటీ కార్యదర్శి మల్లవరపు సుధారాణి, నాయకులు బట్టు రవి, నక్కా నాగరాజు, చాంద్ బాషా, కోటేశ్వరరావు, నందా శ్రీను, నందేటి ప్రభాకర్, దామోదర్, వల్లభాపురం రాము, సురేష్, అహ్మద్ అలీ, రామాంజనేయులు, రాజు, రాజేష్ పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసులో స్థల పరిశీలన

తాడికొండ: స్థానిక అడ్డ రోడ్డులో విశ్రాంత ఏఎస్ఐకి చెందిన సేవా సంస్థ స్థలంలో నిర్మాణాన్ని అక్రమంగా కూల్చి దుర్భాషలాడటంపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైంది. విచారణ నిమిత్తం మంగళవారం తుళ్లూరు డీఎస్పీ మురళీకృష్ణ వచ్చారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు కూల్చిన షెడ్డు, ఖాళీ స్థలాన్ని ఆయన పరిశీలించి, బాధితుడు నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. యర్రంశెట్టి రవి, శ్రీకృష్ణ, ఈడే మురళీకృష్ణలు తన స్థలంలో నిర్మాణాన్ని కూల్చి కులం పేరుతో దూషించారని విశ్రాంత ఏఎస్ఐ తెలిపారు. స్థానికుల నుంచి కూడా ఆయన వివరాలు అడిగి తెలుసుకున్నారు.

రహదారి విస్తరణకు ఆర్ అండ్ బీ సర్వే

తాడికొండ: తాడికొండ ప్రధాన రహదారి విస్తరణలో భాగంగా ఆర్ అండ్ బీ అధికారులు మంగళవారం సర్వే నిర్వహించారు. బాధితులకు పరిహారం చెల్లించేందుకు గతంలో అంచనాలు రూపొందించినా ఒక్క రూపాయి కూడా ఇచ్చిన దాఖలాలు లేవు. ఈ నేపథ్యంలో సర్వేపై పలువురు మండిపడుతున్నారు. పెరిగిన ట్రాఫిక్, వీఐపీలు, వీవీఐపీల రాకపోకల నేపథ్యంలో గ్రామ శివారు నుంచి బైపాస్ రహదారి నిర్మించాలి గానీ గ్రామంలో విస్తరిస్తే మళ్లీ నష్టపోతామని పలువురు వాపోతున్నారు.

క్వాంటం కంప్యూటింగ్‌దే భవిష్యత్తు

మేడికొండూరు: విష్యత్తు అంతా 'క్వాంటం కంప్యూటింగ్'దేనని ఎన్నారై ఇంజనీరింగ్ కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి. తిలక్‌బాబు అన్నారు. ఎన్నారై ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం క్వాంటం కంప్యూటింగ్ పై నిర్వహించిన ప్రత్యేక అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించారు. సాధారణ కంప్యూటర్లు గంటల తరబడి చేసే క్లిష్టమైన సమస్యలను, క్వాంటం కంప్యూటర్లు కేవలం సెకన్ల వ్యవధిలో పరిష్కరిస్తాయని తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి కళాశాలలో ఏఐతో కూడిన క్వాంటం కంప్యూటింగ్‌ను బీటెక్ కోర్సుగా ప్రవేశపెడుతున్నట్లు తిలక్ బాబు ప్రకటించారు. కళాశాల ప్రిన్సిపాల్ సంజయ్, డిప్లొమా ప్రిన్సిపాల్ రవికుమార్, ఏఓ సీతారామయ్య పాల్గొన్నారు.

యూటీఎఫ్ కార్యవర్గం ఎన్నిక

తాడేపల్లి రూరల్: యూటీఎఫ్ మండల మహాసభను తాడేపల్లిలో ఉపాధ్యాయురాలు సుబ్బమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. తాడేపల్లి మండల అధ్యక్షుడిగా వెంకటేశ్వరరావు (కేవీఆర్), కార్యదర్శిగా సత్య శివ నాగేశ్వరరావు నియమితులయ్యారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రాజశేఖర్ పాల్గొన్నారు.

సంవత్సరం పూర్తయిన కార్మికుల దీక్షలు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల దీక్షలు బుధవారంతో సంవత్సరం పూర్తి చేసుకున్నాయి. దీక్షలను యూనియన్ కార్యదర్శి స్టీవెన్, షేక్ సుభాని, సువర్ణకుమారి, రిబ్కా, శారద ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సంవత్సరంగా దీక్షలు చేపడుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని తెలిపారు. కార్యక్రమంలో పలువురు కార్మికులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

మంగళగిరి టౌన్ : పట్టణ పరిధిలోని ద్వారకానగర్‌కు చెందిన కానూరి నాగలక్ష్మికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ. 2,13,000 చెక్కును స్థానిక టీడీపీ నాయకులు బుధవారం ఆమెకు అందజేశారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

మంగళగిరి టౌన్ : విద్యార్థులంతా మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ప్రేమ్‌రాజ్ తెలిపారు. మండల పరిధిలోని చినకాకానిలో వీటీజేఎం అండ్ ఐవీటీఆర్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో బుధవారం యాంటీ టుబాకోపై పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

సామూహిక శ్రీ హనుమంత్ వ్రతం

దుగ్గిరాల: స్థానిక శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో, కొత్త లాకుల వద్ద ఉన్న 42 అడుగుల అంజనేయస్వామి అలయం వద్ద బుధవారం సామూహిక హనుమంత్ వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో దంపతులు పాల్గొన్నారు. ఏర్పాట్లను ఉత్సవ కమిటీ పర్యవేక్షించింది.

దివ్యాంగులను ప్రేమతో ఆదరించాలి

మంగళగిరి టౌన్: దివ్యాంగులను హేళన చేయకుండా ప్రేమతో ఆదరించాలని మంగళగిరి ఎంఈఓ బాబు తెలిపారు. మండల పరిధిలోని కాజా వెంకటరెడ్డి పాలెం భవిత దివ్యాంగుల పాఠశాలలో బుధవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బాబు మాట్లాడుతూ దివ్యాంగులకు విద్య, స్వాభిమాన అభివృద్ధికి ప్రతి వ్యక్తి తోడ్పాటు అందించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు పలకలు, పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు.

ఫిరంగిపురంలో..

స్థానిక భవత సెంటర్‌లో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని ల్యాంప్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో రవికాంత్ పాల్గొని మాట్లాడుతూ దివ్యాంగులపై జాలి చూపించడానికి బదులుగా సమానమైన మనుషులుగా గుర్తించాలని తెలిపారు. దివ్యాంగ బాలలకు శానిటరీ కిట్, వినికిడి యంత్రాలు, వీల్ చైర్ అందజేశారు. కార్యక్రమంలో ల్యాంప్ సంస్థ డైరెక్టర్ కె.సాల్మన్ పాల్ పాల్గొన్నారు.

తాడేపల్లి రూరల్‌లో..

ముగ్గ రోడ్డులోని భవిత కేంద్రంలో విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా డెప్యూటీ విద్యాశాఖాధికారి జి. శాంతకుమారి పాల్గొన్నారు. ఎంఈవో డి.నాగేశ్వరరావు , పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివరామకృష్ణ, సహిత విద్యా ఉపాధ్యాయులు బి. హరికృష్ణ పాల్గొన్నారు.

దుగ్గిరాలలో..

మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్న 31 మంది దివ్యాంగ విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. హెచ్ఎం బి.వి. కృష్ణారావు, ఉపాధ్యాయులు విజయలక్ష్మి, ఆంథోని రాజు, వాసు, సుధా మాధురి, కోటేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మంత్రి లోకేష్‌ను కలిసిన సీపీఐ నాయకులు

మంగళగిరి టౌన్: మంగళగిరి నియోజకవర్గంలో నెలకొన్న పలు ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంత్రి నారా లోకేష్‌కు బుధవారం సీపీఐ నాయకులు ఆయన కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని మంత్రి లోకేష్ హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు మాల్యాద్రి, చిన్ని తిరుపతయ్య, కంచర్ల కాశయ్య, వెంకటేశ్వరరావు, జాలాది జాన్ బాబు, సుహాస్, శివప్రసాద్ పాల్గొన్నారు.

లాభదాయక పంటలపై అవగాహన

ఫిరంగిపురం: మండలంలోని నుదురుపాడు, 113.తాళ్లూరు గ్రామాల్లో రైతన్న మీ కోసంలో భాగంగా బుధవారం లాభదాయక పంటలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. లాం వ్యవసాయ శాస్త్రవేత్త శ్యామ్ రాజ్ నాయక్ మాట్లాడుతూ కాలానికి అనుగుణంగా పంట మార్పిడి చేసుకోవాలని, రబీలో సమృద్ధిగా నీరు ఉంటే మొక్కజొన్న సాగు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రత్యేకాధికారి హనుమంతరావు, ఈవో పీఆర్డీ వెంకటేశ్వరరావు, ఏవో వాసంతి, షేక్ సుభాని, పాల్గొన్నారు.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

RACPC మంగళగిరి బ్రాంచ్, 1వ అంతస్తు, CA-5, CRC బిల్డింగ్, ... మంగళగిరి, గుంటూరు జిల్లా-522503.

రూల్-8(1) **స్వాధీనత ప్రకటన** (స్థిరాస్తి కొరకు)

[illegible]

ఋణగ్రహీతలు, బకాయి, డిమాండ్ నోటీసు & స్వాధీనత నోటీసు తేదీలు మరియు ఆస్తుల వివరాలు

1. ఋణగ్రహీత పేరు & చిరునామా : ... గుంటూరు జిల్లా-522503. హోమ్ లోన్ అకౌంట్ నెం. 40641187352. చెల్లించవలసిన మొత్తం బకాయి : తేది.03.07.2025 నాటికి రూ. 4,23,674/- ... + తేది.04.07.2025 నుండి భవిష్యత్ వడ్డీ, ఖర్చులు, ఇతర ఛార్జీలు మొదలైనవి. డిమాండ్ నోటీసు తేది : 17.07.2025. స్వాధీనత నోటీసు తేది : 27.11.2025. [illegible]

2.–13. [illegible] స్వాధీనత నోటీసు తేది : 27.11.2025

తేది: 27.11.2025, ప్రదేశం: మంగళగిరి. సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

SBI భారతీయ స్టేట్ బ్యాంక్

SME పటమటలంక (63541), విజయవాడ, NTR జిల్లా

సంక్షిప్త డిమాండు నోటీసు

(I) ఋణగ్రహీతలు: మెస్సర్స్ ... GST.No.37CVDPK1763J1ZD [illegible]

(III) NPA తేది: 06.11.2025 డిమాండ్ నోటీసు తేది: 10.11.2025

(IV) [illegible] ... SARFAESI చట్టం ... [illegible]

తేది : 10.11.2025, ప్రదేశం : విజయవాడ. సం/- అధీకృత అధికారి, భారతీయ స్టేట్ బ్యాంక్

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25447 (మంగళగిరి)
7075167541 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com

క్లుప్తంగా...

అర్ధంతరంగా మరోమారు ఇంటర్వ్యూలు రద్దు

బాలల కమిషన్ నిర్లక్ష్య వైఖరిపై అభ్యర్థుల ఆగ్రహం

సాక్షి, అమరావతి: ఏపీ బాలల హక్కుల కమిషన్ నియామకంలో చంద్రబాబు ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోంది. గత ఏడు నెలలుగా నాన్చుతున్న కమిషన్ నియామకంలో తాజాగా మరోసారి ఇంటర్వ్యూలను రద్దు చేయడం ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి అద్దం పడుతోంది. ఇప్పటికే వాయిదాలతో నడుపుతున్న ఇంటర్వ్యూలను వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో ఈ నెల 3, 4, 5 తేదీల్లో ప్రాంతాల వారీగా నిర్వహించేందుకు అభ్యర్థులకు సమాచారం అందించారు. బుధవారం ఉదయం ఏడు గంటలకు ప్రారంభమయ్యే ఇంటర్వ్యూల కోసం ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి మంగళవారం సాయంత్రం అభ్యర్థులు బయలుదేరారు. ఇంతలోనే ఇంటర్వ్యూలు రద్దు చేస్తున్నామని, మరో తేదీ ప్రకటిస్తామంటూ మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు ఫోన్లు, మెయిళ్ల ద్వారా అభ్యర్థులకు మంగళవారం రాత్రి సమాచారం ఇచ్చారు. అయితే వాటిని చాలా మంది గమనించలేదు. అప్పటికే బయలుదేరిన వారంతా బుధవారం తెల్లారేసరికి విజయవాడ చేరుకుని ఇంటర్వ్యూల రద్దు విషయాన్ని తెలుసుకుని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీకాకుళం, పార్వతీపురం, అల్లూరి, విజయనగరం, విశాఖపట్నం తదితర జిల్లాల నుంచి వ్యయ ప్రయాసలకోర్చి వచ్చిన వారంతా నిరాశతో వెనుదిరిగారు. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో ఇబ్బందులు పడుతున్నామని వారంతా వాపోతున్నారు.

మదనపల్లిలో కేంద్రీయ విద్యాలయాన్ని ప్రారంభించండి

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కోరిన ఎంపీ మిథున్ రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: గతేడాది మదనపల్లిలో మంజూరైన కొత్త కేంద్రీయ విద్యాలయాన్ని ప్రారంభించాలని వైఎస్సార్‌సీపీ లోక్‌సభ పక్షనేత, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి కోరారు. బుధవారం ఆయన కేంద్ర విద్యాశాఖమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో భేటీ అయ్యారు. ఈ పాఠశాల ప్రస్తుత విద్యాసంవత్సరం నుంచి ప్రారంభించాల్సి ఉండగా.. పరిపాలనా కారణాల వల్ల ఆలస్యమైనట్టు కేంద్ర మంత్రి దృష్టికి తీసికెళ్లారు. 2026–27 విద్యా సంవత్సరం నుంచి విద్యాలయాన్ని ప్రారంభించాలని కేంద్రమంత్రిని కోరారు.

రఘురామకృష్ణరాజును అరెస్టు చేయాలి

విస్తృత దళిత సంఘాల ఐక్యవేదిక

సీతంపేట(విశాఖ): బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను ఎగవేసిన డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజును తక్షణమే అరెస్టు చేయాలని విస్తృత దళిత సంఘాల ఐక్యవేదిక (విదసం) రాష్ట్ర కన్వీనర్ బూసి వెంకటరావు డిమాండ్ చేశారు. విశాఖలో ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. దళిత వర్గానికి చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారి పి.వి. సునీల్‌కుమార్‌ను ఉద్యోగం నుంచి తొలగించాలంటూ ఫిర్యాదు చేయడం రఘురామకృష్ణరాజు గురివింద గింజ వైఖరికి నిదర్శనం అని మండిపడ్డారు. రఘురామకృష్ణరాజు ఇండ్ భారత్ థర్మల్ పవర్ పేరుతో వివిధ బ్యాంకుల నుంచి రూ.వెయ్యి కోట్లకు పైగా రుణం తీసుకొని ఎగవేశారని గుర్తు చేశారు. ఇలాంటి వ్యక్తి డిప్యూటీ స్పీకర్ పదవికి అనర్హులని.. వెంటనే పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

గంజాయి గ్యాంగ్‌లపై చర్యలేవి?: సీపీఎం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో గంజాయి గ్యాంగ్‌లపై చర్యలు తీసుకోవడంలో చంద్రబాబు ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయవాడలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే గంజాయి మాఫియాకు బలైన పెంచలయ్య కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై సీఎంని కలవడానికి అపాయింట్‌మెంట్ కోరామని, స్పందించకపోతే రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

విద్య, వైద్య రంగాల ప్రైవేటీకరణతో వ్యవస్థ ఛిద్రం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య

సాక్షి, అమరావతి: విద్య, వైద్య రంగాల ప్రైవేటీకరణతో వ్యవస్థ ఛిద్రం అవుతుందని, ప్రజల జీవన ప్రమాణాలు దిగజారిపోతాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య బుధవారం ఓ ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. పీపీపీ పద్ధతిలో 10 ప్రభుత్వ మెడికల్ కాలేజీలతోపాటు తొలివిడతగా 4 బోధనాసుపత్రులను ప్రైవేటుకు అప్పగించేందుకు చంద్రబాబు సర్కారు రంగం సిద్ధం చేయడం ఆందోళన కల్గిస్తోందన్నారు.

రోగులతో చెలగాటం!

కాకినాడ జీజీహెచ్‌లో కాలం చెల్లిన కిట్లతో స్క్రబ్ టైఫస్ పరీక్షలు





ఈ ఏడాది మార్చిలో కాలం చెల్లిన తర్వాత కాకినాడ వీఆర్‌డీఎల్ ల్యాబ్‌కు ఈనెల 1న తెచ్చిన ప్రాణాంతక హెపటైటిస్ నిర్ధారణ కిట్

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌లో ఉన్న వీఆర్‌డీఎల్ (వైరల్ రీసెర్చ్ అండ్ డయాగ్నస్టిక్ ల్యాబొరేటరీ)లో దారుణం జరుగుతోంది. ఎక్స్‌పైరీ అయిపోయిన రసాయనాల (రియేజంట్ల)తో స్క్రబ్ టైఫస్ పరీక్షలు చేసి, కొందరికి అసలు చేయకుండానే నకిలీ రిపోర్టులు ఇచ్చి ప్రజల్ని, అధికారుల్ని పచ్చి మోసం చేస్తున్న ఘటన వెలుగులోకి వచ్చింది. రెండు నెలలుగా ఈ తంతు కొనసాగుతుండడం తీవ్ర విస్మయానికి గురిచేస్తోంది. ఇన్నాళ్లుగా వచ్చిన నివేదికలన్నీ కేవలం సృష్టించినవేనన్న వాస్తవం కళ్లు బైర్లు కమ్మేలా చేస్తోంది. తీవ్ర కలకలం రేపుతున్న ఈ దారుణం వివరాలివీ..

కాకినాడ జీజీహెచ్‌లో ఉన్న వీఆర్‌డీఎల్ ల్యాబ్‌కు రాష్ట్రస్థాయి గుర్తింపు ఉంది. రీసెర్చ్ సైంటిస్ట్ హోదాలో పనిచేసే ఓ ఉద్యోగి కాసులకు కక్కుర్తిపడి స్క్రబ్ టైఫస్ పరీక్షలు చేసేందుకు రక్త నమూనాలు సేకరించి నకిలీ రిపోర్టులు ఇస్తున్నారు. వ్యాధి నిర్ధారణకు ఐజీఎం ఎలీసా (ఇమ్యునో గ్లోబలిన్ ఎం–ఎంజైమ్ లింక్డ్ ఇమ్యూనో సార్బెంట్ అస్సే) టెస్ట్ చేస్తారు. ఇందుకు కాలంచెల్లిన రియేజంట్లు వినియోగించి రోగుల ప్రాణాలను ప్రమాదంలోకి నెడుతున్నారు.

రెండు నెలలుగా ఇదే తంతు..

సాధారణంగా రక్త నమూనా ఇచ్చిన తర్వాత రక్తం నుంచి సీరంను వేరుచేసి ఎలీస్ ప్లేట్‌లో ఉన్న రంధ్రాల్లో వేస్తారు. అరగంట ఇంక్యుబేషన్ వ్యవధి చొప్పున కాంజ్యుగేట్, సబ్‌స్ట్రేట్ రియేజంట్లు వేస్తారు. ఇవే వ్యాధిని నిర్ధారిస్తాయి. అంతటి ప్రాధాన్యం ఉన్న రియేజంట్లను కాలం చెల్లినవి వాడి రెండు నెలలుగా తోచిన రిపోర్టును రాసి పంపిస్తున్నారు. అంతేకాక.. స్టేట్ పోర్టల్‌లోనూ ఈ కాకి లెక్కలే అప్‌డేట్ చేస్తుండడంతో యావత్ రాష్ట్రం ఈ గణాంకాలనే నిజమని నమ్ముతోంది.

రాష్ట్ర, జిల్లా వైద్య ఆరోగ్యశాఖలకు బురిడీ..

ఈ తప్పుడు నివేదికల ఆధారంగానే వైద్యం అందించడం, అందించకపోవడం జరుగుతోంది. రాష్ట్ర, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ విభాగాలను ఈ వీఆర్‌డీఎల్ ఉద్యోగి బురిడీ కొట్టించడం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశమైంది. రోగి వయసు, ప్రాంతం ఆధారంగా వ్యాధి సోకే అవకాశం ఉందా లేదా అన్న విషయాలపై ఓ అంచనాకు వచ్చేసి, నివేదికలు ఇస్తున్నారన్న విమర్శలు గుప్పుమంటున్నాయి. ఇన్నాళ్లూ ఇచ్చిన పాజిటివ్, నెగటివ్ నివేదికలు కల్పితాలేనన్న విషయం బట్టబయలవడంతో వైద్యులే నిర్ఘాంతపోతున్నారు.

ఎక్స్‌పైరీ రియేజంట్లు ఎందుకంటే..

కాలంచెల్లిన కిట్ల వినియోగం వెనుక రీసెర్చ్ సైంటిస్టదే కీలకపాత్ర. నెలన్నరకు పైగా జీజీహెచ్ స్టోర్స్ నుంచి రియేజంట్లు తీసుకోకుండా ఐసీఎంఆర్ (ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్) ఇచ్చిన అవకాశాన్ని అడ్డుపెట్టుకుని బయటి నుంచే కొంటున్నట్లు ఆయన చూపిస్తున్నారు. అవీ కాలం చెల్లినవి తెస్తున్నారు. పొరుగు ప్రాంతాల వారు పనికిరాక పక్కన పడేసిన కిట్లు ఉచితంగా లభిస్తుండడంతో అవి తెచ్చి నాణ్యమైనవి కొంటున్నట్లు బిల్లులు డ్రా చేస్తున్నారనే విమర్శలున్నాయి. పైగా.. ఒక్కో కిట్టు ధర కనీసం రూ.25 వేలు ఉంటుండగా రూ.లక్షల్లో ఆర్జిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఏ ఒక్క కిట్టుకీ లెక్కాపత్రం లేదు..

వైరాలజీ ల్యాబ్‌లో వినియోగిస్తున్న ఏ ఒక్క కిట్టుకీ తగిన లెక్కాపత్రం లేదు. ఈ తంతుపై పర్యవేక్షణ లోపించడంతో అక్కడ పనిచేస్తున్న రీసెర్చ్ సైంటిస్టుది ఆడింది ఆట పాడింది పాటగా సాగుతోంది. కిట్లు కాలం చెల్లినవి కావడంవల్ల కోల్డ్ చెయిన్‌ను మెయింటైన్ (నిర్దిష్ట శీతల ప్రక్రియ) చేయకుండానే జీజీహెచ్‌లోని ల్యాబ్‌కు చేరుతున్నాయి. ఇలా అందుకుంటున్న వాటికి ఎటువంటి బిల్లులుగానీ సరఫరా రశీదులుగానీ ఉండడంలేదు.

కోవిడ్, హెపటైటిస్ రియేజంట్లు కూడా..

ఇక కోవిడ్, హెపటైటిస్ సహా పలు ప్రాణాంతక రోగాలను నిర్ధారించే రియేజంట్లు కూడా కాలం చెల్లినవే వినియోగిస్తున్నారు. మరణించిన వ్యక్తికి కోవిడ్ పరీక్ష చేయాల్సి వస్తే పరీక్ష చేయకుండా లేదా కాలంచెల్లిన కిట్లతో చేసి, రిపోర్టు ఇస్తున్నారు. పోస్ట్‌మార్టం చేస్తున్న ఫోరెన్సిక్ వైద్యులు, మృతుడి కుటుంబీకుల ప్రాణాలకూ ముప్పుతెస్తున్నారు. ఈ ఏడాది మార్చిలో ఎక్స్‌పైర్ అయిన హెపటైటిస్ కిట్లను డిసెంబరు 1న తీసుకొచ్చి, హెపటైటిస్ పరీక్షలు చేస్తున్నారు. ఎక్స్‌పైరీ రియేజంట్లను తేదీ ముద్రించి ఉన్న ట్యూబ్‌ల నుంచి స్టిక్కర్ లేని ఖాళీ ట్యూబ్‌ల్లోకి నింపి శ్వాసకోశ సంబంధిత ప్రాణాంతక కోవిడ్ సహా ఫ్లూ–ఏ, ఫ్లూ–బీ, ఇన్‌ఫ్లూయెంజా, స్వైన్ ఫ్లూ, ఆర్ఎస్‌వీ–ఏ, ఆర్ఎస్‌వీ–బీ, హ్యూమన్ రినోవైరస్ వంటి ముఖ్యమైన పరీక్షలు చేస్తున్నారు. మరోవైపు.. రోగులు కూడా జీజీహెచ్ నివేదికలకు, బయట ప్రైవేటు ల్యాబ్‌ల నివేదికలకు తేడాలు ఉంటున్నాయని వాపోతున్నారు.

ఆ కేసులు నిజమా.. కాకిలెక్కలా?

ఇదిలా ఉంటే.. జిల్లా వ్యాప్తంగా స్క్రబ్ టైఫస్ వ్యాప్తి విస్తృతంగా ఉంది. వీఆర్‌డీఎల్ ల్యాబ్ గణాంకాల ఆధారంగానే ఈ వ్యాప్తిని నిర్ధారిస్తున్నారు. రీసెర్చ్ సైంటిస్ట్ ఇచ్చిన నివేదిక ప్రకారం మొత్తం 151 మందికి స్క్రబ్ టైఫస్ సోకిందని.. నవంబరు, డిసెంబరులో 45 కేసులు నమోదయ్యాయని చెబుతున్నారు. అసలు ఈ లెక్కల సంగతి ఏంటని జీజీహెచ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. అవి నిజం లెక్కలా లేక కాకి లెక్కలా తెలీక గందరగోళంలో పడ్డారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకించండి

- మన రైతుల సమస్యలను దేశం దృష్టికి తీసుకెళ్లండి
- టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలును డిమాండ్ చేసిన నెటిజన్లు
- సమస్యలు చెబితే పార్లమెంట్‌లో చర్చిస్తానంటూ సోషల్ మీడియాలో లావు పోస్ట్
- చంద్రబాబు పాలనలో అరాచకాలను ఏకరువు పెట్టిన నెటిజన్లు

సాక్షి, అమరావతి: చంద్రబాబు పాలనలో రాష్ట్రంలో నెలకొన్న అరాచకాలు, అక్రమాలను పార్లమెంట్‌లో లేవనెత్తాలని.. మెడికల్ కాలేజీలు, స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గళం విప్పాలని డిమాండ్ చేస్తూ టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలుకు నెటిజన్లు షాక్ ఇచ్చారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాల నేపథ్యంలో 'సమస్యలు తెలియజేయండి.. పార్లమెంట్‌లో చర్చిస్తా..' అంటూ లావు శ్రీకృష్ణదేవరాయలు సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఆయనకు నెటిజన్లు దిమ్మతిరిగే షాక్ ఇచ్చారు. రాష్ట్రంలో జరుగుతున్న అక్రమాలు, అరాచకాలు, పీపీపీ ముసుగులో ప్రభుత్వ సంపదను ప్రైవేట్‌కు దోచిపెట్టడుతున్న తీరును పార్లమెంట్‌లో చర్చించాలంటూ కామెంట్‌లు, పోస్టులతో విరుచుకుపడ్డారు. వైఎస్ జగన్ ప్రభుత్వం అభివృద్ధి చేసిన ప్రభుత్వ వైద్య కళాశాలలను చంద్రబాబు సర్కార్ ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టడంపై మండిపడ్డారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పార్లమెంట్‌లో గళం వినిపించాలని కోరారు. 'వైద్య కళాశాలలను పరిరక్షించండి.. పీపీపీని అడ్డుకోండి' అంటూ పోస్టులు పెట్టారు. అలాగే రాష్ట్రంలో మహిళలు, చిన్నారులపై జరుగుతున్న అఘాయిత్యాలు, అధికార పార్టీ నాయకుల దౌర్జన్యాలు, కరువైన శాంతిభద్రతలపైనా పార్లమెంట్‌లో మాట్లాడాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ నాయకులు మహిళలు, ప్రతిపక్ష పార్టీ నాయకులపై దాడులకు దిగిన వీడియోలను సైతం 'ఎక్స్'లో ట్యాగ్ చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా రాబట్టేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలని మరికొందరు కోరారు. పంటలకు మద్దతు ధరలు లేక రాష్ట్ర రైతులు పడుతున్న ఇబ్బందులను దేశం దృష్టికి తీసుకెళ్లాలని ఇంకొందరు తమ పోస్టుల ద్వారా కోరారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయకుండా పోరాడాలని పలువురు నెటిజన్లు డిమాండ్ చేశారు.

పెళ్లి పేరుతో ఎన్టీఆర్ ట్రస్ట్ ఉద్యోగి మోసం

- నగ్న వీడియోలు, ఫొటోల పేరిట బెదిరింపు
- బాధితురాలి నుంచి రూ.34 లక్షలు వసూలు

నరసరావుపేట టౌన్: ఓ ప్రబుద్ధుడు పెళ్లి పేరుతో మహిళను మోసం చేసి రూ.34 లక్షలు కాజేశాడు. తీసుకున్న డబ్బులు అడిగిన బాధితురాలిని నగ్నంగా ఉన్న వీడియోలు సోషల్ మీడియాలో పెట్టటంతో పాటు చంపేస్తానని బెదిరింపులకు దిగాడు. ఈ మేరకు బాధితురాలిచ్చిన ఫిర్యాదుతో ఎన్టీఆర్ ట్రస్ట్ ఉద్యోగి జగదీష్ చౌదరిపై వన్‌టౌన్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన యువతి హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తోంది. ఆమెకు నరసరావుపేటకు చెందిన పెదవల్లి జగదీష్ చౌదరి 2024లో ఫేస్ బుక్ ద్వారా పరిచయం అయ్యాడు. తాను హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ట్రస్ట్‌లో ఉద్యోగం చేస్తున్నట్లుగా చెప్పాడు. ఇద్దరి మధ్య స్నేహం ప్రేమగా మారింది. పెళ్లి చేసుకుందామని ఇద్దరూ నిర్ణయించుకొని ఈ ఏడాది మార్చి హైదరాబాద్‌లోని ప్రగతినగర్‌లో ఇల్లు అద్దెకు తీసుకొని కొంతకాలం కలిసి ఉన్నారు. జూలైలో యువతి గర్భం దాల్చటంతో జగదీష్‌ను పెళ్లి చేసుకోమని ఒత్తిడి చేసింది. ఈ ఏడాది ఆగస్టు 9న ఆమెను తిరుపతి తీసుకెళ్లాడు. అక్కడ అద్దెకు దిగిన గదిలో మెడలో పసుపుకొమ్ము కట్టి పెళ్లి చేసుకున్నట్లు నమ్మించాడు. తర్వాత నరసరావుపేట తీసుకొచ్చి యువతిని వారి ఇంటివద్ద వదిలి వెళ్లాడు. అప్పటి నుంచి యువతి ఫోన్ నంబర్‌ను జగదీష్ బ్లాక్ చేశాడు. దీంతో ఆందోళన చెందిన యువతి జగదీష్ హైదరాబాద్‌లో ఉన్నాడని తెలిసి అక్కడకు వెళ్లింది. తన వద్ద వ్యాపార అవసరాల నిమిత్తం జగదీష్ దఫాల వారీగా తీసుకున్న రూ.29 లక్షలు తిరిగి ఇవ్వాలని అడిగింది. దీంతో జగదీష్ నగ్న ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో పెడతానని, ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరింపులకు దిగాడు. డబ్బులు ఇస్తే వాటిని డిలీట్ చేస్తానని చెప్పటంతో యువతి మరో రూ.5 లక్షలు ఇచ్చింది. అప్పటి నుంచి జగదీష్ ఫోన్ స్విచ్ఆఫ్ చేసి వెళ్లిపోయాడు. మోసపోయానని గ్రహించిన బాధితురాలు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ షేక్ ఫిరోజ్ తెలిపారు.

బాలాజీ రైల్వే డివిజన్‌ను ఏర్పాటు చేయండి

రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కోరిన వైఎస్సార్‌సీపీ ఎంపీలు గురుమూర్తి, రఘునాథరెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: తిరుపతి కేంద్రంగా 'బాలాజీ రైల్వే డివిజన్' ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని వైఎస్సార్‌సీపీ కోరింది. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు, రైల్వే స్టాండింగ్ కమిటీ సభ్యుడు మేడ రఘునాథ రెడ్డి, లోక్‌సభ సభ్యుడు డాక్టర్ మద్దిల గురుమూర్తి కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను సోమవారం పార్లమెంట్‌లో కలిసి లేఖ అందచేశారు. తిరుపతి ప్రాంత రైల్వే వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని వివరించారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న బాలాజీ రైల్వే డివిజన్‌ను తిరుపతి కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరారు. దేశంలోనే తిరుపతి అత్యంత రద్దీ ఉన్న పుణ్యక్షేత్రమని వివరించారు. రైల్వే లైన్లు పలు డివిజన్లలో విభజించబడడంతో పరిపాలనా సమస్యలు, పనుల అనుమతుల కోసం జాప్యం జరుగుతోందన్నారు. దీంతో సేవల నాణ్యతలో లోపాలు ఎదురవుతున్నాయని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. తిరుపతి రైల్వే స్టేషన్ కూడా రూ.300 కోట్లతో అప్‌గ్రేడేషన్ చేస్తుండడంతో బాలాజీ డివిజన్ ఏర్పాటు అవసరాన్ని మరింత బలపరుస్తుందని స్పష్టం చేశారు.

ఏపీ ఇన్ పార్లమెంట్

లోక్‌సభ

రాష్ట్రంలో 38 ఖనిజ అన్వేషణ ప్రాజెక్టులు

లోక్‌సభలో వైఎస్సార్‌సీపీ లోక్‌సభ పక్ష నేత, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ప్రశ్నకు కేంద్రం జవాబు

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో కీలకమైన ఖనిజ నిక్షేపాల కోసం 38 అన్వేషణ ప్రాజెక్టులను చేపట్టినట్లు కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. 2022–23 నుంచి జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) ఈ పనిచేస్తున్నట్లు చెప్పారు. లోక్‌సభలో బుధవారం వైఎస్సార్‌సీపీ లోక్‌సభా పక్ష నేత, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబిచ్చారు. విజయనగరం, నెల్లూరు, శ్రీకాకుళం, పశ్చిమ గోదావరి జిల్లాల్లో మాలిబ్డినం, గ్రాఫైట్, కోబాల్ట్, లిథియం, ఫాస్ఫరైట్ వంటి కీలకమైన ఖనిజాల కోసం జీఎస్ఐ ఈ ప్రాజెక్టులను చేపట్టిందని వివరించారు. తూర్పుగోదావరి, అల్లూరి సీతారామరాజు, అనంతపురం, విజయనగరం, వైఎస్సార్ జిల్లాలో గ్రాఫైట్, టంగ్‌స్టన్, కోబాల్ట్, కాడ్మియం వంటి కీలకమైన ఖనిజాల కోసం వనరులను పెంచినట్లు తెలిపారు. అదేవిధంగా నేషనల్ మినరల్ ఎక్స్‌ప్లోరేషన్ అండ్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఎన్ఎంఈడీటీ) రాష్ట్రంలో 17 ఖనిజ అన్వేషణ ప్రాజెక్టులను ఆమోదించిందన్నారు. వైఎస్సార్ కడప, ప్రకాశం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో ఈ ప్రాజెక్టులున్నట్లు చెప్పారు. బీచ్ ఇసుక ఖనిజాల కోసం మైనింగ్ లీజు మంజూరు చేయడానికి కేంద్రప్రభుత్వం ముందస్తు అనుమతులను మంజూరు చేసిందని తెలిపారు.

ఎండ తీవ్రతను ముందే చెప్పే సూపర్ సిస్టమ్

ఒక్క క్లిక్‌తో ఐఎండీ జిల్లాల వారీగా ఎండ తీవ్రతను ముందే చెబుతుందని కేంద్ర సైన్స్, టెక్నాలజీ, ఎర్త్‌సైన్స్ అండ్ రీసర్చ్ సైన్సెస్ సహాయమంత్రి డాక్టర్ జితేంద్రసింగ్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. ఐఎండీ పోర్టల్‌లో ప్రతి జిల్లా, ప్రతి నగరంలోని వార్డు స్థాయిలోని ఎండతీవ్రత, ఐదు రోజుల ముందస్తు అంచనాలను మ్యాప్‌లపై చూపిస్తున్నట్లు చెప్పారు. ఈ పోర్టల్‌లో రంగుల కోడ్‌లతో (పసుపు, నారింజ, ఎరుపు) హెచ్చరికలు ఉంటాయన్నారు. ఎక్కడ ఎంత ప్రమాదం ఉందో ఆ ప్రమాదాన్ని ఎర్రరంగులో సూచిస్తుందన్నారు. 13 ప్రధాన వాతావరణ ప్రమాదాలపై (హీట్‌వేవ్‌తో సహా) భారతదేశానికి ప్రత్యేకమైన 'క్లైమేట్ హజార్డ్స్ అండ్ వల్నరబిలిటీ అట్లాస్' ను ఐఎండీ తయారు చేసిందన్నారు. ఈ అట్లాస్‌లో ప్రతి జిల్లాకు నెలవారీ, సంవత్సరవారీగా ఎండతీవ్రత, ప్రమాదస్థాయి, జనాభా హాని సామర్థ్యం మ్యాప్ చేసినట్లు చెప్పారు.

ఖర్చులు తగ్గిస్తున్నాం

5జీకి అవసరమైన ఫైబర్ సైజేషన్‌కు, రైట్ ఆఫ్ వే అనుమతుల్లో జాప్యం, ఖర్చులను తగ్గించేందుకు కేంద్రం అనేక చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర కమ్యూనికేషన్స్, గ్రామీణాభివృద్ధిశాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజారాణి ప్రశ్నకు మంత్రి బదులిస్తూ.. ఇందుకోసం 2022లో సింగిల్‌విండో ప్లాట్‌ఫామ్‌గా సెంట్రలైజ్డ్ రైట్ ఆఫ్ వే పోర్టల్ (ఆర్‌ఓడబ్ల్యూ)ను ప్రారంభించినట్లు చెప్పారు.

సోలార్ మైక్రో-గ్రిడ్‌ల ప్రతిపాదనలు లేవు

తిరుపతి జిల్లాలోని విపత్తులకు గురయ్యే ప్రాంతాల్లో వికేంద్రీకృత సోలార్ మైక్రో–గ్రిడ్‌ల ఏర్పాటు ప్రతిపాదనలేవీ పరిశీలనలో లేవని వైఎస్సార్‌సీపీ ఎంపీ మద్దిల గురుమూర్తి ప్రశ్నకు కేంద్ర పునరుత్పాదకశక్తి శాఖ సహాయమంత్రి యశోనాయక్ సమాధానమిచ్చారు.

ఏపీలో మూడేళ్లలో 6,557 సైబర్ క్రైం కేసులు

వైఎస్సార్‌సీపీ ఎంపీ పరిమళ్‌నత్వానీ ప్రశ్నకు కేంద్రం జవాబు

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో 2021–23 మధ్య 6,557 సైబర్ క్రైం కేసులు నమోదైనట్లు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ చెప్పారు. రాజ్యసభలో బుధవారం వైఎస్సార్‌సీపీ ఎంపీ పరిమళ్‌నత్వానీ ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. 2021లో 1,875 కేసులు, 2022లో 2,341 కేసులు, 2023లో 2,341 సైబర్ క్రైం కేసులు నమోదైనట్లు వివరించారు. ఇదేకాలంలో దేశవ్యాప్తంగా 2.52 లక్షల కేసులు నమోదైనట్లు చెప్పారు.

మాదకద్రవ్యాలతో మృత్యువాత



అధిక మోతాదులో మాదకద్రవ్యాలు తీసుకోవడం వల్ల యువత మృత్యువాత పడుతున్నట్లు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి నిత్యానందరాయ్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ ఎస్.నిరంజన్‌రెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. ఎన్‌సీఆర్‌బీ నివేదిక ప్రకారం దేశంలో 2021లో 737 మంది, 2022లో 681 మంది, 2023లో 654 మంది మొత్తం 2,173 మంది నిషేధిత మాదకద్రవ్యాలు అధిక మోతాదులో తీసుకోవడం వల్ల మృతిచెందినట్లు వివరించారు.

దేశంలో 1,04,125 సింగిల్ టీచర్ పాఠశాలలు

2024–25 నివేదిక ప్రకారం దేశంలో 1,04,125 సింగిల్ టీచర్ పాఠశాలలు ఉన్నట్లు నిరంజన్‌రెడ్డి మరోప్రశ్నకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రదాన్ జవాబిచ్చారు.

తుపాను నష్టం అంచనా రూ.6,355 కోట్లు



మోంథా తుపాను వల్ల ఆంధ్రప్రదేశ్‌లో రూ.6,355.60 కోట్ల నష్టం జరిగినట్లు రాష్ట్ర ప్రభుత్వం నివేదిక ఇచ్చినట్లు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి నిత్యానంద్ రాయ్ చెప్పారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ గొల్ల బాబురావు ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. ఇందుకుగాను రూ.902 కోట్లు తక్షణ సహాయం చేయాలని ఏపీ ప్రభుత్వం కోరినట్లు తెలిపారు.

రాజ్యసభ

సైబర్ నేరాల్లో తెలంగాణ టాప్

రాజ్యసభలో వెల్లడించిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

సాక్షి, న్యూఢిల్లీ: సైబర్ నేరాల్లో తెలంగాణ దేశంలోనే టాప్–1గా నిలిచింది. రాష్ట్రంలో అత్యధికంగా సైబర్ నేరాలు జరుగుతున్నట్టు పార్లమెంట్ సాక్షిగా స్పష్టమైంది. మూడేళ్లలో దాదాపు 43వేలకు పైగా సైబర్ కేసులు నమోదైనట్టు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చెప్పారు. అత్యల్పంగా మూడేళ్లలో మూడే కేసులు నమోదైన ప్రాంతంగా లక్షద్వీప్ నిలిచింది. 2021–23 మధ్య దేశంలో జరిగిన సైబర్ నేరాలపై రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ పరిమళ్ నత్వానీ అడిగిన ప్రశ్నకు బండి సంజయ్ లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు. టాప్–1లో తెలంగాణ నిలవగా, ఆ తర్వాతి స్థానాల్లో కర్ణాటక, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, బిహార్‌లు ఉన్నాయి.

మూడేళ్లలో ఇలా....

2021–23 వ్యవధిలో తెలంగాణలో 43,836 కేసులు నమోదు అయ్యాయి. 18 రకాల సైబర్ నేరాలు ఉన్నట్టు హోంశాఖ తెలిపింది. గుర్తు తెలియని వారు అమాయకులకు ఫోన్లు చేసి బెదిరింపులకు గురి చేసి డబ్బు దోచుకున్నట్టు పేర్కొంది. 2021లో 10,303, 2022లో 15,297, 2023లో 18,236 మొత్తం మూడేళ్లలో 43,836 కేసులు నమోదు అయ్యాయి.

ముడి పొగాకుపై ఏకీకృత సుంకంతో మేలు

వైఎస్సార్‌సీపీ ఎంపీ డాక్టర్ గురుమూర్తి

పొగాకు ఉత్పత్తులపై కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సెంట్రల్ ఎక్సైజ్ (సవరణ) బిల్లు–2025కి తమ పార్టీ మద్దతు ఇస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ ఎంపీ మద్దిల గురుమూర్తి చెప్పారు. ఈ బిల్లుపై బుధవారం లోక్‌సభలో జరిగిన చర్చలో ఆయన పాల్గొన్నారు. 2017లో జీఎస్టీ అమల్లోకి వచ్చిన తర్వాత కేవలం పొగాకు, దాని అనుబంధ ఉత్పత్తులపై మాత్రమే ఎక్సైజ్ సుంకం ఉండేదని, ఇప్పుడు జీఎస్టీ పరిహారం సెస్‌ల గడువు ముగుస్తున్న నేపథ్యంలో.. ఆ భారాన్ని కోర్ ఎక్సైజ్‌లోకి మార్చడం ద్వారా కేంద్రం ఆర్థిక వెసులుబాటును పెంచుకుందని చెప్పారు. అన్నిరకాల అన్–మాన్యుఫాక్చర్డ్ (ముడి) పొగాకుపై ఏకీకృత సుంకం విధించడం వల్ల వివాదాలు తగ్గి, రైతులకు, వ్యాపారులకు నిబంధనలు పాటించడంలో సులభతరం అవుతుందన్నారు. నమిలే పొగాకు, సువాసనల పొగాకు ఉత్పత్తులపై అధిక సుంకాలు విధించడం ద్వారా ఆదాయంతో పాటు ప్రజారోగ్య లక్ష్యాలను కూడా చేరుకోవచ్చన్నారు. ఈ చట్టానికి సంబంధించి కొన్ని అంశాలపై కేంద్రం నుంచి స్పష్టత కావాలని చెప్పారు. పన్ను ఎగ్గొట్టేందుకు సిగరెట్ల పొడవును 65 ఎం.ఎం, 70 ఎం.ఎం, 75 ఎం.ఎం.గా తప్పుగా చూపిస్తూ మిస్–డిక్లరేషన్ చేసే అవకాశం ఉందని, దీన్ని అరికట్టడానికి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటోందని ప్రశ్నించారు. తక్కువ పన్ను ఉన్న కట్–టొబాకోను.. ఎక్కువ పన్ను ఉండే నమిలే పొగాకుగా మార్చి తరలిస్తున్నారని, దీన్ని ఎలా నివారిస్తారని ఆయన అడిగారు.

భూగర్భ జలాల రక్షణ అవసరం

వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి



కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నీటికాలుష్య నివారణ, నియంత్రణ సవరణ చట్టం–2024కు వైఎస్సార్‌సీపీ మద్దతు ఇస్తున్నట్లు ఆ పార్టీ ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి చెప్పారు. ఈ బిల్లుపై రాజ్యసభలో బుధవారం జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ 50 ఏళ్ల నాటి నీటిచట్టాన్ని సవరించి ఆధునిక ప్రమాణాలకు అనుగుణంగా మార్పులు తీసుకురావడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. అయితే ఈ బిల్లులో భూగర్భ జలాల రక్షణను విస్మరించడం సరికాదని చెప్పారు. దేశంలో 50 శాతానికిపైగా ప్రజలు భూగర్భ జలాలపైనే ఆధారపడి ఉన్నారని, కానీ ప్రస్తుత సవరణ చట్టం కేవలం ఉపరితల నీటికాలుష్యంపైనే దృష్టి సారించిందని ఆవేదన వ్యక్తం చేశారు. భూగర్భ జలాల రక్షణ కోసం చట్టంలో ప్రత్యేక అధ్యాయం ఉండాలని డిమాండ్ చేశారు. పారిశ్రామికవాడల్లో ఎఫ్లూయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు లేకపోవడం వల్ల ఆ వ్యర్థాలన్నీ నేరుగా నదుల్లో కలుస్తున్నాయని, ప్రతి పారిశ్రామికవాడలో సెంట్రల్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేసి రియల్ టైమ్ డేటాతో అనుసంధానించాలని సూచించారు. అంతేగాక మనం పవిత్రంగా పూజించే గంగ, కృష్ణా వంటి నదులను మున్సిపాలిటీలు, పంచాయతీల నుంచి వచ్చే వ్యర్థాలతో కలుషితం చేస్తున్నామన్నారు. దీన్ని అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

11 కోహ్లి వరుసగా రెండు వన్డేల్లో సెంచరీలు సాధించడం ఇది 11వ సారి.

34 కోహ్లి తన వన్డే కెరీర్‌లో 34 వేర్వేరు వేదికల్లో సెంచరీ సాధించాడు. సచిన్ కూడా 34 వేదికల్లో శతకాలు బాదాడు.

44 ఒకే వన్డే ఇన్నింగ్స్‌లో ఇద్దరు భారత ఆటగాళ్లు సెంచరీలు చేయడం ఇది 44వ సారి.

3 దక్షిణాఫ్రికాపై మూడుసార్లు వన్డేల్లో ఇద్దరు భారత ఆటగాళ్లు సెంచరీలు చేయగా.. మూడుసార్లూ భారత్ ఓడిపోవడం గమనార్హం. 1991 నవంబర్ 14న న్యూఢిల్లీలో జరిగిన మ్యాచ్‌లో రవిశాస్త్రి, సంజయ్ మంజ్రేకర్... 2001 అక్టోబర్ 5న జొహన్నెస్‌బర్గ్‌లో జరిగిన మ్యాచ్‌లో సచిన్ టెండూల్కర్, సౌరవ్ గంగూలీ సెంచరీలు చేశారు. ఈ రెండింటిలోనూ భారత్ ఓటమి పాలైంది.

2 రుతురాజ్ గైక్వాడ్ టి20 (2023 నవంబర్ 28న ఆస్ట్రేలియాపై గువాహటిలో 123 నాటౌట్), వన్డే (2025 డిసెంబర్ 3న రాయ్‌పూర్‌లో దక్షిణాఫ్రికాపై 105) ఫార్మాట్‌లలో తన తొలి సెంచరీ చేసిన రెండు సందర్భాల్లోనూ భారత్ ఓడిపోయింది.

2 వన్డేల్లో భారత్‌పై అత్యధిక లక్ష్యాన్ని ఛేదించిన రెండో జట్టుగా దక్షిణాఫ్రికా నిలిచింది. 2019లో మొహాలీలో జరిగిన వన్డేలోనూ ఆస్ట్రేలియా 359 పరుగుల లక్ష్యాన్ని ఛేదించి గెలిచింది.

మార్క్‌రమ్

358 సరిపోలేదు

రెండో వన్డేలో భారీ లక్ష్యాన్ని ఛేదించిన దక్షిణాఫ్రికా ● 4 వికెట్లతో భారత్ పరాజయం
కోహ్లి, రుతురాజ్ సెంచరీలు వృథా ● వైజాగ్‌లో శనివారం చివరి వన్డే

కోహ్లి

విరాట్ కోహ్లి తన అసాధారణ ఫామ్‌ను కొనసాగిస్తూ వన్డేల్లో 53వ సెంచరీతో చెలరేగాడు. అండగా రుతురాజ్ గైక్వాడ్ వన్డే కెరీర్‌లో తొలి శతకాన్ని అందుకున్నాడు. జట్టు గత మ్యాచ్‌లోకంటే మరో 9 పరుగులు ఎక్కువే చేసింది. అయినా సరే, రెండో వన్డేలో భారత్‌కు ఓటమి తప్పలేదు. రాంచీలో విజయానికి చేరువగా వచ్చి ఆగిపోయిన సఫారీలు ఈసారి రాయ్‌పూర్‌లో పట్టు వదల్లేదు. ఏకంగా 359 పరుగుల లక్ష్యాన్ని ఛేదించి సిరీస్‌ను సమం చేశారు. మార్క్‌రమ్, బ్రెవిస్, బ్రీట్‌కే బ్యాటింగ్ జోరుతో పాటు బౌలర్ల వైఫల్యం, అతి పేలవ ఫీల్డింగ్‌తో భారత్ నుంచి మ్యాచ్ చేజారింది.

రాయ్‌పూర్: భారత్, దక్షిణాఫ్రికా మధ్య వన్డే సిరీస్ 1–1తో సమమైంది. బుధవారం జరిగిన రెండో వన్డేలో దక్షిణాఫ్రికా 4 వికెట్ల తేడాతో భారత్‌ను ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 358 పరుగులు చేసింది. విరాట్ కోహ్లి (93 బంతుల్లో 102; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) వరుసగా రెండో శతకంతో చెలరేగగా... రుతురాజ్ గైక్వాడ్ (83 బంతుల్లో 105; 12 ఫోర్లు, 2 సిక్స్‌లు) దూకుడుగా ఆడి కెరీర్‌లో తొలి సెంచరీ సాధించాడు. కోహ్లి, రుతురాజ్ మూడో వికెట్‌కు 26 ఓవర్లలో 156 పరుగులు జోడించగా, చివర్లో కేఎల్ రాహుల్ (43 బంతుల్లో 66 నాటౌట్; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) ధాటిని ప్రదర్శించాడు. అనంతరం దక్షిణాఫ్రికా 49.2 ఓవర్లలో 6 వికెట్లకు 362 పరుగులు సాధించింది. మార్క్‌రమ్ (98 బంతుల్లో 110; 10 ఫోర్లు, 4 సిక్స్‌లు) సెంచరీ నమోదు చేయగా... మాథ్యూ బ్రీట్‌కే (64 బంతుల్లో 68; 5 ఫోర్లు), డెవాల్డ్ బ్రెవిస్ (34 బంతుల్లో 54; 1 ఫోర్, 5 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. సిరీస్ ఫలితాన్ని తేల్చే చివరి వన్డే శనివారం విశాఖపట్నంలో జరుగుతుంది.

రుతురాజ్

భారీ భాగస్వామ్యం...

ఓపెనర్ యశస్వి జైస్వాల్ (22) జాగ్రత్తగా ఇన్నింగ్స్ మొదలు పెట్టగా... బర్గర్ ఓవర్లో మూడు ఫోర్లు కొట్టిన రోహిత్ శర్మ (14) అదే ఓవర్లో వెనుదిరిగాడు. కొద్ది సేపటికే జైస్వాల్ కూడా అవుటయ్యాడు. అయితే కోహ్లి, రుతురాజ్ భారీ భాగస్వామ్యంతో జట్టును నడిపించారు. సిక్స్‌తో ఖాతా తెరిచిన కోహ్లి ఆ తర్వాత తనదైన శైలిలో కొన్ని చక్కటి షాట్లు ఆడాడు. తొలి 10 ఓవర్లలో భారత్ 66 పరుగులు చేసింది. గత మ్యాచ్‌లో అవకాశం వృథా చేసుకున్న రుతురాజ్ ఈసారి పట్టుదలగా నిలబడి పరుగులు సాధించాడు. ఇద్దరిలో ముందుగా రుతురాజ్ 52 బంతుల్లో, ఆ తర్వాత కోహ్లి 47 బంతుల్లో అర్ధ సెంచరీ మార్క్‌ను అందుకున్నారు. అనంతరం మరింత జోరు పెంచిన రుతురాజ్... మహరాజ్ ఓవర్లో 2 ఫోర్లు, సిక్స్ బాదాడు. యాన్సెన్ బౌలింగ్‌లో లాంగాన్ మీదుగా కొట్టిన సిక్స్ అతని ఇన్నింగ్స్‌లో హైలైట్‌గా నిలిచింది. మరోవైపు బాష్ ఓవర్లో 3 ఫోర్లు కొట్టిన రుతురాజ్ 77 బంతుల్లోనే తన తొలి శతకాన్ని అందుకొని సంబరాలు చేసుకున్నాడు. 50 నుంచి 100కు చేరేందుకు అతను 25 బంతులే తీసుకున్నాడు. సెంచరీ తర్వాత రుతురాజ్ అవుట్ కాగా... యాన్సెన్ ఓవర్లో సింగిల్‌తో కోహ్లి సెంచరీ (90 బంతుల్లో) పూర్తయింది. ఆవెంటనే కోహ్లి వెనుదిరిగాడు. సుందర్ (1) విఫలం కాగా, రాహుల్, రవీంద్ర జడేజా (24 నాటౌట్) కలిసి స్కోరును 350 పరుగులు దాటించారు. ఈ క్రమంలో రాహుల్ 33 బంతుల్లోనే హాఫ్ సెంచరీని అందుకోగా, ఆఖరి 10 ఓవర్లలో భారత్ 76 పరుగులు రాబట్టగలిగింది.

బ్రెవిస్ దూకుడు...

దక్షిణాఫ్రికా టాప్–5లో డికాక్ (8) మినహా మిగతా వారంతా లక్ష్య ఛేదనలో తమవంతు పాత్ర పోషించారు. జట్టు ఇన్నింగ్స్‌లో ఒక సెంచరీ, రెండు అర్ధ సెంచరీ భాగస్వామ్యాలు ఉన్నాయి. తొలి వికెట్ కోల్పోయిన తర్వాత మార్క్‌రమ్, బవుమా కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. ముఖ్యంగా చాలా కాలం తర్వాత చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్ ఆడిన మార్క్‌రమ్ భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్నాడు. 88 బంతుల్లోనే అతని సెంచరీ పూర్తయింది. అతను అవుటయ్యే సమయానికి దక్షిణాఫ్రికా స్కోరు 30 ఓవర్లలో 197/3. మిగిలిన 20 ఓవర్లలో 8.10 రన్‌రేట్‌తో 162 పరుగులు అసాధ్యంగా కనిపించింది! అయితే ఇక్కడే బ్రెవిస్ ఆట స్వరూపాన్ని మార్చాడు. కుల్దీప్, హర్షిత్ బౌలింగ్‌లో చెరో రెండు చొప్పున మొత్తం ఐదు సిక్సర్లు బాదడంతో చేయాల్సిన రన్‌రేట్ ఒక్కసారిగా తగ్గిపోయింది. బ్రెవిస్, బ్రీట్‌కే నాలుగో వికెట్‌కు 64 బంతుల్లోనే 92 పరుగులు జోడించారు. ఆ తర్వాత భారత బౌలర్లు కాస్త కట్టడి చేయగలిగినా... కార్బిన్ బాష్ (15 బంతుల్లో 29 నాటౌట్; 4 ఫోర్లు) నిలిచి మ్యాచ్‌ను ముగించాడు.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) బాష్ (బి) యాన్సెన్ 22; రోహిత్ (సి) డికాక్ (బి) బర్గర్ 14; కోహ్లి (సి) మార్క్‌రమ్ (బి) ఎన్‌గిడి 102; రుతురాజ్ (సి) జోర్జి (బి) యాన్సెన్ 105; రాహుల్ (నాటౌట్) 66; సుందర్ (రనౌట్) 1; జడేజా (నాటౌట్) 24; ఎక్స్‌ట్రాలు 24; **మొత్తం (50 ఓవర్లలో 5 వికెట్లకు) 358. వికెట్ల పతనం:** 1–40, 2–62, 3–257, 4–284, 5–289. **బౌలింగ్:** బర్గర్ 6.1–0–43–1, ఎన్‌గిడి 10–1–51–1, యాన్సెన్ 10–0–63–2, మహరాజ్ 10–0–70–0, బాష్ 8–0–79–0, మార్క్‌రమ్ 5.5–0–48–0.

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: మార్క్‌రమ్ (సి) రుతురాజ్ (బి) హర్షిత్ 110; డికాక్ (సి) సుందర్ (బి) అర్ష్‌దీప్ 8; బవుమా (సి) హర్షిత్ (బి) ప్రసిధ్ 46; బ్రీట్‌కే (ఎల్బీ) (బి) ప్రసిధ్ 68; బ్రెవిస్ (సి) జైస్వాల్ (బి) కుల్దీప్ 54; జోర్జి (రిటైర్డ్‌హర్ట్) 17; యాన్సెన్ (సి) రుతురాజ్ (బి) అర్ష్‌దీప్ 2; బాష్ (నాటౌట్) 29; మహరాజ్ (నాటౌట్) 10; ఎక్స్‌ట్రాలు 18; **మొత్తం (49.2 ఓవర్లలో 6 వికెట్లకు) 362. వికెట్ల పతనం:** 1–26, 2–127, 3–197, 4–289, 5–317, 6–322. **బౌలింగ్:** అర్ష్‌దీప్ 10–0–54–2, హర్షిత్ 10–0–70–1, ప్రసిధ్ 8.2–0–85–2, సుందర్ 4–0–28–0, జడేజా 7–0–41–, కుల్దీప్ 10–0–78–1.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

పాండ్యా, గిల్ పునరాగమనం

● రింకూ, నితీశ్ రెడ్డిలపై వేటు
● దక్షిణాఫ్రికాతో టి20లకు భారత జట్టు ప్రకటన

రాయ్‌పూర్: దక్షిణాఫ్రికాతో జరిగే ఐదు మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో పాల్గొనే భారత జట్టును బుధవారం సెలక్షన్ కమిటీ ప్రకటించింది. గాయం నుంచి పూర్తిగా కోలుకున్న ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా జట్టులోకి తిరిగి వచ్చాడు. ఆసియా కప్ టి20 టోర్నీలో శ్రీలంకతో 'సూపర్ ఫోర్' మ్యాచ్ తర్వాత ఆటకు దూరమైన హార్దిక్ తాజాగా ముస్తాక్ అలీ టి20 టోర్నీలో బరిలోకి దిగి తన ఫిట్‌నెస్‌ను నిరూపించుకున్నాడు. కోల్‌కతా టెస్టులో మెడ గాయంతో అర్ధాంతరంగా తప్పుకున్న శుబ్‌మన్ గిల్‌ను కూడా ఈ సిరీస్ కోసం తీసుకోవడంతో పాటు వైస్ కెప్టెన్‌గా కూడా ఎంపిక చేశారు. అయితే బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ) ఇచ్చే ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌ను బట్టే గిల్ బరిలోకి దిగుతాడు. భారత్ చివరగా ఆస్ట్రేలియా గడ్డపై టి20 సిరీస్ ఆడింది. దాంతో పోలిస్తే ఇద్దరు ఆటగాళ్లు నితీశ్ కుమార్ రెడ్డి, రింకూ సింగ్ జట్టులో చోటు కోల్పోయారు. ఇది మినహా ఎలాంటి ఇతర సంచలనాలు లేకుండా 15 మందితో టీమ్‌ను ప్రకటించారు. భారత్, దక్షిణాఫ్రికా మధ్య ఈ నెల 9, 11, 14, 17, 19 తేదీల్లో వరుసగా కటక్, ముల్లన్‌పూర్, ధర్మశాల, లక్నో, అహ్మదాబాద్‌లలో ఐదు టి20 మ్యాచ్‌లు జరుగుతాయి.

భారత టి20 జట్టు: సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), శుబ్‌మన్ గిల్ (వైస్ కెప్టెన్), అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, అక్షర్ పటేల్, జితేశ్ శర్మ, సంజు సామ్సన్, జస్‌ప్రీత్ బుమ్రా, వరుణ్ చక్రవర్తి, అర్ష్‌దీప్ సింగ్, కుల్దీప్ యాదవ్, హర్షిత్ రాణా, వాషింగ్టన్ సుందర్.

సాక్షి సినిమా

వరప్రసాద్‌కి బై బై

● వెంకటేశ్

శంకర వరప్రసాద్‌కి బై బై చెప్పారు వెంకటేశ్. చిరంజీవి టైటిల్ రోల్‌లో అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'మన శంకర వరప్రసాద్ గారు'. అర్చన సమర్పణలో సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్న ఈ చిత్రంలో వెంకటేశ్ ఓ కీలక పాత్ర చేశారు. ఆ పాత్ర చిత్రీకరణ ముగిసింది. ''మన శంకర వరప్రసాద్ గారు'లో నా పాత్రకు సంబంధించిన షూటింగ్ బుధవారంతో పూర్తయింది. నాకు ఇష్టమైన మెగాస్టార్‌తో కలిసి పని చేయడం చాలా ఆనందంగా ఉంది. ఇది ఎంతో అద్భుతమైన అనుభవం. ఈ చిత్రం నాకు ఎన్నో అందమైన జ్ఞాపకాలను మిగిల్చింది. చిరంజీవితో కలిసి నటించాలని ఎప్పటినుంచో అనుకున్నాను. ఇన్నాళ్లకు ఈ ప్రత్యేక చిత్రం కోసం అనిల్ రావిపూడి మమ్మల్ని ఒకచోట చేర్చినందుకు చాలా హ్యాపీగా ఉంది. 2026 సంక్రాంతిని మీ అందరితో కలిసి థియేటర్లలో సెలబ్రేట్ చేసుకునేందుకు ఎదురుచూస్తున్నాను'' అని సోషల్ మీడియాలో వెంకటేశ్ ఓ పోస్ట్ షేర్ చేశారు. నయనతార కథానాయికగా నటిస్తున్న ఈ సినిమా 2026 సంక్రాంతికి విడుదల కానుంది.

జపాన్‌కి పుష్పరాజ్


● అల్లు అర్జున్

పాన్ ఇండియా స్థాయిలో తన సత్తా చాటిన పుష్పరాజ్ జపాన్ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధం అవుతున్నాడు. హీరో అల్లు అర్జున్ టైటిల్ రోల్ (పుష్పరాజ్)లో నటించిన 'పుష్ప 2: ది రూల్' సినిమా 2026 జనవరి 16న జపాన్‌లో విడుదల కానుంది. సుకుమార్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో రష్మికా మందన్నా హీరోయిన్‌గా నటించగా, శ్రీలీల ప్రత్యేక పాటలో సందడి చేశారు. సుకుమార్ రైటింగ్స్‌తో కలిసి మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా 2024 డిసెంబరు 5న విడుదలై బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. అంతేకాదు... విడుదలైన 32 రోజుల్లోనే 'పుష్ప 2: ది రూల్' ప్రపంచవ్యాప్తంగా రూ. 1831 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించి, సరికొత్త రికార్డు సృష్టించినట్లు చిత్రయూనిట్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ సినిమా విడుదలై (డిసెంబరు 4న ప్రీమియర్స్) నేటికి ఏడాది అవుతున్న నేపథ్యంలో హైదరాబాద్‌లోని విమల్ థియేటర్‌లో స్పెషల్ షో ఏర్పాటు చేశారు నిర్మాతలు. మరి.. వచ్చే ఏడాది జపాన్ భాషలో రిలీజ్ కానున్న 'పుష్ప 2: ది రూల్' ఎన్ని వసూళ్లు సాధిస్తుంది? ఎన్ని రికార్డులు సృష్టిస్తుంది? అన్నది తెలియాలంటే వేచి చూడాల్సిందే.

పూర్తి వివరాలను మేమే ప్రకటిస్తాం

- 'దిల్' రాజు

''**మా** సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ నుంచి రాబోయే సినిమాల గురించి ఈ మధ్య రకరకాల పుకార్లు వినిపిస్తున్నాయి. ఇవన్నీ పూర్తిగా నిరాధారమైనవి. వాటిలో ఏ మాత్రం నిజం లేదు'' అని నిర్మాత 'దిల్' రాజు పేర్కొన్నారు. హిందీలో సినిమాలు నిర్మించేందుకు 'దిల్' రాజు ఆసక్తి చూపుతున్నారని, అందులో భాగంగా సల్మాన్ ఖాన్ హీరోగా వంశీ పైడిపల్లి దర్శకత్వంలో ఓ సినిమా నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారనీ వార్తలు హల్ చల్ చేస్తున్నాయి. ఈ వార్తలను ఖండిస్తూ ఓ ప్రకటన విడుదల చేశారు 'దిల్' రాజు. ''ఎప్పుడో వచ్చిన పాత ఊహాగానాలకు కొంతమంది ఇప్పటి విషయాలను ముడిపెట్టి తప్పుగా ప్రచారం చేస్తున్నారు. ప్రస్తుతం మేం అక్షయ్ కుమార్ హీరోగా అనీస్ బాజ్మీ దర్శకత్వంలో ఒక సినిమాకు సన్నాహాలు చేస్తున్నాం. ఈ చిత్రానికి సంబంధించిన ప్రాథమిక పనులు జరుగుతున్నాయి. త్వరలోనే దీనికి సంబంధించిన పూర్తి వివరాలను మేమే అధికారికంగా ప్రకటిస్తాం. దయచేసి మా నుండి అధికారిక సమాచారం వచ్చే దాకా ఎలాంటి నిర్ధారణలకు రావొద్దని, ధృవీకరించని వార్తలను మీ గౌరవ మీడియాలో ప్రచారం చేయవద్దని మీడియా మిత్రులను కోరుతున్నాం'' అన్నది ఆ ప్రకటన సారాంశం.

అలాంటి వారిని కఠినంగా శిక్షించాలి

- రష్మికా మందన్నా

''ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ని (ఏఐ) తప్పుదోవ పట్టిస్తూ ఇతరులకు ఇబ్బందులు కలిగిస్తున్న వారిని, మనుషుల్లాగా ప్రవర్తించనివారిని కఠినంగా శిక్షించాలి'' అని హీరోయిన్ రష్మికా మందన్నా కోరారు. ఏఐని కొందరు దుర్వినియోగం చేస్తున్నారు. సెలబ్రిటీల ఫొటోలు, వీడియోలను అసభ్యకర రీతిలో మార్ఫింగ్, ఎడిట్ చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారు. దీనిపై ఇప్పటికే పలువురు సెలబ్రిటీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. తన ఫొటోలను మార్ఫింగ్ చేయడంపై పలుమార్లు రష్మిక ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. తాజాగా రష్మిక మరోసారి స్పందించారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ఆమె ఓ పోస్టు పెట్టారు. ''ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనేది అభివృద్ధికి ఊతంలాంటిది. కానీ, మహిళలను లక్ష్యంగా చేసుకుని ఏఐని దుర్వినియోగం చేస్తుండటం కొంతమంది వ్యక్తుల్లో నైతిక క్షీణతను సూచిస్తోంది. నిజానికి ఇంటర్నెట్ ప్రతిబింబం లాంటిది కాదని గుర్తుపెట్టుకోవాలి. ఏదైనా వక్రీకరించగలిగే వేదిక ఇది. గౌరవప్రదమైన, మెరుగైన సమాజం కోసమే ఏఐని ఉపయోగిద్దాం... నిర్లక్ష్యాన్ని వదిలిపెట్టి బాధ్యతగా వ్యవహరిద్దాం. నిజాన్ని తయారు చేయగలిగినప్పుడే విచక్షణే మనకు గొప్ప రక్షణగా మారుతుంది'' అంటూ రష్మిక షేర్ చేసిన పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

ఆల్రెడీ నే రిచ్ కిడ్డు...

● కార్తీ

అన్నగారు థియేటర్లకు వచ్చే తేదీ ఖరారైపోయింది. కార్తీ హీరోగా నటించిన తమిళ చిత్రం 'వా వాత్తియార్'. ఈ చిత్రం 'అన్నగారు వస్తారు' టైటిల్‌తో తెలుగులో రిలీజ్ కానుంది. ఈ నెల 12న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు చిత్రనిర్మాణ సంస్థ స్టూడియో గ్రీన్ అధినేత కేఈ జ్ఞానవేల్ రాజా బుధవారం ప్రకటించారు. నలన్ కుమారస్వామి దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో కృతీ శెట్టి కథానాయికగా నటించారు. ఈ చిత్రం రిలీజ్ డేట్ ఫిక్స్ అయిన విషయాన్ని ప్రకటించి, 'అన్నగారు' లిరికల్ సాంగ్‌ను విడుదల చేశారు. సంగీతదర్శకుడు సంతోష్ నారాయణన్ స్వరపరచిన ఈ పాటకు రాకేందు మౌళి సాహిత్యం అందించగా, ఎస్.పి. అభిషేక్, హరిప్రియ ఆలపించారు. ''అన్నగారు, అన్నగారు... ఆల్రెడీ నే రిచ్ కిడ్డు, పాన్ ఇండియా మూవీ ప్లాన్ చేశా, రాజమౌళికి ఫోన్ చేసి నా మీద బయోపిక్ ఒకటి తీయమంటున్న...' అంటూ కలర్‌ఫుల్ మేకింగ్‌తో ఈ పాట అందర్నీ ఆకట్టుకునేలా ఉంటుంది'' అని దర్శక–నిర్మాతలు పేర్కొన్నారు.

ఓ... సుకుమారి

● ఐశ్వర్యా రాజేశ్, తిరువీర్

ముందు పరుగెడుతున్న జనాలు... వాళ్లను ఫాలో అవుతూ వెనకాలే పరుగు పెడతున్న ఓ యువతి... ఆ వెనకాల కాస్త దూరంలో ద్విచక్ర వాహనంపై ఇద్దరు యువకులు... అసలు ఎందుకీ పరుగు? అంటే ప్రస్తుతానికి సమాధానం లేదు. తిరువీర్, ఐశ్వర్యా రాజేశ్ హీరో, హీరోయిన్‌గా నటిస్తున్న తాజా చిత్రం టైటిల్ పోస్టర్‌పై కనిపించిన దృశ్యం ఇది. ఈ చిత్రానికి 'ఓ..! సుకుమారి' అనే టైటిల్‌ని ఖరారు చేసినట్లు ప్రకటించి, పోస్టర్‌ని రిలీజ్ చేశారు. ఈ పోస్టర్‌లో ఇంకా నీలి రంగు హృదయం, మెరుపులు కూడా కనిపిస్తున్నాయి. నూతన దర్శకుడు భరత్ దర్శన్ దర్శకత్వంలో గంగా ఎంటర్టైన్మెంట్స్‌పై మహేశ్వర రెడ్డి మూలి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. పల్లెటూరి నేపథ్యంలో వినోద ప్రధానంగా సాగే కుటుంబ కథా చిత్రంగా 'ఓ..! సుకుమారి'ని రూపొందిస్తున్నారు. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో విడుదల కానున్న ఈ చిత్రానికి సంగీతం: భరత్ మంచిరాజు, కెమెరా: సీహెచ్ కుషేందర్.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల లైఫ్

● మోనాలిసా

ఉత్తరప్రదేశ్ కుంభమేళా ఫేమ్ మోనాలిసా హీరోయిన్‌గా నటిస్తున్న తొలి తెలుగు చిత్రం 'లైఫ్'. శ్రీను కోటపాటి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో సాయిచరణ్ హీరోగా నటిస్తున్నారు. వెంగమాంబ క్రియేషన్స్‌పై అంజన్న నిర్మిస్తున్న ఈ మూవీ మొదటి షెడ్యూల్ పూర్తయింది. ''సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల జీవితాల్లో చోటు చేసుకుంటున్న ఘటనల నేపథ్యంలో 'లైఫ్' రూపొందుతోంది. త్వరలో రెండో షెడ్యూల్ ప్రారంభిస్తాం'' అని యూనిట్ తెలిపింది. సాయాజీ షిండే, సురేష్, ఆమని, తులసి, రచ్చ రవి కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సినిమాకి కెమెరా: మురళీమోహన్ రెడ్డి, సంగీతం: సుకుమార్.

క్లైమాక్స్‌కి ఇరవై కోట్లు

● విరాట్ కర్ణ

'పెదకాపు' చిత్రం ఫేమ్ విరాట్ కర్ణ హీరోగా నటిస్తున్న చిత్రం 'నాగబంధం'. నభా నటేష్, ఐశ్వర్యా మీనన్ హీరోయిన్లుగా, జగపతి బాబు కీలక పాత్రలో నటిస్తున్నారు. అభిషేక్ నామా దర్శకత్వంలో కిశోర్ అన్నపురెడ్డి, నిషిత నాగిరెడ్డి నిర్మిస్తున్నారు. తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఈ సినిమా రూపొందుతోంది. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. ''పాన్ ఇండియా ఎపిక్ మైథలాజికల్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రం 'నాగబంధం'. నానక్‌రామ్‌గూడలోని రామానాయుడు స్టూడియోలో వేసిన ప్రత్యేకమైన సెట్‌లో క్లైమాక్స్ సన్నివేశాలు చిత్రీకరిస్తున్నాం. కేవలం క్లైమాక్స్ కోసమే రూ. 20 కోట్లు ఖర్చు చేస్తున్నాం. ఓ మహాద్వారం చుట్టూ రూపొందించిన ఈ క్లైమాక్స్ సెట్‌ని కథలోని భావోద్వేగం, డ్రామాలను విజువల్‌గా అద్భుతంగా చూపించేలా ఆర్ట్ డైరెక్టర్ అశోక్ కుమార్ డిజైన్ చేశారు. థాయ్ స్టంట్ మాస్టర్ కేచా ఖాంఫాక్‌డీ అద్భుతమైన యాక్షన్ కొరియోగ్రఫీతో ఈ సీక్వెన్స్‌ని గ్రాండ్‌గా తీర్చిదిద్దుతున్నాం'' అని చిత్రబృందం పేర్కొంది.

ఘంటసాల బయోపిక్ రెడీ

● మృదుల, కృష్ణ చైతన్య

తెలుగు సినిమా తొలి తరం నేపథ్య గాయకులు, సంగీత దర్శకుల్లో ఘంటసాల వెంకటేశ్వరరావు ఒకరు. విలక్షణమైన బాణీలతో కోట్లాది మంది హృదయాలను పులకరింపజేసిన ఘంటసాల బయోపిక్‌గా రూపొందిన చిత్రం 'ఘంటసాల ది గ్రేట్'. సి.హెచ్. రామారావు రచన, దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో ఘంటసాల పాత్రలో కృష్ణ చైతన్య, ఘంటసాల సావిత్రమ్మగా మృదుల నటించారు. అన్యుక్త్ రామ్ పిక్చర్స్ సమర్పణలో సీహెచ్ ఫణి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 12న విడుదల కానుంది. ఘంటసాల వీరాభిమానుల కోసం లండన్, సింగపూర్, ఆస్ట్రేలియా, అమెరికా వంటి దేశాల్లో ఈ సినిమా ప్రత్యేక ప్రివ్యూ షోలు నిర్వహించగా... అక్కడి భారతీయులు 'ఘంటసాల ది గ్రేట్' చూసి తీవ్ర భావోద్వేగానికి లోనైనట్లు చిత్ర బృందం పేర్కొంది. ''ఈ సినిమా ద్వారా ఘంటసాలగారి గాత్రం, గౌరవం, మహిమను మరోసారి అనుభూతిచెందే అవకాశం ఇచ్చిందంటూ ప్రీమియర్స్ చూసినవాళ్లంతా వెల్లడించారు'' అన్నారు మేకర్స్.

సాక్షి బిజినెస్
గురువారం
4-12-2025

స్టాక్ మార్కెట్లు

(తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
31	46
85,107	25,986

విదేశీ సూచీలు

నాస్‌డాక్	23,454	△	41
డోజోన్స్	47,834	△	363
ఎఫ్‌టీఎస్‌ఈ 100	9,689	▽	13
డాక్స్	23,663	▽	48
షాంఘై	3,878	▽	20
నికాయ్	49,865	△	561

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	88.36	91.36
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	117.49	121.89
€	యూరో	ఎస్‌బీఐ	102.98	106.97
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	47.00	60.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	56.49	60.35
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	67.33	71.08
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	23.17	24.66
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	23.66	24.93
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.89	13.71

రూపాయి.. 90కి జారిపోయి..



- కొత్త జీవితకాల కనిష్ట స్థాయి 90.30కి పతనం
- చివరికి 90.15 వద్ద ముగింపు
- విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాలు
- వాణిజ్య ఒప్పందంపై అస్పష్టతతో కరెన్సీపై ఒత్తిడి
- ఈ ఏడాది 5 % క్షీణత

దిగుమతులు, విదేశీ చదువులు, పర్యటనల భారాన్ని పెంచేస్తూ అమెరికా డాలరుతో పోలిస్తే రూపాయి విలువ రోజు రోజుకీ కిందికి జారిపోతోంది. బుధవారం తొలిసారి ఏకంగా 90 స్థాయిని దాటేసి సెంచరీ దిశగా పతన పరుగును మరింత వేగం చేసింది. డాలరుతో రూపాయి విలువ ఈ ఏడాది అయిదు శాతం పడిపోయింది. 2030 నాటికి రూపాయి సెంచరీ కొట్టేసే అవకాశం ఉందంటూ కేంబ్రిడ్జ్ కరెన్సీస్‌లాంటి ఆర్థిక సేవల సంస్థలు అంచనా వేస్తున్నాయి. రేపటి (శుక్రవారం) వెలువడే సమీక్షలో కీలక పాలసీ రేట్లను రిజర్వ్ బ్యాంక్ తగ్గిస్తే విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాలు మరింత వెల్లువెత్తి రూపాయి పాతాళానికి పడిపోయే అవకాశం ఉందని పరిశీలకులు అంచనావేస్తున్నారు. ఇప్పటికే బలహీనంగా ఉన్న రూపాయి కారణంగా ఆర్‌బీఐ పని కష్టతరంగా మారిందని నిపుణులు అంటున్నారు. అయితే ప్రభుత్వ వర్గాలు మాత్రం రూపాయి పతనాన్ని తేలికగా తీసిపారేస్తున్నారు, దీని గురించి పెద్దగా ఆందోళన చెందనక్కర్లేదని అంటున్నారు. రూపాయి పతనం ఎగుమతిదారులకు ప్రయోజనమే అయినప్పటికీ దిగుమతిదారులకు మాత్రం భారంగా మారుతోంది.

ముంబై: అమెరికా డాలర్లకు దిగుమతిదార్ల నుంచి డిమాండ్ భారీగా పెరుగుతున్న నేపథ్యంలో ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజీలో రూపాయి మారకం విలువ బుధవారం ఒక దశలో ఆల్‌టైమ్ కనిష్ట స్థాయి 90.30ని తాకింది. చివరికి క్రితం ముగింపుతో పోలిస్తే 19 పైసలు క్షీణించి 90.15 వద్ద క్లోజయ్యింది. మంగళవారం సైతం 43 పైసలు పతనమై 89.96 వద్ద ముగిసిన సంగతి తెలిసిందే. ''విదేశీ ఇన్వెస్టర్లు ఎడతెగకుండా విక్రయిస్తుండటం, బలహీన ఈక్విటీ మార్కెట్లు, క్రూడాయిల్ రేట్లు పెరగడం వంటి అంశాలు దీనికి కారణం. అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై అనిశ్చితి నెలకొనడం కూడా ఒత్తిడి పెంచింది. అయితే, డాలర్ ఇండెక్స్ కూడా బలహీనంగా ఉండటం వల్ల మరింత భారీగా పతనం కాకుండా కాస్త అడ్డుకట్ట పడింది. రాబోయే రోజుల్లో కూడా రూపాయి కొంత బలహీనంగానే ట్రేడ్ కావచ్చు. అయితే, డాలరు బలహీనపడి, డిసెంబర్‌లో ఫెడ్ రేట్ల కోత అవకాశాలు పెరిగితే రూపాయి కాస్త నిలదొక్కుకోవచ్చు'' అని మిరే అసెట్ షేర్‌ఖాన్ రీసెర్చ్ అనలిస్ట్ అనుజ్ చౌదరి తెలిపారు. విదేశీ ఇన్వెస్టర్లు రిస్కుల జోలికి వెళ్లకుండా, క్రూడాయిల్ రేట్లు అధిక స్థాయిలోనే తిరుగాడుతూ ఉంటే సమీప భవిష్యత్తులో రూపాయిపై ఒత్తిడి కొనసాగవచ్చని, 89.50–91.20 శ్రేణిలో తిరుగాడవచ్చని ఆషికా గ్రూప్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ రాహుల్ గుప్తా తెలిపారు.

సాధారణమే..

ప్రస్తుత పరిస్థితుల్లో రూపాయి పతనం సాధారణ విషయంగా మారిపోయిందని కోటక్ మహీంద్రా మ్యూచువల్ ఫండ్ ఎండీ నీలేష్ షా చెప్పారు. ''మన వాణిజ్య భాగస్వాములతో పోలిస్తే ద్రవ్యోల్బణం అధిక స్థాయిలో ఉంది. ఉత్పాదకత తక్కువగా ఉంది. ఈ అసమానతల కారణంగా 2–3 శాతం క్షీణించడం సహజమే'' అని పేర్కొన్నారు. స్వల్పకాలికంగా పెట్టుబడుల ప్రవాహంలో హెచ్చుతగ్గులనేవి కరెన్సీ స్థాయిని ప్రభావితం చేసినప్పటికీ, శాశ్వత ప్రాతిపదికన రూపాయి పెరగడానికి అవకాశాలు లేవన్నారు. ఒకవేళ అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదిరినా ఇదే స్థాయిలో కొనసాగవచ్చని చెప్పారు. రూపాయి మారకాన్ని మార్కెట్ శక్తులకు విడిచిపెట్టి, తీవ్ర ఒడిదుడుకులను కట్టడి చేసేందుకు మాత్రమే ఆర్‌బీఐ జోక్యం చేసుకోవడం సరైన విధానమేనని పేర్కొన్నారు.

ఆందోళన అక్కర్లేదు: సీఈఏ

రూపాయి క్షీణత విషయంలో ప్రభుత్వమేమీ ఆందోళన చెందడం లేదని కేంద్ర ముఖ్య ఆర్థిక సలహాదారు (సీఈఏ) వి. అనంత నాగేశ్వరన్ చెప్పారు. దీని వల్ల ద్రవ్యోల్బణం, ఎగుమతులపై తీవ్ర ప్రతికూల ప్రభావమేమీ లేదన్నారు. వచ్చే ఏడాది రూపాయి కాస్త మెరుగుపడొచ్చని సీఐఐ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆశాభావం వ్యక్తం చేశారు. స్థూల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ఈ ఏడాది 100 బిలియన్ డాలర్లకు చేరొచ్చని నాగేశ్వరన్ తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం ఇది 81.04 బిలియన్ డాలర్లుగా ఉంది.

పతనానికి మరిన్ని కారణాలు..

- ముడి చమురు ధరలు అధిక స్థాయిలో తిరుగాడుతుండటం
- ఎగుమతుల వృద్ధి నెమ్మదించడం
- కరెన్సీ క్షీణతను అడ్డుకునేందుకు ఆర్‌బీఐ ప్రయత్నాలేమీ చేయకపోవడం

ప్రతికూలం

విదేశీ చదువులు
విదేశీ టూర్లు,
దిగుమతులు
(రత్నాభరణాలు,
ఎలక్ట్రానిక్స్,
ముడిచమురు,
ఫార్మా రంగానికి
కావల్సిన ముడిపదార్థాలు
మొదలైనవి)
విదేశీ లగ్జరీ కార్లు

సానుకూలం

ఎగుమతి ఆధారిత
రంగాలు
(ఐటీ పరిశ్రమ, ఆటో
ఎగుమతులు,
ఫార్మా, టెక్స్‌టైల్స్)
రెమిటెన్సులు

ఎందుకు తగ్గుతుందంటే...

దిగుమతులపై ఆధారపడటం: భారత దేశం ముడి చమురుతో సహా అనేక వస్తువులను దిగుమతి చేసుకుంటుంది. దిగుమతులు పెరిగినప్పుడు, డాలర్లకు డిమాండ్ పెరుగుతుంది, ఇది రూపాయి విలువను తగ్గిస్తుంది.

విదేశీ పెట్టుబడుల ప్రవాహం: అంతర్జాతీయ అనిశ్చితి లేదా ఇతర మార్కెట్‌లలో మెరుగైన రాబడులు వంటి కారణాల వల్ల విదేశీ పెట్టుబడిదారులు భారతీయ మార్కెట్ల నుండి తమ పెట్టుబడులను ఉపసంహరించుకున్నప్పుడు, రూపాయి విలువ బలహీనపడుతుంది.

డాలర్ బలోపేతం: ప్రపంచవ్యాప్తంగా డాలర్‌కు డిమాండ్ పెరిగినప్పుడు (ముఖ్యంగా యూఎస్ ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్లు పెంచిన కారణంగా), ఇతర కరెన్సీలతో పాటు రూపాయి విలువ కూడా తగ్గుతుంది

వాణిజ్య లోటు: దేశం చేసే ఎగుమతుల కంటే దిగుమతుల విలువ ఎక్కువగా ఉన్నప్పుడు 'వాణిజ్య లోటు' ఏర్పడుతుంది. ఇది విదేశీ కరెన్సీకి డిమాండ్‌ను సృష్టిస్తుంది, ఫలితంగా రూపాయి విలువ తగ్గుతుంది.

భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు: ఉక్రెయిన్ యుద్ధం వంటి అంతర్జాతీయ సంఘర్షణలు చమురు ధరలను , ఎగుమతి దిగుమతులను ప్రభావితం చేస్తాయి. ఇది రూపాయి అస్థిరతకు దారితీస్తుంది. భారతీయ రిజర్వ్ బ్యాంక్ ఈ ఒడిదుడుకులను తగ్గించడానికి మార్కెట్‌లో డాలర్లను విక్రయించడం వంటి చర్యలు తీసుకుంటుంది

'సాక్షి ప్లస్'	ఈ-పేపర్‌లో ..
మొదలైన ఆర్‌బీఐ ఎంపీసీ	మెరుగుపడిన సేవల రంగం

నాలుగో రోజూ నష్టాలే

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ నాలుగో రోజూ నష్టాల్లోనే ముగిసింది. విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాల పరంపర కొనసాగింది. రూపాయి రికార్డు స్థాయి పతనం సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. ఫలితంగా బుధవారం సెన్సెక్స్ 31 పాయింట్లు నష్టపోయి 85,107 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 46 పాయింట్లు పతనమై 25,986 వద్ద నిలిచింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం బలహీనంగా మొదలయ్యాయి. ఆర్‌బీఐ ద్రవ్య పాలసీ నిర్ణయాల వెల్లడి(నవంబర్ 5న)కి ముందు ఇన్వెస్టర్లు అప్రమత్తత వహిస్తూ అమ్మకాలకు పాల్పడ్డారు. ఒక దశలో సెన్సెక్స్ 374 పాయింట్లు క్షీణించి 84,764 వద్ద, నిఫ్టీ 141 పాయింట్లు కోల్పోయి 25,891 వద్ద కనిష్టాలు తాకాయి. అయితే ట్రేడింగ్ చివర్లో అధిక వెయిటేజీ ఐసీఐసీఐ బ్యాంకు(1%), ఇన్ఫోసిస్(1.12%), ఐసీసీఐ బ్యాంకు(1.37%), టీసీఎస్(1.41%) షేర్లు రాణించడంతో సూచీలు నష్టాల నుంచి దాదాపు కోలుకోగలిగాయి. ఆసియాలో కొరియా, జపాన్ సూచీలు లాభపడ్డాయి. చైనా, హాంగ్‌కాంగ్ మార్కెట్లు నష్టపోయాయి. యూరప్ మార్కెట్లు స్వల్పంగా లాభపడ్డాయి. అమెరికా మార్కెట్లు నష్టాలలో ట్రేడవుతున్నాయి.

- డాలర్ మారకంలో రూపాయి 90 దిగువకు పతనమవడంతో ఎగుమతుల ఆధారిత ఐటీ కంపెనీల షేర్లకు కలిసొచ్చింది. విప్రో(1.61%), టీసీఎస్(1.41%), ఇన్ఫోసిస్, ఎంఫసిస్ 1%, టెక్ మహీంద్రా అరశాతం, హెచ్‌సీఎల్ టెక్, కోఫోర్జ్ 0.25 శాతం రాణించాయి.

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

సెయిల్‌లో మేనేజ్‌మెంట్ ట్రైయినీ

జాబ్స్ ఇన్ఫో

- **బీఈ/బీటెక్ ఉత్తీర్ణులు దరఖాస్తుకు అర్హులు**

ప్రభుత్వ రంగ సంస్థ..స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (సెయిల్).. పలు పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది. ఇందులో భాగంగా మొత్తం 124 మేనేజ్‌మెంట్ ట్రైయినీ పోస్టులను భర్తీ చేయనుంది. బీఈ/బీటెక్ విద్యార్హతతో ఈ పోస్టులకు పోటీపడొచ్చు. సీబీటీ,గ్రూప్ డిస్కషన్/ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపికచేస్తారు.అర్హత, ఆసక్తి గల వారు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

- **మొత్తం పోస్టులు: 124**

విభాగాలు

కెమికల్, సివిల్, కంప్యూటర్, ఎలక్ట్రికల్, ఇన్‌స్ట్రుమెంటేషన్, మెకానికల్, మెటలర్జీ విభాగాల్లో పోస్టులను భర్తీచేయనున్నారు.

అర్హతలు

కెమికల్/ ఎలక్ట్రోకెమికల్/ సివిల్/ కంప్యూటర్ సైన్స్ / ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్/మెకానికల్/మెకానికల్ అండ్ ఆటోమేషన్/ మెటలర్జికల్ విభాగాల్లో బీఈ/బీటెక్ 60 శాతంతో పూర్తిచేయాలి. ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులు 55 శాతం మార్కులు సాధిస్తే సరిపోతుంది.

వయసు

వయసు 28 సంవత్సరాలు మించకూడదు. ఎస్సీ/ఎస్టీకి ఐదేళ్లు, ఓబీసీ–ఎన్‌సీఎల్‌కు మూడేళ్లు, దివ్యాంగులకు పది నుంచి పదిహేనేళ్ల వయోసడలింపు ఉంటుంది.

ఎంపిక ఇలా

ఆన్‌లైన్ రాత పరీక్ష(కంప్యూటర్ బేస్డ్ టెస్ట్–సీబీటీ), గ్రూప్ డిస్కషన్/ఇంటర్వ్యూలో చూపిన ప్రతిభ ఆధారంగా అభ్యర్థుల ఎంపిక ఉంటుంది. ఈ పరీక్ష మొత్తం 200 మార్కులకు నిర్వహిస్తారు. పార్ట్–1లోని డొమైన్ నాలెడ్జ్ టెస్ట్–100 మార్కులు. వ్యవధి 40 నిమిషాలు. పార్ట్–2లో ఆప్టిట్యూడ్ టెస్ట్ 100 మార్కులకు ఉంటుంది. ఇందులో మొత్తం నాలుగు విభాగాలు.. క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, ఇంగ్లిష్ లాంగ్వేజ్, రీజనింగ్, జనరల్ అవేర్‌నెస్‌ల నుంచి ప్రశ్నలుంటాయి. ప్రతి విభాగానికి 25 మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది. పరీక్ష సమయం 80 నిమిషాలు.

అర్హత మార్కులు

సీబీటీ పరీక్షలో అన్‌రిజర్వ్‌డ్/ఈడబ్ల్యూఎస్‌లు 50 శాతం, ఎస్సీ /ఎస్టీ /ఓబీసీ–ఎన్‌సీఎల్, దివ్యాంగ అభ్యర్థులు కనీసం 40 శాతం మార్కులు సాధించాల్సి ఉంటుంది. వీరిని 1.3 నిష్పత్తిలో గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూలకు పిలుస్తారు. అలాగే సీబీటీ, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూలకు 75:10:15 నిష్పత్తిలో వెయిటేజీ ఉంటుంది. ఈ మూడింటి మార్కులతో కేటగిరీలవారీగా తుది ఎంపిక చేసి నియామకం ఖరారు చేస్తారు. ఉద్యోగాలకు ఎంపికైనవారు దేశవ్యాప్తంగా ఉన్న సెయిల్ ప్లాంట్లు/యూనిట్లు/గనుల్లో ఎక్కడైనా పని చేయాల్సి ఉంటుంది.

వేతనాలు

ఈ ఉద్యోగాలకు ఎంపికైన వారు నెలకు రూ.50,000–1,60,000 వేతన శ్రేణి పొందవచ్చు. మేనేజ్‌మెంట్ ట్రైయినీ–టెక్నికల్ అభ్యర్థులకు ఏడాది ట్రైనింగ్ తర్వాత రూ.60,000–1,80,000 చెల్లిస్తారు. వీటికి అదనంగా హెచ్ఎస్ఏ, టీఏ, డీఏ, వైద్య, పింఛను సదుపాయాలుంటాయి.

ప్రిపరేషన్ ఇలా

ఆన్‌లైన్ పరీక్షను జనవరి/ఫిబ్రవరి 2026లో నిర్వహించే అవకాశం ఉంది. కాబట్టి ఇప్పటినుంచే సన్నద్ధత ప్రారంభించాలి. పార్ట్–1లో డొమైన్ నాలెడ్జ్ ప్రశ్నలకు 100 మార్కులున్నాయి. అభ్యర్థులు సబ్జెక్టుల్లోని ముఖ్యమైన టాపిక్స్‌పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. అలాగే ఎప్పటికప్పుడు రివిజన్ చేస్తూ సన్నద్ధత సాగించాలి. పార్ట్–2లో నాలుగు విభాగాలైన క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, ఇంగ్లిష్ లాంగ్వేజ్, రీజనింగ్, జనరల్ అవేర్‌నెస్‌లకు సంబంధించి గత పరీక్షల పాత ప్రశ్న పత్రాలను ప్రాక్టీస్ చేయాలి. వీటితో పాటు మాక్ టెస్టులనూ రాయాలి. దీనివల్ల ఇన్‌టైంలో అన్ని ప్రశ్నలకు సమాధానాలు గుర్తించడమే కాకుండా.. ఆయా అంశాల్లో బలహీనతలపై అవగాహన వస్తుంది. దీంతో తక్కువ మార్కులు వచ్చిన అంశాలకు ఎక్కువ సమయాన్ని కేటాయించుకునే అవకాశం ఉంటుంది.

ముఖ్యసమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:** 05.12.2025
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** విజయవాడ/ గుంటూరు, విశాఖపట్నం, హైదరాబాద్.
- **వెబ్‌సైట్:** www.sailcareers. com

ఎంబీఏ వయా మ్యాట్

» ఆరు వందలకు పైగా బీస్కూల్స్‌లో మ్యాట్ స్కోర్‌తో ప్రవేశాలు
» ఆల్ ఇండియా మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహణ
» కొనసాగుతున్న దరఖాస్తు ప్రక్రియ

మేనేజ్‌మెంట్ పీజీ చేయాలని భావిస్తున్నారా.. ఐఐఎంలే కాకుండా ఇతర ప్రముఖ బిస్కూల్స్ దిశగానూ అన్వేషణ సాగిస్తున్నారా..! అయితే మీకు చక్కటి మార్గం.. మేనేజ్‌మెంట్ అప్టిట్యూడ్ టెస్ట్ (మ్యాట్). ఆల్ ఇండియా మేనేజ్‌మెంట్ అసోసియేషన్ నిర్వహించే మ్యాట్ స్కోర్ ఆధారంగా.. జాతీయ స్థాయిలో ప్రముఖ బిజినెస్ స్కూల్స్‌లో.. మేనేజ్‌మెంట్ పీజీ ప్రోగ్రామ్‌లకు దరఖాస్తు చేసుకోవచ్చు! ఏటా నాలుగు సార్లు జరిగే మ్యాట్‌కు సంబంధించి.. 2025 డిసెంబర్ సెషన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో.. మ్యాట్ నోటిఫికేషన్ వివరాలు, ఎంపిక విధానం, రాత పరీక్ష, ప్రిపరేషన్ తదితర వివరాలు...

ఎంబీఏ లేదా మేనేజ్‌మెంట్ పీజీ అనగానే విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ఐసెట్, జాతీయ స్థాయిలో క్యాట్‌పైనే దృష్టి పెడతారు. వీరికి అందుబాటులో ఉన్న మరో చక్కటి అవకాశం మ్యాట్. ఐసెట్, క్యాట్ ప్రిపరేషన్‌తోనే మ్యాట్‌కు కూడా హాజరయ్యే అవకాశం ఉంది. మ్యాట్‌లో స్కోర్‌తో జాతీయ స్థాయిలో ప్రముఖ ఇన్‌స్టిట్యూట్స్‌లో ప్రవేశాలకు మార్గం సుగమం చేసుకోవచ్చు.

ఆరు వందలకు పైగా బి-స్కూల్స్

మ్యాట్ స్కోర్ ఆధారంగా ప్రస్తుతం దేశ వ్యాప్తంగా ఆరు వందలకు పైగా బిజినెస్ స్కూల్స్.. ఎంబీఏ, పీజీ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్ తదితర పీజీ స్థాయి మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ప్రవేశం కల్పిస్తున్నాయి. మ్యాట్ అధికారిక ప్రకటనలో 94 ఇన్‌స్టిట్యూట్స్‌నే పేర్కొన్నప్పటికీ.. ఈ స్కోర్ ఆధారంగా ఇంకా ఎన్నో ఎంబీఏ కాలేజీల్లో అడ్మిషన్ పొందే అవకాశం ఉంది.

ఏటా నాలుగుసార్లు

ఏఐఎంఏ–మ్యాట్‌ను ఏటా నాలుగుసార్లు.. ఫిబ్రవరి, మే, సెప్టెంబర్, డిసెంబర్ నెలల్లో నిర్వహిస్తుంది. ఫలితంగా అభ్యర్థులు తమకు అకడమిక్‌గా ఒత్తిడిలేని సెషన్‌లో పరీక్షకు హాజరయ్యే అవకాశం లభిస్తోంది. 2025,డిసెంబర్ సెషన్‌కు సంబంధించి తాజాగా దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. ఇతర మేనేజ్‌మెంట్ ఎంట్రన్స్ టెస్ట్‌లకు హాజరయ్యే విద్యార్థులు ఒకేసారి రెండు పరీక్షల ఒత్తిడి నుంచి ఉపశమనం పొందొచ్చు.

అర్హత

ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి. చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

మూడు విధానాల్లో పరీక్ష

మ్యాట్ డిసెంబర్ సెషన్‌ను మూడు విధానాల్లో నిర్వహించనున్నారు. అవి..

- **పేపర్ బేస్డ్ టెస్ట్:** అభ్యర్థులు నిర్దేశిత తేదీలో పరీక్ష కేంద్రంలో ఓఎంఆర్(పెన్–పేపర్) విధానంలో పరీక్షకు హాజరవ్వాల్సి ఉంటుంది.
- **ఆన్‌లైన్ కంప్యూటర్ బేస్డ్ టెస్ట్:** నిర్దేశిత తేదీల్లో.. పరీక్ష కేంద్రాల్లో ఆన్‌లైన్ టెస్ట్‌కు హాజరవ్వాల్సి ఉంటుంది.
- **ఇంటర్నెట్ బేస్డ్ టెస్ట్:** ఈ విధానంలో అభ్యర్థులు నిర్దేశిత తేదీల్లో ఇంటర్నెట్ ఆధారంగా.. తమకు అనుకూలమైన ప్రాంతం నుంచే పరీక్షకు హాజరయ్యే అవకాశం ఉంటుంది.

తేదీ, స్లాట్ ఎంపిక

అభ్యర్థులు ఈ మూడు విధానాల్లో ఏ విధానంలో హాజరవ్వాలనుకుంటున్నారో దరఖాస్తు సమయంలోనే పేర్కొనాల్సి ఉంటుంది. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, ఇంటర్నెట్ బేస్డ్ టెస్ట్‌లకు నిర్దిష్టంగా ఏఐఎంఏ వర్గాలు తేదీలను ప్రకటిస్తాయి. వాటిని పరిశీలించి తమకు అనుకూలమైన తేదీ, స్లాట్‌ను కూడా దరఖాస్తు సమయంలోనే పేర్కొనాల్సి ఉంటుంది. డిసెంబర్ సెషన్‌కు సంబంధించి పరీక్ష తేదీలను ప్రకటించారు.

అయిదు విభాగాలు.. 600 మార్కులు

మ్యాట్ పరీక్ష మొత్తం అయిదు విభాగాల్లో 150 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో లాంగ్వేజ్ కాంప్రహెన్షన్‌లో 30 ప్రశ్నలు, ఇంటెలిజెన్స్ అండ్ క్రిటికల్ రీజనింగ్‌లో 30 ప్రశ్నలు, మ్యాథమెటికల్ స్కిల్స్‌లో 30 ప్రశ్నలు, డేటా అనాలిసిస్ అండ్ సఫిషియన్సీలో 30 ప్రశ్నలు, ఎకనామిక్స్ అండ్ బిజినెస్ ఎన్విరాన్‌మెంట్‌లో 30 ప్రశ్నలు ఉంటాయి. ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ పద్ధతిలో బహుళైచ్ఛిక విధానంలో అడుగుతారు. ప్రతి ప్రశ్నకు నాలుగు మార్కులు కేటాయిస్తారు. ప్రతి తప్పు సమాధానానికి నాలుగో వంతు మార్కును నెగెటివ్ మార్క్‌గా పేర్కొన్నారు.

మెరుగైన స్కోర్‌కు మార్గం

లాంగ్వేజ్ కాంప్రహెన్షన్

ఈ విభాగంలో రాణించేందుకు అభ్యర్థులు ఇంగ్లిష్ నైపుణ్యాలపై దృష్టి పెట్టాలి. స్పీడ్ రీడింగ్ అలవాటుతోపాటు ఒక విషయాలను చదువుతున్నప్పుడే అందులోని కీలక అంశాలను గుర్తించే నైపుణ్యం సొంతం చేసుకోవాలి. పంక్చుయేషన్స్ నుంచి ప్యాసేజ్ మెయిన్ కాన్సెప్ట్ వరకూ.. అన్నింటిపైనా అవగాహన ఏర్పరచుకోవాలి. అర్థాలు, సమానార్థాలు, ఫ్రేజెస్, వర్డ్ యూసేజ్, సెంటెన్స్ ఫార్మేషన్ అంశాలపై ప్రధానంగా దృష్టి పెట్టాలి. వీటితోపాటు వొకాబ్యులరీపైనా పట్టు సాధించాలి. ఫలితంగా ఆయా ప్యాసేజ్‌లలో వినియోగించిన పదజాలాన్ని వేగంగా అర్థం చేసుకుని.. నిర్దేశిత సమయంలో సమాధానాలిచ్చే నైపుణ్యం లభిస్తుంది. అదే విధంగా విశ్లేషణాత్మకంగా చదవడం అలవర్చుకోవాలి. చదివేటప్పుడు అందులోని ముఖ్య సమాచారం, ప్రశ్నార్హమైన అంశాలు, కీలక పదాలు గుర్తించే నేర్పు సొంతం చేసుకోవాలి. అందుకోసం ఇంగ్లిష్ దినపత్రికల్లోని ఎడిటోరియల్స్, ఇతర వ్యాసాలు చదవాలి.

ఇంటెలిజెన్స్ అండ్ క్రిటికల్ రీజనింగ్

ఈ విభాగంలో ప్రశ్నలు స్వీయ విశ్లేషణ, సూక్ష్మ పరిశీలన ఆధారంగా సమాధానం రాబట్టేవిగా ఉంటాయి. కాబట్టి అభ్యర్థులు సమాచారాన్ని సునిశితంగా పరిశీలించడం, పోలికలు, బేధాలు వంటి వాటిని గుర్తించే నైపుణ్యం పెంచుకోవాలి.

మ్యాథమెటికల్ స్కిల్స్

పదో తరగతి స్థాయి మ్యాథమెటిక్స్ టాపిక్స్‌పై అవగాహన ఏర్పరచుకోవాలి. ప్రాబబిలిటీ అండ్ పెర్ముటేషన్స్–కాంబినేషన్స్, నెంబర్స్, అల్జీబ్రా, జామెట్రీ విభాగాలపై ప్రధానంగా దృష్టి పెట్టాలి. ఫార్ములా బేస్డ్ ప్రశ్నల సాధనకు ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రస్తుత సమయంలో సబ్జెక్ట్ ప్రిపరేషన్‌తో పాటు ఆయా సెక్షన్లలో ప్రీవియస్ ప్రశ్నలను ప్రాక్టీస్ చేయడం లాభిస్తుంది.

డేటా అనాలిసిస్ అండ్ సఫిషియన్సీ

ఈ విభాగంలో ప్రశ్నలు గ్రాఫ్‌లు, ప్యాసేజ్‌లను పేర్కొని.. అందులోని సమాచారం, గణాంకాల ఆధారంగా విశ్లేషించాల్సినవిగా ఉంటాయి. ఇందులో రాణించేందుకు అభ్యర్థులు ఆయా కాన్సెప్ట్‌లపై అవగాహన ఏర్పరచుకోవాలి. పర్సంటేజెస్, యావరేజెస్‌పై పట్టు సాధించాలి. ఇందుకోసం ఏదైనా క్యాట్ స్టాండర్డ్ మెటీరియల్ లేదా ఆన్‌లైన్ టెస్ట్‌లలోని ప్రశ్నలను బాగా ప్రాక్టీస్ చేయాలి. ఇక్కడ కేవలం ఒకే తరహా ప్రశ్నలు కాకుండా.. విభిన్న క్లిష్టతతో కూడిన సమస్యలను సాధించడానికి ప్రాధాన్యం ఇవ్వాలి. అదే విధంగా ఫ్లో చార్ట్‌లు, డయాగ్రమ్ ఆధారిత ప్రాబ్లమ్స్‌ను ప్రాక్టీస్ చేయాలి.

ఎకనామిక్స్ అండ్ బిజినెస్ ఎన్విరాన్‌మెంట్ దీనికి సంబంధించి సమకాలీన ఆర్థిక, వ్యాపార అంశాలపై దృష్టి సారించాలి. అదే విధంగా స్టాక్ జీకే అంశాలపైనా పట్టు సాధించాలి. ముఖ్యంగా ఆర్థిక, వ్యాపార, వాణిజ్య రంగాలకు సంబంధించిన తాజా పరిణామాలపై అవగాహన పెంచుకోవాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **పేపర్ బేస్డ్ టెస్ట్ దరఖాస్తు చివరి తేదీ:** 2025, డిసెంబర్ 7
- **పేపర్ బేస్డ్ టెస్ట్ అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్:** 2025, డిసెంబర్ 10 నుంచి
- **పేపర్ బేస్డ్ టెస్ట్ తేదీ:** 2025, డిసెంబర్ 13
- **కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ దరఖాస్తు చివరి తేదీ:** 2025, డిసెంబర్ 15
- **కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ తేదీ:** 2025, డిసెంబర్ 21
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://mat.aima.in

విద్య, ఉద్యోగ సమాచారం

సీటెట్-ఫిబ్రవరి, 2026

సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ) దేశవ్యాప్తంగా ఉపాధ్యాయ నియామకాలకు కీలకమైన అర్హత పరీక్ష..సెంట్రల్ టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్(సీటెట్)నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ప్రతీ ఏటా సీటెట్ రెండు సార్లు జరుగుతుంది. సీటెట్ స్కోరును దేశంలోని కేవీఎస్, ఎన్‌వీఎస్, సెంట్రల్ స్కూళ్లతో పాటు సీబీఎస్ఈ అనుబంధ పాఠశాలలు, కేంద్ర ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ నియామకాల్లో పరిగణనలోకి తీసుకుంటారు.

» **అర్హత:** ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు డీఈఎల్ఈడీ/బీఈఎల్ఈడీ, డిగ్రీ డీఈడీ (ప్రత్యేక విద్య), బీఈడీ, బీఈడీ(ప్రత్యేక విద్య) /బీఎస్సీఈడీ /బీఏఈడీ /బీఎస్సీఈడీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **పరీక్ష విధానం:**మొత్తం రెండు పేపర్లు ఉంటాయి. మొదటి పేపర్ ఒకటి నుంచి ఐదో తరగతులకు బోధించాలనుకునే వారి కోసం, రెండో పేపర్ ఆరు నుంచి ఎనిమిదో తరగతులకు బోధించాలనుకునే వారి కోసం నిర్వహిస్తారు. సీటెట్ స్కోరుకు జీవితాంతం వ్యాలిడిటీ ఉంటుంది.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 27.11.2025.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 18.12.2025.
» **పరీక్ష తేది:** 08.02.2026.
» **పరీక్ష సమయం:**పేపర్–1 ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు,పేపర్–2 మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5 గంటల వరకు.
» **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, వరంగల్, గుంటూరు, తిరుపతి, విజయవాడ.
» **వెబ్‌సైట్:** https://ctet.nic.in

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం: తెలంగాణ హిస్టరీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం: బయాలజీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం: భూగోళశాస్త్రం » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం: జనరల్ ఇంగ్లిష్

టెన్త్ పరీక్షల్లో స్వల్ప మార్పులు

- తక్కువ ఆదాయ వర్గాల వారికి ఫీజు మినహాయింపు
- 7 పరీక్ష పేపర్లు, 600 మార్కులు
- జనరల్ సైన్స్‌లో రెండు పేపర్లు

సాక్షి, అమరావతి: మార్చి–2026 పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణలో స్వల్ప మార్పులు చేసినట్టు పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది. ఈ మేరకు మార్గదర్శకాలను విడుదల చేసింది. పరీక్షలకు హాజరయ్యే జనరల్, ఓపెన్ స్కూల్, ఒకేషనల్ కేటగిరీల విద్యార్థులు మార్పులను పరిశీలించాలని విజ్ఞప్తి చేసింది. ఈ పరీక్షల్లో అంతర్గత మార్కుల వెయిటేజీ ఉండదని, ప్రతి సబ్జెక్టుకు 100 మార్కులకు 7 పేపర్ల విధానం ఉంటుందని పేర్కొంది. ఒకటో భాష, రెండో భాష, మూడో భాషా పేపర్లు, గణితం, జనరల్ సైన్స్, సోషల్ స్టడీస్ సబ్జెక్టులకు ఒక్కొక్క పేపర్ ఉంటుంది. ప్రతి పేపర్ 100 మార్కులకు ఉంటుంది. జనరల్ సైన్స్ సబ్జెక్టులో ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్ పరీక్షలు రెండు వేర్వేరు రోజుల్లో 50 మార్కుల చొప్పున ఉంటాయి. ప్రథమ భాషలో కాంపోజిట్ పేపర్–వన్ 70 మార్కులకు, పేపర్–టు 30 మార్కులకు ఉంటాయి. పాఠశాలలు/విద్యార్థుల డేటాలో వ్యత్యాసం ఉంటే, యూడైస్ ప్లస్ డేటాలో మార్పులకు కమిషనరేట్‌ను సంప్రదించాలని ఆదేశించారు. ప్రైవేట్ అభ్యర్థులకు వారి ఆన్‌లైన్ దరఖాస్తులో మునుపటి హాజరు రోల్ నంబర్‌ను తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు.

వీరికి పరీక్ష ఫీజు మినహాయింపు

పట్టణ ప్రాంతాల్లో తల్లిదండ్రుల సంవత్సర ఆదాయం రూ.24 వేలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.20 వేలు లేదా గ్రామీణ ప్రాంతాల్లో 2.5 ఎకరాల తడి భూమి/5 ఎకరాల పొడి భూమి మించని వారి పిల్లలకు పరీక్ష ఫీజు నుంచి మినహాయించారు. ఇది మార్చి–2026లో తొలిసారి రెగ్యులర్ పరీక్షకు హాజరయ్యే ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు మాత్రమే వర్తిస్తుంది. వికలాంగులు, కేజీబీవీ విద్యార్థినులకు పూర్తి స్థాయిలో ఫీజు మినహాయింపు ఉంటుంది. 2011 సెప్టెంబర్ ముందు పుట్టిన వారు మాత్రమే 10వ తరగతి పరీక్షలు రాసేందుకు అర్హులని, రూ.300 చెల్లించి ఏడాదిన్నర వరకు వయసు సడలింపును స్థానిక పాఠశాల హెచ్‌ఎం అనుమతి ఇవ్వొచ్చని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

చంద్రబాబుపై కేసు మూసివేత డాక్యుమెంట్లను

ఎందుకు బయట పెట్టడం లేదు?

డాక్యుమెంట్లు బయటకు రాకుండా సీఐడీ ఎందుకు అడ్డుకుంటోంది?

- కోర్టు డాక్యుమెంట్లన్నీ పబ్లిక్ డాక్యుమెంట్లే
- వాటిని ఎవరైనా తీసుకోవచ్చు
- డాక్యుమెంట్ల కోసం వేసిన పిటిషన్‌పై ఉత్తర్వులివ్వండి
- ఏసీబీ కోర్టుకు నివేదించిన సీనియర్ న్యాయవాది పొన్నవోలు
- నేడు ఉత్తర్వులిస్తామన్న న్యాయస్థానం

సాక్షి, అమరావతి: అవినీతి, అక్రమాలకు పాల్పడినందుకు చంద్రబాబుపై గత ప్రభుత్వం నమోదు చేసిన కేసులను మూసివేసిన విజయవాడ ఏసీబీ కోర్టు.. అందుకు సంబంధించిన కాపీలను బహిర్గతం చేయకపోవడంపై సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి తీవ్ర అభ్యంతరం తెలిపారు. కోర్టులో ఏదీ రహస్యం కాదన్నారు. చంద్రబాబుపై కేసుల మూసివేతకు సంబంధించిన డాక్యుమెంట్ల కాపీలను బహిర్గతం చేయడాన్ని సీఐడీ ఎందుకు వ్యతిరేకిస్తోందని ప్రశ్నించారు. డాక్యుమెంట్ల కాపీలు బయటపెట్టే విషయంలో సీఐడీ ఎందుకు జంకుతోందని నిలదీశారు. ఏదో గూడు పుఠాణి లేకుంటే కోర్టు తీర్పు కాపీలను బయటకు రాకుండా చేయాల్సిన అవసరం ప్రాసిక్యూషన్‌కు ఏముందని ప్రశ్నించారు. ప్రతి విషయాన్ని తెలుసుకునే హక్కు ప్రజలకు ఉందని, అది న్యాయపాలనలో భాగమని స్పష్టం చేశారు. కోర్టులోని ప్రతి డాక్యుమెంట్ పబ్లిక్ డాక్యుమెంటేనని, అది కక్షిదారులు, ప్రభుత్వ ప్రైవేటు ఆస్తి కాదని తెలిపారు. ఇదే విషయాన్ని సుప్రీంకోర్టు సైతం చాలా స్పష్టంగా చెప్పిందని ఆయన ఏసీబీ కోర్టు దృష్టికి తీసుకొచ్చారు.

ప్రాసిక్యూషన్, నిందితులకే పరిమితం కాదు

కోర్టు రికార్డులను ఏ వ్యక్తి అయినా నిబంధనలకు అనుగుణంగా తీసుకోవచ్చని, వాటిని తిరస్కరించే అధికారం ఎవరికీ లేదని పొన్నవోలు కోర్టుకు వివరించారు. చార్జిషీట్, ఎఫ్ఐఆర్‌లతో సహా అన్ని రికార్డులను థర్డ్ పార్టీ తీసుకోవచ్చన్నారు. ఈ విషయంలో ఏ చట్టంలోనూ నిషేధం లేదని నివేదించారు. ఎవిడెన్స్ చట్టం ప్రకారం సహేతుక కారణం చూపి ఏ వ్యక్తయినా కూడా కోర్టు డాక్యుమెంట్లను తీసుకోవచ్చని కేకే వేలుస్వామి వర్సెస్ పళని స్వామి కేసులో సుప్రీంకోర్టు చాలా స్పష్టమైన తీర్పు ఇచ్చిందని వివరించారు. కోర్టు డాక్యుమెంట్లు కేవలం ప్రాసిక్యూషన్, నిందితులకే పరిమితం కాదని, ఫిర్యాదుదారులు, కేసుతో సంబంధం ఉన్న వ్యక్తులు, సదుద్దేశం ఉన్నవారు ఎవరైనా కూడా తీసుకోవచ్చని ఎస్.శివశంకరయ్య వర్సెస్ స్టేట్ ఆఫ్ కర్ణాటక కేసులో సుప్రీంకోర్టు తీర్పునిచ్చిందని కూడా ఆయన తెలిపారు.

ఏ డాక్యుమెంట్‌నైనా తీసుకోవచ్చు

కేవలం పార్ట్–1 కేసు డైరీని మాత్రమే బహిర్గతం చేయకూడదని, మిగిలిన ఏ డాక్యుమెంట్‌నైనా తీసుకోవచ్చని పొన్నవోలు కోర్టుకు వివరించారు. కోర్టు డాక్యుమెంట్లను తీసుకునే విషయంలో లోకస్ స్టాండీ (జోక్యం చేసుకునే హక్కు) వాదనకు ఎంత మాత్రం ఆమోదయోగ్యత లేదన్నారు. క్రిమినల్ లాలో ఎక్కడా లోకస్ స్టాండీ ప్రస్తావనే లేదన్నారు. అలాంటప్పుడు దేని ఆధారంగా చంద్రబాబుపై కేసుల మూసివేత డాక్యుమెంట్లను రహస్యంగా ఉంచుతున్నారని ప్రశ్నించారు. చట్టాన్ని పాటించబోమంటే, సుప్రీంకోర్టులో పోరాటం చేయడం మినహా చేయగలిగిందేమీ లేదన్నారు. చంద్రబాబుపై కేసుల మూసివేతకు సంబంధించిన అన్నీ డాక్యుమెంట్ల కాపీలను కోరుతూ తాము దాఖలు చేసిన పిటిషన్‌పై తగిన ఉత్తర్వులు జారీ చేయాలని ఆయన ఏసీబీ కోర్టును కోరారు. దీంతో ఏసీబీ కోర్టు న్యాయాధికారి గురువారం తగిన ఉత్తర్వులు జారీ చేస్తానని చెప్పారు. చంద్రబాబుపై కేసుల మూసివేతకు సంబంధించిన డాక్యుమెంట్ల కాపీలను ఇవ్వాలని కోరుతూ చీరాలకు చెందిన సువర్ణరాజు అనే వ్యక్తి ఏసీబీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈయన తరపున బుధవారం పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు.

మనం 'ఏ'.. వాళ్లు 'బీ'!

రెండు అకాడమీల చైర్మన్లకు జీతభత్యాలు ఖరారు చేసిన బాబు సర్కార్

- టీడీపీ నేతపై వాత్సల్యం.. జనసేన నేతపై సవతి ప్రేమ
- సైన్స్ అండ్ టెక్నాలజీ అకాడమీ చైర్మన్‌కు నెలకు రూ.2,77,500
- జానపద, సృజనాత్మకత అకాడమీ చైర్మన్‌కు రూ.1,93,500
- విమాన ప్రయాణ సదుపాయాల్లోనూ వివక్ష

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో చంద్రబాబు సర్కార్ సొంత పార్టీ నేతలకు ఒకలా.. భాగస్వామ్య పార్టీలకు చెందిన వ్యక్తులకు మరొకలా జీతభత్యాలు నిర్ణయిస్తూ వివక్ష చూపిస్తోంది. తాజాగా బుధవారం రెండు అకాడమీల చైర్మన్ల జీతభత్యాలను ఖరారు చేసింది. ఇందులో రాష్ట్ర సైన్స్ అండ్ టెక్నాలజీ అకాడమీ చైర్మన్ మందలపు రవిని కేటగిరీ'ఏ'లో పెట్టి భారీ జీతాన్ని ఇస్తుండగా.. జానపద–సృజనాత్మకత అకాడమీ చైర్మన్ వంపూరు గంగులయ్యను మాత్రం 'బీ' కేటగిరీకే పరిమితం చేసింది. ప్రభుత్వంలో పలుకుబడి, పెద్దల ఆశీస్సులు, సామాజికవర్గాల సమీకరణాల్లో చక్రం తిప్పే వ్యక్తులకు మాత్రమే 'ఏ' కేటగిరీ జీతభత్యాలు, హోదా దక్కుతుండడం గమనార్హం. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ బుధవారం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం..

సొంతవారిపై వాత్సల్యం..

టీడీపీకి చెందిన ఎన్నారై మందలపు రవిని 'ఏ' కేటగిరీలో పెట్టి నెలకు జీతభత్యాలు ఏకంగా రూ.2,77,500గా నిర్ణయించింది. ఇందులో నెలకు రూ.1.25లక్షల వేతనం, వ్యక్తిగత సిబ్బంది ఖర్చులు కింద రూ.52వేలు (1పీఎస్, 1ఓఎస్, 1డ్రైవర్), వాహనం అలవెన్స్ కింద రూ.60వేలు, అధికారిక నివాసం/రూ.40వేలు చెల్లింపులు, మొబైల్ ఫోన్, మెడికల్ రీయింబర్స్‌మెంట్, జాతీయ విమాన ప్రయాణాల్లో ఎకానమీ, అంతర్జాతీయ ప్రయాణాల్లో బిజినెస్ క్లాస్ విమాన టికెట్ల సౌకర్యాన్ని కల్పించింది.

జనసేన నాయకునిపై సవతి తల్లి ప్రేమ

జనసేనకు చెందిన గంగులయ్య విషయానికి వస్తే ఇతర అకాడమీ చైర్మన్లతో సమానంగా చూడకుండా ఆయనపై ప్రభుత్వం వివక్ష ప్రదర్శించింది. జీతభత్యాలను 'బీ' కేటగిరీలో పెట్టి నెలకు రూ.1,93,500 మాత్రమే ఇస్తోంది. ఇందులో నెలకు రూ.60వేల వేతనం, వ్యక్తిగత సిబ్బంది ఖర్చులు రూ.33వేలు(1పీఏ, 1డ్రైవర్), వాహన అలవెన్స్ రూ.60వేలు, అధికారిక నివాసం రూ.40వేలు, ఫోన్, మెడికల్ రీయింబర్స్‌మెంట్‌తో పాటు డొమెస్టిక్ విమాన ప్రయాణంలో ఎకానమి క్లాస్‌కు మాత్రమే పరిమితం చేసింది. అంతర్జాతీయ విమాన ప్రయాణ జాబితా నుంచి తొలగించింది. ఇక్కడ చంద్రబాబు ప్రభుత్వం జనసేన నేతలను చిన్నచూపు చూడటమే కాకుండా జానపద కళాకారులను తీవ్రంగా అవమానించినట్టు కళావర్గాలు మండిపడుతున్నాయి.

గతంలోనూ ఇదే ధోరణి..

కొద్ది నెలల ముందు ఆంధ్రప్రదేశ్ క్రియేటివ్ –కల్చర్ కమిషన్ చైర్‌పర్సన్ పొడపాటి తేజస్వికి, ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాల కృష్ణకు సైతం 'ఏ' కేటగిరీలోనే జీతభత్యాలను ప్రకటించింది. అయితే గంగులయ్య మినహా మిలిగిన వారు టీడీపీకి చెందిన వారు కావడం గమనార్హం.

అంగన్‌వాడీ కేంద్రాల్లో వసతులు ఎందుకు కల్పించడం లేదు?

- పూర్తి వివరాలతో కౌంటర్లు వేయండి
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు వంటి కనీస మౌలిక సదుపాయాలు కూడా లేవని, ఈ విషయంలో ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదంటూ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. ఈ వ్యాజ్యంపై స్పందించిన హైకోర్టు.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులిచ్చింది. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలంటూ కేంద్ర మహిళా శిశు అభివృద్ధి శాఖ, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, స్త్రీ శిశు సంక్షేమ, వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖల ముఖ్య కార్యదర్శులు తదితరులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను 8 వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చల్లా గుణరంజన్ ధర్మాసనం బుధవారం ఉత్తర్వులిచ్చింది.

మద్యం అక్రమ కేసులో వారిద్దరూ అప్రూవర్లుగా మారుతున్నారు

- వారితో రాజ్ కేసిరెడ్డి పోల్చుకోలేరు
- హైకోర్టులో సీఐడీ సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా
- వాసుదేవరెడ్డి, సత్యప్రసాద్‌లకు సీఐడీ సహకరిస్తోంది
- హైకోర్టుకు నివేదించిన రాజ్ కేసిరెడ్డి తరపు సీనియర్ న్యాయవాదులు నాగముత్తు, పొన్నవోలు

సాక్షి, అమరావతి: మద్యం అక్రమ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న అప్పటి ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ (ఏపీబీసీఎల్) ఎండీ దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, ఎక్సైజ్ శాఖ స్పెషలాఫీసర్ దొడ్డ సత్యప్రసాద్ అప్రూవర్లుగా మారాలని నిర్ణయించుకున్నారని సీఐడీ సిట్ తరపున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా హైకోర్టుకు నివేదించారు. అందుకే వారిని ఇతర నిందితుల్లా కాకుండా ప్రత్యేకంగా చూస్తున్నామని చెప్పారు. వీరిద్దరితో రాజ్ కేసిరెడ్డి తనను తాను పోల్చుకోవడానికి వీల్లేదన్నారు. ఈ కేసులో చాలామంది అరెస్ట్ అయ్యారని, వాళ్లెవరూ అప్రూవర్లుగా మారుతామని కోరలేదని, ఒకవేళ రాజ్ కేసిరెడ్డి అప్రూవర్‌గా మారితే అతన్ని కూడా ప్రత్యేకంగా చూస్తామన్నారు. ఇది పూర్తిగా దర్యాప్తు సంస్థ విశేషాధికారమని స్పష్టం చేశారు.

అప్రూవర్లు కేసు ట్రయల్ పూర్తయ్యేంత వరకు జైలులోనే ఉండాలి

సిద్ధార్థలూథ్రా వాదనల్ని రాజ్ కేసిరెడ్డి తరపు సీనియర్ న్యాయవాది నాగముత్తు తప్పుపట్టారు. నిబంధనల ప్రకారం అప్రూవర్లుగా మారిన వ్యక్తులు కేసు ట్రయల్ పూర్తయ్యేంత వరకు జైలులోనే ఉండాలన్నారు. అందుకే వాసుదేవరెడ్డి, సత్యప్రసాద్ ముందస్తు బెయిల్‌కు ప్రయత్నిస్తున్నారని, ఇందుకు సీఐడీ–సిట్ పూర్తిగా వారికి సహకరిస్తోందన్నారు. రాజ్ కేసిరెడ్డి తరపున మరో సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. అవినీతి నిరోధక చట్టం కింద కేసు పెట్టిన సీఐడీ, దర్యాప్తు చేయడానికి ముందే సెక్షన్ 17(ఏ) కింద అనుమతి తీసుకోవడం తప్పనిసరన్నారు. ఈ కేసులో సీఐడీ ఎలాంటి అనుమతి తీసుకోకుండానే ఆయన్ను అరెస్ట్ చేసి జైల్లో ఉంచిందన్నారు. అందరి వాదనలు విన్న హైకోర్టు, రాతపూర్వక వాదనలను సమర్పించాలని ఇరుపక్షాలకు స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఈ నెల 8కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మద్యం అక్రమ కేసులో తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ప్రధాన నిందితుడిగా ఉన్న కేసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై బుధవారం జస్టిస్ జ్యోతిర్మయి మరోసారి విచారణ జరిపారు.

ఏళ్ల తరబడి జైలులో ఉంచాలని సీఐడీ భావిస్తోంది

రాజ్ కేసిరెడ్డి ఏడు నెలలుగా జైలులో ఉన్నారని అతడి తరపు న్యాయవాదులు నాగముత్తు, పొన్నవోలు కోర్టుకు తెలిపారు. దర్యాప్తు కొనసాగుతోందని, అది ఎప్పుడు పూర్తవుతుందో కూడా తెలియని పరిస్థితి ఉందన్నారు. 300 మంది సాక్షులను విచారించారని, వారందరినీ కోర్టులో విచారించి ట్రయల్ పూర్తయ్యేందుకు ఏళ్ల సమయం పడుతుందన్నారు. అప్పటివరకు కేసిరెడ్డిని జైలులో ఉంచాలని దర్యాప్తు సంస్థ భావిస్తోందన్నారు. నిందితునికి సైతం హక్కులుంటాయని, ఈ బెయిల్ విషయంలో కోర్టులో దీనిని పరిగణనలోకి తీసుకోవాలని సుప్రీంకోర్టు పలు సందర్భాల్లో చెప్పిందన్నారు. నిందితుడు ముందస్తు బెయిల్ దాఖలు చేసినప్పుడు వినిపించాల్సిన వాదనను లూథ్రా ఇప్పుడు వినిపించారన్నారు. బెయిల్ మంజూరు సమయంలో ప్రాథమిక ఆధారాలను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం లేదన్నారు. వాటిని కేవలం ముందస్తు బెయిల్ సందర్భంగా మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని తెలిపారు. బెయిల్ మంజూరు సమయంలో కోర్టులో చూడాల్సిన ప్రధాన అంశాలు ఏమిటో సుప్రీంకోర్టు పలు తీర్పుల్లో స్పష్టంగా చెప్పిందన్నారు. హైకోర్టు స్వతంత్రంగా తన న్యాయ పరిధిని ఉపయోగించి బెయిల్ మంజూరుపై నిర్ణయం తీసుకోవాలని వారు కోర్టును కోరారు.

క్లుప్తంగా...

జూనియర్ లెక్చరర్ల ఫలితాలు విడుదల

సాక్షి, అమరావతి: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న జూనియర్ లెక్చరర్ (లిమిటెడ్ రిక్రూట్‌మెంట్) పోస్టుల ఫలితాలను బుధవారం రాత్రి ఏపీపీఎస్సీ విడుదల చేసింది. డిసెంబర్ 2023లో 13 సబ్జెక్టులకు సంబంధించి 47 జూనియర్ లెక్చరర్ పోస్టుల భర్తీకి సర్వీస్ కమిషన్ నోటిఫికేషన్ వెలువరించింది. ఈ ఏడాది జూలైలో పరీక్షలు నిర్వహించి, 39 మంది పోస్టులకు ఎంపికైనట్టు ప్రకటించింది. మిగిలిన పోస్టులకు అర్హులైన అభ్యర్థులు లేకపోవడంతో భర్తీచేయలేదు. ఎంపికైన అభ్యర్థులకు ఈనెల 16, 17 తేదీల్లో విజయవాడలోని సర్వీస్ కమిషనర్ కార్యాలయంలో సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని కమిషన్ కార్యదర్శి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు కాల్‌లెటర్లు పంపిస్తారు. కాల్ లెటర్ అందకపోతే వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించింది. ఫలితాలను https://psc.ap.gov.in వెబ్‌సైట్‌లో చూడొచ్చు.

ఇంజిన్‌లో సమస్యతో ఆగిన గూడ్స్ రైలు

సింగరాయకొండ: సాంకేతిక సమస్య తలెత్తడంతో ఓ గూడ్స్ రైలు చెన్నై–విజయవాడ లైన్‌లో అరగంటపాటు ఆగిపోయింది. ఈ ఘటన బుధవారం ప్రకాశం జిల్లాలో జరిగింది. చెన్నై నుంచి వస్తున్న గూడ్స్ రైలుకు ఇంజన్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో ఊళ్లపాలెం కటింగ్ వద్ద నిలిచిపోయింది. రైల్వేస్టేషన్‌కు అరకిలోమీటరు దూరంలో ఆగిపోవడంతో ఆ మార్గంలో వచ్చే రైళ్లను మూడో లైను మీదుగా మళ్లించారు. కానీ ఇదే సమయంలో సింగరాయకొండ రైల్వేస్టేషన్‌కు రావాల్సిన విక్రమ సింహపురి ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్..గూడ్స్ రైలు వెనకాలే రావడంతో దానిని మళ్లించే అవకాశం లేకపోయింది. దీంతో ఆ రైలును ఉలవపాడు–సింగరాయకొండ మధ్య నిలిపివేశారు. దీంతో ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ 2 గంటలు ఆలస్యంగా సింగరాయకొండ స్టేషన్‌కు వచ్చింది. ఈలోగా అధికారులు గూడ్స్ రైలుకు ఇంజన్లు తగిలించి..సింగరాయకొండకు తీసుకెళ్లారు.

టెట్ హాల్ టికెట్ల విడుదల

సాక్షి, అమరావతి: ఈనెల 10 నుంచి జరగనున్న ఉపాధ్యాయ అర్హత పరీక్ష (ఏపీ టెట్–2025)కు హాల్‌టికెట్లు విడుదల చేసినట్లు టెట్ కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి తెలిపారు. 2,71,692 మందికి హాల్ టికెట్లు జారీచేయగా వారిలో 2,63,748 (97.08%) మందికి వారు కోరుకున్న తొలి ప్రాధాన్యత పరీక్షా కేంద్రాన్నే కేటాయించినట్లు చెప్పారు. 7,222 (2.66%) మందికి మందికి రెండో ప్రాధాన్యత పరీక్షా కేంద్రాన్ని, 0.2 శాతం మందికి మూడో ప్రాధాన్యతా పరీక్షా కేంద్రాన్ని, 0.06 శాతం మందికి నాలుగో ప్రాధాన్యతా కేంద్రాన్ని కేటాయించినట్లు వివరించారు.

ఏపీ కోలి సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడిగా బాబు

కడప కోటిరెడ్డి సర్కిల్ : కోలి సమాజ్ ఆంధ్రప్రదేశ్ ముదిరాజ్ రాష్ట్ర అధ్యక్షుడిగా దుడంరెడ్డి బాబు నియమితులయ్యారు. గతంలో ఈయన కోలీ ముదిరాజ్ రాష్ట్ర యువజన అధ్యక్షుడిగా సేవలు అందించారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ముదిరాజులు అభివృద్ధి చెందాలంటే బీసీ–డి నుంచి బీసీ–ఏలోకి మార్చాలన్నారు.

ఏలూరు మెడికల్ కాలేజీలో ర్యాగింగ్

మెడికోలపై కేసు నమోదు

ఏలూరు టౌన్: ఏలూరు మెడికల్ కళాశాల హాస్టల్‌లో సీనియర్ వైద్య విద్యార్థులు జూనియర్లను దారుణంగా ర్యాగింగ్ చేస్తున్నారనే ఫిర్యాదుపై మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సావిత్రి స్పందించారు. ఎంబీబీఎస్ సెకండియర్ వైద్య విద్యార్థుల రాతపూర్వక ఫిర్యాదుపై స్పందించిన ప్రిన్సిపాల్ 16 మంది మూడో ఏడాది వైద్య విద్యార్థులను హాస్టల్ నుంచి సస్పెండ్ చేశారు. అలాగే వీరిపై ఏలూరు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఎంబీబీఎస్ సెకండియర్ విద్యార్థి గాది రాకేష్‌రెడ్డిపై దాడి చేశారంటూ ఫిర్యాదు చేయగా.. సీఐ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో కేసు నమోదుచేశారు. మూడో ఏడాది వైద్య విద్యార్థులు సిద్ధార్థ, రాయుడు, మనీష్, జోషితో పాటు మరికొంత మందిపై కేసు నమోదైంది. ఈ నెల 1వ తేదీ రాత్రి ఏలూరు జీజీహెచ్‌లోని ప్రభుత్వ మెడికల్ కాలేజీ అనుబంధ హాస్టల్ వద్ద తమపై సీనియర్లు దాడి చేశారంటూ జూనియర్ విద్యార్థులు ఫిర్యాదు చేశారు.

పొల్లూరు, డొంకరాయిలో విద్యుత్ ఉత్పత్తి నిలిపివేత

మోతుగూడెం (అల్లూరి సీతారామరాజు జిల్లా) : పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో కొత్తగా నిర్మిస్తున్న ఐదు, ఆరు యూనిట్ల అనుసంధాన ప్రక్రియ నిమిత్తం మంగళవారం నుంచి రెండు నెలలపాటు విద్యుత్ ఉత్పాదన నిలిపివేశారు. ఈ ప్రాజెక్ట్ ఎగువున ఉన్న డొంకరాయి జల విద్యుత్ కేంద్రంలో కూడా ఉత్పత్తి నిలిపివేశారు. దీంతో రెండు కేంద్రాల ద్వారా 120 మిలియన్ యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తి ఆగిపోతుంది. ఉత్పాదన నిలిపివేసి పనులు వేగవంతం చేశామని పొల్లూరు జల విద్యుత్ కేంద్రం సీఈ రాజారావు తెలిపారు. డొంకరాయి జలాశయం నీటిని గోదావరి డెల్టాకు రోజుకు 4 వేల క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తామన్నారు.

నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో కుంభవృష్టి

తిరుపతి జిల్లా చిట్టమూరులో 27.6 సెం.మీ. వర్షం

నెల్లూరులోని ఆర్టీసీ కాలనీని చుట్టుముట్టిన వర్షం నీరు

- గోడకూలి వృద్ధురాలు దుర్మరణం
- అల్పపీడనంగా మారిన దిత్వా తుపాను
- మరో రెండు రోజులు తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం

నెల్లూరులోని వేదాయపాలెం వద్ద నీటి ఉధృతికి తోడు ఆర్టీసీ బస్సు వేగానికి నీళ్లు చిమ్మడంతో కిందపడిపోయిన మహిళ

సాక్షి, అమరావతి/నెల్లూరు/వెంకటాచలం/తొట్టంబేడు: వాయుగుండం ప్రభావంతో శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో కుండపోత వర్షాలు కురిశాయి. తిరుపతి జిల్లా చిట్టమూరులో మంగళవారం ఉదయం నుంచి బుధవారం వరకు 27.6 సెం.మీ. వర్షపాతం నమోదైంది. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సర్వేపల్లిలో 27.2, ఇదగలిలో 24, తిరుపతి జిల్లా అల్లంపాడులో 23.8, విద్యానగర్‌లో 19.6, నెల్లూరు జిల్లా మనుబోలులో 17.9, మల్లంలో 17.6, అక్కంపేటలో 16.7, నెల్లూరులో 14 సెం.మీ. చొప్పున వర్షపాతం నమోదైంది. నెల్లూరు రూరల్, సైదాపురం, నాయుడుపేట, అల్లూరు, మనుబోలు, ముత్తుకూరు, ఇందుకూరుపేట, తిరుపతి జిల్లా గూడూరు, చింతవరం, సూళ్లూరుపేట, తొట్టంబేడు తదితర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి. బుధవారం సాయంత్రం వరకు తిరుపతి జిల్లా తొట్టంబేడులో 4.7, నెల్లూరు జిల్లా కృష్ణపట్నంలో 3.7, తిరుపతి జిల్లా మన్నారు పోలూరులో 3.2, చిత్తూరు జిల్లా నింద్రలో 3 సెం.మీ. వర్షపాతం నమోదైంది. దిత్వా తుపాను బలహీనపడి రెండు రోజుల క్రితం వాయుగుండంగా మారగా.. బుధవారం అల్పపీడనంగా మారింది. దీని ప్రభావంతో మరో రెండు రోజులు రాష్ట్రంలో అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. గురువారం శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడా పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. ప్రకాశం, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్ కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

జలదిగ్బంధంలో నెల్లూరు హైవే

వాయుగుండం నెల్లూరు జిల్లాపై తీవ్ర ప్రభావాన్ని చూపింది. మంగళవారం రాత్రి నుంచి బుధవారం తెల్లవారుజామున 5 గంటల వరకు ఏకధాటిగా కుంభవృష్టి కురిసింది. వాగులు, వంకలు, పంట పొలాలు సముద్రాన్ని తలపించాయి. వెంకటాచలం మండలం చెముడుగుంట, కాకుటూరు, కాగితాలపూరు తదితర ప్రాంతాల్లోని జాతీయ రహదారిపై వరద ప్రవహించింది. బుజబుజ నెల్లూరు, చెముడుగుంట ప్రాంతాల్లో జాతీయ రహదారిపైకి వరద పోటెత్తడంతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. వెంకటాచలం–మనుబోలు మధ్య జాతీయ రహదారిలో ఒక వరుస రోడ్డు మునిగిపోయింది. ప్రజలు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నెల్లూరు నుంచి వెంకటాచలం చేరుకునేందుకు సుమారు 3 గంటల సమయం పట్టింది. నెల్లూరు అయ్యప్పగుడి నుంచి హైవే రోడ్డు కలిసేచోట రోడ్డుపై మోకాలి లోతు నీరు చేరడంతో ద్విచక్ర వాహనాల రాకపోకలు ఆగిపోయాయి. పలుచోట్ల వర్షపు నీరు ఇళ్లలోకి చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వెంకటాచలంలో 3 వేల ఎకరాల్లో మునిగిన నారు మళ్లు, నాట్లు మునిగినట్లు ప్రాథమిక అంచనా.

నీట మునిగిన కాలనీలు

భారీ వర్షాలకు నెల్లూరు నగరంలో సగం ప్రాంతాలు నీటమునిగాయి. చంద్రబాబునగర్, వైఎస్సార్ నగర్, మల్లయ్యగుంట, బుజబుజ నెల్లూరులోని ఆర్టీసీ కాలనీ, డ్రైవర్స్ కాలనీ, తల్పగిరి కాలనీ, శివగిరి కాలనీ, జనార్దన్‌రెడ్డి నగర్, కృషి విజ్ఞాన కేంద్రం, ఆర్డీటీ కాలనీ, సుందరయ్య కాలనీ డి–బ్లాకులోని కొన్ని ప్రాంతాలు, హరనాథపురం విస్తరిత(ఎక్స్‌టెర్నల్) ప్రాంతాల్లో పెద్దఎత్తున వరద నీరు చేరింది. మాగుంట లేఅవుట్, రామలింగాపురం, ఆత్మకూరు బస్టాండ్ అండర్ బ్రిడ్జిలు నీటమునిగాయి.

గోడ కూలి వృద్ధురాలి మృతి

తిరుపతి జిల్లా తొట్టంబేడు మండలం కానవరంలో బుధవారం కురిసిన వర్షానికి పూరి గుడిసె గోడకూలి నిద్రదిస్తున్న రేణుకమ్మ(59)పై పడింది. ఈ ఘటనలో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది.

నివురుగప్పిన నిప్పుగానే కర్ణాటకం..!

మంగళూరులో నినాదాల మంటలు

కేసీ వేణుగోపాల్ ఎదుట గళమెత్తిన డీకే వర్గం

అనంతరం సిద్ధరామయ్య మద్దతుదారుల నినాదాలు

సాక్షి బెంగళూరు/శివాజీనగర: కర్ణాటకలో అధికార మార్పిడి వివాదం ఇంకా సద్దుమణిగినట్లు కనబడటంలేదు. సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ 'బ్రేక్‌ఫాస్ట్ చర్చలతో' ఈ వివాదానికి బ్రేకులు పడ్డాయని సంకేతాలు ఇచ్చినా వారి మద్దతుదారులు వెనక్కు తగ్గడం లేదు. తాజాగా మంగళూరు విమానాశ్రయం ఇరువర్గాల బలప్రదర్శనకు వేదికగా మారింది.

మంగళూరులో జరిగిన కార్యక్రమంలో సీఎం సిద్ధరామయ్య, కేసీ వేణుగోపాల్ తదితరులు

విమానాశ్రయం వేదికగా...

కోణాజెలో నారాయణ గురు–మహాత్మా గాంధీ సంవాద శతమానోత్సవ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఢిల్లీ నుంచి మంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయానికి వచ్చారు. ఈ సందర్భంలో డీకే అనుచర నాయకుడు మిథున్‌రై, వందలాది మందితో కలిసి 'డీకే.. డీకే..' అంటూ వేణుగోపాల్ వద్ద నినాదాలు చేస్తూ దూసుకువచ్చారు. అయితే వేణుగోపాల్ మౌనంగా ముందుకు సాగారు. కొన్ని నిమిషాల అనంతరం ఇదే కార్యక్రమంలో పాల్గొనడానికి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య బెంగళూరు నుంచి ప్రత్యేక విమానంలో పలువురు మంత్రులతో కలిసి మంగళూరు చేరుకున్నారు. ఈ సమయంలో ఎమ్మెల్సీ ఐవన్ డిసోజా నేతృత్వంలో భారీ సంఖ్యలో కార్యకర్తలు విమానాశ్రయానికి చేరుకుని ముఖ్యమంత్రికి అనుకూలంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

ఆసక్తి రేపిన సీఎం-కేసీ విందు చర్చలు

కోణాజెలో కార్యక్రమం అనంతరం సిద్ధరామయ్య, వేణుగోపాల్ నడుమ మంగళూరు కావేరి గెస్ట్‌హౌజ్‌లో 'లంచ్ మీటింగ్' జరిగింది. అరగంట పాటు భోజనం చేస్తూ వారిద్దరూ పలు రాజకీయ, పార్టీ అంశాలపై చర్చించుకున్నట్లు సమాచారం. భోజనానికి ముందు కూడా 15 నిమిషాల పాటు హైటల్టేజ్ చర్చ కూడా వీరిద్దరి మధ్య జరిగిందని విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది. అల్పాహార సమావేశాల్లో శివకుమార్, తన మధ్య జరిగిన చర్చలను, తీసుకున్న నిర్ణయాలను వేణుగోపాల్‌కు సీఎం వివరించినట్లు తెలిసింది. అనంతరం సీఎం మీడియాతో మాట్లాడుతూ వేణుగోపాల్‌తో ఎలాంటి రాజకీయ చర్చ జరగలేదన్నారు. తాను ఢిల్లీకి వెళ్లడం లేదని, తనను ఎవరైనా పిలిస్తే మాత్రం వెళతానని వెల్లడించారు. డీకే ప్రస్తుతం ఢిల్లీలో ఉన్న విషయంపై అడిగిన ఒక ప్రశ్నకు స్పందిస్తూ, 'అందులో తప్పేం ఉంది?' అని ప్రశ్నించారు.

అభిమానుల నినాదాలు సహజమే: డీకే

ఒక ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఢిల్లీ వచ్చిన డీకే.. మంగళూరు పరిణామాలపై మీడియా అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇస్తూ, 'వేణుగోపాల్‌తో తమ నాయకుడు సిద్ధరామయ్య మాట్లాడితే తప్పేంటి? వేణుగోపాల్, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే ఇలా ఎవరినైనా కలిస్తే తప్పేంటి?' అని ప్రశ్నించారు. అలాగే విమానాశ్రయంలో తనకు అనుకూలంగా మద్దతుదారులు నినాదాలు చేయడంపై ఆయన మాట్లాడుతూ అభిమానులు తమ నాయకుడి పక్షాన నినాదాలు చేయడం చాలా సహజమన్నారు.

ఫిబ్రవరిలో ఫ్లీట్ రివ్యూ

అదే నెలలో మిలాన్-2026, అంతర్జాతీయ నేవీ సెమినార్

తూర్పు నౌకాదళాధిపతి సంజయ్ భల్లా

అధికారులతో కలిసి మీడియాతో మాట్లాడుతున్న ఈఎన్‌సీ చీఫ్ వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లా

సాక్షి, విశాఖపట్నం: వచ్చే ఏడాది ఫిబ్రవరిలో కీలకమైన మూడు అంతర్జాతీయ కార్యక్రమాలకు విశాఖపట్నం వేదిక కాబోతోందని తూర్పు నౌకాదళాధిపతి వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లా వెల్లడించారు. గురువారం నేవీ డే సందర్భంగా బుధవారం మీడియా సమావేశంలో ఈఎన్‌సీ చీఫ్ భల్లా మాట్లాడుతూ.. ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ, మిలాన్–2026, ఐఓఎన్‌ఎస్ కాంక్లేవ్ ఆఫ్ చీఫ్స్ (సీవోసీ) కార్యక్రమాలు ఫిబ్రవరి 15 నుంచి 25 వరకూ విశాఖలో నిర్వహిస్తున్నామన్నారు. ఆయన తెలిపిన వివరాలివీ..

ఫిబ్రవరి 15 నుంచి ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ

'ఫిబ్రవరి 15 నుంచి ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ (ఐఎఫ్‌ఆర్) ప్రారంభమవుతుంది. ఇప్పటికే 137 దేశాలకు ఆహ్వానం పంపించాం. ఫిబ్రవరి 18న ప్రధాన కార్యక్రమం జరుగుతుంది. ఫ్లీట్‌ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సమీక్షించనున్నారు. మిలాన్–2026 కూడా ఫిబ్రవరి 19న ప్రారంభమవుతుంది దీంతోపాటు రక్షణ దళం, నౌకాదళంలో సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించే అంశాలపై చర్చించేందుకు ఇండియన్ ఓషన్ నేషనల్ కాంక్లేవ్ (ఐఓఎన్‌ఎస్) మహాసాగర్ పేరుతో అంతర్జాతీయ సదస్సు ప్రారంభం కానుంది' అని తెలిపారు.

రూ.38 వేలు ఇస్తేనే మ్యుటేషన్

రైతును డిమాండ్ చేసిన వీఆర్‌ఓ

సోషల్ మీడియాలో ఆడియో వైరల్

మాట్లాడుతున్న రైతులు నాగార్జున, వెంకటపతి

శింగనమల (నార్పల): పొలం మ్యుటేషన్‌కు ఓ వీఆర్‌వో రైతును లంచం అడిగిన ఘటన అనంతపురం జిల్లా నార్పల మండలం దుగుమర్రిలో జరిగింది. దుగుమర్రి రెవెన్యూ గ్రామ పరిధిలోని రంగాపురానికి చెందిన రైతు నాగార్జునకు సర్వే నంబరు 90–2లో 4ఎకరాల పొలం ఉంది. దీని మ్యుటేషన్ కోసం దరఖాస్తు చేసుకోగా వీఆర్‌వో వెంకోబరావు రైతును రూ.38 వేలు ఇస్తేనే మ్యుటేషన్‌కు సంతకం చేస్తానని తెగేసి చెప్పారు. నాగార్జున రూ.10 వేలు ఇవ్వడానికి సిద్ధపడినప్పటికీ వీఆర్‌వో ససేమిరా అన్నారు. 'తహశీల్దార్, ఆర్‌ఐకు మీరు ఏమి ఇచ్చుకుంటారో నాకు తెలియదు. నాకు మాత్రం రూ.38 వేలు ఇస్తేనే సంతకం పెడతా. గతంలో రూ.10 వేలు ఇచ్చారు. అది కూడా ఆర్‌ఐకు ఇచ్చా. నా సొంత డబ్బు రూ.5 వేలు ఖర్చు పెట్టుకున్నా. మధ్య మధ్యలో మేడంకు రూ.3 వేలు ఇచ్చా. మొత్తంమ్మీద దాదాపు రూ.18 వేలు ఖర్చు పెట్టుకున్నా. ఇప్పుడు మీరు రూ.38 వేలు ఇస్తేనే సంతకం పెడతా. ఇంక ముస్ముందు మీకు చాలా పని ఉంటుంది. ఆ పని అంతా ఫ్రీగా చేస్తా. డబ్బు ఇవ్వకుంటే ఆర్‌డీఓ కార్యాలయానికి వెళ్లినా పెండింగ్ పెట్టిస్తా' అని వీఆర్‌వో రైతును ఫోన్‌లో బెదిరించారు. ఈ ఆడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో రైతులు నాగార్జున, వెంకటపతి మీడియా ముందుకు వచ్చారు. వీఆర్వో వెంకోబరావు లంచం డిమాండ్ చేసిన మాట వాస్తవమేనని చెప్పారు. ఈ అంశంపై తహసీల్దార్ స్పందిస్తూ సోషల్ మీడియాలో వచ్చిన ఆడియో విన్నామని, వీఆర్వోను విచారించగా వాయిస్ తనది కాదని చెప్పారన్నారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేసి, ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామన్నారు.

బెట్టింగ్‌కు బానిసై..

అప్పులు ఎక్కువై

యువకుడి బలవన్మరణం

వల్లెపు ప్రతాప్ (ఫైల్)

సీతారామపురం: నిరుపేద కుటుంబానికి చెందిన ఓ యువకుడు డిగ్రీ వరకు చదువుకున్నాడు. గ్రామంలో మంచి పేరు సంపాదించుకుని అందరికీ తలలో నాలుకలా ఉండేవాడు. పలువురు ఆ యువకుడిని నమ్మి రూ.లక్షల్లో అప్పులిచ్చారు. రూ.26 లక్షలతో ఆన్‌లైన్‌లో బెట్టింగ్ పెట్టి నష్టపోయాడు. చివరకు ఆ డబ్బులు తిరిగి ఇవ్వలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శ్రీపొట్టిశ్రీరాములునెల్లూరు జిల్లా సీతారామపురం మండలం రంగ నాయుడుపల్లికి చెందిన వల్లెపు ప్రతాప్ (23) గ్రామస్తుల వద్ద లక్షల్లో అప్పులు చేశాడు. ఈ డబ్బుతో రెండేళ్ల నుంచి ఆన్‌లైన్‌లో బెట్టింగులు ఆడుతూ రూ.26 లక్షల వరకు పోగొట్టుకున్నాడు. ఇటీవల ప్రతాప్‌కు డబ్బులిచ్చిన వ్యక్తుల నుంచి ఒత్తిడి అధికమవడంతో 2 నెలల నుంచి గ్రామానికి రాలేదు. తన సోదరుడు ఉండే దుత్తలూరుకు వచ్చాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న రంగ నాయుడుపల్లి గ్రామస్తులు మంగళవారం అక్కడికి వెళ్లి తమ డబ్బులు ఇవ్వాలని నిలదీశారు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన ప్రతాప్ మంగళవారం రాత్రి తన అన్న ఇంట్లోనే ఉరేసుకున్నాడు. అయితే బుధవారం ఉదయాన్నే మృతదేహాన్ని గుట్టుచప్పుడు కాకుండా ప్రతాప్ స్వగ్రామమైన రంగనాయుడుపల్లికి తరలించారు. విషయం తెలుసుకున్న దుత్తలూరు పోలీసులు వచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ షాక్‌కు గురై ఇంజనీరింగ్ విద్యార్థి మృతి

హిమేష్‌రెడ్డి

పెదకాకాని: స్నేహితుడి పుట్టినరోజుకు ఫ్లెక్సీ కడుతున్న విద్యార్థులకు విద్యుత్ షాక్ తగలడంతో ఒకరు మృతి చెందారు. మరొకరు గాయపడ్డారు. గుంటూరు జిల్లా నంబూరులోని వీవీఐటీయూలో తణుకు ప్రాంతానికి చెందిన లోకేశ్ ఇంజనీరింగ్ సెకండియర్ చదువుతూ వర్సిటీ హాస్టల్‌లో ఉంటున్నాడు. లోకేశ్, రామకృష్ణ, కేఎల్‌యూలో చదువుతున్న కొండా వెంకట హిమేష్‌రెడ్డి ముగ్గురు స్నేహితులు. బుధవారం లోకేశ్ పుట్టిన రోజు సందర్భంగా ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తుండగా హాస్టల్ నిర్వాహకులు అడ్డుకున్నారు. దీంతో సమీపంలోని విద్యుత్ టాన్స్‌ఫార్మర్ వద్ద ఫ్లెక్సీ కడుతుండగా హిమేష్‌రెడ్డి విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. రామకృష్ణకు కూడా షాక్ తగిలింది. ఇద్దరిని గుంటూరు ఆస్పత్రికి తరలించగా అప్పటికే హిమేష్‌రెడ్డి మరణించినట్లు ధ్రువీకరించారు.

ఎంపీటీసీపై టీడీపీ నేతల హత్యాయత్నం

- ముసుగులు ధరించి కర్రలతో దాడి
- తీవ్రంగా గాయపడ్డ ఎంపీటీసీ హరినాథరెడ్డి

నంద్యాల ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న హరినాథరెడ్డి

నంద్యాల(అర్బన్): వైఎస్సార్‌సీపీ నాయకులు రాజకీయంగా ఎదుగుతుండటం, తమ పార్టీలోకి రాకపోవడంతో నంద్యాల జిల్లాలో టీడీపీ నాయకులు జీర్ణించుకోలేక దాడులకు తెగబడుతున్నారు. తమ ఆధిపత్యమే ఉండాలన్న దుర్బుద్ధితో దాడులు చేయిస్తూ రాక్షసానందం పొందుతున్నారు. ఈ క్రమంలో నంద్యాల మండలం ఎస్.కొత్తపల్లె ఎంపీటీసీ సభ్యుడు హరినాథరెడ్డిని చంపేందుకు యత్నించారు. బుధవారం ఉదయం వ్యవసాయ కూలీ లక్ష్మన్నతో కలిసి హరినాథరెడ్డి పొలానికి వెళ్తుండగా ముసుగు ధరించిన ఆరుగురు దుండగులు ఆయనపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. కూలీలు కేకలు వేయడంతో దుండగులు అక్కడి నుంచి పరారయ్యారు. తీవ్రంగా గాయపడిన హరినాథరెడ్డిని స్థానికులు నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటుచేశారు. 'మా కుమారుడు హరినాథరెడ్డి 76 ఎకరాల్లో పంటలు పండిస్తున్నారు. అందరినీ ఆప్యాయంగా పలకరించే హరికి గ్రామంలో శత్రువులెవరూ లేరు. టీడీపీలోకి వెళ్లకపోవడంతో దుండగులు దాడికి పాల్పడ్డారు. ఇది ఎవరు చేయించి ఉంటారనేది గ్రామంలో అందరికీ తెలుసు. ఎన్ని దాడులు చేసినా మా కుటుంబం వైఎస్సార్‌సీపీలో ఉంటుంది' అని హరినాథ్‌రెడ్డి తల్లిదండ్రులు సుబ్బారెడ్డి, సుబ్బమ్మ పేర్కొన్నారు.

అధికారాన్ని అడ్డుపెట్టుకొని దాడులు చేస్తే చూస్తూ ఊరుకోం..

రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందని ఎమ్మెల్సీ ఇసాక్ బాషా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏదైనా రాజకీయంగా ఎదుర్కోవాలే తప్ప భౌతిక దాడులకు పాల్పడటం తగదన్నారు. చికిత్స పొందుతున్న హరినాథ్ రెడ్డిని ఆయన పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ.. అధికారం ఉంది కదా అని దాడులకు పాల్పడితే తాము చూస్తూ ఊరుకోబోమన్నారు. దాడులకు సరైన సమయంలో సమాధానం చెబుతామని హెచ్చరించారు. కాగా, ఈ ఘటనలో దుండగులపై కేసు నమోదు చేయడంలో పోలీసులు నిర్లక్ష్యం వహిస్తున్నట్లు తెలుస్తోంది. రాజకీయ ఒత్తిళ్లతోనే కేసు నమోదుకు వెనుకాడుతున్నట్లు సమాచారం.

టీడీపీ నేత భూమాయ

- చనిపోయిన పంచాయతీ కార్యదర్శి సంతకం ఫోర్జరీ
- 8 సెంట్ల భూమిని కబ్జా చేసి గోడ నిర్మాణం
- తనకు ఎమ్మెల్యే అండగా ఉన్నాడంటూ బెదిరింపులు

కేశవరెడ్డి ఆక్రమించుకున్న భూమి

ఇచ్ఛాపురం రూరల్: శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మండలం లొద్దపుట్టిలో టీడీపీ నాయకుడి భూమాయ వెలుగులోకి వచ్చింది. చనిపోయిన పంచాయతీ కార్యదర్శి సంతకం ఫోర్జరీ చేసి.. 8 సెంట్ల భూమిని కబ్జా చేసి గోడ నిర్మాణం చేపట్టాడు. ఇదేమని అడిగితే తనకు ఎమ్మెల్యే అండగా ఉన్నాడంటూ బెదిరింపులకు పాల్పడుతున్నాడు. దీనిపై కలెక్టర్, ఎస్పీ, జాయింట్ కలెక్టర్, ఆర్డీవోలకు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదని బాధితుడు పెదిన చంద్రయ్యరెడ్డి వాపోయారు. బాధితుడి కథనం ప్రకారం.. లొద్దపుట్టికి చెందిన పెదిన మేఘనాథంరెడ్డికి అదే గ్రామంలో 17 సెంట్ల వారసత్వ భూమి ఉంది. ఉద్యోగరీత్యా అండమాన్‌లో ఉన్న తన కుమారుడు పెదిన చంద్రయ్యరెడ్డి పేరున ఈ ఏడాది జూలై 8న భూమిని రిజిస్ట్రేషన్ చేశాడు. ఈ భూమిపై అదే గ్రామానికి చెందిన టీడీపీ నేత పి.కేశవరెడ్డి కన్నుపడింది. నకిలీ పత్రాలను సృష్టించి ఆ స్థలంలోని 8 సెంట్లు ఆక్రమించేందుకు కుయుక్తి పన్నాడు. స్థానికంగా ఉన్న మరో టీడీపీ నాయకుడి సహాయంతో కబ్జా చేసిన స్థలంలో గోడ నిర్మాణం చేపట్టాడు. ఈ స్థలం తనదేనంటూ అధికారులు, పోలీస్ వ్యవస్థను పక్కదారి పట్టించడంతో బాధితుడు ఈ ఏడాది సెప్టెంబర్ 9న కలెక్టర్, ఎస్పీ, జాయింట్ కలెక్టర్, ఆర్డీవోలకు ఫిర్యాదు చేశాడు. అయితే నియోజకవర్గ టీడీపీ నేత తానున్నానంటూ అభయం ఇవ్వడంతో ఈ ఏడాది నవంబర్ 5న హుటాహుటిన రిజిస్ట్రేషన్ కార్యాలయంలో 8 సెంట్ల భూమికి రిజిస్ట్రేషన్ చేసేశారు.

ఫోర్జరీ చేసి మరీ

ఐదేళ్ల క్రితం లొద్దపుట్టి గ్రామ పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శిగా పనిచేసిన వాణరాశి శంకరరావు 2021 డిసెంబర్‌లో మృతి చెందారు. భూకబ్జాకు పాల్పడిన టీడీపీ కేశవరెడ్డి ఆ భూమి తన స్వాధీనంలో ఉందంటూ చనిపోయిన పంచాయతీ కార్యదర్శి శంకరరావు ఫోర్జరీ సంతకంతో నవంబర్ 10న పొజిషన్ సర్టిఫికెట్ తయారు చేసి అధికారులకు చూపించాడు. దీన్ని పసిగట్టిన అధికారులు వారించినప్పటికీ.. ఆ భూమి తనదేనంటూ బహిరంగంగా చెబుతున్నాడు. దీంతో రెవెన్యూ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. కాగా.. భూహక్కు ధ్రువీకరణ పత్రం జారీ చేయాల్సింది తహసీల్దార్ మాత్రమేనని, పంచాయతీ అధికారులకు, ఇతర అధికారులకు ఎటువంటి హక్కు లేదని తహసీల్దార్ ఎన్.వెంకటరావు చెప్పారు. అటువంటి వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



మృతి చెందిన పంచాయతీ కార్యదర్శి సంతకంతో పొజిషన్ సర్టిఫికెట్

బెదిరిస్తున్నాడు

మా తాతల నుంచి వస్తున్న వారసత్వ ఆస్తిని మా నాన్న నా పేరిట రిజిస్ట్రేషన్ చేశారు. ఈ భూమిలో వాటా ఉందంటూ పి.కేశవరెడ్డి ఫేక్ సర్టిఫికెట్లతో రిజిస్ట్రేషన్ చేశాడు. నాలుగేళ్ల క్రితం చనిపోయిన పంచాయతీ కార్యదర్శి సంతకం ఫోర్జరీ చేశాడు. మాపై ఎదురు తిరుగుతూ తన వెనుక ఎమ్మెల్యే ఉన్నారని, అధికారులు ఈ విషయంలో కలగజేసుకోకుండా ఎమ్మెల్యే చూస్తున్నారంటూ బెదిరిస్తున్నాడు.

– పెదిన చంద్రయ్యరెడ్డి, బాధితుడు, లొద్దపుట్టి

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP) and Printed at Jagati Publications Limited, D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP).,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of news under the PRB act) Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23801.
Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

బిజినెస్ రీల్

టాటా ఆటోకాంప్ చేతికి ఐఏసీ
కొనుగోలు పూర్తిచేసినట్లు వెల్లడి

ముంబై: ఆటో విడిభాగాల కంపెనీ టాటా ఆటోకాంప్ సిస్టమ్స్ తాజాగా ఐఏసీ స్వీడన్ కొనుగోలుని పూర్తి చేసింది. యూరోపియన్ ఆటోమోటివ్ విడిభాగాల తయారీ కంపెనీ ఐఏసీ స్వీడన్‌ను పూర్తిగా సొంతం చేసుకున్నట్లు టాటా ఆటోకాంప్ వెల్లడించింది. దీంతో ఐఏసీ పేరును ఆర్టిఫెక్స్ సిస్టమ్స్ ఏబీగా రీబ్రాండ్ చేసినట్లు పేర్కొంది. తాజా కొనుగోలుతో యూరప్‌లో కార్యకలాపాలు పటిష్టంకానున్నట్లు తెలియజేసింది. తద్వారా ప్రయాణికుల, వాణిజ్య వాహన విభాగాలలోని కీలక యూరోపియన్ ఆటో దిగ్గజాల(ఓఈఎంలు)తో భాగస్వామ్యాలు పుంజుకోనున్నట్లు వివరించింది. అంతేకాకుండా ప్రపంచవ్యాప్త కార్యకలాపాల మెరుగుకు మరింత దోహదపడనున్నట్లు తెలియజేసింది.

టెల్కోల ఆదాయం @ రూ. 1 లక్ష కోట్లు
రెండో త్రైమాసికంపై ట్రాయ్ నివేదికలో వెల్లడి

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో టెలికం సంస్థల స్థూల ఆదాయం రికార్డు స్థాయిలో దాదాపు రూ. 1 లక్ష కోట్లుగా నమోదైంది. వార్షికంగా 9.19 శాతం పెరిగి రూ. 99,828 కోట్లకు చేరింది. టెలికం రంగ నియంత్రణ సంస్థ ట్రాయ్ విడుదల చేసిన నివేదికలో ఇది వెల్లడైంది. దీని ప్రకారం మొత్తం మొబైల్ సర్వీస్ ప్రొవైడర్లు, ఇంటర్నెట్ సర్వీస్ కంపెనీలు సహా టెలికం సర్వీస్ ప్రొవైడర్స్ (టీఎస్‌పీ)ల ఆదాయం గతేడాది క్యూ2లో రూ. 91,426 కోట్లుగా నమోదైంది. మరోవైపు, ప్రభుత్వం లైసెన్సు ఫీజు, స్పెక్ట్రం యూసేజీ చార్జీల విధింపునకు పరిగణనలోకి తీసుకునే 'సవరించిన స్థూల ఆదాయం' (ఏజీఆర్) 9.35 శాతం పెరిగి రూ. 82,348 కోట్లకు చేరింది. రిలయన్స్ జియో, భారతి ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా, బీఎస్ఎన్ఎల్ సంయుక్త ఏజీఆర్ సుమారు రూ. 69,230 కోట్లుగా ఉంది. జియో ఏజీఆర్ 11 శాతం పెరిగి రూ. 30,573 కోట్లకు, భారతి గ్రూప్‌ది సుమారు 13 శాతం పెరిగి రూ. 27,720 కోట్లకు, వొడాఫోన్ ఐడియాది రూ. 8,062 కోట్లకు, బీఎస్ఎన్ఎల్ ఏజీఆర్ 1 శాతం వృద్ధితో రూ. 2,021 కోట్లకు చేరింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

4-12-2025

విశాఖ	640-00
చిత్తూరు	663-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	645-00
విజయవాడ	670-00
రిటైల్ ధర (డజను)	90.00
హైదరాబాద్	651-00
వరంగల్	653-00
రిటైల్ ధర	7.11

నిఫ్టీ 50
టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
WIPRO	254.2	1.61
HINDALCO	818.65	1.46
TCS	3,180.00	1.41
ICICIBANK	1,392.00	1.38
HDFCBANK	1,000.10	1.04

నిఫ్టీ 50
టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
MAXHEALTH	1,085.00	-2.91
TATACONSUM	1,136.00	-2.25
ADANIENT	2,191.60	-2.14
BEL	404.65	-2.03
SHRIRAMFIN	828	-1.83

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	6,821
ఎన్ఎస్ఈ	93,382
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,39,819
ఎఫ్ఐఐ	- 3,207
డీఐఐ	+ 4,730

ముడిచమురు... (బ్యారెల్)

	రాత్రి 11.30కు		క్రితం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	59.08	$	58.64
బ్రెంట్	62.82	$	62.45

మొదలైన ఆర్‌బీఐ ఎంపీసీ

- 5న నిర్ణయాలు వెల్లడి
- రెపో రేటు కోతపై మిశ్రమ అంచనాలు

ముంబై: ఆర్‌బీఐ మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) మూడు రోజుల సమీక్షా సమావేశం బుధవారం ప్రారంభమైంది. రెపో రేటును పావు శాతం తగ్గించొచ్చన్న అంచనాల మధ్య కొనసాగుతున్న ఈ సమావేశానికి ప్రాధాన్యం ఏర్పడింది. ముఖ్యంగా ద్రవ్యోల్బణం కనిష్టాలకు చేరి, జీడీపీ వృద్ధి బలపడడం, రూపాయి మారకం విలువ ఆల్‌టైమ్ కనిష్టాలకు పతనమైన సమయంలో జరుగుతున్న ఎంపీసీ భేటీ.. ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటుందోనన్న ఆసక్తి నెలకొంది. కొందరు విశ్లేషకులు పావు శాతం రేటు కోతను అంచనా వేస్తుంటే, యథాతథ స్థితినే కొనసాగించొచ్చని మరికొందరు విశ్లేషకులు భావిస్తున్నారు. ఆర్‌బీఐ ఎంపీసీ తన నిర్ణయాలను శుక్రవారం (5న) ఉదయం వెల్లడించనుంది. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి మూడు విడతల్లో ఆర్‌బీఐ రెపో రేటును 1% తగ్గించడంతో 5.5 శాతానికి దిగిరావడం తెలిసిందే. ''డిసెంబర్‌లో రెపో రేటు 0.25% తగ్గింపు ఉంటుందని అంచనా వేస్తున్నాం. వృద్ధి బలంగా ఉంది. అక్టోబర్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం గణనీయంగా తగ్గింది. దీంతో రేట్ల కోతకు అదనపు వెసులుబాటు లభించింది''అని క్రిసిల్ ముఖ్య ఆర్థికవేత్త ధర్మకృతి జోషి తెలిపారు. వడ్డీ రేట్ల కోతకు అవకాశం ఉందని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా సైతం గత నెలలో సంకేతం ఇచ్చారు.

మెరుగుపడిన సేవల రంగం

నవంబర్‌లో పీఎంఐ 59.8 ● అక్టోబర్‌లో ఇది 58.9

న్యూఢిల్లీ: కొత్త ఆర్డర్లు రావడం, ధరల ఒత్తిళ్లు తగ్గడంతో సేవల రంగం పనితీరు నవంబర్‌లో గాడిన పడింది. ఈ రంగం పనితీరును సూచించే హెచ్ఎస్‌బీసీ ఇండియా సేవల రంగ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) 59.8 పాయింట్లకు పుంజుకుంది. అక్టోబర్‌లో ఇది 58.9 పాయింట్లుగా ఉండడం గమనార్హం. 50 పాయింట్లకు పైన ఉంటే విస్తరణగానే పరిగణిస్తుంటారు. కొత్త ఆర్డర్ల స్వీకరణతో సేవల రంగంలో పనితీరు నవంబర్‌లో 59.8 పాయింట్లకు మెరుగుపడినట్టు హెచ్ఎస్‌బీసీ ముఖ్య ఆర్థికవేత్త ప్రంజుల్ భండారీ తెలిపారు. అంతర్జాతీయంగా సేవల విక్రయాలు మెరుగుపడ్డాయని, ఆసియా, యూరప్, మధ్య ప్రాచ్యం నుంచి కంపెనీలు ప్రయోజనం పొందినట్టు హెచ్ఎస్‌బీసీ పీఎంఐ సర్వే నివేదిక పేర్కొంది. అయితే అంతర్జాతీయంగా సేవల రంగం విస్తరణ రేటు (అమ్మకాలు) ఎనిమిది నెలల కనిష్ట స్థాయిలో ఉన్నాయని, అంతర్జాతీయంగా తీవ్రమైన పోటీ, చౌక సేవల సరఫరా వృద్ధికి అడ్డుపడుతున్నట్టు తెలిపింది. నిర్వహణ వ్యయాలు ఐదున్నరేళ్ల కనిష్టానికి చేరుకోవడంతో, సేవల చార్జీలు అతి తక్కువ స్థాయిలో పెరిగినట్టు వివరించింది. నవంబర్‌లోనూ సేవల రంగంలో ఉద్యోగ కల్పన బలంగా నమోదైంది. ఇక హెచ్ఎస్‌బీసీ ఇండియా కాంపోజిట్ పీఎంఐ (తయారీ, సేవలు కలిసి) నవంబర్ నెలకు 59.7 పాయింట్లకు పడిపోయింది. అక్టోబర్‌లో ఇది 60.4 పాయింట్లుగా ఉంది.

నవంబర్‌లో హైరింగ్ జోరు

- వార్షికంగా 23 శాతం అప్
- ఐటీయేతర రంగాల్లో భారీగా నియామకాలు
- వైట్-కాలర్ ఉద్యోగాలపై నౌకరీ జాబ్‌స్పీక్ ఇండెక్స్ నివేదిక

ముంబై: దేశీయంగా నవంబర్‌లో వైట్ కాలర్ ఉద్యోగాలకు (మేనేజర్, అకౌంటెంట్, సాఫ్ట్‌వేర్ డెవలపర్ మొదలైనవి) సంబంధించిన నియామకాలు పుంజుకున్నాయి. వార్షికంగా 23 శాతం పెరిగాయి. నౌకరీ జాబ్‌స్పీక్ ఇండెక్స్ నివేదిక ప్రకారం ముఖ్యంగా విద్య, రియల్ ఎస్టేట్, ఆతిథ్య, పర్యాటక, బీమా లాంటి ఐటీయేతర రంగాల్లో హైరింగ్ గణనీయంగా నమోదైంది. నౌకరీడాట్‌కామ్‌లో కొత్త జాబ్ లిస్టింగ్స్, రిక్రూటర్ల సెర్చ్‌లను విశ్లేషించిన మీదట దేశీయంగా జాబ్ మార్కెట్ ధోరణులపై ఈ రిపోర్ట్ రూపొందింది. దీన్ని బట్టి చూస్తే గత నెల ఐటీ రంగంలో హైరింగ్ పెద్దగా పెరగలేదు. విద్య (44 శాతం), రియల్ ఎస్టేట్ (40 శాతం), ఆతిథ్య/పర్యాటకం (40 శాతం), బీమా (36 శాతం) రంగాల్లో అత్యధికంగా రిక్రూట్‌మెంట్ నమోదైంది.

నివేదికలో మరిన్ని విశేషాలు..

- యూనికార్న్‌లలో (1 బిలియన్ డాలర్ల వేల్యుయేషన్ గల సంస్థలు) నియామకాలు 35 శాతం పెరిగాయి. అలాగే అధిక విలువ చేసే ప్యాకేజీలుండే (వార్షికంగా రూ. 20 లక్షలు) ఉద్యోగాలకు రిక్రూట్‌మెంట్ 38 శాతం పెరిగింది. ఈ-కామర్స్ సంస్థల్లో 27 శాతం, ఐటీ యూనికార్న్‌లలో 16 శాతం వృద్ధి నమోదైంది.
- ప్రాంతీయంగా చూస్తే చెన్నై (49 శాతం), హైదరాబాద్ (41 శాతం), ఢిల్లీ/ఎన్‌సీఆర్ (41 శాతం)లో అత్యధికంగా హైరింగ్ నమోదైంది. 13-16 ఏళ్ల అనుభవం ఉన్న సీనియర్ల రిక్రూట్‌మెంట్ యూనికార్న్‌లలో 50 శాతం ఎగిసింది.
- దేశవ్యాప్తంగా ఎంట్రీ-స్థాయి హైరింగ్ 30 శాతం పెరిగింది. మెట్రోయేతర నగరాలు దీనికి సారథ్యం వహించాయి. అహ్మదాబాద్ (41 శాతం) అగ్రస్థానంలో ఉండగా కోయంబత్తూర్ (32 శాతం), జైపూర్ (31 శాతం) తర్వాత స్థానాల్లో ఉన్నాయి. ముంబై, బెంగళూరులాంటి కీలక మెట్రో హబ్‌లు వరుసగా 29 శాతం, 26 శాతం వృద్ధి కనపర్చాయి.
- గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లలో హైరింగ్ 18 శాతం పెరిగింది. ముఖ్యంగా డేటా సైంటిస్టులు (49 శాతం), సొల్యూషన్స్ ఆర్కిటెక్ట్‌లు (45 శాతం), ఫుల్ స్టాక్ డెవలపర్లు (36 శాతం), డేటా ఇంజినీర్లకు (33 శాతం) డిమాండ్ నెలకొంది. స్ట్రాటజీ, మేనేజ్‌మెంట్ కన్సల్టింగ్ జీసీసీల్లో హైరింగ్ 50 శాతం, ఐటీ రంగ జీసీసీల్లో 9 శాతం మేర నియామకాలు పెరిగాయి.
- చిన్న వ్యాపారాలు సైతం డిజిటల్ నిపుణులను నియమించుకునే ధోరణి పెరుగుతోంది.

రెపో రేటును పావు శాతం తగ్గించొచ్చు

- దశాబ్దం కనిష్ట స్థాయిలో ద్రవ్యోల్బణం
- ఇది రేట్ల కోతకు అనుకూలిస్తుంది
- రేటింగ్ సంస్థ కేర్ ఎడ్జ్ అంచనా

కోల్‌కతా: ఆర్‌బీఐ ఎంపీసీ సమీక్షలో రెపో రేటును పావు శాతం తగ్గించొచ్చని రేటింగ్ సంస్థ కేర్‌ఎడ్జ్ అంచనా వేసింది. ద్రవ్యోల్బణం గణనీయంగా తగ్గడంతోపాటు, జీడీపీ వృద్ధి బలంగా కొనసాగుతుండడం రేట్ల కోతకు అనుకూలించొచ్చని పేర్కొంది. ఈ నెల 5న ఆర్‌బీఐ ఎంపీసీ తన నిర్ణయాలను ప్రకటించనుండడం తెలిసిందే. ద్రవ్యోల్బణం దశాబ్ద కనిష్ట స్థాయి అయిన 0.3 శాతానికి అక్టోబర్‌లో తగ్గినట్టు కేర్ ఎడ్జ్ గుర్తు చేసింది. ఆర్‌బీఐ లక్ష్యం అయిన 4 శాతానికి ఇది ఎంతో దిగువన ఉందని, దీంతో పాలసీ రేట్ల తగ్గింపునకు వెసులుబాటు ఉన్నట్టు పేర్కొంది. ప్రస్తుతం రెపో రేటు 5.5 శాతంగా ఉంది. ''బ్రెంట్ ముడి చమురు ధరలు స్థిరంగా ఉన్నాయి. రిజర్వాయర్లలో తగినంత నీటి నిల్వలు ఉండడం రబీ సాగుకు అనుకూలం. చైనాలో తయారీ అధికంగా ఉండడంతో ధరలు పెరిగే ఒత్తిళ్లు లేవు. ద్రవ్యోల్బణం ఇక్కడి నుంచి గణనీయంగా పెరగకుండా ఇవి సాయపడతాయి''అని తాజాగా విడుదల చేసిన నివేదికలో తెలిపింది.

ద్వితీయార్ధంలో వృద్ధి నెమ్మదించొచ్చు..

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) సెప్టెంబర్ త్రైమాసికంలో జీడీపీ వృద్ధి 8.2 శాతానికి విస్తరించగా.. ద్వితీయ ఆరు నెలల్లో (క్యూ3, క్యూ4) వృద్ధి రేటు 7 శాతానికి నెమ్మదించొచ్చని కేర్ ఎడ్జ్ అంచనా వేసింది. అమెరికా టారిఫ్‌లు అమల్లోకి రావడానికి ముందుగా చేసిన అధిక ఎగుమతులు, పండుగల అనంతరం వినియోగం తగ్గడం వంటివి వృద్ధి రేటును నెమ్మదింపజేస్తాయని పేర్కొంది. కాకపోతే పూర్తి ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి 7.5 శాతంగా ఉండొచ్చని అంచనా వేసింది. రిటైల్ ద్రవ్యోల్బణం వచ్చే 12 నెలల్లో 3.7 శాతంలోపు ఉండొచ్చని పేర్కొంది. అమెరికాతో వాణిజ్య చర్చలు దీర్ఘకాలం పాటు కొనసాగుతుండడం, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ.. విదేశీ మారకం నిల్వలు బలంగానే కొనసాగుతున్నట్టు, నవంబర్ మధ్య నాటికి 27 బిలియన్ డాలర్లు పెరిగి 693 బిలియన్ డాలర్లకు చేరినట్టు తెలిపింది.

భారత దివాలా చట్టం భేష్

- ఎస్అండ్‌పీ కితాబు
- రుణదాతలకు అనుకూలంగా ప్రక్రియ
- తగ్గిన పరిష్కార సమయం
- పెరిగిన రుణాల రికవరీ రేటు

న్యూఢిల్లీ: భారత్ దివాలా పరిష్కార చట్టానికి (ఐబీసీ) ఎస్అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్ కితాబిచ్చింది. అధికారిక ర్యాంకింగ్ మదింపును సవరించింది. దివాలా పరిష్కార కార్యాచరణ రుణదాతలకు స్నేహపూర్వకంగా ఉండడాన్ని గుర్తించింది. భారత్‌లో దివాలా అండ్ బ్యాంక్రప్టసీ కోడ్ (ఐబీసీ) రుణ క్రమశిక్షణను బలోపేతం చేసిందని, పరిష్కార ప్రక్రియను రుణదాతలకు అనుకూలంగా మార్చిందని ఎస్అండ్‌పీ తన నివేదికలో పేర్కొంది. గతంలో దివాలా పరిష్కార విధానాలకు భిన్నంగా ఐబీసీ కింద సంక్షోభంలోని కంపెనీల ప్రమోటర్లు తమ వ్యాపారాలపై నియంత్రణ కోల్పోతున్నట్టు వివరించింది. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని భారత దివాలా పరిష్కార చట్టానికి అధికారిక ర్యాంకింగ్ మదింపును గ్రూప్-సి నుంచి గ్రూప్-బికి మారుస్తున్నట్టు ప్రకటించింది. రుణదాతలకు స్నేహపూర్వకంగా ఉన్న దివాలా పరిష్కార ప్రక్రియను బలహీనం నుంచి మధ్యస్థానికి మెరుగుపరిచిన నేపథ్యంలో ఈ మార్పు చోటుచేసుకున్నట్టు తెలిపింది. ఐబీసీ కింద రుణదాతల ఆధ్వర్యంలో విజయవంతమైన పరిష్కారాలను పరిగణనలోకి తీసుకున్నట్టు పేర్కొంది. రుణాల వసూళ్లు, రికవరీ రేటు మెరుగుపడ్డాయని.. సగటు రుణ వసూలు గత చట్టం కింద ఉన్న 15-20 శాతం నుంచి ఐబీసీ కింద 30 శాతానికి పెరిగినట్టు తెలిపింది. గతంలో ఒక్కో కేసు పరిష్కారానికి ఆరు నుంచి ఎనిమిదేళ్ల సమయం తీసుకోగా, ఐబీసీ కింద రెండేళ్లకు తగ్గినట్టు ఎస్అండ్‌పీ పేర్కొంది. అధికార ర్యాంకింగ్ మదింపు అన్నది.. ఒక దేశ దివాలా చట్టం కింద రుణదాతలకు ఉన్న భద్రతను సూచిస్తుంటుంది.

7 ట్రిలియన్ డాలర్లకు గ్రీన్ ఎకానమీ

- 2030 నాటికి విస్తరిస్తుంది
- ప్రస్తుతం 5 ట్రిలియన్ డాలర్లు
- ప్రపంచ ఆర్థిక వేదిక అంచనా

న్యూఢిల్లీ: అంతర్జాతీయ గ్రీన్ ఎకానమీ (పర్యావరణ అనుకూల రంగాలు) విలువ 2030 నాటికి వార్షికంగా 7 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుందని ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) అంచనా వేసింది. ఇప్పటికే ఇది 5 ట్రిలియన్ డాలర్లను అధిగమించినట్టు తెలిపింది. భారత్ పునరుత్పాదక విద్యుత్ పరంగా అధిక వృద్ధిని నమోదు చేస్తుందని పేర్కొంది. బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్‌తో కలసి రూపొందించిన నివేదికను విడుదల చేసింది. పర్యావరణ అనుకూల ఆర్థిక వ్యవస్థతో ఎన్నో రంగాల్లోని వ్యాపారాలు ప్రయోజనం పొందుతున్నట్టు తెలిపింది. పర్యావరణ అనుకూల పరిష్కారాలను అనుసరిస్తున్న కంపెనీలు లబ్ధి పొందుతున్నట్టు వివరించింది. ఆర్థిక అనిశ్చితులు నెలకొన్నప్పటికీ, వైవిధ్యమైన పర్యావరణ పరిస్థితుల్లోనూ గ్రీన్ టెక్నాలజీలపై పెట్టుబడులు గరిష్ట స్థాయిలో కొనసాగుతున్నట్టు పేర్కొంది. సంప్రదాయ వ్యాపార మార్గాల కంటే పర్యావరణ అనుకూల వ్యాపార ఆదాయాలు కలిగిన కంపెనీలు మెరుగైన పనితీరు చూపిస్తున్నట్టు డబ్ల్యూఈఎఫ్ నివేదిక వివరించింది. సంప్రదాయ కంపెనీల కంటే పర్యావరణ అనుకూల వ్యాపారాల ఆదాయాలు రెండు రెట్లు అధికంగా వృద్ధి చెందుతున్నాయని, అలాగే నిధుల వ్యయాలు కూడా పర్యావరణ అనుకూల వ్యాపార కంపెనీలకు తక్కువగా ఉంటున్నట్టు పేర్కొంది. దీంతో ఈ కంపెనీలు 12-15 శాతం అధిక ప్రీమియాన్ని క్యాపిటల్ మార్కెట్లలో పొందుతున్నట్టు తెలిపింది. దీర్ఘకాలంలో ఈ కంపెనీల లాభాలు బలంగా కొనసాగుతాయన్న నమ్మకం ఇన్వెస్టర్లలో ఉండడమే దీనికి కారణమని వివరించింది.

పునరుత్పాదక విద్యుత్‌లో భారత్ టాప్

పునరుత్పాదక ఇంధన వనరుల ఆధారిత విద్యుదుత్పత్తి ప్రపంచ వ్యాప్తంగా ఏటా 9 శాతం పెరుగుతుంటే, 13 శాతం వృద్ధితో భారత్ అగ్రస్థానంలో ఉన్నట్టు డబ్ల్యూఈఎఫ్ నివేదిక వెల్లడించింది. చైనాలో వృద్ధి 12 శాతంగా ఉన్నట్టు తెలిపింది. చాలా ప్రాంతాల్లో ఏటా 10 శాతం వృద్ధి నమోదవుతుందంటూ.. 16 శాతం వృద్ధితో భారత్ ముందుంటుందని అంచనా వేసింది. 15 శాతం వృద్ధితో చైనా తర్వాతి స్థానంలో నిలుస్తుందని పేర్కొంది. 2019 నుంచి 2024 వరకు భారత్, చైనాలో పర్యావరణ అనుకూల ఇంధనాలపై ఏటా 12 శాతం చొప్పున పెట్టుబడులు పెరిగినట్టు వెల్లడించింది. భారత్‌లో పునరుత్పాదక విద్యుదుత్పత్తి విభాగంలో 'రెన్యూ' కంపెనీని ప్రస్తావించింది. దేశవ్యాప్తంగా 28 గిగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని ఈ సంస్థ కలిగి ఉన్నట్టు తెలిపింది.

ఎల్ఐసీ ఎండీగా ఆర్ చందర్ బాధ్యతలు స్వీకరణ

న్యూఢిల్లీ: ఎల్ఐసీ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఆర్ రామకృష్ణన్ చందర్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. ''భారత ప్రభుత్వం 2025 డిసెంబర్ 1న విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం ఆర్ చందర్‌ను మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమించాము'' అని ఎల్ఐసీ ఒక ప్రకటన ద్వారా తెలిపింది. చందర్ 1990లో అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసురుగా ఎల్ఐసీలో చేరారు. తదుపరి సీనియర్ డివిజనల్ మేనేజర్, రీజినల్ మేనేజర్, అంతర్జాతీయ కార్యకలాపాల వ్యూహాత్మక వ్యాపార విభాగానికి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పదవీ కీలక బాధ్యతలు నిర్వహించారు.

ఆగ్రో కెమికల్స్‌కు డిమాండ్

- ఆదాయంలో 6-7 శాతం వృద్ధి
- 2025-26పై క్రిసిల్ రేటింగ్స్ అంచనా

ముంబై: ఆగ్రో కెమికల్స్‌కు (వ్యవసాయ సంబంధిత రసాయనాలు) డిమాండ్ అంతర్జాతీయంగా కోలుకుంటుండడంతో, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కంపెనీల ఆదాయం 6-7 శాతం పెరగొచ్చని క్రిసిల్ రేటింగ్స్ అంచనా వేసింది. అంతర్జాతీయంగా సాగుకు సంబంధించి నెలకొన్న సానుకూల సెంటిమెంట్‌తో ఎగుమతుల ఆదాయం 8-9 శాతం పెరుగుతుందని పేర్కొంది. అధిక వర్షాలతో పంటలు దెబ్బతినడం, ఉత్పత్తులు వెనక్కి రావడం, సాగు సన్నద్ధత వంటి అంశాలు దేశీయ డిమాండ్‌కు సమస్యలుగా ఉన్నట్టు తెలిపింది. ''రెండు సంవత్సరాల స్థిరీకరణ తర్వాత ఆగ్రో కెమికల్స్ రంగంలో ఆదాయం 2025-26లో 6-7 శాతం పెరగొచ్చు. ఇది కూడా ధరల పెంపు ద్వారా కాకుండా అధిక అమ్మకాల రూపంలో రానుంది''అని క్రిసిల్ రేటింగ్స్ సీనియర్ డైరెక్టర్ అనుజ్ సేతి తెలిపారు. ఇన్వెంటరీలు (స్టాక్ నిల్వలు) కూడా సాధారణ స్థాయికి చేరడం ఆదాయం వృద్ధికి అనుకూలిస్తుందని చెప్పారు. ఇక ఆగ్రోకెమికల్స్ పరిశ్రమ తన దీర్ఘకాల వృద్ధి అయిన 8-10 శాతానికి వచ్చే ఆర్థిక సంవత్సరంలో చేరుకోవచ్చని క్రిసిల్ రేటింగ్స్ నివేదిక అంచనా వేసింది. అయితే, ఎగుమతులు స్థిరంగా కొనసాగడం, దేశీ డిమాండ్ పుంజుకోవడంపై ఈ వృద్ధి ఆధారపడి ఉంటుందని పేర్కొంది. పరిశ్రమ ఆదాయంలో దేశీ, విదేశీ మార్కెట్లో చెరో సగం వాటా కలిగి ఉన్నట్టు తెలిపింది. ముడి సరుకుల ధరలు స్థిరంగా ఉండడం, అమెరికా టారిఫ్‌ల ప్రభావంతో నిర్వహణ మార్జిన్లు ప్రస్తుత, వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఒక శ్రేణి పరిధిలోనే ఉంటాయని అంచనా వేసింది.

రుణ భారం నియంత్రణలోనే..

తక్కువ మూలధన వ్యయాలు, స్థిరమైన మూలధన నిధులతో ఆగ్రో కెమికల్ కంపెనీల రుణభారం నియంత్రణల్లోనే ఉంటుందని, దీంతో రుణ పరపతిని మెరుగ్గా కొనసాగొచ్చని క్రిసిల్ రేటింగ్స్ పేర్కొంది. లాక్‌డౌన్ అనంతరం పేరుకున్న నిల్వలు తగ్గిపోవడంతో దేశీయంగా ఆగ్రోకెమికల్స్ ధరలు స్థిరపడినట్టు తెలిపింది. చైనా నుంచి దిగుమతి చేసుకున్న ఆగ్రో కెమికల్స్‌పై కిలోకి 5 డాలర్ల ప్రయోజనం ఒనగూరుతోందని, గతేడాది స్థాయిలోనే ఉందని వివరించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొత్తం మీద ఇదే కొనసాగొచ్చని అంచనా అంచనా వ్యక్తం చేసింది. నిల్వలు తగ్గడం, పర్యావరణ నిబంధనలను కఠినంగా అమలు చేయడంతో సరఫరాలు స్థిరపడతాయని పేర్కొంది. ''ఆగ్రో కెమికల్స్ కంపెనీల నిర్వహణ మార్జిన్లు 12.5-13 శాతంగా ఉండొచ్చు. అయినప్పటికీ కరోనా ముందున్న 15 శాతం కంటే తక్కువే. 2024లో ప్రతికూలతల అనంతరం ఈ స్థిరత్వం నెలకొంది. మెరుగైన నిర్వహణ సామర్థ్యాలు, వ్యయ నియంత్రణలు ఇందుకు అనుకూలిస్తున్నాయి. దిగుమతులకు ప్రత్యామ్నాయంగా ఏటా రూ.5,500 కోట్ల పెట్టుబడులు పెడుతుండడం, కొత్త ఉత్పత్తుల రిజిస్ట్రేషన్లు, క్రమశిక్షణతో కూడిన మూలధన నిధుల నిర్వహణ వంటివి.. రుణ అవసరాలను తక్కువకు పరిమితం చేస్తాయి''అని క్రిసిల్ రేటింగ్స్ డైరెక్టర్ పూనమ్ ఉపాధ్యాయ వివరించారు. అయినప్పటికీ ఈ రంగం పనితీరుపై వాతావరణ మార్పులు, నియంత్రణలను కఠినతరం చేయడం, రూపాయి మారకం విలువల ప్రభావాన్ని పరిశీలించాల్సి ఉంటుందని పేర్కొంది.

లక్ష చార్జింగ్ పాయింట్లపై మారుతీ ఫోకస్

న్యూఢిల్లీ: ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) విభాగంలో అగ్రస్థానంపై కన్నేసిన ఆటోమొబైల్ దిగ్గజం మారుతీ సుజుకీ ఇండియా తమ చార్జింగ్ నెట్‌వర్క్‌ను పటిష్టం చేసుకుంటోంది. ఇందులో భాగంగా డీలర్ పార్ట్‌నర్లు, చార్జింగ్ పాయింట్ ఆపరేటర్లు కలిసి 2030 నాటికి దేశవ్యాప్తంగా లక్ష చార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేయనుంది. ఈ-విటారా కారుకి 5 స్టార్ భారత్ ఎన్‌క్యాప్ సేఫ్టీ రేటింగ్ లభించిన సందర్భంగా కంపెనీ ఎండీ హిసాషి తకెయుచి ఈ విషయాలు తెలిపారు. ఇప్పటికే 1,100 పైగా నగరాల్లోని తమ సేల్స్, సర్వీస్ టచ్‌పాయింట్స్‌వ్యాప్తంగా 2,000 పైగా ఎక్స్‌క్లూజివ్ చార్జింగ్ పాయింట్ల నెట్‌వర్క్‌ను నెలకొల్పినట్లు చెప్పారు. యాప్ తయారీ, దేశవ్యాప్తంగా డీలర్ నెట్‌వర్క్‌లో చార్జింగ్ మౌలిక సదుపాయాల ఏర్పాటుకు రూ. 250 కోట్లు ఇన్వెస్ట్ చేసినట్లు వివరించారు. తమ 'ఈ ఫర్ మి' యాప్ ద్వారా చార్జింగ్ పాయింట్ల వివరాలను పొందవచ్చన్నారు. చార్జింగ్ నెట్‌వర్క్ దన్నుతో 2026లో ఈ-విటారా అమ్మకాలను ప్రారంభించనున్నట్లు వివరించారు.

దీనజన బాంధవుడు దత్త భగవానుడు

మానవులకు దైవభీతి, గురుభక్తి, ధర్మదీక్ష, పుణ్య కార్యాచరణం, జితేంద్రియత్వం, బ్రహ్మజ్ఞానం మొదలైన సుగుణాలను కలిగించడానికి అనేక రూపాలలో అనేక స్థలాలలో అవతరించిన త్రిమూర్తి స్వరూపుడే దత్తాత్రేయుడు. కలియుగంలో మొదట శ్రీపాద శ్రీవల్లభులుగా అవతరించి కురువపురంలో నివసించారు. ఆ తర్వాత ఆయనే శ్రీ నరసింహ సరస్వతీ యతీంద్రులుగానూ, అక్కల్‌కోట మహారాజ్‌గానూ, శ్రీ షిరిడీ సాయి నాథుడిగానూ అవతరించారని ప్రతీతి. నేడు మార్గశిరపూర్ణిమ, దత్తజయంతి సందర్భంగా ఈ వ్యాస కుసుమం ...

జన్మసంసార బంధనాలను సులువుగా వదిలించి, జ్ఞానానందాన్ని పంచుతూ, ముక్తిపథంలో నడిపించి మోక్షాన్ని ప్రసాదించగలిగిన పరమ యోగీశ్వరుడు దత్తాత్రేయుడు. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ముగ్గురు వేరుకారని నిరూపించిన అపురూప ఘట్టమే దత్తాత్రేయ ఆవిర్భావం. త్రిమూర్తులే తనకు పుత్రులుగా జన్మించాలంటూ అత్రిమహర్షి–అనసూయ దంపతులు చేసిన తపస్సుకు మెచ్చి బ్రహ్మ అంశతో చంద్రుడు, రుద్రాంశతో దూర్వాసుడు జన్మించగా, విష్ణు అంశతో అవతరించినవాడే దత్తాత్రేయుడు!

సకల విద్యాపారంగతుడైన దత్తుడు జ్ఞానసముపార్జనలో ప్రకృతి అణువణువూ తనకు గురువేనని వెల్లడించాడు. ధర్మబద్ధంగా ఇహలోక సుఖాలను కోరుకునేవారికి వాటిని అనుగ్రహిస్తూ, వారిని యోగమార్గంవైపు పయనింపజేసే విశ్వగురు దత్తాత్రేయుడు. ఆయన అనుగ్రహిస్తే గురువుతోబాటుగా దైవానుగ్రహమూ లభించినట్లే!

ముగ్గురు మూర్తులూ మూడు శిరస్సులుగా...

దిక్కులనే అంబరంగా చేసుకుని, భక్తులను ఉద్ధరించేందుకు అనేక రూపాలను ధరించిన దత్తాత్రేయుడి మూడు తలలలో నడిమి శిరస్సు విష్ణువుది కాగా.. కుడివైపున శివుడు సద్గురు స్వరూపంగా, ఎడమవైపు బ్రహ్మదేవుడు పరబ్రహ్మస్వరూపమైన శిరస్సుతో భాసిస్తారు. మధ్యభాగంలో అజ్ఞానాన్ని తొలగించే గురుమూర్తిగా శ్రీదత్తుడు ముల్లోకాలను రక్షిస్తాడు.

అరుదైన రూపం

రుద్రాక్షమాల, డమరుకం, చక్రం, శంఖం, త్రిశూలం, కమండలాదులను ఆరుచేతులలో ధరించిన దత్తుని చుట్టూ ఉన్న నాలుగు శునకాలు వేదాలకు ప్రతీకలు. తనను ఆశ్రయించిన వారిని నాలుగువైపులనుండి రక్షిస్తాననే సందేశం కూడా ఇందులో ఉంది. ఆయన వెనకాల కనిపించే గోవును ఉపనిషత్తుల సారంగా చెబుతారు.

దత్తావధూత

దేహంపై వ్యామోహాన్ని వదిలి, జడ పదార్థంలా ఉండేవారిని అవధూత అంటారు. ఈ పదానికి అసలైన నిర్వచనంగా మారి దత్తావధూత అయ్యాడు. బౌద్ధమతకర్త అయిన బుద్ధుడు, జైనమత స్థాపకుడైన మహావీరుడు వారి శిష్యులైన మహాయోగులు, బోధిసత్వులు, జైనతీర్థంకరులు, షిరిడీ సాయిబాబా వంటి మహనీయులందరూ దత్తాత్రేయుని అంశావతారాలే అవుతారు.

పేర్లు వేరైనా పదార్థం ఒక్కటే!

ఒక వస్తువును వివిధ భాషలవారు వివిధ పేర్లతో పిలుస్తారు. తెలుగులో మామిడిపండంటే ఆంగ్లంలో 'మ్యాంగో' అంటారు. హిందీలో ఆమ్ అంటే సంస్కృతంలో చూత ఫలం అంటారు. ఇంకా ఇతర భాషల్లో వేరే పేర్లతో పిలుస్తారు. పేర్లెన్ని ఉన్నా పదార్థం ఒక్కటే కదా! ఆవిరిగా మారినా, మంచులా గడ్డ కట్టినా, నీరుగా ఉన్నా అది ఉదకమే కదా! కాబట్టి ఆయన భక్తులకోసం తానే అనేక రూపాలు ధరించి, ఎవరు ఏ పేరుతో పిలిచినా పలుకుతూ, ఆదుకుంటూ ఉంటాడు.

దత్తజయంతి నాడు ఏమి చేయాలి?

అత్రి, అనసూయ దంపతులకు త్రిమూర్తుల అంశతో మార్గశీర్ష శుద్ధ పౌర్ణమినాడు జన్మించాడు దత్తాత్రేయుడు. ఈ పర్వదినాన ఉదయమే లేచి కాలకృత్యాలు తీర్చుకున్న అనంతరం శుచియై దత్తాత్రేయుల వారి చిత్రాన్ని లేదా ప్రతిమను ముందు ఉంచుకుని షోడశోపచారాలతో, అష్టోత్తర శతనామాలతో పూజించి నైవేద్యం సమర్పించాలి. శారీరక ఉపవాసం కన్నా మానసికంగా చెడు ఆలోచనల నుంచి దూరంగా ఉండటమే ఆయనకు ఇష్టం.

అనంతరం దత్తచరిత్ర, దత్త సహస్రనామావళి, శ్రీగురుచరిత్ర వంటి గ్రంథాలను పారాయణ చేయడం వల్ల సత్ఫలితాలు సిద్ధిస్తాయి. మానసిక, శారీరక వైకల్యాలున్నవారు మార్గశిర పూర్ణిమనాడు దత్తాత్రేయుణ్ణి షోడశోపచారాలతో పూజించి, పంచామృతాలతో అభిషేకిస్తే వారి వైకల్యాలన్నీ తొలగి ఆరోగ్యవంతులవుతారని దత్తచరితం చెబుతోంది.

దత్తుడు ఉదయించిన మార్గశిర పౌర్ణమినే దత్తజయంతిగా జరుపుకుంటారు. 'దిగంబరా దిగంబరా శ్రీ పాదవల్లభ దిగంబరా' అంటూ దత్తనామ స్మరణలో గడుపుతారు. దత్తచరిత్ర, అవధూత గీత మొదలైన గ్రంథాల్ని పారాయణ చేస్తారు. భజనలు, సత్సంగాలు నిర్వహిస్తారు. నేడు దత్త స్తవం లేదా దత్తాత్రేయ వజ్రకవచం పఠించడం వలన అన్నిరకాల రక్షణ లభిస్తుంది. దత్తుడి ఆరాధన ఎంతో జటిలమైన పితృదోషాలను సైతం తొలగిస్తుందని ప్రతీతి.

అందరికీ ఆ దత్తుని అనుగ్రహం లభించాలని కోరుకుందాం.

జై గురు దేవదత్త

– డి.వి.ఆర్.భాస్కర్

కార్తికేయుని అనుగ్రహంతోనే యోగప్రాప్తి

● నిర్మలవాణి

సాధారణంగా కొన్ని దేవాలయాలలో రెండు సర్పాలు ఒక దానితో మరొకటి మెలికలు తిరుగుతూ ఉన్న శిల్పం మనకు కనిపిస్తుంది. ఆ శిల్పంలో ఉండే రెండు సర్పాలు మన సూక్ష్మ శరీరంలో ఏ విధంగా ఇడా, పింగళా నాడులు ఒక దానితో ఒకటి మెలికలు తిరిగి ఆరు శక్తి కేంద్రాలను లేదా షట్చక్రాలను ఏర్పరుస్తాయో సూచిస్తాయి. వీటినే చంద్ర నాడి, సూర్య నాడి అని కూడా పిలుస్తారు. మన వెన్నెముక అడుగు భాగాన త్రికోణాకార ఎముకలో ఉండే కుండలినీ శక్తి ఈ రెండు నాడుల మధ్య ఉండే సుషుమ్నానాడి ద్వారా పైకి వచ్చి మన మాడు పై భాగంలో ఉండే బ్రహ్మ రంధ్రాన్ని ఛేదించి, మన చుట్టూ ఉండే సర్వ వ్యాపితమైన భగవంతుని పరమ చైతన్య శక్తితో ఐక్యం చెందుతుంది. అప్పుడే ఒక సాధకునికి యోగప్రాప్తి జరుగుతుంది. ధ్యానంలో కుండలినీ శక్తి జాగృతిని, దాని ఊర్ధ్వ గమనాన్ని అనుభూతి చెందితే, సాధకుడు నిరానంద అనుభూతిని పొందగలుగుతాడు.

మన కుడివైపు మూలాధార చక్రం శుభ్రమయ్యే కొద్దీ మన లోపల అనవసరమైన ఆలోచనలు తగ్గిపోయి అంతర్గత ప్రశాంతత ఏర్పడుతుంది. ఆ విధంగా కుడి వైపు మూలాధార చక్రం మన లోపల సమతుల్యత ఏర్పడడానికి, నిర్విచార స్థితి నెలకొనడానికి సహాయ పడుతుంది.

మితిమీరిన క్రియాశీలత, ఇతరులపై ఆధిపత్యం చెలాయించడం, అవసరానికి మించి పని చేయడం, అతిగా ప్రణాళికలు వేయడం, నిద్ర లేమి, మొండితనం, మూర్ఖత్వం, చిరాకు, కోపం, అతిగా మాట్లాడడం, అతిగా ఆటలు ఆడటం, క్రూరత్వం, కాఠిన్యం ఇటువంటివన్నీ మన కుడివైపు పింగళానాడిని బలహీన పరుస్తాయి. ఆ సమయంలో శ్రీ కార్తికేయుని ధ్యానం ద్వారా మనం మన లోపల గల అసమతుల్యత లను తొలగించుకోవచ్చును. శ్రీ కార్తికేయుని ధ్యానం వలన మన చిత్తం నిర్మలంగా మారి మనకు నిర్విచార స్థితి లభిస్తుంది.

ఒక గురువుకు తన మీద తనకు ఆత్మ నిగ్రహం ఉంటుంది. అంటే తనను తాను నియంత్రించుకో గలుగుతాడు. కానీ శ్రీ కార్తికేయుని ఆశీస్సులు ఉన్న వ్యక్తి ఇతరులను శాసించ గలుగుతాడు. ఆ విధంగా శాసించ గల శక్తి పురుషులకు వారి మాటల ద్వారా, చురుకుదనం ద్వారా, వ్యక్తిగత విజయాల ద్వారా లభిస్తే, స్త్రీలకు వారి ప్రేమించే గుణం, సహనం, హుందాతనం, క్షమా గుణం, కరుణల ద్వారా లభిస్తుంది.

శ్రీ కార్తికేయుని శక్తి మన లోపల పసితనం లాంటి అమాయకత్వాన్ని పరిరక్షిస్తుంది. ఈ అమాయకత్వం వలనే మానవులు ఆనందంగా ఉండగలుగుతారు. మనలో కుండలినీ శక్తి వెన్నెముక అడుగున ఉన్న త్రికోణాకార ఎముక నుండి బయలు దేరి, షట్చక్రాలనూ దాటుకుంటూ వెళ్ళి, బ్రహ్మ రంధ్రాన్ని ఛేదించడానికి మార్గ మధ్యంలో ఏర్పడే ఆటంకాలన్నీ తొలగించడానికి కుడి మూలాధార చక్రం సహకరిస్తుంది. శ్రీ కార్తికేయుని శక్తి పరిపూర్ణంగా స్వచ్ఛమైన క్రియాశీలక శక్తి. అందులో ఎటువంటి అనవసరమైన, పనికిమాలిన ఆలోచనలకు తావు లేదు. అది చక్కటి ఫలితాలను ఇస్తుంది.

– డా. పి. రాకేశ్

(పరమపూజ్య శ్రీ మాతాజీ నిర్మలాదేవి ప్రవచనాలు, ప్రసంగాల ఆధారంగా)

● కథానీతి

శరణాగతి

ఎప్పుడైతే మానవుని అన్ని శక్తులు ఉడిగిపోతాయో, (నశిస్తాయో) అప్పుడు మనిషికి అనంత శక్తి సంపన్నుడు, దయాళువు అయిన భగవంతుడు గుర్తుకొస్తాడు. అప్పుడు భగవంతుని శరణుకోరితే భగవద్కృప వల్ల స్వేచ్ఛ లేదా సాయం దొరుకుతుంది. అందుకు ఉదాహరణే ఈ భాగవత కథ.

పురాతన త్రికూట పర్వతాలలో అతిశక్తిమంతమైన గజరాజు గజేంద్రుడు తన శక్తికి, అధికారానికి గర్వితుడై భోగలాలసుడై జీవితాన్ని గడుపుతున్నాడు. ఒకరోజు తన పరివార సమేతంగా దగ్గరనున్న కొలనుకు వెళ్ళాడు. ఆ కొలను పద్మాలతో వికసితమై సర్వసుందరంగా ఉంది. గజేంద్రుడు ఆ కొలనులోకి దిగి చల్లని నీళ్ళతో జలకాలాడుతున్నాడు. కాని అక్కడే తనకు మృత్యువు దాగి ఉందని తెలీదు. ఇంతలో అకస్మాత్తుగా ఒక మొసలి అడుగునుంచి వచ్చి గజేంద్రుని కాలు పట్టుకుంది. గజేంద్రుడు తన శక్తినంతా వుపయోగించి తన కాలు తనవైపు లాక్కుంటున్నాడు. మొసలి తన పట్టు వదలకుండా పట్టుకుంటుంది. ఈ పెనుగులాట రోజులు, నెలలు, సంవత్సరాలు గడుస్తున్నా ఓటమి ఎవరిదో నిర్ణయం కాలేదు. దేవతలు ఈ వినోదాన్ని చూస్తున్నారు తప్ప ఏమీ చేయలేక పోతున్నారు. క్రమేపి గజేంద్రుని శక్తి తగ్గుతుంది.

తన శక్తిగాని, తనవాళ్ళు గాని, తన అధికారం గాని ఏ ఒక్కటీ తనను రక్షించలేవని తెలుసుకున్నాడు.

బయట అతని కుటుంబం నిస్సహాయ స్థితిలో వుంది. ఇప్పుడు గజేంద్రునికి లౌకిక, భౌతిక శక్తులు నిరుపయోగమయ్యాయి. అప్పుడు గజేంద్రుడు శరీరమంతా బాధతో నున్నా, తన తొండంతో పద్మాన్ని తీసి పైకెత్తి విష్ణుమూర్తిని ప్రార్థించాడు. ఓ దీనజనరక్షకా, ఆపద్బంధూ, దయాళూ నన్ను కరుణించు, రక్షించు అంటూ పరిశుద్ధ మనసుతో ప్రార్థించాడు. ఆ శరణాగతి శ్రీ మహావిష్ణువుని కరిగించింది. ఆయన వెంటనే వైకుంఠాన్ని విడిచిపెట్టి భక్తుని రక్షించడానికి గరుడవాహనుడై కోటి సూర్యప్రభలతో బయలుదేరాడు. తనతో పాటు తన సుదర్శనచక్రం కూడా వచ్చింది. భగవాన్ తన సుదర్శన చక్రంతో మొసలి శిరస్సుని ఖండించాడు.

మొసలికీ శాపవిమోచనమైంది. గజేంద్రునికి స్వేచ్ఛ లభించి ప్రాణాలు నిలిచాయి. ''గజేంద్రా నీ శరణాగతి, నీ పిలుపులోని ఆర్ద్రత, పరిశుద్ధత వల్ల నీకు ముక్తి లభించిందన్నాడు శ్రీ మహావిష్ణువు.

గజేంద్రుడు తన శక్తి వల్లగాని, పరివారం వల్లగాని, పదవి వల్లగాని రక్షింపబడలేదు. పరిశుద్ధమైన పిలుపు, శరణాగతి, అన్యధా శరణం నాస్తి, త్వమేవ శరణం మమ అనుకోవడంతో అదే అతని ముక్తికి, స్వేచ్ఛకి కారకమైంది. మనిషికి ఇదొక సంకేతం. అన్ని శక్తులు విఫలమైనపుడు భగవంతునికి దాసుడైపోతే (శరణాగతి) స్వేచ్ఛ లేదా ముక్తి తప్పక కలుగుతాయి.

– డా. విశ్వేశ్వరవర్మ భూపతిరాజు.

ఆచార్య సద్బోధ

● పవిత్ర జీవనం గడపటం ద్వారా మాత్రమే శాశ్వతమైన దాన్ని పొందగలం.

● కొందరు మాట్లాడినప్పుడు ఆ మాట సచేతన స్పందనలతో ప్రతిధ్వనిస్తుంది. నూతన జీవితాన్ని ఆరంభించేలా చేస్తుంది. అదే మాట వేరొకరు మాట్లాడితే ఉపయోగం లేకపోవచ్చు.

● మహాత్ముడు అంటే అంతఃశుద్ధిని కలిగి ఉన్నవారు. వారిలోని ప్రకాశాన్ని చూడకుండా ఉండలేము. వారు ఏం చేసినా అది పవిత్రీకరించబడుతుంది.

● అసలు భగవంతుని గురించిన వివేకం, ప్రజ్ఞ కలిగి ఉండటమే పవిత్రతలోని ముఖ్య లక్షణాలు.

● ఒక మనిషి జీవిత సత్యాలను అనుభూతి చెందినపుడు అతడు మృదువుగా, శీఘ్రగ్రాహిగా మారుతాడు. ఆ గాఢానుభూతి ద్వారా దైవప్రేమిగా, సకల మానవాళిని ప్రేమించగలవాడిగా మారతాడు. ఇది జ్ఞానం ద్వారా మాత్రమే వస్తుంది. ఆ జ్ఞానం సరియైన జీవనం ద్వారానే వస్తుంది.

వారం - పర్వం

సకల సంకటాలను తొలగించే సంకట చతుర్థి

డిసెంబర్ 7, ఆదివారం సంకష్టహర చతుర్థి. ప్రతిమాసం కృష్ణపక్షంలో అంటే పౌర్ణమి తరువాత 3,4 రోజుల్లో చవితి వస్తుంది. సాధారణంగా క్యాలెండర్లలోనూ, పంచాంగాలలోనూ సంకష్టహరచతుర్థి ఎప్పుడనేదీ ఉంటుంది. ఈ వ్రతం ఆచరిస్తే జరగని పని లేదు.ఏదైనా గణపతి ఆలయానికి వెళ్ళి ఆలయం చుట్టు 3,11 లేదా 21 సార్లు ప్రదక్షిణ చేయాలి. వీలైనంత వరకు గణపతికి ఇష్టమైన గరిక వంటి వాటిని సమర్పించాలి. ఆలయానికి వెళ్ళటం సాధ్యం కానప్పుడు ఇంట్లోనే ఒకచోట గణపతిని ఉంచి ప్రదక్షిణ చేయవచ్చు. సూర్యాస్తమయం అయిన తరువాత స్నానం చేసి దీపం వెలిగించి స్వామికి లఘువుగా పూజ చేయాలి. సూర్యాస్తమయం వరకు పాలు, పళ్ళు, పచ్చి కూరగాయలు తినవచ్చు. చంద్రోదయం తరువాత చంద్రదర్శనం లేదా నక్షత్ర దర్శనం చేసుకొని చంద్రునకు ధూప, దీప, నైవేద్యాలను సమర్పించి మామూలుగా భోజనం చేయాలి. ఈ మొత్తం ఆచరించడం కష్టమని భావించేవారు, ఉపవాసం చేసి, సంకటనాశన గణేశ స్తోత్రం నాలుగుసార్లు పఠించి, దగ్గరలో ఉన్న గణపతి ఆలయాన్ని సందర్శించవచ్చు. ఉపవాసం చేయలేనివారు, కనీసం 4 సార్లు శ్రీ సంకట నాశన గణేశ స్తోత్రం పఠించినా ఫలితం ఉంటుంది.

● ఇస్లాం వెలుగు

దైవ మార్గంలో మహిళల దానధర్మాలు

దైవ ప్రవక్త సల్లం హజ్రత్ బిలాల్ రజిఅన్ గారి వెంట మసీదు నుండి బయటకు వచ్చినప్పుడు స్త్రీలు తన బోధనలను గ్రహించ లేదని ఆయన భావించారు. తరువాత ఆయన వారిని సమావేశపరిచి సద్ ఖా (దానం) చేయమని ఆదేశించారు. ఆ మహిళలు తమ తమ చెవిపోవుల్ని, ఉంగరాలను (ఆభరణాలను) తీసి హజ్రత్ బిలాల్ కు అప్పజెప్పారు. ఆయన వాటిని తన అంగ వస్త్రం చెరుగులో పోగు చేసుకున్నారు.

వివరణ: దైవ ప్రవక్త ఈద్ (పండుగ) ప్రసంగం ముగించి బయటకు రాగా ప్రసంగం చేసేటప్పుడు మహిళలు దూరంగా కూర్చుని ఉండటం వల్ల ప్రయోజనం పొందలేకపోయారని ఆయన గ్రహించారు. వారి దగ్గరకు వెళ్లి నరక కూపంలో పడవేసే పాపాలకు దూరంగా ఉండమని వారికి హితవు చెబుతూ దైవ మార్గంలో (సదఖా) దానం చేయమని ఆదేశించారు. ధర్మసమ్మతమైన సంపాదన నుండి దైవ మార్గంలో వెచ్చించడం వల్ల నరకంలో పడవేసే తీవ్రమైన పాపాలు సైతం సమసిపోతాయని ప్రమాద సంఘటనల్లో కష్టాల్లో చిక్కుకోకుండా తమను కాపాడుకోవచ్చని ఉద్బోధించారు. దైవ కారుణ్యాన్ని, కటాక్షాన్ని ఈ సదఖా ఆహ్వానిస్తుంది అనడంలో సందేహం లేదు. కాబట్టి స్త్రీలు తమ సొత్తు నుండి వీలైనంత అధి క మొత్తంలో అల్లాహ్ మార్గంలో సదఖా చేసి దేవుని ప్రసన్నత పొందే ప్రయత్నం చేయాలి.

ఆధునిక కాలంలో స్త్రీ స్వతహాగా సంపాదిస్తోంది. కానీ 1500 శతాబ్దాల క్రితం స్త్రీల సంపాదన గురించి ఆలోచించలేము. అయితే వారు కూడా దానధర్మాలు చేయడంలో పురుషులతో సమానంగా ఉండేవారు. ఆ కాలం నుండి ఈ కాలం వరకు దైవ మార్గంలో ధనం అవసరం ఏర్పడినప్పుడల్లా స్త్రీలు ప్రకటన వినగానే తమ శరీరంపై ఉన్న నగానట్రా తీసి అన్ని దైవ మార్గంలో విరాళంగా ఇస్తూ వస్తున్నారు.

తప్పులు ప్రతి ఒక్కరితో జరుగుతాయి. ఆడవారు గానీ మగవారు గానీ ఆ తప్పులకు, ఆ నేరాలకు, ఆ చెడు పనులకు పరిహారంగా దైవ మార్గంలో ఖర్చుపెట్టినట్లయితే పరలోకంలో ఈ ఖర్చు నరకంలోకి వెళ్లకుండా అడ్డుకుంటుంది. అందువల్ల దానధర్మాలు చేస్తూ ఉండాలి దివ్య ఖురాన్ చెబుతోంది: పురుషులు చేసుకున్నది పురుషుల కోసమే, స్త్రీలు చేసుకున్నది స్త్రీల కోసమే. కాబట్టి దానధర్మాలు చేయడంలో ఒకరి కంటే ఒకరు మించి చేయాలి. ఇవే ప్రపంచంలో ఆపదలనుండి గట్టిస్తాయి, పరలోకంలో నరకాగ్ని నుండి రక్షిస్తాయి. దేవుడు మనందరినీ దానధర్మాలు చేసే వారిలో చేర్చుగాక !

–మొహమ్మద్ అబ్దుల్ రషీద్

● సువార్త

దేవునితో అనుబంధం

దేవునితో అత్యంత సాన్నిహిత్య సంబంధ బాంధవ్యం ఏలాంటిదంటే . . దేవునికి కుమారులు, కుమార్తెలుగా ప్రభువైన క్రీస్తును బట్టే నేడు మనం చేరువ కాగలుగుతున్నాము. దేవున్ని తండ్రి అని పిలిచే భాగ్యం క్రీస్తు చేసిన సిలువ యాగం అనే ఆ ఒక్క పుణ్యకార్యం వల్లనే సాధ్యమైంద అనడంలో ఎలాంటి సందేహమూ లేదు. క్రీస్తు వలననే ఈ గొప్ప బాంధవ్యం. ఈ భూమి మీద దేవుని జాతిగా చెప్పబడే ఒక్క ఇశ్రాయేలీయులకే కాక, నేడు సర్వ మానవాళికి కూడనూ దేవుడు తండ్రిగా ఉన్నాడు. ఇప్పుడైతే దేవుడు తండ్రి అనే అత్యంత సాన్నిహిత్య బాంధవ్యంతో భక్తులైన తన పిల్లలను అలరిస్తున్నాడు. పరలోకం నుండి దిగి వచ్చిన క్రీస్తు తాను ఎరిగిన దేవ దేవున్ని తండ్రిగా పరిచయం చేయడం విశేషం. అంతేకాక అసలు దేవుడే లేని ఎరుగని అన్య జనాంగం యావత్తూ దేవున్ని తండ్రి అంటూ ఆయన వద్దకు క్రీస్తును బట్టే నేరుగా వస్తూ ఉన్నారు. ఆయన్ను చనువుగా ఇలా తండ్రి అని పిలిచే ఈ అర్హతను వారికి క్రీస్తే సాధించి పెట్టాడు కూడా.

పూర్వం నోవాహు, యోబు, అబ్రాహాము, యాకోబు అనువారి పితరుల కాలంలో దేవుడు సర్వ శక్తిమంతుడుగా తనను తాను కనబరచుకున్నాడు. దేవుడు మోషే ద్వారా ఇచ్చిన ధర్మ శాస్త్ర కాలపు యుగంలోనూ 'నేను ఉన్నవాడను అనువాడను' అన్న అర్థమిచ్చే యెహోవా లేదా యావే అను పోయెటిక్ నామమున దేవుడు దర్శనమిచ్చేవాడు.

ఇప్పటి ఈ క్రీస్తు యుగాన క్రొత్త నిబంధన అమలులోని ఆత్మ సంచారపు ఈ కడవరి కాలాన అద్వితీయ సత్య దేవుడు తండ్రిగా మానవాళికి దగ్గర అవుతుండడం అదీనూ క్రీస్తు బట్టే క్రీస్తుకు, సర్వ మానవాళికి గాఢమైన అనుబంధంతో దగ్గర అవ్వడం గొప్ప సమాచారం.

అయితే దహించు అగ్నియై సమీపింపరాని తేజస్సు గల దేవుని కుడి పార్శ్వమున క్రీస్తు తనదైన మహిమతో నేడు కూర్చుని ఉన్నాడు. క్రీస్తును బట్టే దేవున్ని తండ్రి అంటూ సమీపించే భాగ్యం మానవాళికి దొరికింది. దేవుడు అబ్రాహామునకు చేసిన వాగ్దాన ప్రకారంగా, దావీదుతో చేసిన సత్య ప్రమాణం అనుసరించే దేవునికి విధేయ కుమారుడుగా భయభక్తులతో క్రీస్తు వ్యవహరించిన కారణాన ఒక్క క్రీస్తుకే కాక సర్వ మానవాళి పట్ల దేవుడు తండ్రిగా ఉన్నాడు. సత్యమును గూర్చి సాక్ష్యం ఇచ్చుటకును, పితరులకు చేయబడిన వాగ్దానముల విషయములో దేవుడు సత్యవంతుడు అని స్థాపించుటకును, సత్య వంతుడైన వానిని ఎరుగవలెనని మనకు వివేకము అనుగ్రహించుటకు దేవుని కుమారుడు ఇలకు వచ్చాడు అనునది లేఖనముల సారము. క్రీస్తు ఇలా వచ్చి రావడంతోనే దేవున్ని తండ్రిగా పరిచయం చేశాడు. దేవునితో సత్సంబంధాలను ఏర్పరిచాడు.

చెదరిన దేవుని పిల్లలను ఏకముగా సమకూర్చాడు.

– జేతమ్

ఒక్కడే తండ్రి అనంటే అనగా ఇందు అంతర్లీనంగా అందంగా ఒదిగిన ఉన్నత భావం ఒక్కడే దేవుడు అనునదే. ఒక్కడే దేవుడు అంటే ఒక్కడే తండ్రి అని అర్థం. ఈ లోకం లేదా ఈ యావత్ప్రపంచం ఒకే కుటుంబం అనుకుంటే దానికి తండ్రియైన దేవుడు ఒక్కడే. కుటుంబానికి తండ్రి ఒక్కడే ఉంటాడు. ఒక్కడే ఉండాలి కూడా. ఇద్దరూ ముగ్గురూ ఉండరు. ఉండకూడదు. అలా ఉంటే అది కుటుంబం కాదు. కుమారులు, కుమార్తెలు హెచ్చుగా అపరిమితంగా ఎంతమంది ఉన్ననూ కుటుంబానికి తండ్రి ఒక్కడే. ఈ ఉపదేశ క్రమంలో దేవుడు ఒక్కడే అంటూ ఉన్నతంగా చెప్పబడిందే సర్వ సత్యము.

ఇజ్రాయెల్- హమాస్ మధ్య రెండేళ్లపాటు జరిగిన యుద్ధం గాజాలో తీవ్ర విధ్వంసాన్ని మిగిల్చింది. శిథిల భవనాల నడుమ ఖాన్‌యూనిస్ నగరంలో మంగళవారం జరిగిన సామూహిక వివాహ కార్యక్రమానికి భారీగా హాజరైన పాలస్తీనియన్లు. వేడుకలో సంతోషాన్ని పంచుకున్న కొత్త జంటలు

ఇండోనేసియాలోని అసెహ్ ప్రావిన్స్‌లో ఇటీవల ఆకస్మిక వరదల్లో వంతెన కొట్టుకుపోగా నదిని దాటేందుకు గ్రామస్తులు ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక కేబుల్ కార్

ఆహ్వానం లేకుండా ఢిల్లీకి వెళ్లను

కర్ణాటక సీఎం సిద్ధరామయ్య వ్యాఖ్య

మంగళూరు: కర్ణాటకలో నాయకత్వ మార్పుపై ఊహాగానాలు కొనసాగుతుండగా.. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఢిల్లీ వెళ్లడం చర్చనీయాంశమైంది. ఓ పెళ్లికి హాజరుకావడంతోపాటు, పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం ఉందని వార్తలొచ్చాయి. బుధవారం ఉప ముఖ్యమంత్రి ఢిల్లీకి వెళ్లారు. ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు మంగళూరు వచ్చిన సిద్ధరామయ్యతో.. డీకే పర్యటన గురించి మీడియా ప్రశ్నించగా.. అధికారికం ఆహ్వానం లేకుండా ఢిల్లీకి వెళ్లబోనని స్పష్టం చేశారు. 'ఆయనను వెళ్లనివ్వండి. ఎవరైనా ఆయనకు నో చెప్పారా? నేను ఆహ్వానించినప్పుడే వెళ్తాను. నన్ను ఆహ్వానించలేదు, కాబట్టి నేను వెళ్లడం లేదు.'అని స్పష్టం చేశారు. మంగళూరు విమానాశ్రయంలో డీకే డీకే అంటూ మద్దతుదారులు నినాదాలు చేయడంపై ఆయన..'ఇందులో తప్పేముంది? గత పదేళ్లుగా ప్రజలు 'డీకే డీకే'అని నినాదాలు చేస్తున్నారు. కొంతమంది 'మోదీ మోదీ'అని అరుస్తారు. మరికొందరు 'రాహుల్ రాహుల్', ఇంకొందరు 'సిద్ధూ సిద్ధూ'అని జపిస్తారు. అందులో తప్పేమీ లేదు. వారు ప్రేమతో నినాదాలు చేస్తారు. దానిని మనం క్రీడాస్ఫూర్తితో తీసుకోవాలి'అని అన్నారు.

నాలుగు కాళ్ల దేవతలు!

అనాథ పురిటి బిడ్డను కాపాడిన శునకాలు

అది పశ్చిమ బెంగాల్‌లోని నదియా జిల్లా, నవద్వీప్ పట్టణం. ఎముకలు కొరికే చలి. నిశ్శబ్దపు తెల్లవారుజాము.. ఆ చీకట్లో రైల్వే కార్మికుల కాలనీలోని ఒక బాత్‌రూమ్ వెలుపల నేలపై నవజాత శిశువు. శరీరంపై ఎలాంటి వస్త్రం లేదు.. పురిటి నెత్తురు మరకలు తొలగలేదు.. ఇంకా ప్రపంచాన్ని పూర్తిగా చూడని ఆ పసికందును ఎవరో కనికరం లేకుండా వదిలివేశారు. ఆ చిన్ని ప్రాణం గడ్డకట్టే చలిలో వణికిపోయింది.. విలవిల్లాడిపోయింది. అప్పుడే ఒక అద్భుతం జరిగింది.

ప్రతీకాత్మక చిత్రం

వలయం కట్టి.. తెల్లార్లూ కాపలా కాసి

వీధి కుక్కల గుంపు ఒకటి ఆ శిశువును చుట్టుముట్టింది. అవి అరవలేదు. కదలకుండా, ప్రశాంతంగా.. శిశువు చుట్టూ రక్షణ వలయాన్ని ఏర్పరిచాయి. రాత్రంతా, అవి నిశ్శబ్ద సైనికుల్లా నిలబడ్డాయి. వేకువ వెలుగు వచ్చే వరకు.. ఆ బిడ్డ దగ్గరకు ఎవరినీ రానివ్వలేదు. పసికందును తాకనివ్వలేదు. 'ఉదయం లేచాక కనిపించిన ఆ దృశ్యం గుర్తొస్తే ఇప్పటికీ ఒళ్లు గగుర్పొడుస్తుంది'.. అని స్థానికుడు సుక్లా మొండల్ ఉద్వేగంగా చెప్పారు. 'ఆ కుక్కలు మామూలుగా లేవు. అవి అత్యంత అప్రమత్తంగా ఉన్నాయి. ఆ బిడ్డ బతకడానికి పోరాడుతోందని అవి అర్థం చేసుకున్నట్లు అనిపించింది'.. అని వ్యాఖ్యానించారు.

పసికందు చుట్టూ సెంట్రీల్లా..

తెల్లవారుజామున శిశువు చిన్నగా ఏడుస్తున్న శబ్దం వినిపించింది. అప్పటివరకు ఎవరో జబ్బు పడిన బిడ్డ అనుకున్న స్థానికులకు, ఆ దృశ్యం చూసి నోట మాట రాలేదు. ఆ కుక్కలు కంచె వేసినట్లు, సెంట్రీల్లా పసికందు చుట్టూ నిల్చున్నాయి. సుక్లా మొండల్ ధైర్యం చేసి, మెల్లగా ముందుకు వెళ్లగానే.. ఆ కుక్కలు పక్కకు తప్పుకున్నాయి. వెంటనే ఆమె బిడ్డను తన దుపట్టాలో చుట్టి ఆసుపత్రికి పరుగులు తీశారు. పరీక్షించిన వైద్యులు, ఆ బిడ్డకు ఎటువంటి గాయాలు లేవని, కేవలం పుట్టిన కొన్ని నిమిషాలకే ఎవరో వదిలేశారని నిర్ధారించారు. పోలీసులు, శిశు సంక్షేమ అధికారులు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు.

మనుషుల్ని మించిన మానవీయత..

'మేము ఎప్పుడూ ఈసడించుకుని.. తిట్టుకునే శునకాలే ఇవి.. కానీ, ఈ బిడ్డను వదిలి వెళ్లిన వారికంటే ఇవే ఎక్కువ మానవత్వాన్ని చూపించాయి'.. అని ఒక రైల్వే కార్మికుడు వ్యాఖ్యానించారు. సాయంత్రం అయ్యేసరికి కాలనీలో దృశ్యం మారిపోయింది. ఆ రాత్రంతా బిడ్డను కాపాడిన కుక్కల దగ్గరికి కాలనీలోని చిన్నారులంతా వెళ్లారు. వాటిని ఆప్యాయంగా నిమిరారు. ప్రేమతో బిస్కెట్లు తినిపించారు. ఆ కుక్కలు కేవలం ఒక శిశువును కాపాడటమే కాదు, ఆ రోజు ఆ కాలనీ ప్రజలందరికీ ఒక సందేశమిచ్చాయి. మానవత్వం అనేది నాలుగు కాళ్లపై కూడా రావచ్చని నిరూపించాయి.

– సాక్షి, నేషనల్ డెస్క్

బెంగళూరులో నటుడు రణ్‌వీర్‌పై ఫిర్యాదు

యశవంతపుర: ప్రముఖ బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్ చిక్కుల్లో పడ్డారు. కాంతార సినిమాలోని సన్నివేశాలను అనుకరిస్తూ వెక్కిరించాడని కన్నడిగులు మండిపడుతున్నారు. ఈ మేరకు రణ్‌వీర్‌సింగ్‌పై బెంగళూరులోని హైగ్రౌండ్స్ పోలీసుస్టేషన్‌లో కేసు పెట్టారు. రణ్‌వీర్ లక్షల మంది హిందువులు, తుళునాడు ప్రజల మనోభావాలను అవమానించారని బెంగళూరుకు చెందిన న్యాయవాది ఒకరు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. ఇటీవల గోవాలో జరిగిన చలన చిత్రోత్సవంలో రణ్‌వీర్ సింగ్, రిషబ్‌శెట్టి తదితరులు పాల్గొన్నారు. ఆ వేడుకలో రణ్‌వీర్ కాంతార సినిమా పాత్రను అవమానించేలా ప్రవర్తించాడని ఆరోపణలొచ్చాయి.

రాజ్‌నాథ్ చెప్పిందంతా అసత్యం

'నెహ్రూ–బాబ్రీ మసీదు' వ్యాఖ్యలపై కాంగ్రెస్

న్యూఢిల్లీ: దేశ ప్రథమ ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ బాబ్రీ మసీదును ప్రభుత్వ ధనంతో నిర్మించేందుకు ప్రయత్నించగా, సర్దార్ పటేల్ అప్పట్లో అడ్డుకున్నారంటూ రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చేసిన వ్యాఖ్యలు అసత్యాలంటూ కాంగ్రెస్ తీవ్రంగా తప్పుబట్టింది. అందుకు తగిన ఆధారాలుంటే చూపాలని నిలదీసింది. ప్రధాని మోదీ మాదిరిగా మాట్లాడవద్దంటూ హితవు పలికింది. చర్చ జరగాల్సిన వాస్తవ అంశాల నుంచి పక్కదోవ పట్టించేందుకే బీజేపీ నేతలు ఇలాంటి అంశాలను పైకితీసుకువస్తున్నారంటూ కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ ధ్వజమెత్తారు. ప్రధాని మోదీ మాదిరిగా మాట్లాడుతున్న రాజ్‌నాథ్ ఆధారాలను చూపాలని కాంగ్రెస్ మరో నేత పవన్ ఖేడా కోరారు. ఆర్‌ఎస్‌ఎస్ కార్యాలయం దగ్గర పార్కింగ్ కోసం 800 ఏళ్లనాటి గుడిని కూలగొట్టిన ఘటనపై తమ వద్ద రుజువుందని చెప్పారు. బాబ్రీ మసీదును 1560లో కట్టారు. నెహ్రూ పుట్టిందెప్పుడు? సర్దార్ పటేల్ మరణించిందెప్పుడు? పటేల్ చనిపోయాక కూడా నెహ్రూ 14 ఏళ్లు అధికారంలో ఉన్నారు. అలాంటప్పుడు ఆయన్ను పటేల్ ఆపడం సాధ్యమా?'అని పవన్ ఖేడా ప్రశ్నలు కురిపించారు. 'రాజ్‌నాథ్ మాటలు అబద్ధాలు, వాట్సాప్ యూనివర్సిటీ కథనాలు'అంటూ కాంగ్రెస్ విప్ మాణిక్కం ఠాకూర్ వ్యాఖ్యానించారు.

ఢిల్లీలో వాయు నాణ్యత 'వెరీ పూర్'

న్యూఢిల్లీ: ఢిల్లీలో వాయు కాలుష్యం తీవ్రంగా ఉంది. బుధవారం వాయు నాణ్యత ఏక్యూఐ 342గా నమోదైందని సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్(సీపీసీబీ) తెలిపింది. ఇది 24 గంటల సరాసరి అని వివరించింది. ఏక్యూఐ సోమవారం 304 కాగా, మంగళవారం 372గా నమోదైందని, బుధవారం కూడా ఇది వెరీ పూర్ కేటగిరీలోనే ఉందని సీపీసీబీ వెల్లడించింది. మొత్తం 39 మానిటరింగ్ కేంద్రాలకుగాను 32 చోట్ల 300కు పైగానే నమోదై వెరీపూర్ కేటగిరీలో ఉందని తెలిపింది. నెహ్రూ నగర్‌లో ఏక్యూఐ అత్యధికంగా 378గా ఉందని పేర్కొంది. వెరీ పూర్ కేటగిరీలో ఆర్‌కే పురం, బురారి, ఆనంద్ విహార్, ముండ్కా, బవానా, వివేక్ విహార్, అలీపూర్, షాదిపూర్, నార్త్ క్యాంపస్ అని వివరించింది. మరికొన్ని రోజులు ఇవే పరిస్థితులు కొనసాగుతాయని అంచనావేసింది. ఢిల్లీ కాలుష్యంలో రవాణా రంగం వాటా 16 శాతం వరకు ఉందని సీపీసీబీ పేర్కొంది.

ప్రజ్వల్‌కు హైకోర్టులో చుక్కెదురు

యశవంతపుర: పనిమనిషిపై అత్యాచారం చేసిన కేసులో బెంగళూరు పరప్పన అగ్రహార సెంట్రల్ జైలులో జీవితఖైదును అనుభవిస్తున్న మాజీ ప్రధాని దేవెగౌడ మనవడు, మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ వేసిన బెయిల్ పిటిషన్‌ను కర్నాటక హైకోర్టు తిరస్కరించింది. జీవిత ఖైదును రద్దు చేసి, బెయిల్‌ను మంజూరు చేయాలని ప్రజ్వల్ మధ్యంతర పిటిషన్‌ను దాఖలు చేశారు. బుధవారం న్యాయమూర్తులు జస్టిస్ కెఎస్ ముద్గల్, జస్టిస్ టి. వెంకటేశ్ నాయక్‌ల ధర్మాసనం విచారణ జరిపింది. ఆరోపణలు, ఆధారాలను పరిశీలించిన ధర్మాసనం బెయిల్ మంజూరు చేయలేమని స్పష్టం చేసింది.

హైజాకర్‌కు పైలట్ ఝలక్

దక్షిణ సూడాన్‌లో బెడిసికొట్టిన హైజాక్ యత్నం

జుబా: అది దక్షిణ సూడాన్ రాజధాని జుబా.. ఉదయపు వేళ ఒక చిన్న విమానం మెల్లగా గాల్లోకి లేచింది. అది క్రైస్తవ సహాయక బృందానికి చెందిన చిన్న టర్బోప్రాప్ విమానం. సమారిటన్స్ పర్స్ అనే సంస్థకు చెందిన సెస్నా గ్రాండ్ కారవాన్. సుదూర ఈశాన్య ప్రాంతంలోని మైవూట్ కౌంటీకి అత్యవసర వైద్య సామగ్రిని చేరవేయడమే దాని లక్ష్యం. కానీ ఆ ప్రయాణం ఊహించని భయానక మలుపు తీసుకోబోతోందని ఎవరికీ తెలియదు.

హైజాకర్ ఎంట్రీ

టేకాఫ్ కావడానికి ముందే, విమానంలోకి యాసిర్ మహ్మద్ యూసుఫ్ అనే దుండగుడు చొరబడ్డాడు. వెనుక క్యాబిన్‌లో రహస్యంగా దాక్కున్నాడు. గగనతలంలో విమానం ప్రయాణిస్తుండగా, ఒక్కసారిగా తుపాకీతో బెదిరించి, పైలట్‌ను అదుపులోకి తీసుకున్నాడు. ఆ విమానాన్ని దక్షిణ సూడాన్‌కు సరిహద్దు లేని మధ్య ఆఫ్రికా దేశం చాడ్‌కు పోనివ్వాలని డిమాండ్ చేశాడు.

బోల్తా కొట్టించిన పైలట్

హైజాక్ తర్వాత, విమానం గంటల తరబడి గాల్లో చక్కర్లు కొట్టింది. విమానంలో ఇంధనం అయిపోయిందని, రీఫ్యూయలింగ్ తప్పనిసరి అని దుండగుడికి పైలట్ స్పష్టం చేశాడు. హైజాకర్‌ను నమ్మించి, విమానాన్ని ఉత్తర పట్టణమైన వాయు వైపు మళ్లించాడు.

హైజాకర్ అరెస్ట్

పైలట్ వ్యూహం ఫలించింది. విమానం వాయు పట్టణంలో సురక్షితంగా ల్యాండ్ అయింది. వాయు పట్టణం ఉన్న వెస్టన్ బహర్ ఎల్ గజల్ రాష్ట్ర పోలీసు ప్రతినిధి అయిన సంతినో ఉడోల్ మయెన్ తెలిపిన వివరాల ప్రకారం, విమానం ల్యాండ్ అయిన వెంటనే దుండగుడిని అదుపులోకి తీసుకున్నారు. దుండగుడు దక్షిణ సూడాన్, సూడాన్ మధ్య వివాదాస్పదమైన, చమురు–సంపన్న ప్రాంతమైన అబ్యేయి అడ్మినిస్ట్రేటివ్ ఏరియా నివాసి. జుబా అంతర్జాతీయ విమానాశ్రయంలో పనిచేసే ఒక ఎయిర్ చార్టర్ కంపెనీ లోగో ఉన్న రిఫ్లెక్టివ్ వెస్ట్‌ను ధరించి ఉన్నాడు. అయితే, ఆ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ పాల్ ఆంట్రోబస్, ఆ పేరుతో తమ సంస్థలో ఎవరూ పని చేయడం లేదనడం గమనార్హం. ఈ సంఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. తమను కాపాడిన భద్రతా దళాలకు సమారిటన్స్ పర్స్ ప్రతినిధి మెలిస్సా స్ట్రిక్‌ల్యాండ్ కృతజ్ఞతలు తెలిపారు.

అఫ్గాన్‌తో ఉద్దేశపూర్వకంగా మునీర్ వైరం

పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఆరోపణ

లాహోర్: పాకిస్తాన్ ఫీల్డ్ మార్షల్ జనరల్ ఆసిమ్ మునీర్ అనుసరిస్తున్న విధానాలు దేశానికి వినాశకరమైనవని మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్ ఖాన్ బుధవారం ఆరోపించారు. ఆఫ్ఘనిస్తాన్‌తో ఉద్దేశపూర్వకంగా ఉద్రిక్తతలను పెంచుతున్నారని ప్రస్తుతం పాకిస్తాన్ జైలులో ఉన్న ఇమ్రాన్ ధ్వజమెత్తారు. షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వం ప్రత్యేక అనుమతి ఇవ్వడంతో, దాదాపు నెల రోజుల విరామం తర్వాత రావల్పిండిలోని అడియాలా జైలులో తన సోదరి డాక్టర్ ఉజ్మా ఖాన్‌ను కలిసిన మర్నాడు ఈ వ్యాఖ్యలు చేశారు. 'ఆసిమ్ మునీర్ విధానాలు పాకిస్తాన్‌కు విపత్కరమైనవి. ఆయన విధానాలతో, ఉగ్రవాదం అదుపు తప్పి పెరిగిపోతోంది. ఇది నన్ను తీవ్రంగా బాధించింది'.. అని ఖాన్ ఉర్దూలో ట్విట్టర్‌లో పోస్టు చేశారు.

పశ్చిమ దేశాలను సంతృప్తిపరచడానికే..

'ఆసిమ్ మునీర్‌కు పాకిస్తాన్ జాతీయ ప్రయోజనాల గురించి ఏమాత్రం పట్టదు. పశ్చిమ దేశాలను సంతోషపెట్టడానికి మాత్రమే ఆయన ఇదంతా చేస్తున్నారు. అంతర్జాతీయంగా తానొక 'ముజాహిద్' (ఇస్లామిక్ ఫైటర్)గా కనిపించడానికి, ఉద్దేశపూర్వకంగా ఆఫ్ఘనిస్తాన్‌తో ఉద్రిక్తతలను రాజేశారు'.. అని ఖాన్ ఆరోపించారు. డ్రోన్ దాడులను, సొంత ప్రజలపై సైనిక చర్యలను వ్యతిరేకిస్తానని స్పష్టం చేశారు. అవి ఉగ్రవాదాన్ని మరింత పెంచుతాయని అభిప్రాయపడ్డారు. 'మునీర్ మొదట ఆఫ్ఘన్‌లను బెదిరించారు, తరువాత శరణార్థులను పాకిస్తాన్ నుండి బహిష్కరించారు. డ్రోన్ దాడులు చేశారు. వాటి పర్యవసానాలను ఇప్పుడు మనం పెరుగుతున్న ఉగ్రవాదం రూపంలో ఎదుర్కొంటున్నాం'.. అని ఖాన్ పేర్కొన్నారు. జనరల్ మునీర్‌ను.. మానసిక స్థిరత్వం లేని వ్యక్తిగా అభివర్ణించారు.

మునీర్ ఆదేశాలతోనే నిర్బంధం

మునీర్ ఆదేశాల మేరకే, తనను, తన భార్యను తప్పుడు కేసులతో బంధించి, అత్యంత దారుణమైన మానసిక చిత్రహింసలకు గురిచేస్తున్నారని ఖాన్ వాపోయారు. 'నన్ను నాలుగు వారాలుగా ఒంటరి నిర్బంధంలో ఉంచారు. సెల్‌లో ఉంచి తాళం వేశారు. బయటి ప్రపంచంతో పూర్తిగా సంబంధాలు లేవు. జైలు మాన్యువల్ హామీ ఇచ్చిన కనీస సౌకర్యాలను కూడా మాకు దూరం చేశారు'.. ఖాన్ ఆవేదన వ్యక్తం చేశారు. హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ, తన రాజకీయ సహచరులతో సమావేశాలను నిషేధించారని, ఇప్పుడు న్యాయవాదులు, కుటుంబ సభ్యులను కలిసే అవకాశాన్ని కూడా అడ్డుకున్నారని చెప్పారు. 'నన్ను కలవాలనే చట్టబద్ధమైన హక్కును కోరినందుకు నా సోదరి నొరీన్ నియాజీని రోడ్డుపై లాక్కెళ్లారు'.. అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇమ్రాన్‌తో భేటీ అనంతరం ఉజ్మా మాట్లాడుతూ, ఆయన ఆరోగ్యం బాగుంది.. కానీ ఒంటరి నిర్బంధంతో మానసిక చిత్రహింసకు గురవుతున్నారని తెలిపారు.

బీజేపీ తన గొయ్యి తానే తవ్వుకుంటోంది

బెంగాల్‌లో ఎస్ఐఆర్‌పై సీఎం మమత వ్యాఖ్య

మాల్దా: పశ్చిమబెంగాల్‌లో ఎన్నికల కమిషన్ చేపట్టిన ఓటరు జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్)పై సీఎం మమతా బెనర్జీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు రాష్ట్రంలో ఎస్ఐఆర్ చేపట్టడం వెనుక హోం మంత్రి అమిత్ షా హస్తం ఉందని ఆమె ఆరోపించారు. ఓటర్లను తికమకపెట్టి, పశ్చిమబెంగాల్‌ను మాయోపాయం ద్వారా కైవసం చేసుకునేందుకు ఆయన కుట్రపన్నారన్నారు. జనం నాడిని తప్పుగా అంచనా వేసిన బీజేపీ, ఎస్ఐఆర్ ద్వారా తన గొయ్యి తానే తవ్వుకుంటోందని మండిపడ్డారు. 'బిహార్‌లో గెలిచినట్టు ఇక్కడా మాయచేద్దామంటే కుదరదు. బిహార్, బెంగాల్ ఒక్కటి కావు. బెంగాల్‌లో మీ తెలివితేటలు, జిత్తులు పనిచేయవు'అని ఆమె ధ్వజమెత్తారు. బుధవారం ఆమె మాల్దా జిల్లా గజోల్‌లో ప్రసంగించారు.

పూర్తిగా నష్టపోయేది వాళ్లే

- నిపుణులకు అడ్డంకులపై జైశంకర్ వ్యాఖ్య

న్యూఢిల్లీ: వృత్తి నిపుణుల రాకపోకలపై నియంత్రణలు విధిస్తే సంబంధిత దేశాలే నష్టపోతాయని విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ తెలిపారు. నైపుణ్యాలను పరస్పర ప్రయోజనాలకు వినియోగించుకునేలా ఇతర దేశాలకు అర్థమయ్యేలా చెప్పాల్సిన బాధ్యత భారత్‌పై ఉందని ఆయన అన్నారు. అమెరికా, యూరప్ దేశాలు వృత్తి నిపుణులు, వలసలపై విధిస్తున్న ఆంక్షల నేపథ్యంలో మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. వలసలపై అమెరికాలోని ట్రంప్ ప్రభుత్వం విధిస్తున్న ఆంక్షలకు అనుగుణంగా అక్కడి యంత్రాంగం హెచ్–1బీ వీసాలపై ఫీజును మరింతగా పెంచేందుకు ప్రయత్నిస్తున్న వేళ జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 'నిపుణులకు ఎంతగా అడ్డంకులు సృష్టిస్తే అంతగా వారు నష్టపోతారు. ఉత్పాదక రంగం విస్తరిస్తున్న వేళ, నిపుణుల అవసరం ప్రతి ఒక్కరికీ ఉంటుంది. అయితే, ఈ నైపుణ్యాలను పరస్పర ప్రయోజనకరంగా మార్చుకోవాలి. ఇప్పటికే పారిశ్రామిక రంగంలో ముందున్న దేశాలే వలసలను ముందుగా ప్రోత్సహించాయి. ఇప్పుడేమో అడ్డంకులు కల్పిస్తున్నాయి. సమస్యను సృష్టించిన వారే దానిని పరిష్కరించాలి'అని జైశంకర్ చెప్పారు.

సుప్రీంలో మహిళా న్యాయవాది వీరంగం

సీజేఐ ధర్మాసనం వారిస్తున్నా ససేమిరా

- తన కేసు వినాల్సిందేనని మంకుపట్టు
- బయటకు పంపిన మహిళా మార్షల్స్

న్యూఢిల్లీ: ప్రధాన న్యాయమూర్తి కొలువుదీరిన సుప్రీం కోర్టులో బుధవారం ఒక మహిళా న్యాయవాది తీవ్ర రసాభాస సృష్టించడంతో, ఆమెను కోర్టు మార్షల్స్ బయటకు తీసుకెళ్లాల్సి వచ్చింది. ధర్మాసనం వారిస్తున్నా.. ఆ న్యాయవాది పదేపదే జాబితాలో లేని ఒక కేసును ప్రస్తావించి, విచారణకు అంతరాయం కలిగించారు.

జాబితాలో లేని అంశంపై పట్టు

ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ ఎన్.కె.సింగ్‌లతో కూడిన ధర్మాసనం ముందు, ఆ మహిళా న్యాయవాది జాబితాలో లేని ఒక అంశాన్ని నోటిమాటగా ప్రస్తావించినప్పుడు ఈ సంఘటన జరిగింది. తొలుత ఆ మహిళా న్యాయవాది మాట్లాడుతూ, ముంబైలో ఉన్నప్పుడు తన స్నేహితురాలు ఢిల్లీలోని ఒక గెస్ట్ హౌస్‌లో హత్యకు గురయ్యారని చెప్పారు. మొదట్లో ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి నిరాకరించిన పోలీసు అధికారిని, ఇప్పుడు అదే కేసులో దర్యాప్తు అధికారిగా నియమించారని ఆరోపించారు.

డిప్రెషన్‌లో ఉన్నాను.. వినాల్సిందే

నిర్ణీత విధానంలో పిటిషన్ దాఖలు చేయాలని ప్రధాన న్యాయమూర్తి ఆమెకు సూచించగా, ఆమె 'నేను డిప్రెషన్‌లో ఉన్నాను, కచ్చితంగా దాఖలు చేస్తాను'.. అన్నారు.

కానీ అక్కడి నుంచి వెళ్లడానికి నిరాకరించారు. కేసు దాఖలుకు ఆమెకు సహాయం చేయాలని అక్కడే ఉన్న ఒక న్యాయవాదికి ధర్మాసనం సూచించి తదుపరి కేసును పిలిచింది. అయినప్పటికీ, ఆ మహిళా న్యాయవాది తన వాదనతో పట్టుబట్టారు.

నన్ను తాకొద్దు..

కోర్టులో ఆమె బిగ్గరగా అరుస్తుండటంతో పరిస్థితి చేయిదాటింది. దీంతో మహిళా కోర్టు మార్షల్స్ ఆమెను బయటకు తీసుకెళ్లడానికి ప్రయత్నించగా, 'గౌరవంగా ప్రవర్తించండి, నన్ను తాకవద్దు'.. అని ఆమె మరింత పెద్దగా అరుస్తూ ప్రతిఘటించారు. జస్టిస్ భూయాన్ సహా తోటి న్యాయవాది ఒకరు.. కోర్టు మర్యాదలు పాటించాలని సలహా ఇచ్చినా, ఆమె మొండిగా వ్యవహరించారు. తన భద్రతకు సంబంధించిన ఈ అంశాన్ని కోర్టుకు చెప్పాల్సిందేనని ఆమె పట్టుబట్టారు. ఆమె పెద్దగా అరుస్తుండటంతో.. కోర్టు కార్యకలాపాల ఆన్‌లైన్ ప్రత్యక్ష ప్రసారం ఆడియో వినిపించకుండా చర్యలు తీసుకున్నారు. కాసేపయ్యాక ఎట్టకేలకు ఆమెను కోర్టు గది నుండి బయటకు పంపించారు.

సహజ సాగుకు మళ్లుదాం

- ఇందుకు తమిళనాడే ఆదర్శం
- ప్రశంసించిన ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: దేశ రైతులందరూ సహజ సాగు పద్ధతిని అవలంబించాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఎన్నెన్నో కీలక సమస్యలకు అది చక్కని పరిష్కారం కాగలదన్నారు. 'ఒక సీజన్‌కు ఒక ఎకరం' నినాదంతో సహజ సాగు మొదలుపెట్టండి. క్రమంగా పెంచుకుంటూ పోతే అద్భుతాలు వాటంతట అవే సాకారమవుతాయి' అని ఆయన అన్నారు. బుధవారం లింక్డ్ ఇన్ పోస్టులో ఈ విషయమై ఆయన తన మనోగతాన్ని పంచుకున్నారు. ' ప్రకృతి వ్యవసాయంతో రసాయనాలపై ఆధారపడటం తప్పుతుంది. దాంతో రసాయనాలు నేలలోని సారాన్ని హరించే దురవస్థకూ చెక్ పెట్టవచ్చు' అని ఆయన చెప్పారు.

ఆ సదస్సు అద్భుతం..: తమిళనాడులోని కోయంబత్తూర్‌లో ఇటీవల తాను పాల్గొన్న దక్షిణాసియా సహజ సాగు సదస్సు గురించి ఈ సందర్భంగా మోదీ వివరంగా రాసుకొచ్చారు. 'అందులో పాల్గొన్న వారిలో రైతులే గాక శాస్త్రవేత్తలు, రైతు ఉత్పత్తి సంఘాల ప్రతినిధులు, తొలి తరం పట్టభద్రుల వంటివారే గాక భారీ వేతనాలను వదులుకొని మరీ వచ్చిన ఐటీ నిపుణులు కూడా ఉన్నారు. వారంతా పెద్ద ఎత్తున సహజ సాగుకు మళ్లడం, అద్భుతమైన ఫలితాలు సాధిస్తుండటం చూసి అచ్చెరువొందా. ఒక యువ పట్టభద్రుడు 15 ఎకరాలతో సహజ సాగులోకి దిగాడు. కొద్ది కాలంలోనే ఏకంగా 3,000 మంది రైతులకు అందులో శిక్షణ ఇచ్చాడు. వారితో కలిసినప్పుడు అలవోకగా నెలకు 30 టన్నుల కాయగూరలకు తక్కువ కాకుండా పండిస్తున్నాడు. మరో బయో సైంటిస్టు సముద్రపు కలుపు ఆధారంగా ఒక కంపెనీయే పెట్టాడు. తీరప్రాంత జిల్లాల్లోని 600 మందికిపైగా మత్స్యకారులకు చక్కని ఉపాధి కల్పిస్తున్నాడు. ఆ సదస్సు నా జ్ఞాపకాల్లో ఎప్పటికీ పదిలంగా ఉండిపోతుంది. అక్కడ నేను కలిసిన వారివి భిన్న నేపథ్యాలు. కానీ వారందరి లక్ష్యమూ ఒక్కటే. సహజ సాగులో అద్భుతాలు సాధించడం' అని మోదీ హర్షం వెలిబుచ్చారు. శ్రీ అన్నం, తృణ ధాన్యాలను ప్రోత్సహించాలన్న కేంద్రం నిర్ణయాన్ని ఆయన గుర్తు చేశారు.

లాయర్ ముసుగులో ఐఎస్ఐ గూఢచారి!

- పాక్ గూఢచర్యం కేసులో రూ.కోట్ల లావాదేవీలు.
- రిజ్వాన్ కేసు దర్యాప్తులో షాకింగ్ నిజాలు

అమృత్‌సర్: పాకిస్థాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐ కోసం గూఢచర్యం చేసి, సమాచారాన్ని చేరవేసిన ఆరోపణలపై అరెస్టయిన గుర్గామ్ న్యాయవాది రిజ్వాన్ కేసులో దర్యాప్తు సంస్థలకు పలు కీలక విషయాలు తెలిశాయి. అరెస్టయిన రిజ్వాన్‌కు రెండు బ్యాంక్ ఖాతాలు ఉన్నాయని, డబ్బు సేకరించేందుకు అతను ఏకంగా ఏడుసార్లు అమృత్‌సర్ వెళ్లాడని, అతని స్నేహితుడు, న్యాయవాది ముషారఫ్ అలియాస్ పర్వేజ్ పోలీసులకు తెలిపాడు. 2022లో సోహ్నా కోర్టులో ఇంటర్న్‌షిప్ చేస్తున్నప్పుడు రిజ్వాన్‌తో స్నేహం ఏర్పడిందని ముషారఫ్ చెప్పాడు. జూలైలో, ఇద్దరూ కలిసి ముషారఫ్ కారులో అమృత్‌సర్ వాఘా సరిహద్దుకు వెళ్లారు. అక్కడ స్వర్ణ దేవాలయం వద్ద, ద్విచక్ర వాహనంపై వచ్చిన కొందరి నుండి రిజ్వాన్ ఒక సంచి నిండా డబ్బు తీసుకున్నాడు. అయితే, వారిని గుర్తించలేకపోయానని ముషారఫ్ తెలిపాడు. తిరిగి వస్తుండగా ప్రమాదం జరగడంతో.. కారును అక్కడే వదిలి రైలులో ప్రయాణించారు. ఆగస్టు 1న కారు తీసుకురావడానికి మళ్లీ అమృత్‌సర్ వెళ్లారని ముషారఫ్ చెప్పాడు.

రూ.41 లక్షలు సేకరించి..

రిజ్వాన్ మొత్తం రూ.41 లక్షల నగదును సేకరించినట్లు విచారణలో అంగీకరించాడు. ఈ డబ్బును అతను అజయ్ అరోరా అనే వ్యక్తికి ఇచ్చినట్లు తెలిపాడు. స్కార్పియో, స్కోడా కార్లలో వచ్చిన వ్యక్తుల నుండి డబ్బు సేకరించడానికి.. రిజ్వాన్ ఏడుసార్లు అమృత్‌సర్ వెళ్లాడు. రిజ్వాన్‌కు తౌరులో పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఖాతా, సోహ్నాలో ఇండస్‌ఇండ్ బ్యాంక్ ఖాతా ఉన్నాయి. రిజ్వాన్ ల్యాప్‌టాప్, ఫోన్‌లో అనుమానాస్పద లావాదేవీలను దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. ఈ కేసులో నుహ్ పోలీసు బృందాలు పంజాబ్ అంతటా దాడులు నిర్వహిస్తున్నాయి.

ఆధునికత దిశగా అడుగులేసిన హైదరాబాద్!

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
తెలంగాణ హిస్టరీ

మీర్ ఉస్మాన్ అలీఖాన్ (1911-48)

మీర్ మహబూబ్ అలీఖాన్, అమత్ – ఉజ్ –జహరున్నిసా బేగం దంపతులకు 1886లో మీర్ ఉస్మాన్ అలీఖాన్ జన్మించాడు. ఇతడు ఏడో అసఫ్ జా బిరుదుతో హైదరాబాద్ సింహాసనాన్ని అధిష్ఠించాడు. ఏడో నిజాం పరిపాలనా కాలాన్ని హైదరాబాద్ రాజ్య చరిత్రలో నూతన శకంగా పేర్కొనవచ్చు. రాజ్యాన్ని ఆధునికత వైపు అడుగులు వేయించిన గొప్ప దార్శనికుడు ఉస్మాన్ అలీఖాన్. ఇతడిని హైదరాబాద్ చరిత్రలో గొప్ప హీరో, విలన్‌గా పేర్కొంటారు.

రాజ్యంలో వ్యవసాయాభివృద్ధి, తాగునీటి అవసరాలను తీర్చడానికి 1920లో ఉస్మాన్‌సాగర్ (గండిపేట చెరువు), 1927లో హిమాయత్ సాగర్; అలీసాగర్(బోధన్), రాయపల్లి చెరువు(మెదక్), పాలేరు చెరువు(ఖమ్మం)లను తవ్వించాడు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య సహకారంతో నిజాంసాగర్‌ను నిర్మించి నీటిపారుదల సౌకర్యాలను కల్పించాడు. 1914లో పురావస్తు శాఖను ఏర్పాటు చేసి వెయ్యి స్తంభాల గుడి, రామప్ప దేవాలయం, ఎల్లోరా, అజంతా లాంటి చారిత్రక ప్రదేశాలను సంరక్షించాడు. హైదరాబాద్ అభివృద్ధి కోసం 1912లో హైదరాబాద్ నగరాభివృద్ధి సంస్థను ఏర్పాటు చేశాడు. 1919లో హైకోర్టు భవనాన్ని, జూబ్లీహాల్, అసెంబ్లీ, మొజంజాహి మార్కెట్ భవనాలను నిర్మించాడు. 1922లో హైదరాబాద్ రాజ్యంలో మరణశిక్షను రద్దు చేశాడు. సాంఘిక దురాచారాలైన దేవదాసి, వెట్టి చాకిరి విధానాలను అదే ఏడాది రద్దు చేశాడు.

1927లో ఉచిత ప్రాథమిక విద్యను ప్రవేశపెట్టాడు. 1936లో మాధ్యమిక విద్యా మండలిని స్థాపించాడు. 1918లో ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని స్థాపించి ఉన్నత విద్యను ప్రోత్సహించాడు. (1919 ఆగస్టు 28 నుంచి ఓయూలో విద్యాబోధన ప్రారంభమైంది.) నిజాం స్టేట్ రైల్వేలో భాగంగా దేశంలో తొలి రోడ్డు రవాణా సంస్థను 1932లో ఏర్పాటైంది. రాజ్యాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు దక్కన్ బటన్ ఫ్యాక్టరీ(1916), వజీర్ సుల్తాన్ టొబాకో(వీఎస్‌టీ) ఫ్యాక్టరీ, దక్కన్ గ్లాస్ ఫ్యాక్టరీ(1927), నిజాం షుగర్ ఫ్యాక్టరీ (1937), సిర్పూర్ పేపర్ మిల్లు(1939), గోల్కొండ సిగరెట్ ఫ్యాక్టరీ(1941), హైదరాబాద్ ఆల్విన్ మెటల్స్(1942) తదితర పరిశ్రమలను నెలకొల్పాడు.

హైదరాబాద్ స్టేట్ బ్యాంక్ చట్టం–1941 ప్రకారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ ప్రారంభమైంది. ఈ బ్యాంక్ మొదటి శాఖను 1942 ఏప్రిల్ 5న గన్‌ఫౌండ్రి వద్ద మీర్ ఉస్మాన్ అలీఖాన్ ప్రారంభించాడు. ఉస్మాన్ అలీఖాన్ తన పేరు మీద 'ఉస్మానియా సిక్కా'ను ప్రవేశపెట్టాడు. ప్రముఖ చరిత్రకారుడు రాజేంద్రప్రసాద్ అభిప్రాయం ప్రకారం 'పాలనా పగ్గాలు చేపట్టిన తొలి సంవత్సరాల్లో ఉస్మాన్ అలీఖాన్ మంచి సంస్కర్త'. రెండో ప్రపంచ యుద్ధ కాలం నుంచి బ్రిటిష్ ప్రభుత్వం దేశంలో, ముఖ్యంగా స్వదేశీ సంస్థానాల విషయాల్లో జోక్యం చేసుకోవడం తగ్గించింది. ఇదే అదనుగా ఉస్మాన్ అలీఖాన్ ఆంగ్లేయ అధికారులను తొలగించి ముస్లింలతో ఉద్యోగాలను భర్తీ చేశాడు.

జిల్లాల పేర్ల మార్పు

మీర్ ఉస్మాన్ అలీఖాన్ కాలంలో హైదరాబాద్‌ను ముస్లిం రాజ్యంగా మార్చే ప్రయత్నం జరిగింది. 1905లో వివిధ జిల్లాల పేర్లను మార్చారు. ఎలగండలను కరీంనగర్‌గా, పాలమూరును మహబూబ్‌నగర్‌గా, ఇందూరును నిజామాబాద్‌గా, మెతుకును మెదక్‌గా మార్చారు. మానుకోటను మహబూబాబాద్‌గా, భువనగిరిని భోన్‌గిర్‌గా మార్చారు. ప్రభుత్వ ప్రోత్సాహంతో 1927లో మజ్లిస్–ఇ–ఇత్తేహాదుల్–ముస్లిమీన్ అనే సంస్థను స్థాపించారు. ఈ సంస్థ అంజుమన్ తబ్లి గులిస్తాన్ అనే మరో సంస్థతో కలిసి హిందువుల్ని ముస్లిం మతంలోకి మార్చే తబ్లిక్ ఉద్యమాన్ని ప్రారంభించింది. హైదరాబాద్ నగరంలో ఆర్య సమాజం శాఖను 1892లో ఏర్పాటు చేశారు. కేశవరావ్ కొరాట్కర్, దామోదర్ సత్యాలేకర్, డాక్టర్ అఘోరనాథ్ ఛటోపాధ్యాయ లాంటి ప్రముఖులు నగరంలో ఆర్య సమాజ కార్యకలాపాలకు మద్దతునిచ్చారు. ఆర్య సమాజం తబ్లిక్ ఉద్యమానికి వ్యతిరేకంగా 'శుద్ధి' కార్యక్రమాన్ని చేపట్టి ఇస్లాం మతంలో చేరిన వారిని తిరిగి హిందువులుగా మార్చింది. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఉర్దూ మాధ్యమంలోనే బోధించేవారు. మెజార్టీ ప్రజల మాతృభాషలైన తెలుగు, కన్నడ, మరాఠీల్లో విద్యాబోధనపై నిషేధం ఉండేది. తెలుగు మాధ్యమంలో విద్యాబోధన చేయడం వల్ల నారాయణగూడలోని ఆంధ్ర బాలికోన్నత పాఠశాలకు ఉస్మానియా విశ్వవిద్యాలయం గుర్తింపు ఇచ్చేందుకు నిరాకరించింది. హైదరాబాద్ రాజ్యంలో ఖిలాఫత్ ఉద్యమాన్ని ప్రజలు ప్రారంభించారు. ఈ ఉద్యమాన్ని ఉస్మాన్ అలీఖాన్ తన రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకున్నాడు. 1920లో హైదరాబాద్, కరీంనగర్, మెదక్ లాంటి పట్టణాల్లో ఖిలాఫత్ దినాన్ని పాటించారు. ఈ ఉద్యమ కాలంలో ముస్లింలు ఉస్మాన్ అలీఖాన్‌కు 'మెహిపుల్ మిల్లత్–ఇ–ఉద్దీన్' అనే బిరుదునిచ్చి, ఖిలాఫత్ ఉద్యమంలో పాల్గొనాలని కోరారు. జమీందార్, సియాసత్, జమానా లాంటి ఉర్దూ పత్రికలు ఖిలాఫత్ భావాలను ప్రచారం చేశాయి.

చందా రైల్వే ఆందోళన

భారత ప్రభుత్వం, హైదరాబాద్ ప్రభుత్వం మధ్య 1870లో ఒక ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం మద్రాస్–బొంబాయి మార్గంలో వాడి–హైదరాబాద్ మధ్య రైల్వే లైన్ నిర్మాణం చేపట్టాలి. రైల్వేల విస్తరణతో బొగ్గుకు గిరాకీ పెరగడం వల్ల ఈ రైల్వే లైన్‌ను బొగ్గు గనులున్న ప్రాంతాలైన డోర్నకల్, సింగరేణి మీదుగా విజయవాడ వరకు పొడిగించాలని నిర్ణయించారు. కొద్దికాలం తర్వాత చందాలో బొగ్గు నిక్షేపాలు కనుగొన్నారు. దీంతో రైల్వే లైన్‌ను చందా వరకు పొడిగించాలని నిర్ణయించారు.

ఈ ప్రతిపాదనలు మొదటి సాలార్‌జంగ్ కాలంలోనే ఆమోదం పొందాయి. ఈ రైల్వే లైన్ల నిర్మాణానికి బ్రిటిష్ రైల్వే కంపెనీ మూడు లక్షల పౌండ్ల ధనాన్ని సమకూర్చింది. రైల్వే నిర్మాణ వివరాలు ప్రజలకు పూర్తిగా తెలియవు. ఈ ప్రతిపాదన వల్ల సంస్థానానికి ఆర్థికంగా చాలా నష్టం వాటిల్లుతుందని అప్పుడే ఉనికిలోకి వస్తోన్న విద్యావంతులు భావించారు. అందువల్ల చందా రైల్వే ప్రణాళికను పరిశీలించేందుకు సంస్థానంలోని విద్యావంతులు అఘోరనాథ్ ఛటోపాధ్యాయ, ముల్లా అబ్దుల్ ఖయ్యూం నాయకత్వంలో ఒక కమిటీని ఏర్పాటు చేశారు. చందా రైల్వే పథకానికి సంబంధించిన పూర్తి వివరాలను తమకు అందజేయాలని ఈ కమిటీ ప్రభుత్వాన్ని కోరింది. ప్రజలు ఈ విధంగా కోరడం హైదరాబాద్ సంస్థాన చరిత్రలో ఇదే తొలిసారి. ఈ విషయమై ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. పర్యవసానంగా అఘోరనాథ్ ఛటోపాధ్యాయ, ముల్లా అబ్దుల్ ఖయ్యూం తదితరులను సంస్థానం నుంచి బహిష్కరించింది. 1883 నాటి చందా రైల్వే ఆందోళన హైదరాబాద్ సంస్థానంలో ప్రజా చైతన్యానికి నాంది అనడంలో సందేహం లేదు.

తెలంగాణలో రాజకీయ చైతన్యం

ఆంధ్ర ప్రాంతంతో పోలిస్తే తెలంగాణలో రాజకీయ చైతన్యం ఆలస్యంగా మొదలైంది. మిగతా సంస్థానాల తరహాలోనే హైదరాబాద్ సంస్థానంలోనూ నిరంకుశత్వం అమల్లో ఉండేది. రాజ్యంలో ప్రాథమిక హక్కులు కరవయ్యాయి. వ్యవసాయ కౌలుదార్ల పరిస్థితి దుర్భరంగా తయారైంది. ముక్తేదార్లు, ఫత్తేదార్లు అనే పెద్ద భూస్వాములు కౌలుదారీ రైతులను బాగేలా అనే దాస్యానికి, బానిసత్వానికి గురి చేశారు. ఇలాంటి దుర్భర పరిస్థితుల్లో ప్రజల్లో రాజకీయ చైతన్యం తీసుకురావడానికి కొమర్రాజు లక్ష్మణరావు 1901లో హైదరాబాద్ నగరంలో 'శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయం'ను స్థాపించారు. ఇదే తెలంగాణలో ఏర్పాటైన తొలి గ్రంథాలయం. మునగాల రాజా ఎస్.వెంకటరావు, హైదరాబాద్ మునసబ్‌దార్ రావిచెట్టు రంగారావు ఆర్థిక ప్రోత్సాహంతో లక్ష్మణరావు ఈ గ్రంథాలయాన్ని స్థాపించారు. 1904లో హన్మకొండలో 'శ్రీ రాజరాజ ఆంధ్ర భాషా నిలయం, 1905లో సికింద్రాబాద్‌లో 'ఆంధ్ర సంవర్థిని' లాంటి తెలుగు గ్రంథాలయాలను ఏర్పాటు చేశారు. 1906లో లక్ష్మణరావు 'విజ్ఞాన చంద్రికా గ్రంథ మండలి' అనే సాహితీ సంస్థను ఏర్పాటు చేశారు. ఈ సంస్థ ప్రభుత్వ వ్యతిరేక చర్యలు చేపడుతోందని ప్రభుత్వానికి సందేహం వచ్చింది. దీంతో 'విజ్ఞాన చంద్రికా గ్రంథ మండలి' ప్రధాన కేంద్రాన్ని మద్రాసుకు తరలించారు. ఈ విధంగా తెలంగాణలో సాంస్కృతిక పునర్జీవనానికి పునాదులు వేయడంలో కొమర్రాజు లక్ష్మణరావు సఫలీకృతుడయ్యాడు.

ఆంధ్ర జనసంఘం ఏర్పాటు

1921 నవంబర్ 11, 12 తేదీల్లో హైదరాబాద్ సంస్థాన సాంఘిక సమావేశం హైదరాబాద్‌లో జరిగింది. ఈ సమావేశానికి సంఘ సంస్కర్త, ఎస్.ఎన్.డి.టి. మహిళా విశ్వవిద్యాలయ వ్యవస్థాపకుడైన మహర్షి కార్వే అధ్యక్షత వహించారు. ఈ సమావేశ కార్యక్రమాలను ఆంగ్ల, ఉర్దూ భాషల్లో నిర్వహించారు. ఈ సమావేశంలో ఆలంపల్లి వెంకట రామారావు ఒక తీర్మానంపై తెలుగులో మాట్లాడేందుకు ప్రయత్నించారు. దీంతో సమావేశంలో పాల్గొన్న ఒక వర్గం ఆయన ప్రసంగాన్ని అడ్డుకొంది. ఈ సమావేశంలో తెలుగు భాషకు అవమానం జరిగిందని భావించి, తెలుగు వారి కోసం ఓ సంస్థను ప్రారంభించాలని తీర్మానించారు. మాడపాటి హనుమంతరావు, బి.రామకృష్ణారావు, ఎం.నరసింగరావు, ఆదిరాజు వీరభద్రరావు సహా 11 మంది సభ్యులతో 'ఆంధ్ర జనసంఘం' పేరుతో ఒక సంఘాన్ని ఏర్పాటు చేశారు. ఆంధ్ర జనసంఘం మొదటి సమావేశం 1922 ఫిబ్రవరి 14న కొండా వెంకట రంగారెడ్డి అధ్యక్షతన హైదరాబాద్‌లో జరిగింది. ఈ సమావేశంలోనే ఆంధ్ర జనసంఘం పేరును 'నైజాం ఆంధ్ర రాష్ట్ర జనసంఘం'గా మార్చారు. తెలంగాణ ప్రజల్ని సాంఘిక, ఆర్థిక, సాంస్కృతికాభివృద్ధి దిశగా నడపడమే ఈ సంఘం ముఖ్యోద్దేశం.

తెలంగాణలోని వివిధ ఆంధ్ర సంఘాల కార్యకలాపాలను సమన్వయపరిచేందుకు 'ఆంధ్ర జన కేంద్ర సంఘం' అనే కేంద్ర సంఘాన్ని ఏర్పాటు చేశారు. ఈ సంస్థకు మాడపాటి హనుమంతరావు కార్యదర్శిగా పనిచేశారు. వెట్టిచాకిరి, వర్తక సంఘం అనే కరపత్రాలను ఈ సంస్థ విడుదల చేసింది. ఆంధ్ర జన సంఘం నిర్వహించిన తొలి నాలుగు సమావేశాలు హైదరాబాద్(1923), నల్గొండ(1924), మధిర(1925), సూర్యాపేట(1928)లో జరిగాయి. 'నిజాం ఆంధ్ర రాష్ట్ర ప్రశంస', 'నిజాం ఆంధ్ర రాష్ట్ర ఆంధ్రులు' అనే పుస్తకాలను ప్రచురించారు. కొమర్రాజు లక్ష్మణరావు జ్ఞాపకార్థం 'లక్ష్మణరాయ పరిశోధక మండలి' పేరుతో ఒక చారిత్రక పరిశోధన సంఘాన్ని జన సంఘం ఏర్పాటు చేసింది. 1930లో ఈ సంస్థ 'కాకతీయ సంచిక' అనే పేరుతో ఒక సంపుటిని విడుదల చేసింది.

పార్కిన్సన్ వ్యాధి ఏ అవయవానికి వస్తుంది?

జనరల్‌సైన్స్ విభాగం నుంచి గతంలో వచ్చిన ప్రశ్నలు

1. మానవ శరీరంలో ఎన్ని ఎముకలుంటాయి? (ఏఈఈ-2007)
1) 330 2) 280
3) 206 4) 220

2. మానవ శరీరంలో అతి కఠిన భాగం? (ఏఎస్‌వో-2008)
1) గోర్లు 2) ఎముకలు
3) కొమ్ములు 4) ఎనామిల్

3. చెవుల్లోని మొత్తం ఎముకల సంఖ్య? (ఏఎస్‌వో-2008)
1) రెండు 2) నాలుగు
3) ఆరు 4) ఎనిమిది

4. దంతక్షయాన్ని అరికట్టడానికి నీటి సరఫరాలో కలిపే రసాయన పదార్థం? (గ్రూప్-2, 2000)
1) క్లోరైడ్ 2) ఫ్లోరైడ్
3) బ్రోమైడ్ 4) సల్ఫైడ్

5. పాలలోని చక్కెర? (జె.ఎల్.-2007)
1) ఫ్రక్టోజ్ 2) గ్లూకోజ్
3) సుక్రోజ్ 4) లాక్టోజ్

6. పాలు అంటే ఏమిటి? (గ్రూప్-1, 2002)
1) కొవ్వు విస్తరించి ఉన్న రక్తం
2) కొవ్వు విస్తరించి ఉన్న నీరు
3) నీరు విస్తరించి ఉన్న కొవ్వు
4) నీరు విస్తరించి ఉన్న చమురు

7. పాలలో కొవ్వు శాతం ఏ సమయంలో తగ్గుతుంది? (ఏఈఈ-2009)
1) చలికాలం 2) వేసవికాలం
3) వర్షాకాలం 4) ఏదీకాదు

8. ఆవు పాలు పసుపు రంగులో ఉండటానికి కారణం? (గ్రూప్-2, 2012)
1) జాంతోఫిల్ 2) మాల్టోజ్
3) రైబోఫ్లావిన్ 4) కెరాటిన్

9. కండరాలకు వచ్చే కేన్సర్ ఏది? (గ్రూప్-1, 2003)
1) లింఫోమా 2) ల్యూకేమియా
3) సార్కోమా 4) అనీమియా

10. నేత్రదానంలో దాత తన కంటిలోని ఏ భాగాన్ని దానం చేస్తాడు? (గ్రూప్-1, 2003)
1) కార్నియా 2) లెన్స్
3) రెటీనా 4) పూర్తి కన్ను

11. పాలిష్ చేసిన బియ్యాన్ని ఎక్కువగా తీసుకుంటే ఏ విటమిన్ లోపిస్తుంది? (డిప్యూటీ ఈవో-2008)
1) A 2) B_2 3) D 4) B_1

12. ఏ విటమిన్‌లోపం వల్ల చిగుళ్ల నుంచి రక్తస్రావమవుతుంది?
1) A 2) D 3) K 4) C

13. తాడు రక్తం (Cord Blood) అంటే ఏమిటి? (గ్రూప్-2, 2005)
1) కూతుళ్లకు తండ్రి దానం చేసే రక్తం
2) కృత్రిమ రక్తం
3) గుండె కాండ కణాల నుంచి వృద్ధి చేసిన రక్తం
4) మాయ కాండ కణాల నుంచి వృద్ధి చేసిన రక్తం

14. హిమోగ్లోబిన్‌లో ఉండే లోహం? (గ్రూప్-1, 1987-88)
1) మెగ్నీషియం 2) ఇనుము
3) కోబాల్ట్ 4) మాంగనీస్

15. పేస్‌మేకర్ దేనికి సంబంధించింది? (గ్రూప్-1, 2010)
1) గుండె 2) ఊపిరితిత్తులు
3) కాలేయం 4) కిడ్నీ

16. రక్తం ఒక..? (గ్రూప్-1, 2010)
1) ద్రావణం 2) కొల్లాయిడ్
3) తరల పదార్థం 4) జెల్

17. శిశువు పితృత్వాన్ని నిర్ధారించేందుకు ఏ పరీక్ష నిర్వహిస్తారు? (సివిల్స్-2010)
1) ఆమ్నియో సెంటాసిస్
2) డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్
3) జన్యు సైక్లింగ్ 4) ఏదీకాదు

18. AB రక్త గ్రూపునకు చెందిన ఒక వ్యక్తిని విశ్వగ్రహీత అని ఎందుకంటారు? (గ్రూప్-1, 2007)
1) ప్రతిరక్షక జనకాలు లేనందువల్ల
2) ప్రతిరక్షకాలు ఉన్నందువల్ల
3) ప్రతిరక్షకాలు లేనందువల్ల
4) ప్రతిరక్షకాలు – ప్రతి రక్షక జనకాలు లేనందువల్ల

19. సిరా రక్తాన్ని ఆక్సిజన్ కోసం ఊపిరితిత్తులకు చేరవేసేది? (గ్రూప్-2, 2008)
1) పుపుస సిరలు 2) పుపుస ధమనులు
3) కుడి జఠరిక 4) మహాధమని

20. చాలా కీటకాలు గాలిని సంగ్రహించే పద్ధతి?
1) చర్మం ద్వారా
2) మొప్పల ద్వారా
3) ట్రాకియల్ వ్యవస్థ ద్వారా
4) లంగ్స్ ద్వారా

21. బయోగ్యాస్‌లోని ప్రధానాంశం? (గ్రూప్-1, 1987)
1) ఈథేన్ 2) మీథేన్
3) బ్యూటేన్ 4) ఎసిటలిన్

22. ఆక్సిజన్ లేకుండా ఒక జైవిక పదార్థాన్ని విచ్ఛిన్నం చేయడం ద్వారా ఏ వాయువును ఉత్పత్తి చేయొచ్చు? (గ్రూప్-2, 2001)
1) బొగ్గుపులుసు వాయువు
2) నత్రజని 3) SO_2 4) మీథేన్

23. ఆల్కహాల్‌ను తయారు చేయడానికి ఏది అవసరం? (గ్రూప్-2, 2001)
1) ప్రోటోజోవా 2) శిలీంధ్రాలు – ఈస్ట్
3) బ్యాక్టీరియా 4) వైరస్

24. పురుషుడి గొంతు కంటే స్త్రీ గొంతు కీచుగా ఉంటుంది. ఎందుకంటే? (గ్రూప్-2, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్- 2009)
1) అధిక పీడన వ్యాప్తి
2) అల్ప పీడన వ్యాప్తి
3) అధిక కంపన పరిమితి
4) అల్ప కంపన పరిమితి

25. సిలికోసిస్ వ్యాధి ఏ అవయవానికి సంక్రమిస్తుంది?
1) మూత్రపిండాలు 2) కాలేయం
3) నరాలు 4) ఊపిరితిత్తులు

26. మొదటిసారిగా కృత్రిమంగా తయారు చేసిన జీవ సమ్మేళనం? (గ్రూప్-2, 2008)
1) మీథేన్ 2) బెంజీన్
3) గ్లూకోజ్ 4) యూరియా

27. సాధారణంగా మూత్రం ద్వారా విసర్జితమయ్యే పదార్థం? (గ్రూప్-2, 2003)
1) పంచదార 2) గ్లూకోజ్
3) క్రియాటిన్ 4) ప్రోటీన్

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
బయాలజీ

28. మానవ కిడ్నీలో ఏర్పడే రాళ్లలో అధికంగా ఉండేది?
1) కాల్షియం ఆక్జలేట్
2) సోడియం ఎసిటేట్
3) మెగ్నీషియం సల్ఫేట్
4) సోడియం సిట్రేట్

29. మూత్రపిండాల్లోని ఏ భాగంలో మూత్రం వడపోత అవుతుంది? (డీఎల్-2012)
1) వృక్కం 2) మూత్ర కోశం
3) ప్రసేకం 4) వృక్క సిర

30. మానవ మూత్రంలోని యూరియా తయారయ్యే భాగం? (గ్రూప్-2, 2000)
1) మూత్రపిండాలు 2) పెద్దపేగు
3) కాలేయం 4) మూత్రాశయం

31. కృత్రిమంగా మూత్రపిండాలు వ్యర్థ పదార్థాలను శుద్ధి చేయడాన్ని ఏమంటారు? (గ్రూప్-2బి,1984)
1) పనోరిసిస్ 2) మానోమీటర్
3) డయాలసిస్ 4) డయామెంటేషన్

32. చక్కెర వ్యాధిగ్రస్థుని మూత్ర నమూనాలో ఉండేది? (ఏఈఈ-2009)
1) లాక్టోజ్ 2) మాల్టోజ్
3) గ్లూకోజ్ 4) సుక్రోజ్

33. క్లోమం ఒక ..? (గ్రూప్-1, 1999)
1) అంతస్స్రావ గ్రంథి
2) బహిస్స్రావ గ్రంథి
3) అంతస్స్రావ – బహిస్స్రావ గ్రంథి
4) ఏదీకాదు

34. శరీరంలో తాప నియంత్రణను కలిగి ఉన్న గ్రంథి? (గ్రూప్-1, 2007)
1) పీనియల్ గ్రంథి
2) పిట్యూటరీ గ్రంథి/ హైపోథలమస్
3) థైరాయిడ్ 4) అడ్రినలిన్

35. మానవ శరీరంలో 'ఆడమ్స్ ఆపిల్' అని పిలిచే గ్రంథి? (గ్రూప్-1, 2007)
1) అడ్రినల్ గ్రంథి 2) లివర్/కాలేయం
3) థైరాయిడ్-బాలగ్రంథి
4) థైమస్-బాలగ్రంథి

36. తన జాతి జీవులపై ప్రభావం చూపే, జీవి శరీరం నుంచి బాహ్యంగా స్రవించే సమ్మేళనాన్ని ఏమంటారు? (గ్రూప్-1, 1995)
1) సబ్ హార్మోన్ 2) న్యూరో హార్మోన్
3) ఫిరమోన్స్ 4) న్యూరో ట్రాన్స్‌మీటర్

37. పాల పొదుగు నుంచి – చూషణ ద్వారా పాలను స్రవించేందుకు తోడ్పడే హార్మోన్? (సివిల్స్-1989)
1) ప్రోలాక్టిన్ 2) ఆక్సిటోసిన్
3) అడ్రినలిన్ 4) థైమోసిన్

38. రక్తపోటు(బ్లడ్ ప్రెజర్)కు కారణమైన హార్మోన్? (అసిస్టెంట్ తెలుగు ట్రాన్స్‌లేటర్-2010)
1) కాలేయం 2) థైమోసిన్
3) అడ్రినలిన్ 4) సెక్రిటిన్

39. కణం శక్తి గృహం (కణ శక్తి భాండాగారం) అని పిలిచే కణాంగం? (గ్రూప్-1, 1994, ఎ.ఎం.వి. ఇన్‌స్పెక్టర్- 2009)
1) క్లోరోప్లాస్ట్ 2) మైటోకాండ్రియా
3) గ్రానా 4) ప్రోటోప్లాజమ్

40. తుమ్ములు, మింగడం, వాంతులు, వెక్కిళ్లు దేని నియంత్రణలో ఉంటాయి? (గ్రూప్-1, 1990)
1) మజ్జాముఖం 2) మస్తిష్కం
3) అనుమస్తిష్కం 4) హైపోథాలమస్

41. అనుమస్తిష్కం (సెరిబెల్లమ్) దేనికి సంబంధించింది? (టౌన్‌ప్లానింగ్ - 2010)
1) కండరాల కదలిక సమన్వయం
2) గ్రాహకాంగం
3) జ్ఞాపక శక్తి 4) దృష్టి

42. జంతు రాజ్యంలో అతిపొడవైన కణం? (గ్రూప్-1, 2010)
1) ఆస్ట్రిచ్ అండం 2) శుక్రకణం
3) నాడీకణం 4) మైకోప్లాస్మా

43. మెదడును కప్పి ఉంచే లోపలి పొర? (డీఎల్-2012)
1) ప్లూరా 2) డ్యురామ్యాటర్
3) పియామ్యాటర్
4) అరాకినాయిడ్ మెంబ్రేన్

44. పార్కిన్సన్ వ్యాధి ఏ అవయవానికి వస్తుంది? (ఏఈఈ-2006)
1) గుండె 2) కాలేయం
3) మెదడు 4) చర్మం

45. శరీరంలో వార్తలను గ్రహించి సమన్వయ పరిచే కేంద్రం? (జె.ఎల్.-2007)
1) గుండె 2) మెదడు
3) మూత్రపిండాలు
4) పీయూషగ్రంథి

46. మెదడులో ఏ భాగం జ్ఞాపకశక్తికి మూలం? (జె.ఎల్.-2004)
1) మస్తిష్కం 2) అనుమస్తిష్కం
3) దవ్వ 4) అథోపర్యంకం

47. కిందివాటిలో జీర్ణక్రియా ఎంజైమ్ కానిది? (సివిల్స్-2007)
1) ట్రిప్సిన్ 2) పెప్సిన్
3) టయలిన్ 4) గ్యాస్ట్రిన్

48. హెపటైటిస్ వ్యాధి దేనికి సంబంధించింది? (గ్రూప్-2, 2000)
1) కాలేయంలో మంట
2) గుండెలో మంట
3) మూత్రపిండాల్లో మంట
4) పేగులో మంట

49. బేరియాట్రిక్ శస్త్ర చికిత్స అంటే ఏమిటి? (గ్రూప్-1, 2004)
1) గుండె బైపాస్ శస్త్ర చికిత్స
2) పొట్ట బైపాస్ శస్త్ర చికిత్స
3) మెదడు సర్జరీ
4) సియామీ కవలలను విడదీసే సర్జరీ

50. కోసిన తర్వాత 2-3 వారాల్లోనే తన పూర్వ స్థితిని తిరిగి దాదాపు 85 శాతం వరకు పెంచుకునే సామర్థ్యం ఉన్న మానవ శరీర అవయం ఏది? (గ్రూప్-1, 2004, ఏఈఈ-2008)
1) మెదడు 2) మూత్రపిండాలు
3) కాలేయం 4) ఊపిరితిత్తులు

51. మానవుని సొల్లు (సెలైవా)లో ఉండే ఎంజైమ్? (గ్రూప్-2, 2003)
1) రెనిన్ 2) అమైలేజ్
3) లైపేజ్ 4) టయలిన్

52. 'రూట్ కెనాల్ థెరపీ' వేటికి సంబంధించిన చికిత్స? (గ్రూప్-2, 2000)
1) దెబ్బతిన్న పళ్లు
2) దెబ్బతిన్న మూత్రనాళం
3) రక్తనాళాలు 4) గోర్లు

53. మానవుడిలో అతిపెద్ద గ్రంథి? (ఆర్కియాలజీ అండ్ మ్యూజియమ్స్-2012)
1) కాలేయం 2) ఊపిరితిత్తులు
3) ప్లీహం 4) క్లోమం

54. మానవ ఉదరంలో ఉత్పత్తి అయ్యే ఆమ్లం? (గ్రూప్-1, 2012)
1) ఎసిటికామ్లం 2) హైడ్రోక్లోరికామ్లం
3) ఫార్మికామ్లం 4) నైట్రికామ్లం

55. కిందివాటిలో సరైన వరస క్రమం ఏది?
1) గడ్డి–తోడేలు–జింక–గేదె
2) గడ్డి–కీటకం–పక్షి–పాము
3) బ్యాక్టీరియా–కీటకం–పాము–జింక
4) బ్యాక్టీరియా–గడ్డి–కుందేలు–తోడేలు

56. అండోత్పత్తి స్థానం నుంచి అండాలు గర్భాశయంలోకి ప్రవేశించడానికి ఏ భాగం సహాయపడుతుంది? (గ్రూప్-1, 2004)
1) సెర్విక్ 2) యోని
3) జరాయువు 4) ఫెల్లోపియన్ నాళాలు

సమాధానాలు

1) 3;	2) 4;	3) 3;	4) 2;	5) 4;
6) 2;	7) 2;	8) 3;	9) 3;	10) 1;
11) 4;	12) 4;	13) 4;	14) 2;	15) 1;
16) 2;	17) 2;	18) 3;	19) 2;	20) 3;
21) 2;	22) 1;	23) 2;	24) 4;	25) 4;
26) 4;	27) 3;	28) 1;	29) 1;	30) 3;
31) 3;	32) 3;	33) 3;	34) 2;	35) 3;
36) 3;	37) 2;	38) 3;	39) 2;	40) 1;
41) 1;	42) 3;	43) 3;	44) 3;	45) 2;
46) 1;	47) 4;	48) 1;	49) 2;	50) 3;
51) 4;	52) 1;	53) 1;	54) 2;	55) 2;
56) 4.				

విద్య, ఉద్యోగ సమాచారం

బీఐఆర్ఏసీ, న్యూఢిల్లీలో అసోసియేట్ కన్సల్టెంట్ పోస్టులు

న్యూఢిల్లీలోని బయోటెక్నాలజీ ఇండస్ట్రీ రీసెర్చ్ అసిస్టెన్స్ కౌన్సిల్(బీఐఆర్ఏసీ) ఒప్పంద ప్రాతిపదికన అసోసియేట్ కన్సల్టెంట్–ఇంక్యుబేషన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- **మొత్తం పోస్టుల సంఖ్య:** 02.
- **అర్హత:** బయోటెక్నాలజీ/లైఫ్ సైన్స్ లేదా తత్సమాన విభాగంలో ఎంఎస్సీ/ఎంటెక్ ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు పని అనుభవం ఉండాలి.
- **వయసు:** 45 ఏళ్లు మించకూడదు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 18.12.2025
- **వెబ్‌సైట్:** https://birac.nic.in

బీఐఆర్ఏసీ, న్యూఢిల్లీలో ప్రోగ్రామ్ ఆఫీసర్ పోస్టులు

న్యూఢిల్లీలోని బయోటెక్నాలజీ ఇండస్ట్రీ రీసెర్చ్ అసిస్టెన్స్ కౌన్సిల్(బీఐఆర్ఏసీ) ఒప్పంద ప్రాతిపదికన ప్రోగ్రామ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- **మొత్తం పోస్టుల సంఖ్య:** 01.
- **అర్హత:** లైఫ్ సైన్సెస్/మైక్రోబయాలజీ/బయోకెమిస్ట్రీ/బయోటెక్నాలజీ/పబ్లిక్ హెల్త్‌లో మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు పని అనుభవం ఉండాలి.
- **వయసు:** 30 ఏళ్లు మించకూడదు.
- **వేతనం:** నెలకు రూ.60,000 నుంచి రూ.2,10,000.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 18.12.2025
- **వెబ్‌సైట్:** https://birac.nic.in

బీఆర్ఐసీ-ఎన్‌సీసీఎస్, పుణెలో పీహెచ్‌డీ ప్రవేశాలు

పుణె(మహారాష్ట్ర)లోని బయోటెక్నాలజీ రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ కౌన్సిల్ (బీఆర్ఐసీ) –నేషనల్ సెంటర్ ఫర్ సెల్ సైన్స్(ఎన్‌సీసీఎస్)మార్చి–2026 సంవత్సరానికి సంబంధించి పీహెచ్‌డీలో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.
- **అర్హత:** పీజీ ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు సీఎస్ఐఆర్–యూజీసీ, డీబీటీ, ఐసీఎంఆర్, బీఐఎన్‌సీల నుంచి ఫెలోషిప్‌ను కలిగి ఉండాలి లేదా డిసెంబర్ 2024లో ఎన్‌సీబీఎస్/టీఐఎఫ్ఆర్ నిర్వహించిన జేజీఈఈబీఐఎల్ఎస్ పరీక్షకు హాజరై ఉండాలి.
- **ఎంపిక విధానం:** జేజీఈఈబీఐఎల్ఎస్ కట్ ఆఫ్ స్కోర్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 09.12.2025.
- **వెబ్‌సైట్:** http://nccs.res.in

‘ఎవరెస్ట్’ ఏ హిమాలయ పర్వత పంక్తుల్లో ఉంది?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

భూగోళశాస్త్రం

హిమాలయ పర్వత వ్యవస్థ- ప్రాధాన్యం

ఉత్తరాన కోటగోడలా విస్తరించి ఉన్న హిమాలయ పర్వత వ్యవస్థ భారత్‌కు పాకిస్తాన్, చైనా, నేపాల్, భూటాన్ దేశాలతో సరిహద్దుగా ఉంది. వ్యూహాత్మకంగానే కాకుండా ఆర్థిక, సామాజిక అంశాల పరంగా కూడా హిమాలయ పర్వతాలు భారతదేశానికి కీలకం. దేశానికి ఉత్తర ప్రాంతం నుంచి సైనిక దాడులను నిరోధించి రక్షణ కల్పించడంలో హిమాలయాలు ప్రధానపాత్రను పోషిస్తున్నాయి. తూర్పు హిమాలయ ప్రాంతంలో భారత్-చైనాలను విడదీసే ‘మెక్‌మోహన్ రేఖ’ను శాస్త్రీయ సరిహద్దుగా అభివర్ణిస్తారు. ఈ ప్రాంతంలో హిమాలయ పర్వతాలు, వాటి కనుమలను పూర్తిగా భారతదేశం కిందకు తేవడంతో చైనా ఈ ప్రాంతంలో భారత్‌లోకి చొచ్చుకు రావడం చాలా కష్టం. కాబట్టి చైనా మెక్‌మోహన్ రేఖను అంగీకరించడం లేదు. చైనా వాదన ప్రకారం ఈ ప్రాంతంలో అంతర్జాతీయ సరిహద్దు హిమాలయ పర్వత పాదాల వద్ద ఉండాలి. అంటే మొత్తం హిమాలయ పర్వతాలను (అరుణాచల్ ప్రదేశ్‌ను) చైనా కోరుతుందన్న మాట. ఇది భారత్‌కు ఎట్టి పరిస్థితుల్లోనూ సమ్మతం కాదు. సైనిక వ్యూహాల పరంగా హిమాలయ పర్వతాల్లోని కనుమలు చాలా ప్రాధాన్యాన్ని కలిగి ఉంటాయి. 1962 యుద్ధంలో అరుణాచల్ హిమాలయాల్లోని తవాంగ్, బొమిడిల్లా కనుమ లను రక్షించుకోలేకపోవడంతోనే చైనా సైన్యాలు సులువుగా అరుణాచల్ ప్రదేశ్‌లోకి ప్రవేశించగలిగాయి. జమ్ముకశ్మీర్ హిమాలయాల్లోని కారకోరం కనుమ నుంచి భారత్, చైనా, పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే) భూభాగాల్లోకి సులువుగా ప్రవేశించవచ్చు. 1980లలో (పీఓకే)మీదుగా చైనా, పాకిస్తాన్‌లను కలుపుతూ కారకోరం కనుమ ద్వారా రహదారి నిర్మించడంతో భారత్ భద్రతకు ముప్పు ఏర్పడింది. కాబట్టి కారంకోరం కనుమకు సమీపంలోని సియాచిన్ హిమానీ నద ప్రాంతంలో సైనిక బలగాలను మోహరించాల్సి వచ్చింది. కార్గిల్ యుద్ధంలో కూడా జోజిల్లా కనుమకు ముప్పు ఏర్పడింది. శ్రీనగర్-లే జాతీయ రహదారికి సమీపంలో ఈ కనుమ ఉంది. జోజిల్లా కనుమ శత్రువుల ఆధీనంలోకి వెళితే భారతదేశం నుంచి లడఖ్‌ను సులువుగా వేరు చేయొచ్చు. ఈ ప్రమాదాన్ని గమనించే కార్గిల్ యుద్ధంలో జోజిల్లా కనుమ సమీపంలోని టైగర్‌కొండ, ముష్కోష్ లోయల్లో తిష్ట వేసిన ముష్కరులను హతమార్చడానికి భారత సైన్యం పెద్ద మూల్యాన్నే చెల్లించాల్సి వచ్చింది. ‘బనిహాల్ కనుమ’ గుండా జమ్ము-శ్రీనగర్ జాతీయ రహదారి వెళ్తుంది. అందుకే ఈ కనుమను ‘కశ్మీర్ లోయ ముఖద్వారం’గా పరిగణిస్తారు.

వాణిజ్య-సాంస్కృతిక సంబంధాలు

హిమాలయ పర్వతాల కనుమలు అనాదిగా వాణిజ్య, సాంస్కృతిక సంబంధాల్లోనూకీలక పాత్ర పోషించాయి. భారతదేశం నుంచి చైనాలోకి బౌద్ధమత వ్యాప్తి హిమాలయ పర్వత కనుమల ద్వారా జరిగింది. సిక్కిం-టిబెట్ సరిహద్దులోని నాథూలా, జెలెప్ కనుమల ద్వారా టిబెట్ రాజధాని లాసా, కోల్‌కతా రేవు పట్టణాలను కలిపే రహదారి వెళ్తుంది. 1962 యుద్ధం తర్వాత ఈ రెండు కనుమల ద్వారా జరిపే వాణిజ్యాన్ని నిలిపివేశారు. ఇటీవల నాథూలా కనుమను తిరిగి వాణిజ్యానికి తెరిచారు. టిబెట్-నేపాల్-ఉత్తరాఖండ్ సరిహద్దు ప్రాంతంలోని ‘లిపులేక్’ కనుమ మార్గం అనాదిగా వాణిజ్యానికి ప్రసిద్ధి. 1962 యుద్ధం తర్వాత ఈ కనుమను కూడా మూసివేశారు.

శీతోష్ణస్థితి నియంత్రణ

భారతదేశపు శీతోష్ణస్థితిని నియంత్రించడంలో కూడా హిమాలయాలు కీలక పాత్ర పోషిస్తాయి. శీతాకాలంలో సైబీరియా (రష్యా) నుంచి దక్షిణాసియా వైపు వీచే అతి శీతల పవనాలను హిమాలయాలు అడ్డుకొని గంగా-సింధు-బ్రహ్మపుత్ర మైదానాన్ని హిమపాతం నుంచి కాపాడతాయి. హిమాలయాలు లేకపోతే సైబీరియా శీతల పవనాల వల్ల గంగా-సింధు-బ్రహ్మపుత్ర మైదానంలో శీతకాలంలో రబీ వ్యవసాయం సాధ్యపడేది కాదు. గంగా, యమున, సట్లెజ్, బ్రహ్మపుత్ర నదులు శీతాకాలంలో గడ్డ కట్టుకుపోయేవి. కాబట్టి ఉత్తర మహా మైదాన ప్రాంతం ఉప ఆయనరేఖా అక్షాంశ ప్రాంతంలో ఉన్నప్పటికీ ఆయనరేఖా శీతోష్ణస్థితిని కలిగి ఉంది. భారతదేశంలో నైరుతి రుతుపవనాల చురుకుదనం శీతాకాలంలో హిమాలయాల్లో కురిసిన మంచు పరిమాణంపై ఆధారపడి ఉంటుంది.

జీవ నదులకు ఆలవాలం

హిమాలయాల్లోని హిమానీనద సరస్సులు, హిమానీ నదాలు, మంచుతో కప్పుకుపోయిన పర్వత శిఖరాలు అనేక జీవ నదులకు మాతృకలు. ఉదాహరణకు గంగోత్రి హిమానీనదం నుంచి గంగా, యమునోత్రి వద్ద యమున, రాకాస్‌తాల్ సరస్సు నుంచి సట్లెజ్, చాంమ్యుయాంగ్ హిమానీనదం నుంచి సింధు, వెరినాగ్ కొండల నుంచి జీలం, కైలాస మానస సరోవరం వద్ద బ్రహ్మపుత్ర, కులూ కొండల్లో రావి నదులు ఆవిర్భవిస్తున్నాయి. హిమాలయాల్లో ఆవిర్భవించడం వల్ల ఈ నదులన్నీ ‘జీవనదులు’గా అవతరించాయి. అయితే ఇటీవల గ్లోబల్ వార్మింగ్ వల్ల హిమాలయ హిమానీ నదులు క్రమంగా కుంచించుకుపోవడం ఆందోళనను కల్గిస్తోంది. హిమాలయాల్లో రెండో అతిపెద్దదైన గంగోత్రి హిమానీనదం వేగంగా కుంచించుకు పోతుందని శాస్త్రజ్ఞులు నిర్ధారించారు. దీనివల్ల గంగానదిలో సమీప భవిష్యత్తులో వరద తీవ్రత పెరిగి దీర్ఘ కాలంలో క్రమంగా ఎండిపోయే ప్రమాదం ఉందని శాస్త్రజ్ఞులు హెచ్చరిస్తున్నారు.

అటవీ, వన్యమృగ సంపద

హిమాలయ పర్వత సానువులు దట్టమైన అరణ్యాలతో కూడి విశిష్టమైన అటవీ, వన్యమృగ సంపదను కలిగి ఉన్నాయి. హిమాలయ పర్వత సానువుల్లో వివిధ ఎత్తుల్లో వివిధ రకాల అరణ్యాలు ఉన్నాయి. శివాలిక్ కొండల్లో ఆయనరేఖా ఆకురాల్చు అరణ్యాలు, సమశీతోష్ణ అరణ్యాలు పెరుగుతున్నాయి. హిమాచల్ పర్వతాల్లో విశిష్టమైన కోనిఫెరస్ (శృంగాకార) అరణ్యాలు ఉన్నాయి. నాణ్యమైన మెత్తని కలప నిచ్చే పైన్, ఫర్, స్ప్రూస్, దేవదారు మొదలైన వృక్ష జాతులు ఇక్కడ పెరుగుతున్నాయి. హిమాద్రి పర్వతాల (గ్రేటర్ హిమాలయాల) నిమ్న సానువులు విశాలమైన పచ్చిక బయళ్లకు ప్రసిద్ధి. ఈ ప్రాంతాల్లో రోడో డెండ్రాన్ వంటి ఆకర్షణీయమైన పుష్ప జాతులతో పాటు విలువైన ఔషధ మొక్కలు కూడా లభిస్తాయి.

అరుదైన హిమాలయ ఎలుగుబంటి, కస్తూరి మృగం వంటి వన్య ప్రాణులు కూడా ఈ అరణ్యాల్లో సంచరిస్తున్నాయి. శివాలిక్ కొండలు-లెస్సర్ హిమాలయాల మధ్యలో విస్తరించి ఉన్న ‘డూన్’ ప్రాంతాలు, కశ్మీర్ లోయ ప్రాంతాల్లో సాంద్ర వ్యవసాయం కేంద్రీకృతమై ఉంది. నిమ్న హిమాలయాల్లో పర్వత సానువుల వెంట ఆపిల్ వంటి పండ్ల తోటలను పెంచుతున్నారు. హిమాలయ పర్వతాల్లో వివిధ రకాల ఖనిజ నిల్వలున్నప్పటికీ, వాటి వెలికితీత ఆర్థికంగా లాభదాయకం కాదు. నదులు హిమాలయ పర్వతాలను దాటేటప్పుడు విశిష్టమైన జల పాతాలను సృష్టిస్తాయి. ఇవి విస్తృతంగా జల విద్యుచ్ఛక్తి వనరులను కలిగి ఉన్నాయి. దూల్ హస్తి, సలాల్, చమేలి, కర్ణప్రయాగ్ ముఖ్యమైన జల విద్యుచ్ఛక్తి ఉత్పత్తి కేంద్రాలు.

మాదిరి ప్రశ్నలు

1. కిందివాటిలో ఏ పర్వత శ్రేణులను ‘ఉప హిమాలయాలు’గా పిలుస్తారు?
   ఎ) హిమాచల్ శ్రేణులు
   బి) హిమాద్రి పర్వతాలు
   సి) కారకోరం పర్వతాలు
   డి) శివాలిక్ పర్వతాలు
2. హిమాలయాలకు చెందిన కింది పర్వతాలను ‘ఆసియా ఖండ వెన్నెముక’గా వ్యవహరిస్తారు?
   ఎ) కారకోరం పర్వతాలు
   బి) జాగ్రోస్ పర్వతాలు
   సి) లడఖ్ పర్వతాలు
   డి) పిర్‌పంజాల్ పర్వతాలు
3. కశ్మీర్ లోయ ఏ పర్వత శ్రేణుల మధ్య ఉంది?
   ఎ) జాస్కర్-హిమాద్రి పర్వతాలు
   బి) హిమాద్రి పర్వతాలు-పిర్‌పంజాల్
   సి) పిర్‌పంజాల్ శ్రేణులు-జమ్ము కొండలు
   డి) కారకోరం పర్వతాలు-లడఖ్ పర్వతాలు
4. కుమావున్ పర్వత శ్రేణులు ఏ రాష్ట్రంలో ఉన్నాయి?
   ఎ) జమ్ముకశ్మీర్
   బి) హిమాచల్ ప్రదేశ్
   సి) అరుణాచల్ ప్రదేశ్
   డి) ఉత్తరాఖండ్
5. హిమాలయ పర్వత పంక్తులు ఏ కోవకు చెందుతాయి?
   ఎ) నవీన ముడుత పర్వతాలు
   బి) ప్రాచీన ముడుత పర్వతాలు
   సి) అవశిష్ట పర్వతాలు
   డి) భ్రంశ పర్వతాలు
6. వాణిజ్యానికి తిరిగి తెరిచిన ‘నాథూలా’ కనుమ ఏ రాష్ట్రంలో ఉంది?
   ఎ) అరుణాచల్ ప్రదేశ్
   బి) ఉత్తరాఖండ్
   సి) సిక్కిం
   డి) జమ్ముకశ్మీర్
7. ‘కశ్మీర్ లోయ ముఖద్వారం’గా దేనిని పిలుస్తారు?
   ఎ) కారకోరం
   బి) మానా
   సి) బనిహాల్
   డి) పిర్‌పంజాల్
8. భారత్‌లో లేని హిమాలయ పర్వత శ్రేణులు?
   ఎ) మహాభారత్ శ్రేణులు
   బి) కారకోరం శ్రేణులు
   సి) ధవులాదార్ కొండలు
   డి) జాస్కర్ శ్రేణులు
9. ప్రపంచంలోకెల్లా ఎత్తయిన ఎవరెస్ట్ (సాగరమాత) శిఖరం ఏ హిమాలయ పర్వత పంక్తుల్లో ఉంది?
   ఎ) టిబెటన్ హిమాలయాలు
   బి) హిమాద్రి పర్వతాలు
   సి) హిమాచల్ పర్వతాలు
   డి) శివాలిక్ పర్వతాలు
10. వేసవి విడిది కేంద్రమయిన డార్జిలింగ్ ఏ రాష్ట్రంలో ఉంది?
    ఎ) సిక్కిం బి) అసోం
    సి) అరుణాచల్ ప్రదేశ్ డి) పశ్చిమ బెంగాల్
11. లడఖ్‌లోని ‘పూగా లోయ’ వేటికి ప్రసిద్ధి?
    ఎ) వేడినీటి బుగ్గలు
    బి) హిమానీ నదాలు
    సి) దట్టమైన అరణ్యాలు
    డి) పైవన్నీ
12. హిమాలయాల్లోకెల్లా అతిపెద్ద హిమానీనదం ఏది?
    ఎ) గంగోత్రి బి) యమునోత్రి
    సి) బయిఫూ
    డి) సియాచిన్
13. టిబెటన్ హిమాలయాల్లోని మానస సరోవరం ఏ పర్వత శ్రేణుల్లో ఉంది?
    ఎ) నాగటిబ్బ
    బి) కైలాస పర్వతాలు
    సి) సయాడియా పర్వతాలు
    డి) పైవేవీ కావు
14. కశ్మీర్ హిమాలయాల్లోని సోనామెర్గ్, గుల్‌మెర్గ్ వేటికి ప్రసిద్ధి?
    ఎ) కోనిఫెరస్ అరణ్యాలు
    బి) వన్యమృగాలు
    సి) పచ్చిక బయళ్లు
    డి) హిమానీ నదాలు
15. హిమాలయాలు ఉద్భవించిన భౌమ్య యుగం?
    ఎ) ప్రీకాంబ్రియన్
    బి) మీసోజాయిక్
    సి) కెయినో జాయిక్
    డి) టెరిషరీ

సమాధానాలు

1) డి	2) ఎ	3) బి	4) డి
5) ఎ	6) సి	7) సి	8) ఎ
9) బి	10) డి	11) ఎ	12) డి
13) బి	14) సి	15) డి	

The meaning of scoot is..

BANK EXAMS

GENERAL ENGLISH

MODEL QUESTIONS

Directions (Q. 1- 5): Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in bold to help you locate them while answering some of the questions.

A flash of lightning and deafening crash of thunder are enough to make a child scream and a dog **scoot** under the bed, his tail between his legs. Some adults are also frightened, particularly those who have had a close call with nature's fireworks. The child who is frightened by thunder and lightning needs comfort rather than ridicule. The majority of them are calmed by a story or song. Older tots are helped by watching and discussing the flashes and roars provided the parents show no evidence of alarm. The experiments of Benjamin Franklin 200 years ago helped dispel superstitions and primitive ideas about this natural phenomenon. If a church instead of a nearby gambling joint is struck by lightning, the people no longer are amazed that a good rather than a bad place should bear the brunt. They realize the church was struck because its steeple is the highest point in the vicinity. Lightning represents a discharge of atmospheric electricity from one cloud to another or from a cloud to the earth. The best targets here below are projections of some height. This makes the church spire more **vulnerable** than a low building protected by a grove of trees. On the other hand a single tree, shack, fence pole or human being becomes the best target on a prairie, more so when representing the only inlet for a bolt of lightning with in the radius of miles. Stay indoors during a thunderstorm but if caught outside, choose a safe shelter, preferably a large metal building or a dwelling protected against lightning.

1. What should you do during a lightning storm?
   1) play golf and other outdoor games
   2) watch television and engage yourself
   3) if outside choose a safe shelter
   4) stay in water
   5) stay on a hilltop
2. How should you react to a child's fright over lightning?
   1) give strict warning to them
   2) try to shout at them and control the things
   3) try to hide in a secret place
   4) ridicule them
   5) calm them by telling a story
3. What kind of structures does lightning generally strike?
   1) projections of some height
   2) nature's fireworks
   3) gambling joint
   4) a low building protected by a grove of trees
   5) indoors
4. The meaning of **scoot** is
   1) crawl 2) creep
   3) poke 4) hurry 5) haze
5. The synonym of **vulnerable** is
   1) Inclination 2) week
   3) experience 4) susceptible
   5) averse

Directions (Q. 6-10): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

6. Earlier homemade rafts dumped their waste into the water _____, but by June the _____ rafts were mostly gone, banned under a new state law.
   1) untreated, unsightly
   2) artfully, dismal
   3) openly, few
   4) flagrantly, petty
   5) hazy, cloudy
7. We live in a _____ age; everyone thinks that maximizing _____ is the point of life.
   1) ubiquitous, enjoyment
   2) propitious, delight
   3) sporadic, bliss
   4) hedonistic, pleasure
   5) omniscient, plain
8. The___of the Minister's statement cannot be verified by people who have no _____ to official records.
   1) veracity, access
   2) verbosity, entre
   3) ambiguity, admission
   4) validity, contact
   5) opulence, grandeur
9. Catching the earlier train will give us the _____ to do some shopping.
   1) chance 2) luck
   3) possibility 4) occasion
   5) probable
10. David finally found the photographs, after hours spent _____ through drawers.
    1) cavorting 2) haggling
    3) rummaging 4) divagating
    5) cajoling

Directions: (Q. 11 - 15): Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

11. The problems of translation <u>are still remain.</u>
    1) are remain 2) will remained
    3) will still remain
    4) are remaining
    5) No Correction required
12. It is ten years since I <u>have begun</u> living here.
    1) begun 2) had begun
    3) began 4) beginning
    5) No Correction required
13. Education is a <u>strong</u> instrument for moldings the character of the young.
    1) striking 2) powerful
    3) potent 4) proven
    5) No Correction required
14. He <u>gave</u> the I.A.S. examination in all seriousness.
    1) appeared 2) took
    3) undertook 4) prepared
    5) No Correction required
15. He has cooked that meal so often he can do it with his <u>eyes closed.</u>
    1) mind blank 2) eyes covered
    3) hands full 4) hands tied
    5) No Correction required

Directions (Q. 16-25): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

16. His interest (1)/ in the study of human behavior (2)/ is indeed (3)/ very large. (4)/ No error (5)
17. The improvement made by changes (1)/ in the system (2)/ was marginal (3)/ and did not warrant the large expenses. (4)/ No error (5)
18. For a few seconds, (1)/ he was totality blinded (2)/ by the powerful lights (3)/ of the oncoming car. (4)/ No error (5)
